శ్రీమద్రామాయణము

సుందర కాండము

సంస్కృత మూలము

భగవాన్ వాల్మీకి మహర్షి

తేటతెలుగులో

మొదలి వెంకట సుబ్రహ్మణ్యం

2-31, చైతన్యపురి,
హైదరాబాదు 500060
ఫో: 24048104
సెల్: 9391134792

ఇప్పుడు మనము రామాయణంలో సుందర కాండములో ప్రవేశించబోతున్నాము. ఈ కాండను సుందర కాండ అని ఎందుకు అన్నారో చాలా మంది పండితులు రకరకాలుగా విశ్లేషించారు. వాటిని మీరు చదివే ఉంటారు. కాబట్టి మనం ఈ కాండమునకు సుందర కాండము అని ఎందుకు పేరు వచ్చింది అనే విషయం మీద చర్చిండం లేదు.

ఈ సుందర కాండమును చాలా మంది పారాయణం చేస్తుంటారు. కొంత మంది స్వయంగా పారాయణం చేస్తారు. ఇంకొంత మంది పండితుల చేత పారాయణం చేయించి వింటూ ఉంటారు. కాని మనం స్వంతంగా పారాయణం చేస్తే వచ్చే ఫలితం వేరుగా ఉంటుంది.

కాని సుందర కాండము వాల్మీకి సంస్కృతంలో శ్లోకరూపంలో రచించాడు. పారాయణం చేస్తే శ్లోక రూపంలోనే చెయ్యాలి అని కొందరు అంటుంటారు. కాని ఇక్కడ చదవడం కన్నా చదివి అర్థంచేసుకోవడం, అర్థం చేసుకున్నదాన్ని ఆచరిచండం ముఖ్యం అని నా అభిప్రాయము. సుందర కాండము మనము పారాయణం చేసి ఏమి నేర్చుకున్నాము. సుందర కాండము లో ఉన్న విషయములను మనము నిజజీవితంలో ఎలా అమలుపరుస్తున్నాము అనేది ముఖ్యం కానీ యాంత్రికంగా పారాయణం చెయ్యడం కాదు. కాబట్టి సుందర కాండములో మనకు ఉపయోగించే విషయాలు ఏమి ఉన్నాయి అనే విషయం చర్చించుకుందాము. మీరు సుందర కాండము చదువుతున్నప్పుడు ఈ క్రింది విషయాలు ఎక్కడెక్కడ పొందు పరచబడ్డాయిఅనే విషయాన్ని మీరు అవగాహన చేసుకోవాలి.

సుందర కాండము

సుందర కాండము శ్రద్ధగా చదివితే మనకు కొన్ని విషయాలు ద్యోతకము అవుతాయి.

నిరాశా, నిస్పృహలకు లోనైన మనిషిని పునరుజ్జీవితుణ్ణి చేస్తుంది సుందర కాండము.

మానసికంగా బలహీనమైన వాడిని మానసికంగా బలోపేతుణ్ణి చేస్తుంది సుందర కాండము.

కేవలం పురుష ప్రయత్నం చాలదు. దైవయత్నం కూడా ఉండాలి. అలాగని, కేవలం దైవప్రార్థన చాలదు. మానవ ప్రయత్నం కూడా ఉండాలి. పురుష ప్రయత్నము, దైవయత్నము కలిస్తేనే కార్యసిద్ధి కలుగుతుంది అని చాటి చెప్పినది సుందర కాండము.

మనం చేసే కార్యంలో చిత్తశుద్ధి ఉంటే, మన ప్రమేయం లేకుండానే మనకు బయట నుండి సాయం అందుతుంది అని మనకు తెలియజేసేది సుందర కాండము.

మన సమస్యకు పరిష్కారము ఎదురుగా ఉన్నా, మన మనస్సు కల్లోలంగా ఉన్నప్పుడు ఆ పరిష్కారం మనకు కనపడదు. నిర్మలమైన మనస్సుతో ఆలోచిస్తే, ఓస్ ఇంతేనా అని అనిపిస్తుంది, పరిష్కారం కట్టెదుట కనపడుతుంది అని బోధించింది సుందర కాండము.

జీవితంలో ఎన్ని కష్టాలు వచ్చినా, తాను నమ్మిన ధర్మానికి కట్టుబడి ఉంటే, జయం మనదే అవుతుంది అని నిరూపించింది సుందర కాండము.

ఏ సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కొంటే, మనకు సాయం చేసేవాళ్లు మనకు కనపడకుండా మన పక్కనేఉండి సాయం చేస్తుంటారు అని తెలియజేసేది సుందర కాండము.

కోపం అన్ని అనర్థాలకు మూలము, కోపంలో ఏమి చేస్తున్నామో తెలియకుండా చేసేస్తాము తుదకు దు:ఖాలపాలవుతాము అని బోధించేది సుందర కాండము.

మనిషికి ఎంత శారీరక బలం ఉన్నా, దానికి బుద్ధిబలం తోడైతేగాని రాణించదు అన్న విషయాన్ని తెలియజెప్పేది సుందర కాండము.

ఎన్ని శివపూజలు చేసినా, ఎంతటి నిష్టాగరిష్టుడైనా, గుణగణాలు మంచివి కాకపోతే ఆ శివపూజలు అతనిని రక్షించలేవు, అతనికి పతనం తప్పదు అని నిరూపించినది సుందర కాండము.

ఎవరి శక్తి వారికి తెలియదు. ప్రతి మనిషిలోనూ అంతర్గతంగా అపారమైన శక్తి ఉంటుంది. ఆ శక్తి ఒక్కొసారి తనంతట తానే బహిర్గతమవుతుంది. మరి కొన్ని సందర్భాల్లో ఇతరులు చెబితేనే గానీ బయట పడదు. కాబట్టి పెద్దవారి మాటలు, మన శ్రేయోభిలాషుల మాటలు శ్రద్ధగా విని, ఆచరించి, మనశక్తి యుక్తులను సమర్థవంతంగా వినియోగించుకోవాలి అని చాటి చెప్పినది సుందర కాండము.

ఇలా చెప్పుకుంటూ పోతే సుందర కాండలో మన దైనందిన జీవితానికి ఉపయోగపడని విషయం ఒక్కటీ లేదు అని చెప్పవచ్చు. అందుకే సుందర కాండమును పారాయణం చెయ్యడమే కాదు, అర్థం చేసుకొని ఆచరణలో పెట్టినపుడే పారాయణం చేసిన దానికి సార్థకత అని మరొక సారి మనవిచేసుకుంటున్నాను.

మీరు నేను రాయబోయే సుందర కాండ వచనమును పారాయణ చెయ్యదలచుకుంటే ఈ క్రింది ప్రార్థనా శ్లోకములు చదివి ప్రారంభించండి.

సుందర కాండము

గణపతి ప్రార్థన:

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే
అగజాననపద్మార్కం గజాననమహర్నిశమ్
అనేకదం తం భక్తానామేకదంతముపాస్మహే॥

సరస్వతీ ప్రార్థన:

యా కుందేందుతుషారహారధవళా యా శుభ్రవస్త్రావృతా
యా వీణావరదండమండితకరా యా శ్వేతపద్మాసనా
యా బ్రహ్మాచ్యుత శంకరప్రభృతిభిర్దేవై: సదా పూజితా
సా మాం పాతు సరస్వతీ భగవతీ నిశ్శేషజాడ్యాపహా॥

వాల్మీకి ప్రార్థన:

కూజంతం రామ రామేతి మధురం మధురాక్షరమ్
ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకికోకిలమ్

హనుమంతుని ప్రార్థన:

గోష్పదీకృవారాశిం మశకీకృతరాక్షసమ్
రామాయణమహామాలారత్నం వందే అనిలాత్మజమ్
మనోజవం మారుత తుల్యవేగం జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్
వాతాత్మజం వానరయూథముఖ్యం శ్రీరామదూతం శిరసా నమామి.

శ్రీరామ ప్రార్థన:

వైదేహీసహితం సురద్రుమతలే హైమే మహామండపే
మధ్యే పుష్పకమాసనే మణిమయే వీరాసనే సుస్థితమ్
అగ్రేవాచయతి ప్రభంజనసుతే తత్త్వం మునిభ్య: పరం
వ్యాఖ్యాతం భరతాదిభి: పరివృతం రామం భజే శ్యామలం॥
నమోస్తు రామాయ సలక్ష్మణాయ దేవ్యై చ తస్యై జనకాత్మజాయై
నమోస్తు రుద్రేంద్రయమానిలేభ్యో నమోస్తు చంద్రార్క మరుద్గణేభ్య:

శ్రీమద్రామాయణము

సుందర కాండము

మొదటి సర్గ.

జాంబవంతుని ప్రేరణతో, వానర వీరులు ఇచ్చిన ప్రోత్సాహంతో, అమితమైన ఉత్సాహంతో, హనుమంతుడు ఆకాశవీధిన లంకకు పోవడానికి నిశ్చయించుకున్నాడు. తన మెడను ముందుకు చాచాడు. తల పైకి ఎత్తాడు. ఆకుపచ్చని రంగులో ఉన్న హనుమంతుడు వైడూర్యము వలె ప్రకాశిస్తున్నాడు.

హనుమంతుడు ఎగరడానికి ఆయత్తమైన మహేంద్ర పర్వతము మీద ఎంతో మంది యక్షులు, కిన్నరులు, గంధర్వులు, నాగులు నివసిస్తున్నారు. వారే కాకుండా సింహములు, ఏనుగులు, పెద్దపులులు కూడా ఆ పర్వతము మీద స్థిరనివాసము ఏర్పరచు కున్నాయి.

ఆకాశంలోకి ఎగరడానికి ముందు హనుమంతుడు తూర్పు దిక్కుగా తిరిగి, బ్రహ్మదేవునికి, దేవేంద్రునికి, తన తండ్రి వాయు దేవునకు, ప్రత్యక్షదైవము సూర్యభగవానుడికి, సమస్తదేవతలకు భక్తిపూర్వకంగా నమస్కరించాడు. తరువాత దక్షిణ దిక్కుగా తిరిగి లంకాద్వీపమునకు పోవుటకు తన శరీరమును పెంచాడు. అక్కడ ఉన్న వానర వీరులు, వానరులు అందరూ హనుమంతుని వంక కళ్లప్పగించి చూస్తున్నారు.

సుందర కాండము

వీలైనంత పెద్దదిగా తన శరీరాన్ని పెంచాడు హనుమంతుడు. తన చేతులను, కాళ్లను పర్వత శిఖరము మీద తొక్కిపట్టాడు. హనుమంతుడు తన బలమంతా ఉపయోగించి మహేంద్ర పర్వత శిఖరమును తొక్కిపట్టడంతో ఆ పర్వతము ఊగిపోయింది. దాని మీద ఉన్న జంతువులు, భూకంపము వచ్చినది అనే భ్రమతో, అన్నీ కకావికలై అటు ఇటు పరుగులు తీసాయి. ఆ జంతువుల వికృతమైన అరుపులతో ఆ పర్వతము ప్రతిధ్వనించింది. విష సర్పాలు అన్నీ భయపడి విషాన్ని కక్కాయి. చెట్లనుండి పూలు జలా జలా రాలాయి. పెద్ద పెద్ద బండరాళ్లు కిందికి దొర్లాయి. మరి కొన్ని రాళ్లకు బీటలు ఏర్పడ్డాయి.

ఆ పర్వతము మీద తపస్సు చేసుకుంటున్న మునులు, ఆ ఉత్పాతాలకు భయపడి ఆశ్రమాలు విడిచిపెట్టి పారిపోయారు. అప్పటిదాకా తమ తమ ప్రియురాళ్లతో, మద్యపానము చేస్తూ ఆనందిస్తున్న విద్యాధరులు, ఆఉత్పాతాలు చూచి, పాన పాత్రలు అక్కడే పడవేసి, తమ తమ ప్రియురాండ్రతో పారిపోయారు.

దేవతలు, విద్యాధరులు, మహర్షులు, చారణులు,సిద్ధులు ఈ చోద్యాన్ని చూడటానికి ఆకాశంలో బారులు తీరారు. ఆకాశంలో నిలబడిన వారంతా ఇలా అనుకుంటున్నారు. “అహెూ ఏమి ఆశ్చర్యము. రామ కార్యము కొరకు హనుమంతుడు ఎవరూ చేయలేని సాహసం చేస్తున్నాడు. నూరుయోజనముల సముద్రమును లంఘించు చున్నాడు.” అని తమలో తాము అనుకుంటున్నారు.

అలా నిలబడ్డ హనుమంతుడు ఒక్కసారి భయంకరంగా గర్జించాడు. తన తోకను గట్టిగా విదిలించాడు. హనుమంతుని తోక నిటారుగా నిలబడింది. హనుమంతుడు తన చేతలను గట్టిగా బిగించాడు. పాదములను ఎగరడానికి సిద్ధంగా ఉంచాడు. తన భుజములను మెడను ముందుకు వంచాడు. చూపు తన వెళ్లవలసిన ఆకాశ మార్గము వైపు నిలిపాడు. ఎటు వైపు ఎగరాలో నిర్ణయించుకున్నాడు. ఆకాశం వంక చూస్తూ తన ఊపిరిని స్తంభింపజేసాడు. హనుమంతుని చెవులు రిక్కపొడుచుకున్నాయి.

హనుమంతుడు వానరులను చూచి ఇలా అన్నాడు. "నేను రాముని ధనుస్సునుండి వెడలిన బాణము మాదిరి లంక వైపుకు ఎగిరిపోతాను. లంకలో సీత కనపడకపోతే అటునుంచి అటే స్వర్గలోకమునకు వెళతాను. స్వర్గలోకంలో కూడా సీత జాడ తెలియకపోతే, ఆ రావణుని కట్టి తెచ్చి రాముని పాదముల మీద పడవేస్తాను. నేను వెళ్లి రామ కార్యమును సాధించుకొని వస్తాను. సీతతో వస్తాను. లేకపోతే రావణుని బంధించి తెస్తాను. అదీ కాకపోతే లంకను కూకటి వేళ్లతో పెకలించి తీసుకొని వస్తాను. ఇదే నా నిశ్చయము" అని పలికాడు.

హనుమంతుడు తన కాళ్లను పర్వతశిఖరము మీద తన్నిపెట్టి పైకి ఎగిరాడు. ఆ సమయంలో తాను గరుత్మంతుడు అని అనుకొన్నాడు హనుమంతుడు. హనుమంతుడు పైకి ఎగిరిన వేగానికి మహేంద్ర పర్వతము మీద ఉన్న పెద్ద పెద్ద వృక్షములు కూకటి వేళ్లతో సహా పైకి ఎగిరి అల్లంత దూరంలో పడ్డాయి. హనుమంతుని వేగానికి పెకలింప బడ్డ వృక్షాలు ఎగిరి సముద్రంలో పడ్డాయి. ఆ వృక్షముల

నుండి రాలిన పూలు ఆకాశంలో చెల్లాచెదరుగా ఎగురుతూ నేలమీద రాలుతున్నాయి.

హనుమంతుడు ఆకాశంలో దూసుకుపోతుంటే, ఆకాశాన్ని మింగుతున్నాడా అన్నట్టు కనపడుతూ ఉంది. హనుమంతుడు తన రెండు చేతులూ ముందుకు, రెండు కాళ్లు వెనక్కు, చాచి, తోక పై కి ఎత్తి దూసుకుపోతంటే, ఐదుతలలతో ఉన్న మహాసర్పము ఆకాశంలో ఎగురుతూ ఉన్నదా అని భ్రమకలికిస్తూ ఉంది. నిప్పుకణముల మాదిరి మండుతున్న హనుమంతుని కళ్లు సూర్యచంద్రుల మాదిరి ప్రకాశిస్తున్నాయి. హనుమంతుడు ఎగురుతుంటే, హనుమంతుని పొడవాటి తోక పైకి లేచి నిటారుగా నిలబడి ఇంద్రుని ధ్వజము మాదిరి ప్రకాశిస్తూ ఉంది.

సముద్రము మీద హనుమంతుడు మహావేగంతో ఎగురుతూ ముందుకు దూసుకుపోతుంటే, కిందకు నెట్టబడిన గాలి ఝంఝామారుతంలాగా పెద్దగా ధ్వని చేస్తూ ఉంది. ఆకాశంలో ఎగురుతున్న హనుమంతుడు చూచేవారికి పెద్ద కాంతి పుంజము మాదిరి కనపడుతున్నాడు. సముద్రము మీద ఆకాశంలో హనుమంతుడు ఎగురుతుంటే ఆయన నీడ కూడా సముద్రము నీటి మీద అదే వేగంతో అనుసరిస్తూ ఉంది. హనుమంతుని నీడ ముప్పది యోజనముల పొడవు, పదియోజనముల వెడల్పు కలిగి ఉంది.

మహావేగంతో హనుమంతుడు సముద్రము మీద ఎగురుతుంటే ఆ వేగానికి సముద్రము అలలు ఉవ్వెత్తున లేచి కిందపడుతున్నాయి. సముద్రపు నీటి అలలతో పాటు ఆ సముద్రములో

ఉన్న జలచరములు కూడా పైకి లేస్తున్నాయి. హనుమంతుడు సముద్రము మీద ఎగురుతుంటే మహేంద్రపర్వతము రెక్కలు వచ్చి ఆకాశంలో ఎగురుతూ ఉందా అన్నట్టు చూచేవారికి భ్రమకలుగుతూ ఉంది. సముద్రజలముల మీద హనుమంతుడు ఏ ప్రాంతంలో ఎగురుతుంటే, ఆ ప్రాంతంలో జలము సుడులు తిరుగుతూ ద్రోణి ఏర్పడుతూ ఉంది. తనకు అడ్డం వచ్చిన మేఘాలను చీల్చుకుంటూ పోతున్న హనుమంతుడు, మబ్బుల్లో చంద్రుడి మాదిరి ప్రకాశిస్తున్నాడు. హనుమంతుని ప్రయాణాన్ని ఆశ్చర్యంతో తిలకిస్తున్న దేవతా గణాలు, హనుమంతుని మీద పూలవాన కురిపించారు.

హనుమంతునికి ఎక్కడ వేడి తగులుతుందో అని సూర్యుడు తన కిరణాల తీవ్రతను తక్కువ చేసాడు. వాయుదేవుడు కూడా హనుమంతుడు వెళ్లే దిశకు అనుకూలంగా వీస్తున్నాడు. రామకార్యము నిమిత్తము తన మీదుగా ఎగురుతున్న హనుమంతుని చూచిన సముద్రుడు ఇలా అనుకున్నాడు. “ఇప్పుడు నేను హనుమంతునికి సాయం చెయ్యకపోతే అందరూ నన్ను తప్పు పట్టడానికి అవకాశము ఇచ్చిన వాడిని అవుతాను. రాముడు పుట్టిన ఇక్ష్వాకు వంశము వాడైన సగర చక్రవర్తి వల్లనే కదా సముద్రములు ఏర్పడినవి. నూరుయోజనములు ఎగరాలంటే సామాన్యము కాదు. హనుమంతుడు ఎగిరి ఎగిరి అలసి పోతాడు. హనుమంతునికి కొంత విశ్రాంతి అవసరము. కొంచెం సేపు విశ్రాంతి తీసుకున్న తరువాత మరలా హనుమంతుడు రెట్టించిన బలంతో ఎగురగలడు.” అని ఆలోచించాడు.

వెంటనే సముద్రుడు తనలో మునిగి ఉన్న బంగారముతో నిండిన మైనాక పర్వతమును చూచి ఇలా అన్నాడు. “ఓ పర్వత రాజమా! పాతాళంలో దాగి ఉన్న అసురులు పైకి రాకుండా దేవేంద్రుడు నిన్న పాతాళ ద్వారానికి అడ్డుగా నిలిపాడు. నీవు పాతాళ ద్వారమును మూసివేసి అడ్డుగా నిలబడి ఉన్నావు. నీకు పైకి లేచే శక్తి ఉంది. కొంచెంగా ఎగుర గలవు. ఇక్ష్వాకు వంశమునకు చెందిన రాముని కార్యము నిమిత్తము హనుమంతుడు సముద్రం మీద ఎగురుతూ నీవు ఉన్న ప్రదేశము మీదుగా వస్తున్నాడు. మనకు ఆయనకు సాయం చెయ్యాలి. కాబట్టి నీవు నిటారుగా పైకి లేచి, నీ మీద హనుమంతుడు కాసేపు విశ్రాంతి తీసుకొనేట్టు చెయ్యి. నీ శిఖరము మీద కాసేపు విశ్రాంతి తీసుకొని మరలా హనుమంతుడు లంక వైపు సాగిపోగలడు. ఇది మనము చేయవలసిన పని. చేయవలసిన పని చేయకపోతే అది అధర్మము అవుతుంది. కాబట్టి హనుమంతుడు నీ స్వర్ణ శిఖరము మీద నిలబడటానికి వీలుగా నీవు సముద్రజలాల నుండి పైకి లేచి నిలబడు. హనుమంతుడు నీ మీద కొంచెం సేపు విశ్రాంతి తీసుకోగలడు.” అని అన్నాడు.

సముద్రుని మాటలు మన్నించాడు మైనాకుడు. సముద్ర గర్భంలో ఉన్న మైనాక పర్వతము నీటిని ఛేదించుకుంటూ పైకి లేచింది. నట్టనడిసముద్రములో నిలబడింది. స్వర్ణ శిఖరములతో ప్రకాశిస్తున్న ఆ పర్వత రాజము ఉదయించు చున్న సూర్యుమాదిరి ప్రకాశించింది.

తన దారిన తాను వెళుతుంటే ఈ పర్వతము ఏంటి తనకు అడ్డంగా వచ్చి నిలబడింది అని అనుకున్నాడు హనుమంతుడు. తనకార్యమునకు విఘ్నము కలిగించడానికి అలా నిలబడింది అని

అనుకున్నాడు. కాని ఆగలేదు. ఆ పర్వతశిఖరమునకు హనుమంతుని వక్షస్థలము ఢీకొట్టింది. అంత పెద్ద మైనాక పర్వతశిఖరము హనుమంతుని వక్షస్థలము దెబ్బకు ఛిన్నాభిన్నమై పక్కకు పడిపోయింది. హనుమంతుడు ఎగురుతున్న వేగానికి ఆశ్చర్యపోయాడు మైనాకుడు. మనుష్యరూపము దాల్చి హనుమంతుని ఎదుట నిలిచాడు.

"వానరోత్తమా! నా పేరు మైనాకుడు. నేను పర్వత రాజును. నీవు ఇక్ష్వాకు వంశ రాజైన రాముని కార్యము నిమిత్తము లంకకు పోతున్నావని సముద్రునికి తెలుసు. ఇక్ష్వాకు వంశము వారి వలననే కదా సముద్రుడు అభివృద్ధి చెందాడు. కాబట్టి ఇక్ష్వాకు వంశము రాజైన రామునికి ప్రత్యుపకారము చేయవలెనని సముద్రుడు తలిచాడు. అందుకని నన్ను పంపాడు. నీవు నూరు యోజనముల దూరము ప్రయాణిస్తున్నావు. నీకు అలసట కలిగి ఉంటుంది. కాబట్టి కాసేపు నా శిఖరము మీద విశ్రాంతి తీసుకొని వెళ్లు. ఇది సముద్రుని అభిలాష. నా విజ్ఞప్తి.

నీవు తినడానికి కంద మూలములు ఫలములు సిద్ధము చేసాను. వాటిని ఆరగించి కాసేపు విశ్రాంతి తీసుకో. ఈ రోజు నీవు మాకు అతిథివి. అతిథిని సత్కరించడం మా ధర్మము. పైగా నీవు వాయుదేవుని కుమారుడవు. నిన్ను సత్కరిస్తే వాయుదేవుని సత్కరించినట్టే. అదీ కాకుండా, మనకు దగ్గర సంబంధము ఉంది. పూర్వము పర్వతములకు రెక్కలు ఉండేవి. పర్వతములు కూడా గరుడునితోనూ, వాయువుతోనూ సమానమైన వేగముతో ఎగురుతూ ఉండేవి. ఆ ప్రకారంగా పర్వతములు ఎగురుతుంటే కింద ఉన్న ఋషులు, మునులు, దేవతా గణములు, మానవులు, ఇతర

జంతుజాలములు ఆ పర్వతములు ఎక్కడ తమ మీద పడతాయో అని భీతి చెందేవారు. అప్పుడు దేవేంద్రుడు కోపించి పర్వతములకు ఉన్న రెక్కలను తన వజ్రాయుధము తో ఖండించాడు. ఆ ప్రక్రియలో నా రెక్కలు కూడా ఖండించడానికి దేవేంద్రుడు వజ్రాయుధమును చేతబూని వస్తుంటే, నీ తండ్రి వాయుదేవుడు అడ్డు పడి నన్ను దూరంగా తీసుకొని వెళ్లి ఈ సముద్రగర్భంలో దాచి పెట్టాడు. ఆ ప్రకారంగా నేను నా రెక్కలు ఖండింపబడకుండా రక్షింపబడ్డాను. అందువలన వాయుదేవుడు నాకు ప్రాణదాత. ఆ వాయుదేవుని కుమారుడవు నువ్వు. అందుచేత, నువ్వు కూడా నాచేత గౌరవింపతగ్గవాడవు. కాబట్టి నువ్వు మా ఆతిధ్యము స్వీకరించి నన్ను, సముద్రుని సంతోషపెట్టు. మేము చేయుపూజలు అందుకో. నా మీద కొంచెము సేపు విశ్రాంతి తీసుకో." అని వినయంగా పలికాడు మైనాకుడు.

మైనాకుని మాటలు విన్న హనుమంతుడు ఇలా అన్నాడు. "ఓ పర్వత రాజా! నీ ఆతిధ్యమునకు చాలా సంతోషించాను. కాని, ప్రస్తుతము నీ ఆతిధ్యము స్వీకరించలేను. నాకు సమయము మించి పోతూ ఉంది. సీతాన్వేషణలో ఇప్పటికే చాలా ఆలస్యం అయింది. అందుకని నేను మార్గ మధ్యలో ఎక్కడా ఆగలేను. ఏమీ అనుకోకు" అని అంటూనే తన దారిన తాను ఎగురుకుంటూ వెళ్లాడు హనుమంతుడు. అలా వెళుతున్న హనుమంతుని కార్యదీక్షకు ముగ్ధులయ్యారు మైనాకుడు, సముద్రుడు. హనుమంతునికి తమ ఆశీస్సులు అందించారు.

హనుమంతుడు మైనాక పర్వతమును వదిలి ఆకాశంలోకి ఇంకా ఎత్తుగా ఎగిరాడు. దక్షిణ దిక్కుగా ఆకాశంలో ప్రయాణం చేస్తున్నాడు. ఈ సంగతి విన్న దేవేంద్రుడు కూడా ఎంతో సంతోషించాడు. మైనాకునికి అభయం ఇచ్చాడు. "ఓ మైనాకుడా! నీవు రామకార్యము మీద పోతున్న హనుమంతునికి ఎంతో సాయం చేసావు. నాకు చాలా ఆనందం కలిగింది. ఇంక నా వలన నీకు ఏలాంటి భయము లేదు. నీ ఇష్టం వచ్చినచోట ఉండ వచ్చును." అని అన్నాడు. దేవేంద్రుని మాటలు విని మైనాకుడు చాలా సంతోషించాడు. ఇంక తనకు దేవేంద్రుని వలన ఎలాంటి భయం లేదనుకున్నాడు.

అప్పటికి హనుమంతుడు చాలాదూరం వెళ్లిపోయాడు. హనుమంతుని గమనమును చూస్తున్న దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు హనుమంతునికి కొంచెము విఘ్నములు కల్పించవలెనని అనుకున్నారు. సురస అనే నాగమాతను పిలిచారు. "అమ్మా, నాగమాతా! హనుమంతుడు సముద్రము మీద ఎగురు తున్నాడు. నీవు అతనికి విఘ్నము కల్పించాలి. నీవు పర్వత సమానమైన రాక్షస రూపము ధరించి, నీ నోరు పెద్దదిగా తెరిచి హనుమంతునికి అడ్డంగా నిలబడు. హనుమంతుడు ఉపాయంతో నిన్ను జయిస్తాడా లేక తాను తల పెట్టిన కార్యమునకు విఘ్నము కలిగినదని విచారిస్తాడా తెలుసుకోవాలని అనుకుంటున్నాము." అని అన్నాడు.

దేవతల కోరికను మన్నించింది సురస. ఆమెకు కూడా హనుమంతుని పరీక్షించవలెనని కోరిక పుట్టింది. వెంటనే కొండంత రాక్షస రూపం ధరించింది. తన నోరు తెరిచి హనుమంతుని మార్గమునకు అడ్డంగా నిలిచింది.

"ఓ వానరా! ఈరోజు నీవు నాకు ఆహారము అయ్యావు. నేను నిన్ను నమిలి తింటాను. నువ్వు నా నోట్లో ప్రవేశించు." అని నోరు తెరిచింది సురస. హనుమంతుడు ఏమీ తొణక లేదు. ఆమెకు రెండు చేతులు ఎత్తి నమస్కరించాడు. "అమ్మా! నీవు ఎవరో నాకు తెలియదు. నేను రామ కార్యము నిమిత్తము వెళుతున్నాను. దశరథుని కుమారుడు రాముడు, ఆయన భార్య సీత, తమ్ముడు లక్ష్మణుడు దండకారణ్యములో ఉండగా, రావణుడు అనే రాక్షసుడు రాముని భార్యను సీతను అపహరించి తీసుకొని వెళ్లాడు. లంకలో ఉంచాడని తెలిసింది. ప్రస్తుతము నేను రాముని దూతగా సీత వద్దకు వెళు తున్నాను. నీవు కూడా రాముని రాజ్యములోనే ఉన్నావు కదా! రాజుకు సాయం చెయ్యడం మన ధర్మం కదా! అందుకని నాకు దారి వదులు. నేను రామ కార్యము ముగించుకొని తిరిగి వచ్చునపుడు నీ ముఖంలోకి ప్రవేశించి నీకు ఆహారం అవుతాను. నేను సత్యమునే పలుకుతున్నాను." అని అన్నాడు హనుమంతుడు.

కాని సురస అంగీకరించలేదు. నన్ను దాటి ఎవరూ పోలేరు. ఆ ప్రకారంగా నాకు బ్రహ్మ ఇచ్చిన వరం ఉంది. కాబట్టి నువ్వు నన్ను దాటి పోలేవు.నువ్వు నా ముఖంలోకి ప్రవేశించాలి. తప్పదు."అని పలికింది సురస. సురస మాటలకు హనుమంతునికి కోపం వచ్చింది. కాని తమాయించుకున్నాడు.

"అలాగా! అయితే నీవు ఎంత పెద్దగా నీ నోరు తెరవగలవో తెరువు. అప్పుడు నేను నీ నోట్లో దూరుతాను." అని అన్నాడు. సురస నోరు తెరిచింది. అంతకన్నా తన దేహమును పెంచాడు హనుమంతుడు. సురస తన నోటిని ఇరువది యోజనముల వెడల్పు

తెరిచింది. హనుమంతుడు ముప్పది యోజనముల లావు పెరిగాడు. సురస నోరు పట్టలేదు. సురస తన ముఖమును నలుబది యోజనముల వెడల్పు పెంచింది. హనుమంతుడు ఇంకా లావు పెరిగాడు. ఆఖరుకు సురస తన ముఖమును 80 యోజనముల వెడల్పు పెంచింది. హనుమంతుడు తన శరీరమును 90 యోజనముల లావు పెంచాడు. వెంటనే హనుమంతుడు చిన్న బొటన వేలి ప్రమాణం అంత చిన్న వాడయ్యాడు. చటుక్కున సురస నోట్లోకి వెళ్లి మరలా బయటకు వచ్చేసాడు.

"ఓ మాతా! నీవు కోరినట్టు నీ ముఖంలోకి ప్రవేశించి బయటకు వచ్చాను కదా! ఇంక నాకు దారి ఇవ్వు. నేను తొందరగా వెళ్లాలి." అని అన్నాడు. ఆమాటలకు సురస ఎంతో సంతోషించింది. తన నిజస్వరూపంతో హనుమంతుని ఎదుట నిలిచింది.

"కుమారా హనుమా! నీ బుద్ధికుశలతకు సమయస్ఫూర్తికి మెచ్చాను. నీవు రామ కార్యము మీద వెళ్ల వచ్చును. నీకు విజయం సిద్ధిస్తుంది." అని ఆశీర్వదించింది సురస. ఇది చూచిన దేవతలు హనుమంతుని తెలివికి ఎంతో సంతోషించారు.

(ఇక్కడ ఒక్క మాట. హనుమంతుడు దాటవలసిన దూరము 100 యోజనములు. అప్పటికే కొంత దూరం ప్రయాణం చేసాడు. సురస 80 యోజనములు పెరిగితే, ఇంకేముంది, ఆమె మీదుగా దూకుతూ లంకలోకి దూకవచ్చు కదా!హనుమంతుడు తన శరీరమును 90 యోజనములు పెంచాడు అని ఉంది. 90యోజనముల లావు ఉన్న హనుమంతుడు మధ్య నిలబడితే అటు

ఐదు, ఇటు ఐదు యోజనముల దూరమే ఉంటుంది. వానరులందరూ అటునుంచి ఇటు ఇటు నుంటి అటు లంకలో దూకేయవచ్చుకదా! ఈ ఎగరడాలు ఎందుకు? కాబట్టి, ఈ సురస కథలో ఇచ్చిన దూరముల కొలతలు హనుమంతుని తెలివి తేటలగురించి, శక్తి సామర్థ్యముల గురించి మనకు బాగా తెలియజెయ్యడానికి, చిన్న పిల్లలకు ఆసక్తి కలిగించడానికి చమత్కారంగా రాయబడినవి అని పండితుల అభిప్రాయము.)

తరువాత హనుమంతుడు తన ప్రయాణమును కొనసాగించాడు. మరలా హనుమంతునికి ఒక ఆటంకం కలిగింది. సింహిక అనే రాక్షసి ఉంది. ఆ రాక్షసి ఆకాశమార్గంలో పోతున్న హనుమంతుని చూచింది. ఇవ్వాళ నాకు మంచి ఆహారము దొరికింది అని అనుకొంది. ఆ సింహికకు నేల మీద పడ్డ నీడను పట్టుకొని పైన ఎగురుతున్న పక్షులను పట్టుకొనే శక్తి ఉంది. ఆ ప్రకారంగా పైన ఎగురుతున్న హనుమంతుని నీడను పట్టుకొంది. కిందికి లాగుతూ ఉంది. ఎవరో తనను పట్టి లాగుతున్నట్టు అనిపించింది హనుమంతునికి. కిందికి చూచాడు. సింహిక కనపడింది. సముద్ర జలాల మీద పడ్డ నీడను పట్టుకొని పక్షులను, జంతువులను తన వైపుకు లాక్కునే వికృతమైన ఆకారాల గురించి సుగ్రీవుడు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి హనుమంతునికి. సుగ్రీవుడు చెప్పిన వికృతమైన ఆకారము ఇదే అనుకున్నాడు హనుమంతుడు.

హనుమంతుడు తన దేహమును పెంచాడు. అది చూచిన సింహిక తన నోరు అంత కన్నా పెద్దగా తెరిచి అరుస్తూ హనుమంతుని వైపుకు వెళ్లింది. హనుమంతుడు తన శరీరమును

చిన్నదిగా చేసి సింహిక నోట్లోకి దూరాడు. ఆమె శరీరములోకి ప్రవేశించిన హనుమంతుడు తన వాడిఅయిన గోళ్లతో ఆమె లోపల భాగములను, గుండెను, ఊపిరితిత్తులను, పేగులను చీల్చాడు. వెంటనే బయటకు వచ్చాడు. శరీరం ఛిన్నాభిన్నం కావడంతో సింహిక సముద్రంలో పడి మరణించింది. ఆకాశంలో సంచరిస్తున్న సిద్ధులు, గంధర్వులు మొదలగు దేవతలు హనుమంతుడు సింహికను చంపడం చూచి బాగు బాగు అని మెచ్చుకున్నారు.

సింహికను చంపిన హనుమంతుడు మరలా పైకి ఎగిరాడు. ఆకాశంలో ప్రయాణం సాగిస్తున్నాడు. సముద్రము ఆవల ఒడ్డుకు చేరుకున్నాడు. సముద్రము ఒడ్డున వరుసగా ఉన్న వృక్షములను చూచాడు. హనుమంతుడు ఆకాశము నుండి కిందికి దిగుతున్నాడు. అప్పటికి హనుమంతుడు తన శరీరమును చాలా రెట్లు పెద్దది చేసాడు. తన ఆకారమును చూచి రాక్షసులు భయపడతారని తన వంక అనుమానంగా చూస్తారని అనుకున్నాడు హనుమంతుడు. అందుకని తన నిజరూపమును ధరించాడు. సాధారణ వానర రూపమును ధరించాడు హనుమంతుడు. హనుమంతుడు లంకా ద్వీపములో ఉన్న త్రికూట పర్వత శిఖరము మీదకు దిగాడు. ఆ పర్వతము పైన నిర్మింపబడిన లంకా పట్టణమును చూచాడు హనుమంతుడు.

ఆ లంకా పట్టణము దేవేంద్రుని రాజధాని అయిన అమరావతి మాదిరి శోభిల్లుతూ ఉంది. ఆ పర్వత శిఖరము మీద పూలచెట్ల కింద నిలబడి ఉన్న హనుమంతుని మీద ఆ పూల చెట్లు పూలవాన కురిపించాయి. ఆ పూలతో నిండిపోయిన హనుమంతుడు

కదులుతున్న పూలవిగ్రహము మాదిరి శోభించాడు.

శ్రీమద్రామాయణము

సుందర కాండము మొదటి సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందరకాండము

రెండవ సర్గ.

హనుమంతుడు ఏ మాత్రమూ అలసట చెందకుండా నూరుయోజనముల దూరము కల దక్షిణ సముద్రమును దాటి లంకా ద్వీపంలో ప్రవేశించాడు. త్రికూట పర్వత శిఖరము మీద నిలబడి లంకా నగరమును చూచాడు. లంకా నగరములో ఉన్న అనేక రకములైన వృక్షజాతులు, పుష్పలతలను చూచాడు హనుమంతుడు.. అనేకము లైన సరోవరములూ, ఉద్యానవనములనుచూచాడు.. లంకా నగరము మరో అమరావతిని తలపిస్తూ ఉంది.

ఆ లంకా నగరమును పూర్వము విశ్వకర్మ నిర్మించాడు. ఆ లంకా నగరము మొదట కుబేరునికి చెందినది. లంకా నగరము చుట్టు పెద్ద అగడ్తను చూచాడు.

(శత్రువులు నగరంలోకి ప్రవేశించకుండా కోట చుట్టు గొయ్యి తవ్వి దానిని నీటితో నింపి అందులో మొసళ్లను వదులుతారు. దాని పేరు అగడ్త, పరిఖ అంటారు.)

ఆ లంకా నగరము పర్వతశిఖరము మీద ఉండటం వలన గాలిలో తేలుతున్న నగరంలా ప్రకాశిస్తూ ఉంది. లంకా నగరంలో తెల్లటి ఎత్తైన భవనములు, విశాలమైన వీధులు, వందలకొలదీ కోట బురుజులు, భవనముల మీద ఎగురు పతాకములు, ధ్వజములతో లంకా నగరము దేవేంద్రుని రాజధాని అమరావతిని తలపిస్తూ ఉంది.

లంకా నగరము చుట్టు బంగారు ప్రాకారము ఉంది. లంకానగరమును అనుక్షణము ఆయుధములు ధరించిన సైనికులు కాపలా కాస్తున్నారు. లంకానగర కోట గోడల మీద శతఘ్నులు అమర్చబడి ఉన్నాయి. లంకా నగరమునకు అమర్చబడిన పటిష్టమైన రక్షణ విధానమును, చుట్టు ఉన్న సముద్రమును చూచి రావణుని అంత సులభంగా గెలువలేమని అనుకున్నాడు హనుమంతుడు. దేవతలకే గెలువ శక్యము కాని ఈ లంకా నగరమును వానరులు ఎలా గెలువగలరు అని సందేహంలో పడ్డాడు హనుమంతుడు. రాముడు స్వయంగా వచ్చినా రావణుని గెలిచి లంకను స్వాధీనం చేసుకోడం అంత సులభం కాదు అని అనుకొన్నాడు హనుమంతుడు. ఇంకా ఇలా ఆలోచిస్తున్నాడు.

"ఈ రాక్షసులు సామ,దాన, భేదోపాయములకు లొంగరు. ఇంక యుద్ధమే శరణ్యము. యుద్ధము చేసి లంకను గెలవడం సాధ్యము అయ్యేట్టు లేదు. నేను, సుగ్రీవుడు, నీలుడు, అంగదుడు మేము నలుగురము మాత్రమే ఈ లంకానగరములోకి రాగలము. మరి మిగిలిన వారి సంగతి ఏమిటి? ముందు నేను పోయి సీత ఎక్కడ ఉన్నదో తెలుసుకోవాలి? అసలు సీత జీవించి ఉన్నదా లేదా అనే విషయం ధృవపరచుకోవాలి. తరువాత యుద్దము విషయం

ఆలోచించవచ్చును. " అని తనలో తాను అనుకున్నాడు హనుమంతుడు.

"ఇప్పుడు లంకానగరంలోకి ఎలా ప్రవేశించాలి. కాపలాగా ఉన్న రాక్షసులను ఏమార్చి ఏ రూపంతో ప్రవేశించాలి. నేను ఈ రూపంతో లోపలకు వెళితే రాక్షసులు పట్టుకొంటారు. కాబట్టి రాక్షసులను ఏదో విధంగా వంచించి సీతను వెదకాలి." అని ఆలోచిస్తున్నాడు హనుమంతుడు.

కాని హనుమంతుని ఆలోచనలు ఎంతకూ ఒక కొలిక్కిరావడం లేదు. ఉపాయంతో కార్యం సాధించాలి అని అనుకొన్నాడు. "ఏమి చేసినా, ఇతరుల కంట పడకుండా, కనపడీ కనపడకుండా ఉన్న అతి చిన్నరూపమును ధరించి లంకలో ప్రవేశించాలి. సీతను వెదకాలి. రామకార్యము చెడిపోకుండా నెరవేర్చాలి. ఒంటరిగా ఉన్న సీతను చూచినపుడు ఎవరైనా చూస్తే ఏం చెయ్యాలి? అసలు సీత కనపడిన తరువాత ఆమె దగ్గరకు ఎలా వెళ్లాలి?

ఎక్కడ ఏ చిన్న పొరపాటు జరిగినా మొత్తం కార్యము చెడిపోతుంది. స్థిరమైన మనసు లేకుండా పనులు చేస్తే, ఆ పనులు చెడిపోవడం తథ్యం. నాకు అన్నీ తెలుసు అని అహంకరిస్తే, ఆ అహంకారంతో తప్పులు చేయడం, ఆ కార్యము చెడిపోవడం జరుగుతుంది నూరు యోజనముల సముద్రము దాటిన ఫలము చిన్న పొరపాటుతో సర్వనాశనము అవుతుంది. అలా కాకుండా కార్యము ఎలా నిర్విఘ్నంగా నెరవేర్చాలి? పొరపాటున నేను రాక్షసుల కంటపడితే,

రాముని కార్యము సమూలంగా నాశనం అవుతుంది.

ఒకవేళ రాక్షస రూపంలో సంచరిస్తే? అప్పుడు కూడా రాక్షసులు నన్ను గుర్తు పడితే. రాక్షసులకు తెలియకుండా వాళ్లలో ఒక రాక్షసుడుగా లంకలో సంచరించడం అతి కష్టం. లంకలో రాక్షసులకు తెలియని ప్రదేశము లేదు. వారికి తెలియకుండా గాలి కూడా లంకలో చొరబడలేదు. నేను ఈ రూపంతో లంకలో ప్రవేశిస్తే రాక్షసులు నన్ను పట్టుకొని చంపుతారు. కాబట్టి అతి చిన్న రూపంతోనే ఈ రాత్రికి లంకలో ప్రవేశించాలి. రాక్షసులకు కనపడీ కనపడకుండా సీతను వెదకాలి. అదే ప్రస్తుత కర్తవ్యము. ఈరాత్రికి లంకా నగరంలో ప్రవేశించి, రావణుని మందిరము అంతా సీత కోసం వెదుకుతాను." అని నిశ్చయించుకున్నాడు హనుమంతుడు. చీకటి పడేదాకా వేచి ఉన్నాడు.

సూర్యుడు అస్తమించాడు. చీకట్లు నలుమూలలా అలముకున్నాయి. అప్పుడు హనుమంతుడు అతి సూక్ష్మ రూపం ధరించాడు. దాదాపు ఒక మార్జాలము (పిల్లి) అంత రూపం ధరించాడు. చకా చకా ఎగురుతూ సుందరమైన లంకానగరంలోకి ప్రవేశించాడు హనుమంతుడు. లంకానగరాన్ని తేరిపార చూచాడు.

లంగా నగరంలో ఎత్తైన భవనాలు బారులు తీర్చి ఉన్నాయి. బంగారు, వెండి స్తంభములతో ప్రకాశిస్తున్నాయి. ఆ ఎత్తు అయిన భవన పైభాగములకు స్ఫటికములు, మణులు అమర్చిఉన్నాయి. హనుమంతుడు ఆ లంకా నగరమును ఆశ్చర్యంగా చూస్తున్నాడు. ఇంత పెద్ద నగరంలో సీతను కనుక్కోడం సాధ్యమా అని దిగులుపడు

తున్నాడు.

ఆనగరము అంతా భయంకరమైన రాక్షసులు అనుక్షణం కాపలా కాస్తున్నారు. వారి కంట పడకుండా సీతను ఎలా వెదకడం అనే సందేహం పట్టుకుంది హనుమంతునికి. ఇంతలో చంద్రోదయం అయింది. చంద్రుడు తెల్లటి చల్లటి వెన్నెల కురిపిస్తున్నాడు. లంకా నగరంలో సీతను వెదకడానికి హనుమంతునికి సాయం చేయడానికా అన్నట్టు చంద్రుడు ఆకాశంలో పైపైకి వస్తున్నాడు. మనసుకు ఆహ్లాదాన్ని కలిగించే చంద్రుని చూచాడు హనుమంతుడు.

శ్రీమద్రామాయణము

సుందర కాండము రెండవ సర్గ సంపూర్ణము.

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

మూడవ సర్గ.

హనుమంతుడు ధైర్యం చేసి లంకానగర ముఖద్వారము వద్దకు వచ్చాడు. అక్కడి నుండి లంకా నగరాన్ని చూచాడు. లంకా నగరంలో భవనాలు తెల్లగా అందంగా ఉన్నాయి. లంకా నగరము ముఖద్వారము వద్ద అసంఖ్యాకంగా ఏనుగులు నిలిచి ఉన్నాయి. అక్కడ సైనికులు కాపలా కాస్తున్నారు. లంకా నగరము చుట్టు బంగారముతో కట్టబడిన ప్రాకారమును చూచాడు హనుమంతుడు. మెల్లిగా ఆ ప్రాకారము దగ్గరకు వెళ్లాడు. అక్కడి నుండి లంకానగరమును దూరంనుండి చూచాడు.

లంకా నగరంలో ఉన్న ఇండ్లకు అమర్చబడిన ద్వారములు అన్నీ బంగారముతో నిర్మించబడి ఉన్నాయి. ఆ భవనములకు ఉన్న అరుగులు అన్నీ మణులు, మాణిక్యములతో అలంకరింపబడి ఉన్నాయి. లంకా నగరములో భవనములు అన్నీ ఆకాశాన్ని అంటుతున్నాయి. అంత ఎత్తుగా ఉన్నాయి. దేవేంద్ర నగరమువలె ఉన్న ఆ లంకా నగరమును చూచి హనుమంతుడు ఎంతో సంతోషించాడు.

అంతలోనే హనుమంతునికి ఒక సందేహము కలిగింది. "ఈ లంకా నగరమును రావణుని సైన్యములు అహర్నిశములు కాపలా కాస్తున్నారు. కాబట్టి వీరిని బలప్రయోగంతో ఎదిరించడం చాలా కష్టము. అసలు ఇక్కడి దాకా వానరులు రావాలి కదా! కుముదుడు, అంగదుడు, సుషేణుడు, మైందుడు, ద్వివిదుడు వీరు మాత్రము సముద్రము దాటి ఈ లంకకు రాగలరేమో! తరువాత సుగ్రీవుడు, కుశపర్వుడు, ఋక్షుడు, నేను మాత్రము ఇక్కడికి రాగలము." అని అనుకున్నాడు. "అయినా రామలక్ష్మణుల పరాక్రమము ముందు ఈ రాక్షసులు ఎంత;?" అని తనలో తాను సమాధాన పరచుకున్నాడు. ఇంతలో లంకా నగరంలో ఉన్న గృహములలో దీపములు వెలిగాయి. లంకా నగరము దేదీప్యమానంగా ప్రకాశిస్తూ ఉంది. అటువంటి లంకా నగరంలోకి ప్రవేశించాడు హనుమంతుడు.

లంకా నగరానికి ఒక అధిదేవత ఉంది. ఆమె పేరు కూడా లంక. అమె లంకను నిరంతరమూ రక్షిస్తూ ఉంటుంది. హనుమంతుడు ఎంత చిన్న రూపంలో ఉన్నా లంకకు అధి దేవత అయిన లంక దృష్టిని తప్పించుకోలేక పోయాడు. లంక హనుమంతుని చూచింది. తన అనుమతి లేకుండా లంకలో ప్రవేశించిన హనుమంతుని చూచిన

లంక భయంకర రూపంతో హనుమంతుని పట్టుకొంది.

"ఓ వానరా! నీవు ఎవరు? లంకా నగరంలో ఎందుకు ప్రవేశించావు? నేను నిన్ను చంపేలోగా నిజం చెప్పు. ఈ లంకా నగరాన్ని అనుక్షణం రాక్షసులు కాపలా కాస్తుంటారు. నీవు అడుగు కూడా ముందుకు వెయ్యలేవు. కాబట్టి నీ గురించి చెప్పు." అని గద్దించింది లంక.

హనుమంతుడు ఆ లంకాధి దేవతను చూచి ఇలా అన్నాడు. "నేను ఉన్నది ఉన్నట్టు చెబుతాను కానీ ఇంతకూ నువ్వు ఎవరు? ఈ లంకా నగర ద్వారము వద్ద ఎందుకు ఉన్నావు? నన్ను ఎందుకు బెదిరిస్తున్నావు?" అని అడిగాడు హనుమంతుడు.

అప్పటి దాకా తనను చూచి భయపడ్డ వాళ్లేకానీ తనను ఎదిరించిన వాళ్లు లేకపోవడంతో లంకకు కోపం వచ్చింది. "లంకాధి నేత రావణుని ఆజ్ఞ మేరకు నేను ఈ లంకానగరమును రక్షిస్తుంటాను. నా అనుమతి లేకుండా ఎవరూ ఈ లంకానగరంలో ప్రవేశించలేరు. ఇప్పుడు నువ్వు ప్రవేశించావు కాబట్టి నీకు చావు తప్పదు. నాచేతిలో చావడానికి సిద్దంగా ఉండు. నేను ఎవరో చెప్పాను కదా! ఇంక నువ్వు ఎవరో చెప్పు? " అని పరుషంగా అడిగింది లంక. అవసరమైతే లంక అధిదేవతను ఎదుర్కోడానికి సిద్ధంగా ఉన్నాడు హనుమంతుడు. ఆమె మాటలు విని ఇలా అన్నాడు.

"ఏమీలేదు. ఈ లంకానగరం ఎంతో సుందరంగా ఉంది. ఎత్తైన బురుజులతోనూ, ప్రాకారములతోనూ, తోరణములతోనూ

అందంగా ఉంది. అందుకని చూడటానికి వచ్చాను. ఈ లంకా నగరంలో ఉద్యానవనములు, తోటలు, సరోవరములు, ఎత్తైన భవనములు చాలా బాగున్నాయి. మరి ఇవన్నీ నేను చూడాలి కదా! నన్ను పోనివ్వు." అని అన్నాడు హనుమంతుడు అమాయకంగా.

"నా అనుమతి లేకుండా ప్రవేశించావు. నన్ను జయించు. తరువాత ముందుకు నడువు." అంది లంక.

"నేను కేవలం లంకానగరాన్ని చూడటానికి వచ్చాను. ఈ జయించడాలు ఎందుకు. అలా చూచి ఇలా పోతాను. నన్ను పోనివ్వు."అని అన్నాడు హనుమంతుడు.

వీడు మాటలతో వినే రకం కాదని లంక తన అరిచేతితో హనుమంతుని ఒక చరుపు చరిచింది. ఆ దెబ్బకు హనుమంతుడు కుయ్యోమని అరిచాడు. ఎడమ చేతి పిడికిలితో ఒక్కపోటుపొడిచాడు. ఆ దెబ్బకు లంక దిమ్మతిరిగి నేలమీద పడింది. "అయ్యో ఆడదాన్ని కొట్టానే." అని బాధపడ్డాడు హనుమంతుడు.

హనుమంతుని పిడికిలి దెబ్బతిన్న లంక హనుమంతునితో ఇలా అంది. "ఓవానరా! నన్ను చంపకు. నీ లాంటి బలవంతులు స్త్రీలను చంపరు కదా! నీవు నన్ను జయించావు. నేను లంకా నగరాన్ని. నువ్వు నీ పరాక్రమంతో లంకను జయించావు. పూర్వము బ్రహ్మ నాకు ఓ వరం ప్రసాదించాడు. ఎప్పుడైతే నన్ను ఒక వానరుడు జయిస్తాడో అప్పుడే రాక్షసులకు భయం అనేది తెలుస్తుంది. ఇప్పుడు వానరుడవైన నీవు నన్ను జయించావు. బ్రహ్మ చెప్పిన సమయము ఆసన్నమయింది.

రాక్షసులకు చేటుకాలము దాపురించింది. సీత మూలంగా రావణునికి, లంకలో రాక్షసులకు వినాశము సమీపించింది. ఓ వానరా! నీవు నీ ఇష్టం వచ్చినట్టు లంకలో ప్రవేశించు. సీత కోసరం వెదుకు. నీవు ఏం చెయ్యాలను కొన్నావో అది చెయ్యి. ఈ లంకా నగరానికి శాపం తగిలింది. దానిని ఎవరూ తప్పించలేరు." అని పలికింది లంక.

శ్రీమద్రామాయణము
సుందర కాండము మూడవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము
నాలుగవ సర్గ.

లంక అధిదేవతను ఓడించిన హనుమంతుడు లంకలోకి ఎలా ప్రవేశించాలా అని ఆలోచించాడు. తాను రావణునికి మిత్రుడు కాదు. అందుకని సింహద్వారము గుండా ప్రవేశించడం ఉచితం కాదు. కాబట్టి, శత్రువు మాదిరి నగరము చుట్టుకట్టిన ప్రాకారము పైకి ఎక్కి లోపలకు దూకాడు. ఎడమ కాలు ముందు పెట్టి లంకానగరంలో ప్రవేశించాడు. లంకా పుర రాజమార్గముల గుండా వెళుతున్నాడు హనుమంతుడు.

లంకాపురములోని గృహముల నుండి వాద్య ధ్వనులు శ్రావ్యంగా వినపడుతున్నాయి. గృహములన్నీ మంగళకరంగా అలంకరింపబడి ఉన్నాయి. లంకానగరములోని గృహములు అన్నీ వాస్తు ప్రకారము నిర్మింపబడి ఉన్నాయి. ఒక్కొక్క గృహము ఒక్కొక్క

విధముగా కట్టబడి ఉన్నాయి. కొన్ని గృహముల నుండి స్త్రీలు నాట్యము చేయు ధ్వనులు వినబడుతున్నాయి. కొన్ని చోట్ల మల్లయోధులు చేయు సింహ నాదములు వినపడుతున్నాయి. కాని కొన్ని గృహముల నుండి సుస్వరంతో మంత్రోచ్ఛారణలు, వేదాధ్యయనములు వినపడుతున్నాయి. హనుమంతుడు ఒక్కొక్క ఇంటినీ చూచుకుంటూ వెళుతున్నాడు.

లంకలో ఉన్న సైనిక సమూహములను, ప్రచ్ఛన్నవేషములతో తిరుగుతున్న రావణుని గూఢచారులను కూడా చూచాడు హనుమంతుడు. రాక్షసులు అంటే అందరూ దుష్టులు క్రూరులు అనుకున్నాడు కానీ, వారిలో కొందరు వేదాధ్యయన పరులు, నిష్ఠాగరిష్టులు కూడా ఉన్నారని అనుకున్నాడు హనుమంతుడు.

రాక్షసులలో కొందరు యజ్ఞదీక్ష వహించి ఉన్నారు. కొందరు శిరోముండనము చేయించుకున్నారు. (నున్నగా గుండు గీయించుకున్నారు) మరి కొందరు మంత్రోచ్ఛాటన చేస్తున్నారు. కొందరు శత్రువులను నాశనం చెయ్యడానికి మంత్రించిన దర్భలు చేత ధరించి ఉన్నారు. మరి కొందరు మారణహోమములు చేయడంలో నిమగ్నమయి ఉన్నారు. మరి కొందరు ఆయుధ ధారులై ఉన్నారు. మరి కొందరు వికృత రూపాలతో ఉన్నారు. ఇంకా మరి కొందరు శృంగార పురుషులుగా చేత పూల మాలలు ధరించి, లేపనములు పూసుకొని ఉన్నారు.

రావణుని అంతఃపురము దగ్గర లక్ష మంది సైనికులతో ఒక సైనిక నివేశము ఎటువంటి పరిస్థితి నైనా ఎదుర్కొనడానికి సిద్ధంగా

ఉండటం హనుమంతుడు చూచాడు. అలా చూచుకుంటూ హనుమంతుడు రావణుని అంత:పురము వద్దకు వచ్చాడు.

అంత:పురము చుట్టు ఇతరులు ఎవరూ ప్రవేశించకుండా ఎత్తైన ప్రాకారము కట్టబడి ఉంది. ఆ ప్రాకారమునకు పెద్ద ముఖ ద్వారము ఉంది. రావణుని గృహము స్వర్గము వలె ప్రకాశిస్తూ ఉంది. రావణుని అంత:పురము నుండి మధురమైన సంగీతధ్వనులు, నాట్యరవళులు వినిపిస్తున్నాయి. రావణుని గృహమును నిరంతరమూ రాక్షసులు కాపలా కాస్తున్నారు. అటువంటి రావణుని గృహములోకి హనుమంతుడు రహస్యముగా ప్రవేశించాడు.

శ్రీమద్రామాయణము
సుందర కాండము నాలుగవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము
ఐదవ సర్గ.

హనుమంతుడు రావణుని అంత:పురము ప్రవేశించే సమయానికి చంద్రుడు ఆకాశంలో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాడు. చల్లని వెన్నెలలు వెదజల్లుతున్నాడు.లక్ష్మీకళలతో ఉట్టిపడుతున్నాడు. సూర్య కిరణములు తన మీద పడుతూ ఉంటే వాటిని ప్రతిబింబిస్తున్నాడు చంద్రుడు. చీకట్లను నశింపజేసి వెన్నెలలను నలుమూలలకూ పంచిపెడుతున్నాడు. అటువంటి చంద్రుని చూచాడు హనుమంతుడు. చంద్రుడు క్రమక్రమంగా పైకి వస్తున్నాడు.

ఆ వెన్నెల రాత్రిలో రాక్షసులు మాంసమును తింటూ మద్యం తాగుతున్నారు. వనితలు కూడా తమ తమ ప్రియులతో కలిసి క్రీడిస్తున్నారు. ఉత్తములైన స్త్రీలు తమ తమ భర్తలతో నిద్రిస్తున్నారు. కొంత మంది నిశాచరులు ఇంకా పురవీధుల్లో తిరుగుతున్నారు. హనుమంతుడు సీత కోసరం అంతటా వెతుకుతున్నాడు.

మద్యపానమత్తులో ఒకరి ఒకరు దూషించుకోడం చూచాడు హనుమంతుడు. కొంత మంది స్త్రీలు నిద్రిస్తుంటే మరి కొంత మంది స్త్రీలు తమ ప్రియుల మీద కోపించి, అలిగి, నిట్టూర్పులు విడుస్తున్నారు. వీరందరినీ నిశితంగా చూస్తున్నాడు హనుమంతుడు. వీరే కాకుండా రాక్షసులలో బుద్ధిమంతులను, విద్యావంతులను, గానకళా కోవిదులను, వేదవిద్యాపారంగతులను కూడా చూచాడు హనుమంతుడు.

రాక్షస స్త్రీలలోకూడా విద్యావంతులు, గుణవంతులను భర్తల పట్ల గౌరవ ప్రమత్తులు కలవారిని కూడా చూచాడు హనుమంతుడు. కొందరు స్త్రీలు తమ తమ మేడలపై కూర్చొని భర్తలతో సరస సల్లాపములతో మునిగి తేలుతున్నారు. రాక్షస స్త్రీలలో కూడా అత్యంత సౌందర్యవతులను, అత్యంత వికృత రూపులను కూడా చూచాడు హనుమంతుడు.

హనుమంతునికి ఇంతమంది స్త్రీలు కనపడ్డారు కానీ రాముని కోసరం పరితపించు చున్న సీత మాత్రం కనపడలేదు. రాముని విడిచి దు:ఖిస్తున్న సీత, కళ్లలో నీళ్లు తప్ప కాంతి కనపడని

సీత, శోకమూర్తిఅయిన సీత హనుమంతునికి కనపడలేదు. ఇంతమంది స్త్రీలలో సీత కనపడకపోయేసరికి హనుమంతునికి దు:ఖము ముంచుకొచ్చింది. ఎంతో ఉత్సాహంతో సీత కోసం వెతుకుతున్న హనుమంతుని ఉత్సాహం అంతా క్షణాల్లో ఆవిరి అయిపోయింది.

శ్రీమద్రామాయణము
సుందర కాండము ఐదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము
ఆరవ సర్గ.

సీత కోసరం లంకా నగరంలో వెదికి వెదికి విసిగిపోయి దు:ఖిస్తున్న హనుమంతుడు, ఈ సారి రావణుని అంత:పురంలో వెదకాలని అనుకున్నాడు. రావణుని గృహం దగ్గరకు వచ్చాడు. రావణుని భవనానికి కాపలా చాలా కట్టుదిట్టంగా ఉంది.

రావణుని భవనమునకు అమర్చిన ముఖద్వారము బంగారముతో చేయబడి ఉంది. ఆ భవనములో ఉన్న సింహాసనములు, వస్తువులు బంగారంతో తయారు చేయబడి, రత్నాలు, మణులు పొదగబడి ఉన్నాయి. బంగారు ఆభరణములతో అలంకరింపబడిన రథములు అక్కడక్కడా నిలిచి ఉన్నాయి. రావణ భవనంలో అనేక రకములైన మృగములు, పక్షులు సంచరిస్తున్నాయి. రావణుని భవనము నిండా ఉత్తమ జాతి స్త్రీలు అక్కడక్కడా అటు

ఇటు తిరుగుతున్నారు. రావణుని భవనము నిండా రాజ లాంఛనములు అయిన ఛత్రములు, చామరములు కనపడు తున్నాయి. భవనమంతా అగరు, చందనముల సువాసనలతో గుబాళిస్తూ ఉంది.

ఒక పక్క భేరీ మృదంగ నాదములు వినిపిస్తుంటే, మరొక పక్క శివార్చనలు, హోమములు జరుగుతున్నాయి. రావణుని భవనమంతా పరిశీలనగా చూస్తున్నాడు హనుమంతుడు. హనుమంతుడు రావణుని భవనములో ఒక గృహము నుండి మరొక గృహమునకు తిరుగుతూ సీత కోసరం వెతుకుతున్నాడు. తరువాత ప్రముఖుల భవనముల వద్దకు వచ్చాడు హనుమంతుడు.

ముందుగా ప్రహస్తుని గృహమును చూచాడు. అక్కడి నుండి మహాపార్శ్వుని గృహము మీదికి దుమికాడు. తరువాత కుంభకర్ణుని గృహము, అక్కడి నుండి విభీషణుని గృహము పరిశీలించాడు. ఎక్కడా సీత కనిపించలేదు. తరువాత హనుమంతుడు వరుసగా మహోదరుడు, విరూపాక్షుడు, విద్యుజ్జిహ్వుడు, విద్యున్మాలి, వజ్రదంష్ట్రుడు, అనే రాక్షస వీరుల భవనముల మీదికి దూకి వారి భవనములను కూడా వెదికాడు. శుకుడు, సారణుడు, ఇంద్రజిత్తు గృహములు కూడా వెదికాడు. అంతటితో ఆగకుండా జంబుమాలి, సుమాలి, రశ్మికేతువు, సూర్యకేతువు, వజ్రకాయుడు, అనే రాక్షస వీరుల గృహములను కూడా గాలించాడు. ఎక్కడా సీత కనపడలేదు.

సుందర కాండము

ప్రముఖుల గృహములు అయిన తరువాత, రెండవ శ్రేణి రాక్షసులు అయిన ధూమ్రాక్షుడు, సంపాతి, విద్యుద్రూపుడు, భీముడు, ఘనుడు, విఘనుడు, శుకనాసుడు, వక్రుడు, శఠుడు, వికటుడు, బ్రహ్మకర్ణుడు, దంష్ట్రుడు, రోమశుడు, మత్తుడు, ధ్వజగ్రీవుడు, విద్యుజ్జిహ్వుడు, ఇంద్రజిహ్వుడు, హస్తిముఖుడు, కరాళుడు, శోణితాక్షుడు మొదలగు రాక్షసుల గృహములను కూడా క్షుణ్ణంగా వెదికాడు. హనుమంతుడికి వారి వారి ఐశ్వర్యములు, విభవములు కనపడ్డాయి గానీ, సీత మాత్రం కనిపించలేదు.

ఆఖరున రావణుడు నివసించే గృహము చేరుకున్నాడు. ఆసమయంలో రావణుడు నిద్రపోతున్నాడు. రావణునికి రక్షణగా భయంకరాకారము కల రాక్షస స్త్రీలు ఆయుధ ధారులై కాపలా కాస్తున్నారు. రావణుని భవనము చాలా విశాలంగా ఉంది. రావణుని భవనములోనే దాదాపు వెయ్యి వాహినుల సైనిక సమూహములు ఉ న్నాయి. గుర్రాలు ఉన్నాయి. ఏనుగులు ఉన్నాయి.

రావణుని గృహములో రకరకాల పల్లకీలు, విహార గృహములు, లతా గృహములు, క్రీడా గృహములు, చిత్రశాలలు ఉన్నాయి. అనేక పడక గదులు ఉన్నాయి. ఆ గదులలో ఉన్న ఆసనములు, మంచములు అన్నీ బంగారముతో చేయబడి రత్నములు, మణులు పొదగబడి ఉన్నాయి. మణులు, రత్నములు పొదగబడిన పాత్రలలో వివిధము లైన మధుర పానీయములు సిద్ధంగా ఉన్నాయి. రావణుని భవనములో వందలకొద్దీ స్త్రీలు ఉన్నారు.

రావణ భవనము అంతర్భాగము లోనే ఎన్నో ప్రాసాదములు ఉన్నాయి. వాటితో వేరు వేరు శాలలు, గదులు ఉన్నాయి. ఆ భవన నిర్మాణ శైలికి ఆశ్చర్యపోయాడు హనుమంతుడు.

శ్రీమద్రామాయణము

సుందర కాండము ఆరవ సర్గ సంపూర్ణము.

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

ఏడవ సర్గ.

రావణుని అంత:పురములోని ప్రాసాదములు అన్నీ ఒకటి వెంబడి ఒకటిగా గాలిస్తున్నాడు హనుమంతుడు. ఆ గృహము లన్నీ ధన,ధాన్యములతో నిండి ఉన్నాయి. ఆ గృహ నిర్మాణంలో ఏ మాత్రం దోషం లేకుండా నిర్దుష్టం నిర్మించబడి ఉన్నాయి. సాక్షాత్తు మయుడే ఆ గృహాలు నిర్మించాడా అన్నట్టు ఉన్నాయి ఆ గృహములు. అన్నిటి లోకీ రావణుడు నివసించే గృహము అత్యంత శోభాయమానంగా ప్రకాశిస్తూ ఉంది.

ఆ రావణుని అంత:పురము లోనే ఒక విమానమును చూచాడు హనుమంతుడు. దాని పేరు పుష్పకము. ఈ విమానము ఆకాశం నుండి భూమి మీదికి జారిపడిన స్వర్గధామం లాగా ఉంది. ఆ విమానము భూమి మీద నిలబడ కుండా గాలిలో తేలుతున్నట్టు ఉంది. ఆ పుష్పక విమానంలో భవనాలు నిర్మింపబడి ఉన్నాయి. సరస్సులు ఉన్నాయి. ఉద్యాన వనములు ఉన్నాయి. ఆ పుష్పక విమానాన్ని ఎంతో

ఆసక్తిగా చూస్తున్నాడు హనుమంతుడు. ఆ విమానాన్ని బంగారము తోనూ మణులు, మరకతములు, వైడూర్యములతోనూ అలంకరించారు. ఆ విమానము రెక్కలను కూడా పగడములు, బంగారు పుష్పములతో అలంకరించారు. ఆ విమానములో లక్ష్మీదేవిని ప్రతిష్ఠించారు. చేతిలో పద్మములను ధరించి, పద్మములు ఉన్న సరస్సులో పద్మము మీద కూర్చుని ఉన్న లక్ష్మీదేవి అత్యంత మనోహరంగా ఉంది.

పర్వతము మాదిరి నిలబడి ఉన్న ఆ విమానమును ఆసక్తితో చూచాడు హనుమంతుడు. ఆ విమానంలో కూడా సీత కోసరం వెదుకుతున్నాడు. కాని సీత ఎక్కడా కనపడలేదు. హనుమంతుడు నిరాశ చెందాడు. అయినా వెదుకుతూనే ఉన్నాడు.

శ్రీమద్రామాయణము
సుందర కాండము ఏడవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము
ఎనిమిదవ సర్గ.

హనుమంతుడు పట్టిన పట్టు వదలకుండా, ఒక పక్క ఆ పుష్పక విమానములోని వింతలు విశేసాలు చూస్తూనే విమానం అంతా క్షుణ్ణంగా వెదుకుతున్నాడు. ఆ విమానములో అన్ని వస్తువులు, నిర్మాణములు వేటికవే సాటి గా ఉన్నాయి. విశేషం కానిది ఏదీ లేదు. అన్నీ గొప్పగా ఉన్నాయి. ఆ విమానంలో మరొక విశేషం ఏమిటంటే ఆ

విమానంలో కూర్చున్న వాళ్లు ఎటు వెళ్లాలని మనసులో అనుకుంటే ఆ విమానం అలా వెళుతుంది. ఆ విమానము యొక్క నిర్మాణము అత్యంత విశిష్టంగా ఉంది.

ఆ విమానము ఒక భవనము ఆకారంలో, పెద్ద పెద్ద శిఖరములతో నిర్మింపబడి ఉంది. ఆ విమానమును భయంకరాకారులు అయిన రాక్షసులు రక్షిస్తున్నారు.

శ్రీమద్రామాయణము
సుందర కాండము ఎనిమిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము
తొమ్మిదవ సర్గ.

హనుమంతుడు రావణుని భవనమును, అందులో ఉన్న పుష్పక విమానమును చూచిన తరువాత, అసలు ఈ భవనము పొడుగు ఎంత, వెడల్పు ఎంత, వైశాల్యము ఎంత, ఇంత పెద్ద భవనమును ఎలా నిర్మించారు అన్న విషయం కనుక్కోడానికి ప్రయత్నం చేసాడు. రావణుని భవనము ఒక యోజనము పొడుగు, (ఎనిమిది మైళ్లు,) అందులో సగం(నాలుగు మైళ్లు) వెడల్పు ఉన్న స్థలంలో నిర్మించబడి ఉంది. అంత పెద్ద స్థలములో నిర్మించబడ్డ ఆ భవనమును సుశిక్షితులైన రాక్షస సైనికులు అనుక్షణం అప్రమత్తంగా కాపలా కాస్తున్నారు.

సుందర కాండము

రావణాసురుని భవనం అంతా రావణుని భార్యలతోనూ, రావణుడు వివిధ దేశాధిపతులను, రాజులను, జయించి వారి వద్దనుండి బలాత్కారంగా తీసుకురాబడిన స్త్రీలతోనూ, మునులను చంపి వారి వద్దనుండి బలాత్కారంగా తీసుకురాబడిన కన్యలతోనూ నిండి ఉంది.

అందులో ఉన్న పుష్పక విమానము రావణునిది కాదు. దానిని పూర్వము విశ్వకర్మ బ్రహ్మదేవుని కోసరం స్వర్గంలో నిర్మించాడు. కుబేరుడు బ్రహ్మ గురించి తపస్సు చేసి ఆ విమానమును బ్రహ్మ వద్దనుండి పొందాడు. కుబేరుని సోదరుడు రావణుడు. రావణుడు కుబేరుని జయించి లంకా నగరాన్ని, దానితో పాటు పుష్పక విమానాన్ని బలవంతంగా తన సొంతం చేసుకున్నాడు.

హనుమంతుడు ఆ పుష్పక విమానము మీదికి ఎక్కాడు. ఆ విమానములో ఉన్న వంటశాలల నుండి ఆహారపదార్థాల ఘుమ ఘుమలు హనుమంతుని నాసికా పుటాలకు సోకుతున్నాయి. "రా, రా, ఇక్కడకు రా, మమ్ములను ఆరగించు" అని పిలుస్తున్నాయా అన్నట్టు ఆ ఘుమఘుమలు విమానం అంతటా వ్యాపించి ఉన్నాయి.

హనుమంతుడు ఆ విమానంలోకి ప్రవేశించాడు. వెండి బంగారములతో నిర్మించి మణులు, రత్నములు పొదిగిన స్తంభములు కల ఒక విశాలమైన ప్రాంగణమును చూచాడు. అది ఒక చిత్రశాల. ఆ శాలలో నేల కనపడకుండా రత్నములతో కూడిన కంబళి పరిచి ఉంది. ఆ శాలలో రావణుడు సురలోక భోగములు అనుభవిస్తున్నాడు. ఆ శాలను చూస్తుంటేనే మనసుకు ఆహ్లాదం కలుగుతూ ఉంది.

"ఇది స్వర్గలోకమా లేక దేవతల నివాసమా" అని ఆశ్చర్యపోయాడు హనుమంతుడు. అక్కడ వెలుగుతున్న దీపస్తంభములు కూడా బంగారముతో చేయబడి మణులు పొదగబడి ఉండటం గమనించాడు హనుమంతుడు.

ఆ శాలలో ఎంతో మంది ఉత్తమ స్త్రీలు రకరకాలైన రంగు రంగుల దుస్తులు ధరించి రత్నకంబళముల మీద పడుకొని ఉండటం చూచాడు హనుమంతుడు. వారంతా దాదాపు వేయి మంది ఉన్నారు. వారు రాత్రి అంతా రావణునితో కామక్రీడలు జరిపి, కామభోగములలో తేలియాడి, అలసి, సొలసి ఒళ్లు తెలియ కుండా నిద్రపోతున్నారు. వాళ్లంతా కళ్లుమూసుకొని గాఢనిద్రలో ఉన్నారు. ఆ స్త్రీల మధ్య పడుకొని ఉన్న రావణుడు తారల మధ్య ఉన్న చంద్రుడిలా వెలిగిపోతున్నాడు.

"ఈ స్త్రీల ముఖములను పద్మములని భ్రమసి తుమ్మెదలు మకరందము కొరకు రావు కదా!" అని అనుకొన్నాడు హనుమంతుడు. ఆ స్త్రీలందరూ రాత్రంతా రావణుని తో కూడి మద్యము సేవించి, రతిక్రీడలు సలిపినందున వారు ధరించిన హారములు అన్నీ చెల్లాచెదరు అయ్యాయి. కొంత మంది స్త్రీలకు నుదుటి మీద ఉన్న తిలకము చెదిరిపోయింది. ఆ దృశ్యము ఒక పూలవనములో ఒక మదించిన ఏనుగు ప్రవేశించి ఆ వనమును చెల్లాచెదరు చేసినట్టు ఉంది.

కొందరి శరీరము మీద వస్త్రములు తొలగిపోయాయి. హారములు చెదిరిపోయాయి. వడ్డాణములు ఊడిపోయాయి. ఆ స్త్రీల

ఉఛ్వాస నిశ్వాసములకు వారు ధరించిన వస్త్రములు, కుండలములు ఊగుతున్నాయి. గాఢనిద్రలో ఉన్న కొందరు స్త్రీలు, పక్కనున్న స్త్రీలను రావణుడు అని కౌగలించుకొని ముద్దులు పెట్టుకుంటున్నారు. ఆ స్త్రీలు కూడా రావణుడే తమను ముద్దులాడుచున్నాడని భ్రమించి, వారుకూడా ప్రతిగా పక్కన ఉన్న స్త్రీలకు ముద్దులు అందిస్తున్నారు.

అందరికీ సరి అయిన తలగడలు లేకపోవడంతో పక్కనున్న వారి చేతులను తలగడలుగా చేసుకొని నిద్రిస్తున్నారు. మరి కొందరు పక్కన ఉన్నవారి వక్షస్థలమునే తలగడలుగా చేసుకొని నిద్రిస్తున్నారు. మరి కొందరు పక్కనున్న స్త్రీల తొడలను తలగడలుగా చేసుకొని నిద్రిస్తున్నారు. అలా ఒకరి మీద ఒకరు పడిపోయి ఒళ్లు తెలియకుండా నిద్రపోతున్నారు ఆ స్త్రీలు. ఎవరి చేతులు ఎక్కడ ఉన్నాయో, ఎవరి భుజాలు ఎక్కడ ఉన్నాయో ఎవరి కాళ్లు ఎక్కడ ఉన్నాయో తెలియడం లేదు. రావణుడు మేల్కొని ఉండగా కన్నెత్తికూడా చూడలేని ఆ స్త్రీల వంక, రావణుడు నిద్రపోవు సమయంలో, ఆ అందమైన స్త్రీల వంక కన్నార్పకుండా చూస్తున్నాయా అన్నట్టు ఆ విశాల ప్రాంగణంలో దీపాలు నిశ్చలంగా వెలుగుతున్నాయి.

ఆ స్త్రీలలో రాజర్షులకు చెందిన వారు, పితృదేవతలకు చెందిన వారు, దైత్యులకు చెందిన వారు, గంధర్వ స్త్రీలు, రాక్షస స్త్రీలు ఉన్నారు. వారందరూ రావణుని మోహావేశానికి వశులై ఆయనతో కామక్రీడలు సలిపారు. రావణుడు ఎందరో రాజులను జయించి తెచ్చిన స్త్రీలలో, కామానికి వశులైన స్త్రీలు మాత్రమే రావణుని పక్కలో చేరారు. తమ తమ భర్తలను దైవంగా భావించే స్త్రీ ఒక్కత్తె కూడా అక్కడ లేదు. కులీనయైన ఒక్క స్త్రీకూడా అక్కడ లేదు. రావణునిచేత బలవంతంగా

ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా తేబడిన ఒక్క స్త్రీ కూడా అక్కడ లేదు. అందుకే సీత అక్కడ లేదు అని అనుకున్నాడు హనుమంతుడు.

కాని రావణుని ఇష్టపడి వివాహము చేసుకున్న వారందరూ మంచి కులములో పుట్టి, సకల సద్గుణములతో ప్రకాశించేవారే! వారందరినీ చూచి హనుమంతునికి తన సహజమైన చపల స్వభావంతో ఒక అనుమానం క్షణం సేపు అతని మనస్సులో పొడసూపింది.

"వీరందరూ సీత వలె ఉత్తమ జాతి స్త్రీలే. మరి ఇంతమంది ఉత్తమ జాతి స్త్రీలు రావణుని ఐశ్వర్యమునకు బలమునకు పరాక్రమమునకు మోహమునకు లోబడి వశులైనపుడు, సీత కూడా వీరి మాదిరి రావణునికి వశమై ఉండవచ్చును కదా! ఒకవేళ అలా జరిగితే రావణుడు అంత అదృష్టవంతుడు ఉండబోడు. ఒక వేళ అదే జరిగితే, రావణుడు చాలా తప్పుచేసాడు. సరిదిద్దుకోలేని తప్పు చేసాడు. వీడికి రాముని చేతిలో చావు తప్పదు." అని పిచ్చిపిచ్చి ఆలోచనలు చేసాడు హనుమంతుడు.

శ్రీమద్రామాయణము
సుందర కాండము తొమ్మిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

సుందర కాండము

పదవ సర్గ.

హనుమంతుడు సీత కోసరం రావణుని అంత:పురము అంతటా వెదుకుతున్నాడు. రావణుని పడక గదిలోకి ప్రవేశించాడు. ఆ గదిలో ఎన్నో ఆసనములు శయ్యలు ఉన్నాయి. అవి అన్నీ మణులతో రత్నములతో అలంకరింపబడి ఉన్నాయి. ఒక ఉన్నతమైన శయ్య మీద రావణుడు నిద్రపోతున్నాడు.

రావణుడు దీర్ఘమైన బాహువులు, ఎర్రటి కళ్లు, నల్లని రూపముతో ఉన్నాడు. అతని ఒంటికి సువాసనలు వెదజల్లే చందనము పూయబడి ఉంది. రావణుని శయనాగారంలో మణులతో అలంకరింపబడిన తెల్లని గొడుగు ఒకటి, ఒక మూలగా నిలబెట్టబడి ఉంది. దాని పక్కనే బంగారముతో నిర్మించిన ఉన్నతాసనము ఉంది.

రావణుడు రాత్రి అంతా రతికేళి జరిపి సొక్కి సోలి గాఢంగా నిద్రపోతున్నాడు. రావణుని చూస్తే హనుమకు కించిత్ భయం కలిగింది. అందుకని కాస్త దూరంగా ఉండి చూస్తున్నాడు. ఎందు కన్నా మంచిదని పక్కన ఉన్న అరుగు ఎక్కి అక్కడి నుండి రావణుని చూస్తున్నాడు హనుమంతుడు. అక్కడి నుండి రావణుడు బాగా కనపడుతున్నాడు.

విశాల మైన అతని బాహువుల మీద ఇంద్రుని ఏనుగు ఐరావతము పొడిస్తే ఏర్పడిన గాయము మచ్చలు కనపడుతున్నాయి. ఆ బుజముల మీద ఇంద్రుని వజ్రాయుధముతోనూ, విష్ణువు తన

సుదర్శన చక్రముతోనూ కొడితే ఏర్పడిన గాయముల వలన కలిగిన మచ్చలు కనపడుతున్నాయి.

రావణుడు వెల్లకిలా పడుకొని నిద్రపోతున్నాడు. అతని కిరీటము ముత్యములు, మణులు పొదగబడి చిత్రవిచిత్రంగా ప్రకాశిస్తూ ఉంది. అతని విశాలమైన వక్షస్థలము మీద ముత్యాల హారములు ప్రకాశిస్తున్నాయి. రావణుడు పీతాంబరమును ధరించి ఉన్నాడు. పైన తెల్లటి పట్టు వస్త్రమును ఉత్తరీయముగానూ ధరించి ఉన్నాడు. రావణుడు నిద్రపోతూ కూడా కళ్లు సగం తెరిచి ఉన్నాడు.

హనుమంతుడు రావణుని కాళ్ల దగ్గర నిద్రపోతున్న అతని భార్యలను చూచాడు. వారందరూ ఎంతో సౌందర్యవంతులు. వారి ముఖములు పద్మముల వలె ప్రకాశిస్తున్నాయి. వారు ధరించిన పూలమాలలు ఇంకా వాడిపోలేదు. కాని చెల్లాచెదరు అయ్యాయి. ఆ స్త్రీలు కొందరు రావణుని భుజముల దగ్గర కొందరు రావణుని తొడల దగ్గర తలలు పెట్టి నిద్రపోతున్నారు. వారంతా రావణునితో రతికేళి సలిపి అలసి పోయి గాఢంగా నిద్రపోతున్నారు.

ఒకామె తాను నిద్రపోతున్నప్పుడుకూడా తాను నేర్చిన నృత్యభంగిమలోనే పడుకొని ఉంది. ఒకామె వీణ వాయిస్తూ అలాగే నిద్రవచ్చి వీణ మీద పడిపోయి నిద్రపోతూ ఉంది. మరొక యువతి మడ్డుకము అనే వాద్య విశేషమును వాయిస్తూ, ఇంతలో నిద్రముంచు కొచ్చి, తల్లి కుమారుని కౌగలించుకొని నిద్రిస్తున్నట్టు, ఆ వాద్యమును కౌగలించుకొని నిద్రిస్తూ ఉంది. మరొక స్త్రీ పటహమ అనే వాద్యమును గట్టి గా పట్టుకొని నిద్రలోకి జారుకుంది. మరొక మదవతి వేణువును

ఊదుతూ, ఆ వేణువును తన పెదాలకు అదుముకొని నిద్రపోయింది. మరొక వనిత ఏడు తీగలు కలిగిన వీణను, ప్రియురాలు ప్రియుని కౌగలించుకున్నట్టు కౌగలించుకొని నిద్రిస్తూ ఉంది. మరియొక సుందరాంగి మృదంగము వాయిస్తూ అలాగే దానిమీద పడిపోయి నిద్రపోయింది. మరియొక యువతి పణవము అనే వాద్యమును వాయిస్తూ అలాగే సోలిపోయింది. మరియొక వనిత డిండిమము అనే వాద్యమును ఒడిలో ఉంచుకొని నిద్రపోయింది. మరొక వనిత ఆడంబరము అనే వాద్యమును వాయిస్తూ నిద్ర ఆపుకోలేక అలాగే పడిపోయి నిద్రలోకి జారుకుంది. మరియొక వనిత నిద్రమత్తులో పక్కనేఉన్న నీటి కలశమును తన్నింది. ఆ నీళ్లు ఆమె కిందికి వచ్చి ఆమె పూర్తిగా తడిసిపోయింది. కానీ ఆ నిద్రమత్తులో ఆమెకు మెలుకువ రాలేదు. గాఢనిద్రలో ఉంది. మరియొక పద్మనేత్ర తన పక్కన మరియొక యువతిని తన ప్రియుడు అనుకొని గట్టిగా కౌగలించుకొని నిద్రలోకి జారుకుంది. అదే మాదిరి రకరకాల వాద్య విశేషములను తమ తమ గుండెలకు అదుముకుంటూ అక్కడ ఉన్న వనితలు గాఢనిద్రాపరవశులై ఉన్నారు.

ఇంతమంది యువతులు, మదవతులు నిద్రిస్తూ ఉంటే, చుక్కల్లో చంద్రుడు లాగా వారందరి మధ్యలో ఒక ఉత్తమ జాతి స్త్రీ నిద్రిస్తూ ఉంది. ఆమెయే రావణుని పట్టమహిషి మండోదరి. ఆ అంత:పురమునకు అధిపతి. ఆమె రకరకాల బంగారు ఆభరణములు ధరించి ఉంది. ముత్యములు, రత్నములు పొదిగిన అలంకారములను ఒంటి నిండా అలంకరించుకొని ఉంది. ఆమెను చూడగానే హనుమంతునికి ప్రాణం లేచి వచ్చింది. అమ్మయ్య సీత కనపడింది అనుకున్నాడు. రూపవతి, యౌవనవతి, సౌందర్యవతి అయిన

మండోదరిని చూచి సీత అని భ్రమపడ్డాడు హనుమంతుడు. హనుమంతుని ఆనందానికి అవదులు లేవు. గంతులు వేసాడు. పక్కనే ఉన్న స్తంబమును ఎక్కాడు. కిందికి దుమికాడు. బుజాలు చరచు కున్నాడు. తోకను పట్టుకొని ముద్దులుపెట్టుకున్నాడు. వచ్చినపని అయిందని పరమానందభరితుడు అయ్యాడు. అటు ఇటు గబా గబా తిరిగాడు. స్తంబాలు ఎక్కాడు. దిగాడు. ఆ చోటంతా కలయతిరిగాడు. వానరములకు ఉన్న చాపల్యము అంతా ప్రదర్శించాడు.

శ్రీమద్రామాయణము

సుందర కాండము పదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

పదకొండవ సర్గ.

ఎగిరీ ఎగిరీ దుమికీ దుమికీ అలసిపోయాడు హనుమంతుడు. ఒకచోట స్థిరంగా కూర్చున్నాడు. సీత కనపడింది అన్న ఆనందాన్ని పక్కన బెట్టి ఆలోచించసాగాడు.

"ఈమె నిజంగా సీతయేనా! ఈమే నిజంగా సీత అయి ఉంటే రాముడు దగ్గర లేకుండా ఇంత సుఖంగా, నిశ్చింతగా, ఆనందంగా నిద్రపోతుందా! రాముడు దగ్గర లేని సీత ఇన్ని ఆభరణములు ధరిస్తుందా! మద్యపానము చేస్తుందా! పరపురుషుడైన దేవేంద్రుని కూడా కన్నెత్తి చూడని సీత, ఇలాగా రావణుని పక్కన నిద్రిస్తుందా! సందేహం లేదు. ఈమె సీత కాదు. మరొక స్త్రీ. ఈమె సీత

కాకపోతే మరి సీత ఎక్కడ ఉంది?" ఇలా పరి పరి విధాల ఆలోచించిన హనుమంతుడు, మరలా సీతకోసం వెదకడం మొదలెట్టాడు హనుమంతుడు.

మరొక పాన గృహమునకు వెళ్లాడు. అక్కడ కూడా అందమైన యువతులు, మద్యపానంతో, రతికేళితో సొక్కి సోలి ఒళ్లు తెలియకుండా నిద్రపోతున్నారు. ఎక్కడబడితే అక్కడ వాలిపోయి నిద్రపోతున్నారు. అందరి వనితల మధ్య రావణుడు ఆడ ఏనుగుల గుంపుమధ్య ఉన్న మగ ఏనుగుమాదిరి ప్రకాశించాడు. హనుమంతుడు సీతను వెదుకుతూ పక్కనే ఉన్న పానభూమిని చూచాడు.

అక్కడ రక రకాల మృగముల మాంసములు అందమైన పాత్రలలో పెట్టబడి ఉన్నాయి. లేళ్లు, దుప్పులు, అడవి దున్నలు, అడవి పందుల మాంసములు వేరు వేరుగా అమర్చబడి ఉన్నాయి. బంగారుపాత్రలలో ఉన్న నెమళ్లు, కోళ్ల మాంసములను, తిన్నంత తిని మిగిలింది వదిలేసారు అక్కడ ఉన్న యువతులు. చక్కగా వండబడిన పంది మాంసము, గొర్రె మాంసము, లేడి మాంసము, రకకరాల పక్షుల మాంసములు అందమైన పాత్రలలో అమర్చబడి ఉన్నాయి. అంతే కాదు, అక్కడ ఉన్న బంగారు పాత్రలలో రకరకాల భోజ్యములు, లేహ్యములు, చోష్యములు, భక్ష్యములు, లేళ్లు, దుప్పులు మాంసములు అందంగా అమర్చబడి ఉన్నాయి. ఆ పదార్థము లన్నీ తినగా తిని మిగిలినవి నేల మీద చెల్లాచెదరుడా చల్లబడి ఉన్నాయి.

ఈ ఆహార పదార్థములతో పాటు రకరకాల మద్యములు, పానీయములు, బంగారు పాత్రలలోనూ, వెండి పాత్రలలోనూ అమర్చబడి ఉన్నాయి. ఆ పాత్రలకు రత్నములు, మణులు పొదగబడి ఉన్నాయి. అలా అమర్చబడిన మద్యమును కొన్ని పాత్రలలో నుండి పూర్తిగా తాగేశారు. కొన్ని పాత్రలను అసలు ముట్టుకోలేదు. కొన్ని పాత్రలలో సగం సగం తాగగా మిగిలి ఉన్న మద్యము దొర్లిపోయి కారిపోతూ ఉంది. ఈ ప్రకారంగా చెల్లాచెదరుగా పడి ఉన్న మద్యపాత్రలను, భోజన పాత్రలను చూస్తూ హనుమంతుడు సీత కోసరం అణువు అణువునా గాలిస్తున్నాడు.

అక్కడి నుండి మరొక చోటికి వెళ్లాడు హనుమంతుడు. అక్కడా అందమైన స్త్రీలు నిద్రిస్తున్నారు. వారికి ఒంటిమీద వస్త్రములు తొలగినట్టుకూడా తెలియడం లేదు. ఒకరి వస్త్రమును మరొకరు లాగుకుంటూ కప్పుకుంటూ నిద్రబోతున్నారు. వారు ఒంటికి పూసుకున్న చందనము వాసన, వారు సేవించిన మద్యము వాసనా, వారు తిన్న మధురమైన పదార్థముల వాసనా కలగలిపి ఒక రకమైన వింత వాసన వస్తూ ఉంది. ఆ వాసనలన్నీ ఆఘ్రాణిస్తూ హనుమంతుడు వారి మధ్య తిరుగుతూ సీత కోసరం వెదుకుతున్నాడు.

రావణుని అంత:పురములో ఉన్న స్త్రీలు రకరకాలైన రంగులలో ప్రకాశిస్తున్నారు, కొందరు బంగారు వర్ణములోనూ కొందరు చామచాయలోనూ మరి కొందరు నల్లగానూ, మరి కొందరు పచ్చని పసిమి ఛాయలోనూ ప్రకాశిస్తున్నారు. వారందరి ముఖములు వికసించిన పద్మముల మాదిరి ప్రకాశిస్తున్నాయి. ఇంతమంది సౌందర్యవతుల మధ్య హనుమంతునికి సీత కనపడలేదు. ఇప్పుడు

సుందర కాండము

హనుమంతునికి మరొక సందేహము పట్టుకుంది. తాను ఇప్పటి దాకా ఎంతో మంది యువతులను ఎన్నోచిత్ర విచిత్ర భంగిమలలో చూచాడు. పరస్త్రీలను ఈ విధంగా చూడటం వలన తాను ధర్మం తప్పానా! పాపం చేసానా! అని సందేహం కలిగింది హనుమంతునికి.

"నేను ఇప్పటి దాకా పరస్త్రీలను కన్నెత్తికూడా చూడలేదు. అటువంటిది ఇప్పుడు నిద్రపోతున్న పరాయి స్త్రీలను ఈ విధంగా వివిధ భంగిమలలో చూచాను. అది కాకుండా పట్టి పట్టి పరీక్షగా చూచాను. అంగాంగములు చూచాను. మరి ఇది ధర్మద్రోహము కాదా!" అని తనలో తాను తర్కించుకున్నాడు. ఇంతలో హనుమంతునికి మరొక ఆలోచన వచ్చింది. "నా అంతట నేను స్వతాహాగా పరాయి స్త్రీలను చూడలేదు కదా! కేవలం సీతను వెదికే ప్రక్రియలో భాగంగా చూచాను. అదీ కాకుండా వారిని చూచినపుడు నా మనసులో ఎలాంటి వికారమూ కలగలేదు. ఇంద్రియములు ఏ పని చేయాలన్నా మనసే కారణము. మనస్సులో సంకల్పించనిది ఇంద్రియములు ఏపనీ చేయలేవు. నేను నా మనసులో ఈ స్త్రీల పట్ల ఎలాంటి వికారము సంకల్పించలేదు. కాబట్టి నాకు ఏ పాపమూ అంటదు. అదీ కాకుండా సీత ఒక స్త్రీ. సీతకోసరం స్త్రీల మధ్యలో వెదకాలి కానీ పురుషుల మధ్యలో వెదకలేను కదా! కాబట్టి నేను స్త్రీలను చూడటం తప్పని సరి. నా మనసు పరిశుద్ధంగా ఉన్నప్పుడు, నేను ఎంతమంది స్త్రీలను ఎలా చూచినా నాకు ఏ ధర్మహానీ కలగదు." అని తన మనసును సమాధాన పరచుకున్నాడు. మరలా సీతను వెదకడం మొదలెట్టాడు.

రావణుని అంత:పురములో, దేవతా స్త్రీలు, నాగ కన్యలు, గంధర్వకన్యలు కనపడ్డారు కానీ, ఎంత వెదికినీ సీత కనపడలేదు. ఇంక అక్కడ ఉండి ప్రయోజనము లేదని కొంచెం దూరంగా వెళ్లి ఒక చోట కూర్చుని ఆలోచించడం మొదలెట్టాడు హనుమంతుడు. సీత అంత:పురములలో ఉండదు. విలాసవంతమైన అంత:పురములో వెదకడం వృధా. కాబట్టి బయట వెదకాలని అనుకున్నాడు హనుమంతుడు.

శ్రీమద్రామాయణము

సుందర కాండము పదకొండవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

పన్నెండవ సర్గ.

హనుమంతుడు రావణుని అంత:పురము నుండి బయటకు వచ్చాడు. పక్కనే ఉన్న ఉద్యానవనములు, పొదరిళ్లు, చిత్రగృహములు, ఏదీ వదల కుండా వెదుకుతున్నాడు. లంక పూర్తిగా గాలించడం అయింది. సీత జాడ కనపడలేదు. ఇంక సీత ఈలోకంలో బతికి లేదు. మరణించి ఉంటుంది. సీత బతికే ఉంటే ఎక్కడో ఒకచోట కనపడాలి కదా! అనే నిర్ధారణకు వచ్చాడు హనుమంతుడు.

ఇంక హనుమంతుని ఆలోచనలు ఆ విధంగా సాగాయి. సీత మరణించి ఉంటుంది అన్న వార్త గానీ, , సీత దొరకలేదు అన్న వార్తను గానీ తీసుకొని కిష్కింధకు వెళితే పరిణామాలు ఎలా ఉ

ంటాయి అనే దాని మీద రకరకాల ఊహాగానాలు చేయసాగాడు హనుమంతుడు.

"ఎంతకూ తనకు లొంగకుండా ధర్మమార్గాన్ని అంటిపెట్టుకొని ఉన్న సీతను, రావణుడు కోపం వచ్చి చంపేసి ఉంటాడేమో! అదీ కాక పోతే ఎప్పుడూ కని విని ఎరుగని ఈ భయంకర రాక్షసులను చూచి, వారి బెదిరింపులకు భయపడి, తట్టుకోలేక సీత మరణించిందేమో! కాబట్టి సీత ఇంక నాకు కనిపించదు. సుగ్రీవుడు ఇచ్చిన గడువు ఎప్పుడో దాటి పోయింది. ఇన్నిరోజులూ అక్కడా ఇక్కడా తిరిగి ఇప్పుడు సీత కనపడలేదు అని చెబితే సుగ్రీవుడు ఊరుకుంటాడా! వాడసలే మహాబలవంతుడు. చచ్చేట్టు చావ గొడతాడు. మరణ దండన విధిస్తాడు.

నేను మాత్రం ఊరికినే ఉన్నానా! రావణుని అంత:పురం అంతా చూచాను. ఎంతో మంది స్త్రీలను చూచాను. కాని సీత ఎక్కడా కనపడలేదు. ఏం చెయ్యను? నూరుయోజనముల సముద్రం దాటడం, లంకలోకి ప్రవేశించడం, లంక అంతా అణువు అణువునా గాలించడం ఈ శ్రమ అంతా వృథా అయింది. నా కోసరం సముద్రము ఆవల ఎంతో మంది వానరులు వేచి ఉన్నారు. నేను వారి దగ్గరకు పోగానే "నూరుయోజనముల సముద్రము దాటి లంకకు వెళ్లావు కదా! ఏమి సాధించావు? సీత జాడ తెలుసుకున్నావా? ఏమయింది? సీత ఎక్కడుంది?" అని వాళ్లు అడిగితే ఏమని సమాధానము చెప్పాలి? పోనీ వారి దగ్గరకు వెళ్లకుండా ఇక్కడే ఉంటే, నా కోసరం ఎదురు చూచి చూచి వారు ప్రాయోపవేశం చేసి మరణిస్తారేమో!

నేను ఏదో ఘనకార్యం చేసుకొని వస్తానని జాంబవంతుడు, అంగదుడు నా కోసం ఎదురు చూస్తుంటారు. వారికి ఏమని చెప్పాలి?" అని ఆవేదన చెందుతున్నాడు హనుమంతుడు.

ఇంతలో హనుమంతుని లోని వివేకము మేల్కొంది. తనను తాను సంబాళించుకున్నాడు. "ఏమిటిది! నేను ఇలా ఆలోచిస్తున్నాను. నాకు ఇంత నిర్వేదము పనికిరాదు! అన్ని అనర్థములకు హేతువు నిర్వేదము. నిర్వేదము లేకపోవడమే కార్యసిద్ధికి మూలము. మానవుడు తాను ఏమీ చేయలేను అనుకుంటే ఏమీ చేయలేడు. చేయ గలను అనుకుంటే ఏమైనా చేయగలడు. నిర్వేదము లేకపోవడమే కార్యము సఫలం కావడానికి మూలము. కాబట్టి నాలో పుట్టిన ఈ నిర్వేదమును సమూలంగా నాశనం చేసి, రెట్టించిన ఉత్సాహంతో సీత కోసం వెదుకుతాను." అని తనకు తానే ఉత్తేజితుడు అయ్యాడు హనుమంతుడు.

వెంటనే తాను అప్పటి వరకూ సీత కోసరం ఎక్కడెక్కడ వెదికిందీ ఒక్కసారి ఆకళింపు చేసుకున్నాడు. తాను ఇప్పటి దాకా పానశాలలు, ఉద్యానవనములు, పూపొదరిళ్లు, క్రీడా మందిరములు, శయ్యాగారాలు, భోజన శాలలు, పుష్పక విమానము లోని అంతర్భాగములు, ఇంకా లంకలోని అన్ని గృహములు, ప్రాంగణములు వెదికాడు. ఇంకా వెదకవలసినవి నేలమాళిగలు, జనులు సాధారణంగా గుమిగూడే మంటపాలు, చిన్న చిన్న గృహాలూ. వీటిని కూడా వెదకాలి అని నిర్ణయించుకున్నాడు.

అంతే హనుమంతుడు చిన్న మర్కటము మాదిరి చెంగు చెంగున ఎగురుతూ, దుముకుతూ అన్ని ఇళ్లలోకి దూరి వెదకడం మొదలెట్టాడు. చిన్నా, పెద్దా అని తేడా లేకుండా అన్ని గృహములనూ ఒక్కటీ వదలకుండా, అంగుళము మేరకూడా వదలకుండా వెదికాడు. కాని సీత కనపడలేదు. ఇంక మిగిలినవి బావులూ, సరస్సులూ, వీధులూ. అక్కడ కూడా క్షుణ్ణంగా వెదికాడు హనుమంతుడు. సీత కనపడలేదు. ఎంతోమంది రాక్షస స్త్రీలు, ఇతర జాతుల స్త్రీలు కనపడ్డారు కానీ సీత మాత్రం కనపడలేదు. ఇంక వెదకవలసిన స్థలాలు ఏవీ లేకపోవడంతో హనుమంతునిలో మరలా నిరుత్సాహము ఆవరించింది. తాను సముద్రాన్ని లంఘించడం, సీతను వెదకడం అన్నీ వృథా అయిపోయినాయి కదా! అని ఆలోచిస్తున్నాడు హనుమంతుడు.

శ్రీమద్రామాయణము

సుందర కాండము పండ్రెండవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

పదమూడవ సర్గ.

హనుమంతుడు ఒక గృహము మీది నుండి మరొక గృహము మీదికి దుముకుతూ, అన్ని గృహములూ వెదికాడు.ఎక్కడా సీత జాడ కనపడలేదు. విసిగిపోయాడు. ఒక చోట ఏకాంతముగా కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

"నేను రామకార్యము నిమిత్తము లంకకు వచ్చాను. లంక అంతా గాలించాను. కానీ సీత ఎక్కడా కనపడలేదు. కాని జటాయువు సోదరుడు, పక్షిరాజు సంపాతి చెప్పిన ప్రకారము సీత రావణాసురుని స్థావరమైన లంకలోనే ఉండాలి. కాని లంక అంతా ఎంత వెతికినా సీత కనపడలేదు. నిస్సహాయురాలైన సీత రావణుని చెరలో ఉండి చేసేది లేక రావణునికి లొంగి పోయిందా! లేక రావణుడు సీతను ఆకాశ మార్గంలో అతి వేగంగా తీసుకొని వస్తుంటే, ఆ వేగానికి తట్టుకోలేక సీత మార్గమధ్యంలో ఎక్కడైనా పడిపోయిందా! రావణుడు సీతను సముద్రము మీదుగా తీసుకొని వచ్చి ఉండాలి. ఆకాశంలో వస్తున్నప్పుడు కింద ఉన్న అపారమైన జలరాసిని చూచి భయపడి, సీత సముద్రంలో పడిపోయిందా! జలచరములకు ఆహారంగా మారిందా!

అయోనిజ అయిన సీత, దుర్మార్గుడు, దుష్టుడు అయిన రావణుడు, తనను తాకి, తనను పట్టుకొని, తన అంగాంగములు తాకుతూ, తీసుకొని వస్తుంటే, ఆ అవమానమును తట్టుకోలేక దారిలోనే ప్రాణములు విడిచిందా! అదీ కాకుండా, రావణుడు సీతను తీసుకొని వస్తుంటే, ఆమె పెనగులాడితే, ఆ పెనగులాటలో జారి సముద్రంలో పడిపోయిందా! సీత ఎంత కాలానికి తనకు లొంగక పోతే, రావణుడు విసుగుచెంది ఆమెను చంపించి, భక్షించాడా! రావణుడు సీతను తీసుకొని వచ్చి అంత:పురములో ఉంచినపుడు, రావణుని ఇతర భార్యలు అతిలోకసౌందర్యవతి అయిన సీతను చూచి, అసూయ చెంది, రావణుడు తమకు దక్కడేమోఅన్న అనుమానంతో సీతను అంతమొందించారా!

సుందర కాండము

రావణుడు సీతను ఒంటరిగా బంధించి ఉంచినపుడు, సీత రాముని తలచు కొని తలచుకొనీ, కృంగి, కృశించి, చివరకు మరణించినదా! లేక సీత రావణుని అంత:పురములోనే ఎక్కడైనా ఉందా! నాకు కనపడలేదా! అయినా నా వెర్రిగానీ, మహాపతివ్రత అయిన సీత, రాముని తప్ప మరొకరిని కన్నెత్తి కూడా చూడని మహాసాధ్వి, రావణునికి లొంగిపోతుందా! ఏది ఏమైనా సీత నాకు కనపడలేదు.

సీత మరణించి ఉన్నా, లేక జీవించి ఉన్నా, లేక ఆత్మాహుతి చేసుకున్నా, ఎవరికీ కనపడకుండా పోయినా, ఈ విషయం రామునికి తెలియచెయ్యడం మంచిది కాదు. అలాగని సీత గురించి రామునికి చెప్పకుండా ఎంత కాలము దాచగలము! సీత గురించి రామునికి తెలిసినా దోషమే! తెలియకపోయినా దోషమే! ఇప్పుడు నేను ఏం చెయ్యాలి? నాకేది మార్గము? అంతా అగమ్యగోచరంగా ఉంది. సముద్రమును దాటాను, లంకకు వచ్చాను అనుకుంటే, రామ కార్యము అంతా రసాభాస అయింది." అని హనుమంతుడు పరి పరి విధాలా ఆలోచిస్తున్నాడు.

కాని ఆయన ఆలోచనలు ఒక కొలిక్కిరావడం లేదు. మరలా హనుమంతుని ఆలోచనా ప్రవాహం సాగి పోయింది. "ఇప్పుడు నేను ఏమి సాధించానని కిష్కింధకు తిరిగి వెళ్లాలి. సముద్రము దాటడం, లంకకు రావడం, లంక అంతా వెదకడం అంతా వృథా అయింది కదా! ఒకవేళ నేను కిష్కింధకు వెళితే, సీత జాడ తెలిసిందా అని అడిగితే, రామలక్ష్మణులకు, సుగ్రీవునికి ఏమి సమాధానము చెప్పాలి?

నేను రాముని ముందు నిలబడి సీత కనపడలేదు అని ఒక మాట చెబితే రాముడు కుప్పకూలి పోతాడు, సీతా వియోగబాధతో మరణిస్తాడు. సీత కనపడలేదు అన్న మాట కన్నా రాముని దృష్టిలో మరొక పరుషమైన మాట ఉండదు. రాముడు మరణించడం చూచిన లక్ష్మణుడు కూడా ప్రాణత్యాగము చేస్తాడు. రాముడు, లక్ష్మణుడు మరణించారు అన్న వార్త అయోధ్యకు చేరగానే భరతుడు కూడా మరణిస్తాడు. సోదరుల మరణవార్త విన్న శత్రుఘ్నుడు కూడా మరణించడం తథ్యము. లేక లేక కలిగిన వాళ్లు, పుత్రకామేష్టి యాగఫలంగా జన్మించిన కుమారులు మరణించగానే, కౌసల్యా, కైకేయీ, సుమిత్రల మేనిలో ప్రాణములు నిలువవు. తనకు మిత్రుడు, తనకు సాయం చేసిన వాడు అయిన రాముడు మరణించగానే, సుగ్రీవుడు కూడా మరణిస్తాడు. సుగ్రీవుని మరణం చూచి సుగ్రీవుని భార్య రుమ కూడా భర్తను అనుసరిస్తుంది. అసలే భర్త వాలిని కోల్పోయి, సుగ్రీవుని పంచన చేరిన తార, సుగ్రీవుడు కూడా మరణించగానే, తాను కూడా మరణిస్తుంది. తండ్రి వాలి, తల్లి తార, పిన తండ్రి సుగ్రీవుడు, పినతల్లి రుమ చనిపోగానే, గుండెపగిలి అంగదుడు కూడా మరణిస్తాడు. కిష్కింధ అనాథ అయి పోతుంది. తమ ఆలనా పాలనా చూచే నాథుడు లేక వానరులు అందరూ ప్రాణత్యాగము చేసుకుంటారు. ఇదంతా నేను కిష్కింధకు వెళ్లి సీత కనపడలేదు అన్న ఒక్క మాట చెప్పినందువల్ల సంభవిస్తుంది. అటు రాముని వంశము, ఇటు సుగ్రీవుని వంశము అంతరిస్తుంది. కాబట్టి నేను కిష్కింధకు వెళ్లనే వెళ్లను. సీత జాడ తెలియకుండా నేను సుగ్రీవుని వద్దకు వెళ్లడం వృథా!

నేను తిరిగి కిష్కింధకు వెళ్లకుండా ఉంటే “ఎప్పటికైనా హనుమంతుడు వస్తాడు, సీత గురించి వార్త తెస్తాడు” అనే ఆశతో రామలక్ష్మణులు, సుగ్రీవుడు, వానరులు జీవించి ఉంటారు. నేను మాత్రము ఇక్కడే ఉండి ఇక్కడ ఉన్న కాయలు పండ్లు తింటూ వానప్రస్థ జీవనము గడుపుతాను. కాలగతిన మృతి చెందుతాను. లేదా చితి పేర్చుకొని అందులో దూకుతాను. లేక సముద్రము ఒడ్డున ప్రాయోపవేశము చేస్తాను. నాశరీరాన్ని పక్షులు, మృగములు తింటాయి. ఇంతకన్నా నాకు మరొక మార్గము కనిపించడం లేదు. నేను ఇంత కాలము సంపాదించుకున్న పేరు, ప్రతిష్ట రామ కార్యము సాధించలేకపోవడం వలన భగ్నమైపోయాయి.” అని హనుమంతుడు శోకిస్తున్నాడు.

హనుమంతునికి ఏమి చెయ్యాలో తోచడం లేదు. మితిమీరిన దు:ఖంతో హనుమంతుని ఆలోచనా శక్తి నశించింది. కోపం ఎక్కువ అయింది. ఆ కోపంలో ఇలా అనుకున్నాడు.

“దీనికంతటికీ మూల కారణము ఈ దుష్టుడైన రావణుడు. ముందు వీడిని చంపితే గానీ నా కసి తీరదు. లేకపోతే వీడిని పట్టుకొని పశువును కట్టినట్టు కట్టి, రాముని ముందు పడవేస్తాను. వీడి సంగతి రాముడే చూచుకుంటాడు.” అని అనుకున్నాడు హనుమంతుడు.

మరలా హనుమంతుని ఆలోచనలు మొదటికి వచ్చాయి. “లాభం లేదు. సీత కనిపించేవరకూ లంకను మాటి మాటికీ వెదుకుతాను. ఎన్నిసార్లు అయినా వెదుకుతాను. సీత లంకలోనే

ఉందని సంపాతి చెప్పాడు. సంపాతి చెప్పాడు కదా అని రాముని వద్దకు పోయి, రాముని ఇక్కడకు తీసుకొని వస్తే, ఇక్కడ తన భార్య సీత కనపడకపోతే, రాముడు వానరులందరినీ వరస బెట్టి చంపుతాడు. కాబట్టి లంకను వదలకూడదు. వెదకాలి. వెదికి తీరాలి. నేను తగుదునమ్మా అంటూ కిష్కిందకు పోయి అందరి మరణానికి కారణం అయ్యే బదులు ఇక్కడే ఉండి వెదుకుతూ ఉంటే ఎప్పటికైనా సీత జాడ తెలియకపోదు. సీత జాడ తెలిసిన తరువాతనే కిష్కింధకు వెళతాను” అని తనలో తాను అనుకుంటూ తల ఎత్తి చూచాడు హనుమంతుడు.

ఎదురుగా అశోక వనము కనిపించింది. దాని వంక చూచాడు హనుమంతుడు. “ఇదేమిటి. లంక అంతా వెతికాను. ఇక్కడ వెతికినట్టు లేదే! ఇక్కడ కూడా వెదికితే ఒక పని అయిపోతుంది కదా! ” అని అనుకున్నాడు.

వెంటనే సమస్త దేవతలకు, ఆదిత్యులకు, రుద్రులకు, అశ్వినీ దేవతలకు, మరుత్తులకు నమస్కారం చేసాడు. “ఈ అశోక వనములో సీత కనపడాలి. నేను సీతను రాముని వద్దకు చేర్చాలి. దానికి మీ సాయం కావాలి.” అని అందరినీ ప్రార్థించాడు. జైశ్రీరాం అంటూ పైకి లేచాడు. రాముడికి, సీతకు మనసులోనే నమస్కరించాడు. అశోక వనము వైపు వెళ్లాడు. అశోక వనము ముందు నిలబడ్డాడు.

ఇదివరకు మాదిరి ఎక్కడంటే అక్కడ వెదకకుండా, ఒక పద్ధతి ప్రకారం వెదకాలని నిర్ణయించుకున్నాడు. ఎక్కడెక్కడ రక్షక

భటులుఉన్నారో తెలుసుకున్నాడు. వారికి కనపడకుండా చిన్ని వానరంగా మారాడు. మరలా మరొక సారి సమస్త దేవతలకు రుద్రునికి, బ్రహ్మకు, దేవేంద్రునికి, సూర్యచంద్రులకు నమస్కరించాడు. సకలభూతములకు అదిపతి అయిన మహేశ్వరునికి కార్యసిద్ధి కలిగించమని మనసారా మొక్కాడు. అశోకవనంలో ప్రవేశించాడు హనుమంతుడు.

(ఇక్కడ మనకు రెండు విషయాలు కనపడుతున్నాయి. మొదటిది. హనుమంతుడు లంక అంతా వెతికాడు. వెతికే ముందు ఏ దేవునికి మొక్కలేదు. తన స్వశక్తిని నమ్ముకున్నాడు. కాని ఫలితం కనిపించలేదు. ఇప్పుడు అన్ని దేవుళ్లకు మొక్కాడు. అశోక వనంలో సీత కనిపించింది. చాలామంది తమ శక్తిని నమ్ముకుంటారు. దైవాన్ని నమ్మరు. కొంతమంది కేవలం దైవాన్ని నమ్ముతారు. ఏ ప్రయత్నమూ చెయ్యరు. రెండూ పనికిరావు. మానవ ప్రయత్నమూ దైవశక్తీ కలిసినపుడే కార్యసిద్ధి కలుగుతుంది. అదే హనుమంతుడు చేసాడు. దేవతలందరినీ ప్రార్థించాడు. వారి సాయాన్ని అర్థించాడు. తన శక్తిని ఉపయోగించి అశోకవనము అంతా వెతికాడు. సీతను కనుగొన్నాడు. కార్యసిద్ధి పొందాడు.

ఇంక రెండవది. హనుమంతుడు అశోకవనము ముందు కూర్చుని   నిర్వేదము పొందాడు. కాని ఆ అశోక వనములోనే సీత ఉందని తెలియదు హనుమంతునికి. సమస్య ఎక్కడ ఉంటుందో దానికి పరిష్కారం అక్కడే ఉంటుంది. కాకపోతే ప్రశాంతమైన మనస్సుతో ఆలోచించాలి. ప్రయత్నం చెయ్యాలి. దైవసాయం అర్థించాలి. అప్పుడు కార్యం సఫలమవుతుంది. చిన్న సమస్య ఎదురైనా కంగారు

పడిపోతాం. ఏమేమోఆలోచిస్తాం. ఏమి చెయ్యాలో అది చెయ్యం. అందరినీ తిడతాం. మనలను మనం తిట్టుకుంటాం. హనుమంతుడూ అదే చేసాడు. కాని హనుమంతుని సమస్యకు పరిష్కారం ఎదురుగానే ఉంది. అది గుర్తించిన హనుమంతుడు కార్యరంగంలోకి దూకాడు. దైవ సాయం కోరాడు. రామ కార్యాన్ని సాధించాడు. కాబట్టి మనకు ఏ సమస్య ఎదురైనా కంగారు పడకుండా, ప్రశాంతంగా ఆలోచించాలి. పరిష్కారం వెంటనే దొరుకుతుంది. మనం సుందర కాండము చదివి తెలుసుకోదగిన మంచి విషయాలలో ఇది ఒకటి.)

శ్రీమద్రామాయణము

సుందర కాండము పదమూడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

పదునాలుగవ సర్గ.

హనుమంతుడు కాపలా వాళ్ల కంటపడకుండా అశోకవనం లోకి ప్రవేశించాడు. ప్రాకారము మీదికి ఎక్కి కిందికి దుమికాడు. చుట్టు చూచాడు.

అశోక వనము చాలా పెద్దది. పుష్పించిన పుష్పములతోనూ, లతలతోనూ, సంపెంగ, పొన్న, జాజి, మామిడి చెట్లతో ఇంకా రకరకాల వృక్షములలోనూ లతలతోనూ నిండి ఉంది. హనుమంతుడు అక్కడే ఉన్న మామిడి చెట్ల సమూహంలోకి ప్రవేశించాడు. అక్కడ లెక్కలేనన్ని మామిడి చెట్లు ఉన్నాయి. ఆ వనములో మృగములు, పక్షులు

యధేచ్ఛగా విహరిస్తున్నాయి. మృగముల అరుపులతో, పక్షుల కిలా కిలా రావాలతో ఆ వనం ప్రతిధ్వనిస్తూ ఉంది. హనుమంతుడు సీతను వెదుకుతూ ఇంకా లోపలకు వెళ్లాడు.

హనుమంతుడు ఒక చెట్టు మీది నుండి మరొక చెట్టు మీదికి వేగంగా దుముకుతుంటే ఆ చెట్ల మీద ఉన్న పక్షులు భయపడి టపా టపా రెక్కల చప్పుడు చేసుకుంటూ ఎగిరిపోయాయి. హనుమంతుడు అలా దుముకుతుంటే పుష్పించిన వృక్షములు పుష్పవర్షము కురిపించాయి. (పూలన్నీ రాలిపోయాయి). ఆ చెట్లమధ్య వేగంగా తిరుగుతున్న హనుమంతుడు వసంత ఋతువులో తిరుగాడు వసంతుని వలె ప్రకాశించాడు. అశోకవనములో ఉన్న నేల అంతా పుష్పములతో నిండి పోయి పుష్పముల తివాచీ పరచినట్టు శోభించింది.

ఒకచెట్టు మీది నుండి మరొక చెట్టు మీదికి లంఘించే హనుమంతుని వేగానికి ఆ చెట్లకు ఉన్న పండ్లు అన్నీ రాలిపోయాయి. ఆకులు ఎగిరిపోతున్నాయి. హనుమంతుడు అడ్డం వచ్చిన చెట్ల కొమ్మలను విరుస్తున్నాడు. చిన్న చిన్న చెట్లను పెకలించి అవతల పారేస్తున్నాడు. పెద్ద పెద్ద తీగలు అల్లుకొన్న పొదలను చిందర వందర చేస్తున్నాడు.

ఆ అశోక వనములో పెద్ద పెద్దదిగుడు బావులు ఉన్నాయి. వాటిలో పక్షులు కూర్చోడానికి చిన్న చిన్న తిన్నెల మాదిరి ఉన్నాయి. ఆ బావులలో తామరలు, కలువలు వికసించి ఉన్నాయి. ఆ బావులలో ఉన్న నీటిలో చక్రవాక పక్షులు, నీటి పక్షులు, హంసలు, సారస పక్షులు

ఈదుతున్నాయి. ఆ అశోక వనములో పెద్ద పెద్ద కొండలు, వాటిలో గుహలు కూడా ఉన్నట్టు హనుమంతుడు చూచాడు. ఆకొండల మీద, గుహలలోనూ సీత కోసం గాలించాడు.

ఆ కొండల మీది నుండి చిన్న చిన్న నదులు వేగంగా కిందికి దుముకుతున్నాయి. అవి మొగుడి మీద అలిగి పుట్టింటికి పోయే భార్యల వలె శోభిల్లుతున్నాయి. ఆ నదుల ప్రవాహానికి అడ్డంగా అక్కడక్కడా కొన్ని చెట్టు కొమ్మలు ఉన్నాయి. అవి ఎలా ఉన్నాయంటే "మొగుడి మీద అలిగి పుట్టింటికి పోవడంమంచిది కాదు" అని ఆ భామలను అడ్డగిస్తున్న బంధువుల మాదిరి ఉన్నాయి. అవి చూచుకుంటూ హనుమంతుడు ముందుకుసాగాడు.

హనుమంతుడు తామరపూలతో, రకరకాల పక్షులతో శోభిల్లుతున్న సరోవరములను చూచాడు. ఈ సరోవరముల దగ్గర హనుమంతుడు ఒక శింశుపా వృక్షమును చూచాడు. దాని చుట్టు బంగారు అరుగులు కట్టబడి ఉన్నాయి. హనుమంతుడు ఆ శింశుపా వృక్షము మీదకు ఎక్కి ఒక కొమ్మ మీద కూర్చున్నాడు.

"సీత ఇక్కడే ఎక్కడో ఉన్నదని నా మనస్సు చెబుతూ ఉంది. సీత ఇక్కడే తిరుగుతూ ఉంటుంది. సందేహం లేదు. దైవం అనుకూలిస్తే సీత ఇక్కడే నాకు కనపడవచ్చు. ఈ శింశుపావృక్షము, ఈ పద్మములతో కూడిన సరస్సు చాలా మనోహరంగా ఉన్నాయి. సీతకు ఇటువంటి ప్రదేశము అంటే ఎంతో ఇష్టము. అందుకని సీత ఇక్కడే ఉండాలి. ఇక్కడ లేకపోయిన తప్పకుండా ఈ ప్రదేశానికి రావచ్చు. రాముని మీది విరహముతో బాధపడుతున్న సీత రమ్యమైన హర్మ్యములలో

ఉండదు. ఈ వనములో, ఈ పద్మ సరస్సు చెంత, ఈ అందమైన పక్షులు, మృగముల మధ్యనే ఉంటుంది. సీతకు నియమనిష్టలు ఎక్కువ. ఇప్పుడు సంధ్యాసమయము అయింది. సాయం సంధ్య ఉపాసన కొరకు సీత ఈ పద్మసరోవరము వద్దకు తప్పక వస్తుంది. నిజంగా సీత జీవించి ఉంటే ఈ సుందరమైన సరోవర ప్రాంతమునకు తప్పకుండా వస్తుంది." అని అనుకొన్నాడు హనుమంతుడు.

సీత రాక కోసరం ఎదురు చూస్తూ హనుమంతుడు చుట్టు పక్కలను పరిశీలనగా చూస్తున్నాడు.

శ్రీమద్రామాయణము
సుందర కాండము పదునాలుగవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము
పదునైదవ సర్గ.

హనుమంతునికి ఆ అశోక వన సౌందర్యము ఎంత చూచినా తనివి తీరడం లేదు. ఆ వృక్షములను, లతలను, మృగములను, పక్షులను, సరోవరములను, బావులను, అందులో తిరుగాడే నీటిపక్షులను ఆనందంగా చూస్తున్నాడు. అశోక వనము అనే పేరుకు తగ్గట్టు ఆ వనమంతా అశోక వృక్షములతో నిండి ఉంది. దేవేంద్రుని నందన వనము మాదిరి ప్రకాశిస్తూ ఉంది. ఆ వనంలో ఉన్న చెట్లు లతలు అన్ని ఋతువులలోనూ పుష్పములు, ఫలములు అందిస్తున్నాయి.

అలా చూస్తున్న హనుమంతునికి ఆ శింశుపా వృక్షము దగ్గరలో, పద్మసరోవరము వద్ద ఒక చైత్యప్రాసాదము (మండపము లాంటి ఎత్తైన రాతి కట్టడము) ను చూచాడు. ఆ కట్టడము బాగా ఎత్తుగా, తెల్లటి రంగుతో, కైలాస పర్వతము మాదిరి ఉంది. ఆ కట్టడము దగ్గం. రాక్షస స్త్రీల మధ్యలో, మాసి పోయిన వస్త్రములు ధరించిన ఒక ఉత్తమ జాతి స్త్రీ కనపడింది. సరిగా ఆహారము తినక పోవడం వలన ఆమె బాగా చిక్కిపోయి ఉంది. ఆమె శరీరం చిక్కిపోయినను ఆమె దివ్యమైన తేజస్సుతో ప్రకాశిస్తూ ఉంది. మాసిపోయిన వస్త్రమును కట్టుకొన్న ఆమె బురదలో ఉన్న పద్మంలాగా ప్రకాశిస్తూ ఉంది. ఆమె దిగులుతో తల వంచుకొని కూర్చుని ఉంది. ఏమేమో ఆలోచిస్తూ ఉంది. ఆమె చుట్టు రాక్షస స్త్రీలు ఉన్నారు. తన వాళ్ల నుండి తప్పిపోయిన లేడి పిల్ల, తోడేళ్ల గుంపుమధ్య ఉంటే ఎలా ఉంటుందో, ఆ రాక్షస స్త్రీల మధ్య ఆమె తలవంచుకొని కూర్చుని ఉంది.

హనుమంతుడు ఆమెను చూచాడు. ఆమె సీత కావచ్చు అని అనుకున్నాడు. ఆమె అందము, కూర్చున్న తీరు, ఆమె ముఖంలో గూడుకట్టుకున్న విషాదము, ఒక తాపసి వలె ఆమె కూర్చొనడం చూస్తుంటే, ఆమె సీతయే అని హనుమంతుని మనస్సు చెబుతూ ఉంది. పొగతో కప్పబడిన అగ్నిజ్వాల మాదిరి ఆమె ప్రకాశిస్తూ ఉంది. ప్రతిరోజూ స్నానాదికములు చేయక పోవడం వల్ల ఆమె శరీరం మలినంగా ఉంది. నిరంతరమూ కన్నీళ్లు కార్చడం వలన ఆమె చెక్కిళ్ల మీద కన్నీటి చారికలు కనపడు తున్నాయి. మేఘములతో కప్పబడిన సూర్యుని వలె ఆమె ప్రకాశిస్తూ ఉంది.

హనుమంతుడు ఆమెను తదేక దృష్టి తో చూస్తున్నాడు. ఈమె సీత అవునా కాదా అనే మీమాంసలో పడ్డాడు. పైకి కనిపించే లక్షణాలు చూస్తుంటే ఈమె సీత అని నమ్మకం కలుగుతూ ఉంది. కాని మరలా సందేహము. హనుమంతునికి మరొక విషయం గుర్తుకు వచ్చింది. రాముడు తమను కలిసి నపుడు, ఆకాశం నుండి తమ మధ్య పడిన ఆభరణముల మూటను రామునికి చూపినపుడు, రాముడు, సీత అపహరింపబడిన రోజున ధరించిన ఆభరణముల గురించి వివరంగా చెప్పాడు. ఆ మాటలు హనుమంతునికి బాగా జ్ఞాపకం ఉన్నాయి. రాముడు ఏయే ఆభరణములు సీత ఒంటిమీద ఉన్నాయని చెప్పాడో అవే ఆభరణములు ఇప్పుడు కూడా సీత ఒంటిమీద ఉన్నాయి కానీ సంస్కారము లేక పోవడం వలన మట్టికొట్టుకొని పోయి ఉన్నాయి. ఆ ఆభరణములను గుర్తించాడు హనుమంతుడు.

రావణుడు అపహరించుకుపోతున్నప్పుడు సీత కొన్ని ఆభరణములను మూటగట్టి కిందికి జారవిడిచింది. ఆ ఆభరణములు ఇప్పుడు ఆమె ఒంటి మీద లేవు. మిగిలిన ఆభరణములు ఆమె ఒంటి మీద ఉన్నాయి. అంతే కాకుండా సీత తన ఉత్తరీయమును చించి ఆభరణములను కట్టి తమ మధ్య జార విడిచింది. ఆమె ఆభరణము లను కట్టిన ఉత్తరీయపు రంగు, ఇప్పుడు ఆమె ధరించిన వస్త్రము రంగు ఒకటే. ఆభరణములు కట్టిన వస్త్రము ఎలా మెరిసిపోతూ ఉందో ఈమె కట్టుకున్న వస్త్రము కూడా అదే మాదిరి మెరిసిపోతూ ఉ ంది. కాకపోతే చాలారోజుల నుండి కట్టుకోవడం వలన కొంచెం మాసినట్టు కనపడుతూ ఉంది.

ఈమె శరీర చ్ఛాయ, ముఖవర్చస్సు ఈమె కట్టుకున్న వస్త్రములు అన్నీ ఈమె సీత అని చెప్పకనే చెబుతున్నాయి. అదీ కాకుండా ఈమె నిరంతరము తన భర్త రాముని తలచుకోవడం వలన, ఈమె ముఖంలో విషాదం గూడుకట్టుకొని ఉంది. ఈమె సీత కాకపోతే ఇలా విషాదంతో ఉండాల్సిన పని లేదు. పైగా ఈమె ముఖ వర్చస్సు, అందము, అవయవముల పొందిక, రాముని ముఖవర్చస్సు, రాముని అందము, రాముని అవయవముల పొందిక, సరిగ్గా సరిపోయాయి. రాముడు అనుదినమూ సీత కోసరం విషాదంతో దు:ఖిస్తుంటే ఈమె కూడా రాముని కోసరం దు:ఖిస్తూ ఉంది. ఎవరి కోసరం రాముడు అనుదినమూ పరితపిస్తూ అలమటిస్తున్నాడో ఆసీత ఈమెయే. సందేహము లేదు." అని నిశ్చయించుకున్నాడు హనుమంతుడు.

హనుమంతుని ఆనందానికి అవధులు లేవు. సంతోషంతో పొంగిపోయాడు. ఒక్కసారి మనసులో రాముని స్మరించుకున్నాడు. మనసులోనే రామునికి నమస్కరించాడు.

శ్రీమద్రామాయణము
సుందర కాండము పదునైదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

సుందర కాండము

పదునారవ సర్గ.

అశోక వనములో సీత కనపడగానే హనుమంతుని ఆనందానికి అవదులు లేవు. రాముని మనసారా స్మరించుకున్నాడు. సీత పడుతున్న కష్టాలు చూచి హనుమంతుని హృదయం ద్రవించి పోయింది. హనుమంతుని కనుల నుండి కన్నీళ్లు ధారాపాతంగా కారుతున్నాయి. సీత కష్టములను తలచుకొని ఈ విదంగా బాధపడుతున్నాడు హనుమంతుడు.

"పరాక్రమమును, వినయ విధేయతలను, సమానంగా పుణికిపుచ్చుకున్న లక్ష్మణునికి వదిన అయి ఉండీ సీతమ్మ ఇన్న బాధలు పడుతూ ఉందంటే, కాల గమనమును ఎవరూ అతిక్రమించలేరు కదా! ఇన్ని కష్టములలో కూడా సీత ఇంత నిబ్బరముగా ఉందంటే ఆమెకు రాముని మీద, లక్ష్మణుని మీద అపారమైన నమ్మకము. వారు వచ్చి తనను రావణుని చెర నుండి విడిపించెదరని ప్రగాఢవిశ్వాసముతో ఉంది. రామునికి తగిన భార్య సీత. సీతకు తగిన భర్త రాముడు. ఇందులో సందేహము ఏ మాత్రము లేదు.

సీత ఇంతటి సుగుణవతి, సహనశీలి, సౌందర్యవతి కనుకనే రాముడు సీత గురించి అన్ని కష్టములు పడుతున్నాడు. సీత కోసమే కదా రాముడు, విరాధుడు, ఖరదూషణులు, త్రిశిరుని, ఇంకా పదునాలుగు వేల మంది రాక్షసులను తుదముట్టించాడు. ఈ సీత కారణంగానే కదా, సుగ్రీవుడు రాముని చేత వాలిని చంపించి, తన రాజ్యమును తిరిగి పొందగలిగాడు. నేను కూడా ఈ సీత కోసమే కదా

నూరు యోజనముల దూరము కల సముద్రమును లంఘించి ఈ లంకలో ప్రవేశించింది. ఇటువంటి గుణవతి, రూపవతి, పతివ్రత కోసరం రాముడు ఒక్క లంకనే కాదు ఈ భూమండలమును అంతా జయించిన ఆశ్చర్యపోబని లేదు. ముల్లోకములమీద ఆధిపత్యము ఒక వైపు, సీతను ఒకవైపు ఉంచితే., ముల్లోకాధిపత్యము సీతకు పదహారవ వంతుకు కూడా సరిపోదు. అంతటి మహిమాన్విత సాధ్వి సీత.

ఈ సీత అయోనిజ. సీత తండ్రి జనకుడు యజ్ఞము చేయగోరి, యజ్ఞభూమిని చదును చేయడానికి నాగలి పట్టి దున్నుతుంటే ఆ నాగేటి చాలులో దొరికిన సాధ్వి ఈ సీత. పాతివ్రత్యములో ఈమెకు ఈమెయే సాటి. జనకుని కూతురేకాదు, ఈమె దశరథుని కోడలుకూడా. దశరథుని పెద్దకుమారుడు రామునికి భార్య. అటువంటి సాధ్వి ఈనాడు ఈ ప్రకారంగా రాక్షసస్త్రీల మధ్య కష్టాలు పడుతూ ఉంది. అడవులకు వెళ్లాల్సింది రాముడే అయినా, భర్తమీద అనురాగము, గౌరవం చేత, సమస్తరాజభోగములను వదిలి, నారచీరలు ధరించి, కేవలము కందమూలములు తింటూ, నేల మీద శయనిస్తూ రామునితోపాటు అరణ్యవాసము చేస్తూ ఉంది ఈ సీత. అటువంటి సీతకు రావలసిన కష్టాలా ఇవి!

రావణుడు ఎంత భయపెట్టినా, ప్రలోభ పెట్టినా, చలించని మహాసాధ్వి ఈ సీత. ఇటువంటి సీతను ఇప్పుడు రాముడు చూస్తే ఎంత సంతోషిస్తాడో కదా! సీతను చూచిన రామునికి తిరిగి అయోధ్యకు పట్టాభిషిక్తుడు అయినంత ఆనందం కలుగుతుంది. ఈ సీత రావణుని చెరలో ఇన్ని కష్టములు అనుభవిస్తూ, రాముని గురించి తలచుకుంటూ, ఎప్పటి కైనా రాముడు రాక పోతాడా, తనను ఈ

రాక్షసుని చెరనుండి విడిపించకపోతాడా అని ఎదురు చూస్తూ ఉంది. ఈమెను చూస్తుంటే ఈమెకు తన ఎదురుగా ఉన్న భయంకరా కారులైన రాక్షస స్త్రీలు కానీ, చుట్టు పక్కల ఉన్న లతలు కానీ, పుష్పములు కానీ, అందమైన పూపొదరిళ్లు కానీ, కనిపించడం లేదు. కేవలం ఆమె కనులకు రాముడే కనపడుతున్నాడా అని అనిపిస్తూ ఉంది. స్త్రీకి ఎన్ని ఆభరణములు, అలంకారములు ఉన్నా, భర్తను మించిన అలంకారము వేరొకటి లేదు. అటువంటి సీతకు భర్త దగ్గర లేకపోవడం వల్ల, అలంకార విహీనంగా కనపడుతూ ఉంది. సీతవంటి భార్య అపహరింపబడినా, ఈమెనే తలచుకుంటూ రాముడు కాలం గడుపుతున్నాడు అంటే రాముని మించిన భర్త మరియొకడు ఉండబోడు.

ఎటువంటి సంబంధము లేని నాకే ఈమెను చూస్తే మనసు ద్రవించి పోతూఉంటే, ఇంక ఈమెను భార్యగా పొంది, అకారణంగా ఈమెను పోగొట్టుకున్న రాముని సంగతి వేరే చెప్పాలా! అరణ్యవాస సమయంలో ఈ సీతను రామలక్ష్మణులు కంటికి రెప్పలా కాపాడేవారు. ఇప్పుడు ఈమె ఈ రాక్షసస్త్రీల కాపలాలో ఉంది. ఎంత విచిత్రము. అరణ్యవాసంతోనే సతమతమవుతున్న సీతకు ఈ అపహరణము, రాక్షస స్త్రీల సహచర్యము ఎంత బాధకలిగిస్తూ ఉందో కదా! ఈమె సీతయే. సందేహము లేదు." అని సీత పడుతున్న కష్టములను చూచి హనుమంతుడు బాధపడుతున్నాడు. ఆమెనే చూస్తూ ఆ చెట్టు మీద కూర్చొని ఉన్నాడు.

శ్రీమద్రామాయణము

సుందర కాండము పదునారవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

పదునేడవ సర్గ.

ఇంతలో చీకటి పడింది. చంద్రోదయం అయింది. చంద్రుడు పండువెన్నెల కురిపిస్తున్నాడు. వాతావరణము ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. ఆ వెన్నెలలో హనుమంతునికి సీత స్పష్టంగా కనపడుతూ ఉంది. సీత కనపడింది అన్న సంతోషంలో హనుమంతుడు చుట్టుపక్కల ఉన్న రాక్షస స్త్రీలను సరిగా చూడలేదు. ఇప్పుడు హనుమంతుడు వారి మీద దృష్టి పెట్టి చూస్తున్నాడు.

ఆ రాక్షస స్త్రీల ఆకారాలు ఒకటీ సరిగా లేదు. అన్నీ వికృతాకారులే! ఒక దానికి ఒక కన్ను , దొప్పల్లాంటి చెవులు ఉన్నాయి. మరొక దానికి చెవులే లేవు. మరొక దానికి చెవులు మొనలు దేలి ఉన్నాయి. ఒక దానికి శరీరం సన్నగా తల పెద్దదిగా ఉంది. ఇంక వాళ్ల కేశ సంపద గురించి చెప్ప పనిలేదు. అందరికీ దాదాపు తైల సంస్కారములేని చింపిరి .జుట్టు. కొన్నిటికీ పొట్ట, స్తనములు వేలాడుతూ ఉన్నాయి. ఒకతి పొట్టిది. మరొకతి పొడుగు. ఒకదానికి ఎత్తు పళ్లు మరొక దానికి అసలు పళ్లే లేవు. ఇలా ఒకదానిని మించి ఒకటి వికృతాకారంతో ఉన్నాయి. ఆ వికృతాకారులైన రాక్షస స్త్రీలను చూచాడు హనుమంతుడు.

వారు తమ చేతిలో శూలములు, ముద్గరలు ధరించి ఉన్నారు. ఆ రాక్షస స్త్రీలు ఆ శింశుపా వృక్షము చుట్టు కూర్చుని ఉన్నారు. వారికి మద్యము, మాంసము అంటే ఎంతో ఇష్టము లాగుంది. వారు

నిరంతరమూ మాంసము తింటూ మద్యము సేవిస్తున్నారు. వారి మధ్యలో మూర్తీభవించిన శోకదేవతలా కూర్చుని ఉంది సీత.

సీతకు ఆభరణములు లేక పోయినా పాతివ్రత్యము అనే ఆభరణంతో ప్రకాశిస్తూ ఉంది. సీత ఒంటి మీద ఎన్ని ఆభరణములు ఉన్నా భర్త అనే ఆభరణం లేకపోవడంతో దరిద్రురాలిగా కనిపిస్తూ ఉంది. ఎల్లప్పుడూ భర్త సన్నిధిలో కాలం గడపవలసిన సీత ఈ ప్రకారంగా రాక్షస స్త్రీల సమూహంతో కాలం గడపవలసి రావడం ఎంతో బాధగా ఉంది. కాని రాముని పరాక్రమము ఎరిగిన సీత, తన కష్టములకు బాదపడటం లేదు. ఆమె పాత్రివ్రత్యమే ఈమెను రక్షిస్తూ ఉంది. ఎంతో సహనంతో ఓర్పుతో ఉన్న సీత సాక్షాత్తు భూదేవిని తలపిస్తూ ఉంది. తన పాతివ్రత్యమే ఆభరణంగా కలిగిన సీత, మాసిపోయిన చీర ధరించి, భయంకరమైన ఆకృతులుకలిగిన రాక్షస స్త్రీల మధ్య కూర్చుని ఉండటం చూచాడు హనుమంతుడు.

ఎవరైనా తనను చూస్తారేమో అని చెట్ల ఆకుల మధ్యన నక్కి నక్కి కూర్చుని ఉన్నాడు హనుమంతుడు.

శ్రీమద్రామాయణము

సుందర కాండము పదునేడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

పదునెనిమిదవ సర్గ.

రాత్రి మెల్లిగా గడిచింది. ఇంక ఒక జాము రాత్రి మాత్రమే మిగిలి ఉంది. తూర్పున తెల తెల వారుతూ ఉంది. లంకా నగరంలో దుర్మార్గులైన రాక్షసులే కాదు. వేదవేదంగపారంగతులు అయిన రాక్షసులు కూడా ఉన్నారు. వారు తెల్లవారుజామునే లేచి స్నానమాచరించి వేదపఠనం చేస్తున్నారు. ఆ వేదఘోషలు హనుమంతుని చెవికి సోకుతున్నాయి. రావణుని అంత:పురములో వంది మాగధులు రావుణుని నిద్రలేపుతున్నారు. మంగళ వాద్యములు మనోహరంగా వినపడుతున్నాయి.

మంగళవాద్యములు మధురంగా చెవి సోకుతుండగా, రావణుడు నిద్రనుండి మేల్కొన్నాడు. లేచీ లేవగానే రావణునికి సీత గుర్తుకు వచ్చింది. వెంటనే సీత మీద మోహము, కామము రావణుని మనసులో పెల్లుబికాయి. సీతను చూడంది నిలువలేకపోతున్నాడు రావణుడు. గబగబా కాలకృత్యాలు తీర్చుకున్నాడు. ఆభరణములు అలంకరించుకున్నాడు. మైపూతలు పూసుకున్నాడు. సీతను ఉంచిన అశోక వనంలోకి ప్రవేశించాడు.

రావణుని అనుసరించి సౌందర్యవతులైన నూరుమంది కన్యలు వెళుతున్నారు. కొంత మంది వింజామరలు వీస్తున్నారు. మరి కొంత మంది ఛత్రములు పడుతున్నారు. మరికొందరు బంగారు కాగడాలు పట్టుకొని దారి చూపిస్తున్నారు. కొంత మంది సుగంధ

పానీయములు తీసుకొని వెళుతున్నారు. మరి కొందరు ఆయుధములు ధరించి రావణునికి రక్షణగా వెళుతున్నారు. ఒక వనిత మద్యము నింపిన బంగారు పాత్రను పట్టుకొని రావణుని పక్కనే నడుస్తూ ఉంది. వారి వెనక రావణుడు అపహరించుకు వచ్చిన ఉత్తమజాతి స్త్రీలు నడుస్తున్నారు. వారి వెనక రావణుని భార్యలుకొంత మంది రావణుని మీద గౌరవంతో కానీ, రావణుని మీద కోరికతో కానీ, కామంతో కానీ ఆయన వెంట వెళుతున్నారు. వారందరికీ నిద్రమత్తు, రాత్రి తాగిన మద్యము మత్తు వదల లేదు. తూలుతూ నడుస్తున్నారు. వారి జుట్టు వీడిపోయింది. పూలమాలలు వాడి పోయాయి. ఆభరణములు చెదిరిపోయాయి. అటువంటి స్త్రీలు అనుసరించి రాగా, రావణుడు సీత మీద కోరికతో ఆమెను పొందవలెననే గాఢమైన కాంక్షతో సీత ఉన్న అశోకవనానికి వెళుతున్నాడు.

రావణుడు తన పరివారముతో అశోకవనము ద్వారమును సమీపించాడు. హనుమంతుడు రావణుని ద్వారం దగ్గర ఉండగానే చూచాడు. రావణుని మొహంలో కామము, దర్పము, మదము స్పష్టంగా కనపడుతూ ఉంది. హనుమంతుడు ఆకుల సందులలో నుండి రావణుని నిశితంగా పరిశీలిస్తున్నాడు. హనుమంతుడు రావణుని వెంట నడుస్తున్న ఉత్తమ జాతి స్త్రీలను కూడా పరిశీలనగా చూచాడు. రాత్రి తాగిన మత్తు ఇంకా దిగని, ఒంటినిండా ఆభరణము లను ధరించిన, ఉత్తమ జాతి స్త్రీలు వెంటరాగా, విశ్రవసు పుత్రుడైన రాక్షస రాజు రావణుని చూచాడు హనుమంతుడు. రావణుని తేజస్సు చూచి హనుమంతుడు ఆశ్చర్యపోయాడు. రావణుడు సరిగా కనిపించడం లేదని ఒక కొమ్మమీది నుండి మరొక కొమ్మ మీదికి దూకుతూ, రావణుని పరిశీలనగా చూస్తున్నాడు హనుమంతుడు.

ఎప్పుడెప్పుడు సీతను చూద్దామా అనే ఆతురతతో రావణుడు గబ గబా సీత ఉన్న చోటికి వస్తున్నాడు.

శ్రీమద్రామాయణము
సుందర కాండము పదునెనిమిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము
పంతొమ్మిదవ సర్గ.

తెల్లవారుజామున అట్టహాసంగా పరిజనులతో కూడా బయలు దేరిన రావణుడు సీత ఉన్న అశోక వనమునకు వచ్చాడు. ఆ సమయంలో వచ్చిన రాక్షస రాజు రావణుని చూచి సీత మనసు తల్లడిల్లిపోయింది. ఆమె లేత చిగురాకులా వణికిపోయింది. సీత తన అవయవములను దగ్గరగా చేర్చుకొని ముడుచుకొని కూర్చుంది.

రాక్షస స్త్రీల మధ్య కూర్చుని ఉన్న సీతను చూచాడు రావణుడు. మనసులో రాముని తప్ప మరొకరిని తలంపని సీతను చూచాడు రావణుడు. సీత శరీరం లంకలో ఉన్నా మనసు మాత్రం రాముని వద్దనే ఉన్న సీతను చూచాడు రావణుడు. మంత్ర తంత్రములతో కట్టబడిన మహాసర్పము వలె ఉన్న సీతను చూచాడు రావణుడు. నివురు గప్పిన నిప్పులా శోకముతో కప్పబడిన అగ్నిజ్వాలలాంటి సీతను చూచాడు రావణుడు. రాముని కోసరం పరితపిస్తూ, కేశసంస్కారములేక, మాసిన బట్టలతో కూర్చుని ఉన్న

సీతను చూచాడు రావణుడు. నిత్య ఉపవాసములతోనూ, రాముని గురించిన ఆలోచనలతోనూ, రావణుని వలన భయంతోనూ, మనసులో కేవలము రాముని ధ్యానిస్తూ కృశించిన శరీరంతో ఉన్న సీతను చూచాడు రావణుడు. తన మనసులో, రాముడు ఎప్పుడు వచ్చి రావణుని చంపుతాడా, తనను రావణ చెరనుండి విడిపిస్తాడా, అని నిరంతరము కోరుకుంటున్న సీతను చూచాడు రావణుడు.

ఆ సమయంలో వచ్చిన రావణుని చూచి సీత విలపిస్తూ ఉంది.

శ్రీమద్రామాయణము
సుందర కాండము పంతొమ్మిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము
ఇరువదవ సర్గ.

రాక్షస స్త్రీల మధ్య మూర్తీభవించిన శోకదేవతవలె కూర్చుని ఉన్న సీతను చూచాడురావణుడు. రావణుడు సీత దగ్గరగా వచ్చాడు. సీతను చూచి అనునయంగా ఇలా అన్నాడు.

"ఓ సీతా! నన్ను చూచి ఎందుకు భయపడి అలా ముడుచుకొని కూర్చుంటావు. నేనంటే నీకు ఎందుకు భయము? నేను కేవలము నిన్ను కోరుకుంటున్నాను. నువ్వు అంటే నాకు ఎంతో ఇష్టం. నేను నీ నుండి ప్రేమను ఆశిస్తున్నాను. నా మనోహారిణీ! నన్ను

కరుణించు. ఇక్కడ ఎవరిని చూచి భయపడుతున్నావు. ఇక్కడ మనుషులు ఎవరూ లేరే! లేక కామరూపులైన రాక్షసులు కూడా ఎవరూ లేరే! అంతా మనవాళ్లే కదా. వాళ్లని చూచి ఎందుకు భయము. ఇంక నేను నిన్ను గాఢంగా ప్రేమిస్తున్నాను. నువ్వు అంటే పడి చస్తున్నాను. నేనంటే ఎందుకంత భయము?

ఓహో! వివాహితవైన నిన్ను నీ భర్తకు తెలియకుండా తీసుకొని వచ్చాననా! అలా తీసుకురావడం మా రాక్షసులలో ఆచారము సీతా! ఇతరుల భార్యలతో సంగమించడం, ఇతర స్త్రీలను బలవంతంగా ఎత్తుకు రావడం, రాక్షసుల ధర్మము. మా ధర్మం మేము చేస్తున్నాము. దీనికి భయపడటం ఎందుకు. రాక్షస ధర్మము ప్రకారము నిన్ను బలవంతంగా నైనా అనుభవించగలను. కానీ, నేను అలా చేయను. నీకు నా మీద ప్రేమ కలగాలి. నీ అంతట నువ్వే నా కౌగిట్లో చేరాలి. అప్పటి దాకా నిన్ను ముట్టను. తెలిసిందా నేనెంత మంచి వాడనో!

ఓ సీతా! నన్ను నమ్ము. నేను అబద్ధము ఆడటం లేదు. నిజమే చెబుతున్నాను. నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నువ్వు కూడా నన్ను ప్రేమించు. ఇద్దరం ప్రేమసాగరంలో ఓలలాడతాము. అంతే కానీ, తిండితినకుండా ఇలా నీ అందమైన శరీరాన్ని కృశింపచేసుకుంటే ఏమి లాభం? అయ్యో! సీతా! ఏమిటీ పనులు. ఒకే జడ వేసుకుంటావు. నేలమీద పడుకుంటావు. సరిగా భోజనం చెయ్యవు. నీ లాంటి రాజకుమారికి, సౌందర్యవతికి ఇలా చేయడం తగునా? అదే నువ్వు నన్ను ప్రేమించావనుకో, క్షణంలో నీ రూపు రేఖలు మారిపోతాయి. రకరకాల చందనములు, లేపనములు, మైపూతలు, ఆభరణములు,

మద్యములు, శయనాగారములు, హంసతూలికా తల్పములు, నృత్యగీతావినోదములు, ఓహ్ నిన్ను మహారాణిగా మార్చేస్తాను.

ఓ సీతా! నువ్వు ముల్లోకములలో ఉన్న స్త్రీలందరిలో రత్నము వంటి దానవు. అటువంటి నీవు అలంకారములు లేకుండా ఆభరణములు లేకుండా ఉండటం ధర్మమా! నా దగ్గరకు రా! నీకు సమస్త భోగములు సమకూరుస్తాను. నీకు ఉన్న నవయవ్వనంలో ఒక్కొక్కరోజు వృధాగా గడిచిపోతుంటే నాకు ఎంతో బాధగా ఉంది. యవ్వనం ఉండేది అనుభవించడానికే కదా! మరి అటువంటి యౌవ్వనాన్ని ఎందుకు వృథా చేసుకుంటావు? ప్రవహిస్తున్ననీరు తిరిగి రానట్టు, గతించిన యవ్వనం తిరిగి రాదు కదా!

ఓ సీతా! నీకో విషయం తెలుసా! బ్రహ్మ దేవుడు అందమైన సౌందర్యవతులను సృష్టిస్తూ, నిన్ను అతిలోక సౌందర్యవతిగా సృష్టించి, తరువాత, సృష్టిని ఆపివేసినట్టున్నాడు. అందుకనే నీ లాంటి సౌందర్యవతి ముల్లోకములలో లేదు! అంతెందుకు, ఆ బ్రహ్మదేవుడు నిన్ను సృష్టించి భూలోకంలో పడేసాడు కాబట్టి సరిపోయింది. లేకపోతే, రూపయవ్వనములతో ప్రకాశిస్తున్న నిన్ను చూసి, ఇప్పుడు ఆ బ్రహ్మదేవుడు కూడా నిన్ను వదిలిపెట్టడు. ఇంక నేనెంత.

సీతా! నీ ప్రతి అయవయములో సౌందర్యం తొణికిసలాడుతూ ఉంటుంది. నీలో ఏఅవయానికి ఆ అవయవమే అందంగా కనిపిస్తుంది. నీ శరీరంలో ఏ అవయవాన్ని చూచినా నా చూపు అక్కడే నిలిచి పోతుంది. అంత అందంగా ఉంటావు నువ్వు. కాబట్టి ఈ మూర్ఖత్వాన్ని విడిచిపెట్టు. జీవితాన్ని సుఖమయం చేసుకో.

నన్ను వరించు. నాకు భార్యవు కా! నేను ఎన్నో దేశాల నుండి ఎందరో రాకుమార్తెలను తీసుకొని వచ్చి నా అంత:పురంలో ఉంచాను. నీకు వారందరూ సేవలు చేస్తారు. వారందరికీ నిన్ను యజమానురాలిని చేస్తాను. నిన్ను నా పట్టమహిషిగా చేసుకుంటాను. నేనూ, నా లంకా రాజ్యము, నా సంపదలు అన్నీ నీ అధీనములు. అంతెందుకు. ఈభూమి సమస్తమును జయించి నీకు కానీ, నీ తండ్రి జనకునకు గానీ ఇస్తాను.

ఓ సీతా! ఈలోకంలో నన్ను ఎదిరించి నిలబడగలిగిన వీరుడు ఎవడూ లేడు. నేను అజేయుడను. నేను ఎన్నోసార్లు దేవతల మీద, దానవులమీద దండెత్తి వారిని జయించాను. వారి రాజ్యములను స్వాధీనపరచు కున్నాను. ఇప్పటికీ వారెవరూ నన్ను కన్నెత్తి కూడా చూడలేరు. ఇంతటి పరాక్రమవంతుడనైన నేను నీ కోసం ప్రాధేయపడుతున్నాను. నా మీద దయచూపు. నన్ను కరుణించు. వరించు. బాగా అలంకరించుకో. ఆభరణాలు ధరించు. నీకు ఇష్టంవచ్చిన పదార్థాలు తిను. తాగు. ఆనందాన్ని అనుభవించు. నీకు ఇష్టం వచ్చినట్టు దానములు, ధర్మములు చెయ్యి. నేను నీకు దాసుడను. నన్ను ఆజ్ఞాపించు. నేనునీ కనుసన్నలలో మెలగుతాను.

నీ కీర్తిని ఐశ్వర్యమును చూచి నీ బంధువులు,మిత్రులు ఎంతో సంతోషిస్తారు. రావణుని పట్టమహిషి అంటే నీకు ఎంతో గౌరవ మర్యాదలు లభిస్తాయి. అంతేకానీ, రాజ్యముపోగొట్టుకొని నార చీరలు కట్టుకొని అడవులను పట్టి తిరిగే ఆ రాముడి దగ్గర ఏముంది? అసలు ఇంత కాలము రాముడు జీవించి ఉన్నాడో లేదో అని నా అనుమానము. మా రాక్షసులు ఆ రాముని ఎప్పుడో చంపి తినేసి ఉంటారు! ఒక వేళ రాముడు జీవించి ఉన్నా, తన జీవిత కాలంలో నిన్ను

చూడలేడు, కలుసుకోలేడు. హిరణ్యకశిపుడైనా ఇంద్రుడు అపహరించిన తన భార్యను తిరిగి పొందగలిగాడేమో గానీ, రాముడు మాత్రం నా చేతిలో చిక్కిన నిన్ను పొందలేడు.

అదేమిటో గాని సీతా! నా మనసును నువ్వు గరుడుడు నేల మీద ఉన్న సర్పాన్ని హరించి నట్టు హరించావు. నువ్వు నా మనోహారిణివి. చూడు. నువ్వు మాసిపోయిన చీర కట్టుకున్నావు. నగలు పెట్టుకోలేదు. అలంకరించుకోలేదు. అయినా నిన్ను చూస్తుంటే, నాకు నీ మీద మోహం పుడుతోంది. నిన్ను చూసిన తరువాత నా భార్యలతో ఆనందంగా గడపలేకపోతున్నాను.   మరలా చెబుతున్నాను. ఓ సీతా! నా అంత:పురములో నీ వంటి గుణవతులు, శీలవతులు సౌందర్యవతులు అయిన స్త్రీలు ఎంతో మంది ఉన్నారు. వారందరికీ నిన్ను రాణిని చేస్తాను. వారందరూ దేవతలు లక్ష్మీదేవిని కొలిచినట్టు నిన్ను సేవిస్తారు.

నీకు తెలుసుకదా! కుబేరుడు ముల్లోకములకు ధనాధి పతి. ఆ కుబేరుని సంపద అంతా నా వద్ద ఉంది. ఆ సంపద అంతా నీది. నీవే దానికి అధిపతివి. ఆ సంపదలను, నన్ను, నీ ఇష్టం వచ్చినట్టు అనుభవించు. ఐశ్వర్యములోగానీ, పరాక్రమములోగానీ, తపశ్శక్తిలో గానీ, ధనములో గానీ, కీర్తిలోగానీ, ఆ రాముడు నా కాలి గోటికి కూడా సాటి రాడు.

కాబట్టి ఓ సీతా! నా సంపదలను అనుభవించు. నన్ను నీ వాడిని చేసుకో. ఇష్టం వచ్చినట్టు తిను. తాగు. క్రీడించు. భోగములు అనుభవించు. నాతో కలిసి ఉద్యానవనములలో, సముద్ర తీరాలలో,

పూల పొదరిళ్లలో విహరించు. నీ బంధువులనందరినీ పిలిపించు. వారందరితో ఆనందంగా గడుపు. నీ ఇష్టం." అని సీతను సకల విధాలుగా ప్రలోభపెట్టాడు రావణుడు.

శ్రీమద్రామాయణము

సుందర కాండము ఇరువదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

ఇరువది ఒకటవ సర్గ.

రావణుడు పలికిన పలుకులు అన్నీ సావధానంగా వింది సీత. పక్కనే ఉన్న ఒక గడ్డి పరకను తీసింది. రావణుడికి తనకూ అడ్డుగా పెట్టింది. ఆ గడ్డి పరకనే రావణుని గా భావించి బదులుచెప్పింది.

" ఓ రావణా! నీకు ఎంతో మంది భార్యలు ఉన్నారు. నన్ను ఇంతగా బతిమాలే బదులు నీ ప్రేమను నీ భార్యలకు పంచి ఇవ్వు. వారిని ప్రేమించు. అంతే కానీ, పరుల భార్యను అయిన నా వెంట ఎందుకు పడతావు.

నీవు రాక్షసుడవు. నీకు ఇతరుల భార్యలను అపహరించి అనుభవించడం ధర్మమే కావచ్చు కానీ నేను మానవ కాంతను. ఉత్తమమైన వంశంలో పుట్టాను. మరొక ఉత్తమమైన ఉత్తమ వంశంలోకి కోడలిగా వెళ్లాను. నా భర్తనే దైవంగా భావించిన

పతివ్రతను. నీ రాజ్యమును, ఐశ్వర్యమును, భోగములను ఆశించి నేను ఇటువంటి నీచమైన కార్యమును చేయలేను." అని సౌమ్యంగా చెప్పింది సీత.

తరువాత రావణుని వంక కాకుండా, శూన్యంలోకి చూస్తూ ఇలా అంది.

"నీవు ధర్మములు తెలిసినవాడవు. నీ పూర్వీకులు పాటించిన ధర్మమును పాటించు. పరస్త్రీని కోరుకోకు. నేను నీకు తగిన దానిని కాను. నీవు నీ భార్యలను ఎలా రక్షించుకుంటావో, ఇతరుల భార్యలు కూడా అలా రక్షింపబడవలసిన వారే కదా! నీ భార్యలను ఇతరులు అపహరిస్తే నీకు ఎంత బాధ కలుగుతుందో, నీవు ఇతరుల భార్యలను అపహరిస్తే వారికి కూడా అంతే బాధకలుగుతుంది కదా! ఆ విషయాన్ని గ్రహించుకో! అందుకని నీ భార్యలతో సుఖించు. ఇంట్లో ఉన్న భార్యలతో సుఖములు అనుభవించకుండా పరుల భార్యలతో సుఖాలు కోరుకునే వాళ్లను, ఆ పరుల భార్యలు పరాభవిస్తారు, శపిస్తారు.

ప్రస్తుతము నీ బుద్ధి ఇతరుల భార్యల మీద ఉంది. ఇంత విపరీత బుద్ధికల రాజుకు హితబోధ చేసే మంత్రులు, గురువులు, హితులు నీ రాజ్యంలో లేరా! నీ రాజ్యంలో అంతా నీ లాంటి విపరీత బుద్ధులు కలవారేనా! లేక, నీకు హితులైన వారు నీకు హితబోధ చేసినా, నీకు వినాశ కాలము దాపురించి, వారి హితోక్తులను నీవుపెడచెవిని పెడుతున్నావా! ఇంద్రియ నిగ్రహము లేని రాజు పాలనలో నగరములు, రాష్ట్రములు నాశనం అవుతారు. ప్రజలు కష్టాల పాలవుతారు. పరదారాసంగమం కోరుకునే నీ లాంటి రాజు దొరకడం

వలన ఈ లంకారాజ్యము తొందరలో నాశనం కాబోతోంది. దుర్మార్గుడు, పాపాత్ముడు అయిన నీ పతనం చూచి సకల జనులు సంతోషిస్తారు. నిన్ను అయ్యోపాపం అనే వాడు ఉండడు. నీచేత బాధలు పడిన వారంతా నీ పీడ విరగడ అయిందని ఆనందంతో పండుగలు చేసుకుంటారు.

నువ్వు నీ ఐశ్వర్యమును, ధనమును చూపి నన్ను ప్రలోభపెట్టావు. నేను నీ ఐశ్వర్యమునకు ధనమునకు, భోగములకు లొంగను. సూర్యుని నుండి కాంతిని ఎలా వేరు చెయ్యలేరో, రాముని నుండి నన్ను ఎవరూ వేరు చెయ్యలేరు. నేను రాముని పాణిగ్రహణము చేసినది మొదలు, ప్రతిరోజూ రాముని చేతిని నా తలగడగా పెట్టుకొని నిద్రిస్తున్నాను. అటువంటిది ఇప్పుడు మరొక పురుషుని చేతిని తలగడగా ఎలా పెట్టుకొని నిద్రించగలను. నేను రాముని భార్యను, నా జీవితాంతము నేను రామునికే భార్యను. మరొకరికి కాదు. కాబట్టి ఇప్పటి కన్నా తెలివి తెచ్చుకొని నన్ను రాముని వద్దకు చేర్చు. నీ ప్రాణాలు కాపాడుకో. నీవు నాలుగా కాలాల పాటు నీ భార్యలతో సుఖంగా ఉండాలన్నా, ఆనందంగా రాజ్యము చేయాలన్నా, వెంటనే రామునితో స్నేహం చెయ్యి. చేసిన తప్పు ఒప్పుకొని రాముని శరణు వేడు. రామునికి నన్ను అప్పగించు. రాముడు తప్పకుండా నిన్ను క్షమిస్తాడు. కాబట్టి రామునితో స్నేహంచేసుకోవడమే యుక్తము.

రావణా! నన్ను రాముని వద్దకు చేరిస్తేనే నువ్వు బతుకుతావు. లేకపోతే చస్తావు. ఇంద్రుడు ప్రయోగించిన వజ్రాయుధము వేటును నువ్వు తప్పించుకోవచ్చు. యమధర్మరాజు పాశము బారి నుండి నువ్వుబయట పడవచ్చు కాని రాముని వింటి

నుండి వెలువడ్డ బాణము మాత్రము నిన్ను వదిలిపెట్టదు. రాముడు కూడా నిన్ను విడిచి పెట్టడు. వెతికి వెతికి చంపుతాడు. నీవు ఇంద్రుని వజ్రాయుధము యొక్క ప్రచండ ధ్వని విని ఉంటావు. కానీ రాముని ధనుష్టంకారమును విని ఉండవు. వింటే నీ గుండెలు బద్దలవుతాయి. తొందరలోనే రాముని పేరు లక్ష్మణుని పేరు చెక్కబడిన బాణములు నీ లంకారాజ్యంలో పడతాయి. రాక్షసులను హతమారుస్తాయి. లంకా నగరమంతా రామ బాణములతో కప్పబడిపోతుంది. గరుత్మంతుడు పాములను చంపినట్టు రామ బాణములు రాక్షసులను హతమారుస్తాయి.

రాముడు జనస్థానములో ఉన్న 14,000 మంది రాక్షసులను చంపి దానిని శ్మశానంగా మార్చాడు. అప్పుడు రాముని ఏమీ చేయలేక రాముడు ఇంటలేని సమయంలో నన్ను అపహరించావు. పెద్దపులుల ఎదుట కుక్క ఎలా నిలువలేదో, రామలక్ష్మణుల ముందు నువ్వు కూడా నిలువలేవు.

రావణా! మరలా చెబుతున్నాను విను. రాముడు తొందరలోనే వచ్చి నిన్ను చంపి నన్ను తీసుకొని వెళతాడు. నీకు వినాశకాలము దాపురించింది. నీవు ముల్లోకములలో దాగినను, రామ బాణము నిన్ను విడిచి పెట్టదు. వెతికి వెతికి హతమారుస్తుంది. జాగ్రత్త!" అని పలికి మౌనం వహించింది సీత.

శ్రీమద్రామాయణము
సుందర కాండము ఇరువది ఒకటవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

ఇరువది రెండవ సర్గ.

సీత పలికినపలుకులు అన్నీ సావధానంగా విన్నాడు రావణుడు. అతనికి కోపం తలకెక్కింది. కాని తమాయించుకున్నాడు. స్త్రీలను వశం చేసుకొనేటప్పుడు కోపం పనికిరాదు అని అనుకున్నాడు రావణుడు. అందుకని సౌమ్యంగానే మాట్లాడాడు.

“ఓ సీతా! స్త్రీలకు మంచి మాటలు చెప్పేకొద్దీ వాళ్లు మగాళ్లను తిరస్కరిస్తుంటారు. కానీ ఆ స్త్రీలే బుజ్జగించిన కొద్దీ పురుషుడు వాళ్లకు స్వాధీనుడవుతాడు. దాసుడవుతాడు. ఇదీ స్త్రీలతో వ్యవహరించేటప్పుడు ఆచరించవలసిన ధర్మము. నీ మాటలు విన్న కొద్దీ నాకు కోపం ఎక్కువ అవుతూ ఉంది. కానీ నీ మీద నాకు ఉన్న కోరిక, కామము ఆ కోపాన్ని అణగదొక్కుతూ ఉంది. కామానికి వ్యతిరేక స్వభావము ఉంది. నువ్వు ఎంత కాదన్నా నీమీదనే నాకు మనసు అవుతూ ఉంది. నీ మీద కోరిక ఇంకా ఇంకా పెరుగుతూ ఉంది.

సకలైశ్వర్యవంతుడనైన నన్ను విడిచి అడవులలో తిరిగే ఆ రాముని నీవు ఎల్లప్పుడూ తలచుకుంటున్నావో అప్పుడే నిన్ను చంపాలనీ, నరకాలనీ అనుకున్నాను. కానీ నీ మీద నాకు ఉన్న కోరిక నన్ను ఆ పని చెయ్యనివ్వడం లేదు. ఇప్పటి దాకా నువ్వు నన్ను అన్న పరుషమైన మాటలకు ఒక్కొక్క మాటకూ ఒక్కొక్కసారి నిన్ను నరకాలని ఉంది. నీ మీద ఉన్న ప్రేమతో, కామంతో, ఆ పని చేయలేకపోతున్నాను. నీకుగా నీవు నా దగ్గరకు వచ్చేవరకూ నేను నిన్ను తాకను. అందుకే నీకు రెండు మాసములు గడువు ఇస్తున్నాను. ఈ రెండు మాసములు

దాటగానే నువ్వు నా పడక మీదికి రావాలి. తప్పదు. ఈ రెండు మాసములలోగా నీవు నన్ను నీ భర్తగా, ప్రియునిగా అంగీకరించాలి. ఈ రెండు మాసములలో నీవు నన్ను వరించకపోతే, రెండు మాసములు గడువు తీరిన మరునాడు నిన్ను మా వంటశాలకు తీసుకొని పోయి వధించి, నీ మాంసమును వండి, నాకు ఆ రోజు ఉదయము తీసుకొనే అల్పాహారముగా నాకు వడ్డిస్తారు. తరువాత నీ ఇష్టం." అని పరుషంగా పలికాడు రావణుడు.

రావణుని మాటలకు రావణుని వెంట వచ్చిన స్త్రీలు కన్నీళ్లు పెట్టుకున్నారు. కానీ రావణునికి భయపడి వారు ఎవరూ నోరు మెదపలేదు. ఆ మాటలు విన్న సీత రావణునితో ఇలా అంది:

"నీ మాటలు వింటూ ఉంటే నీ రాజ్యములో నీ క్షేమము కోరేవారు, నీకు హితము చెప్పేవారూ ఎవరూ లేరని అనిపిస్తూ ఉంది. నేను రాముని భార్యను. నీ లాంటి మూర్ఖుడు తప్ప వేరెవరూ పరాయివాడి భార్యను కోరుకోడు. రాముని భార్యను అయిన నాతో ఇటువంటి ప్రేలాపనలు పేలినందుకు రాముని చేతిలో నీకు దండన తప్పదు. రాముడు ఏనుగు లాంటి వాడు. రాముని ముందు నీవు కుందేలు వంటి వాడివి. రాముని పాదాల కిందపడి నలిగిపోతావు.

నీకు నిజంగా వీరత్వము, పరాక్రమము ఉంటే ఇలా పిరికిపందలా లంకలో కూర్చుని ఆడవాళ్లతో, ఆడవాళ్ల ముందు బీరాలు పలుకవు. నీకు ధైర్యం ఉంటే రాముని ముందు నిలిచి మాట్లాడు. రాముని ఎదుట పడటానికి భయపడే నీవు ఒక వీరుడివా! నన్ను కామ దృష్టితో చూచుచున్న నీ కనుగుడ్లు ఎందుకు రాలి కింద పడిపోవడం

లేదో అర్ధం కావడం లేదు. ఇక్ష్వాకు వంశపురాజు దశరథుని కోడలిని, రాముని భార్యను అయిన నన్ను ఈ ప్రకారంగా దుర్భాషలాడిన నీ నాలుక ఇంకా ఎందుకు తెగి కిందపడలేదో అర్ధం కావడం లేదు.

ఓ రావణా! నా పాతివ్రత్య మహిమతో నిన్ను ఇక్కడే ఈ క్షణమే భస్మం చేయగలను. కానీ పతివ్రతలు భర్త అనుజ్ఞలేనిదే ఏ పనీ చేయరు. అందుకని నీ ప్రేలాపనలు అన్నీ సహించాను. రాముడు ఇంటేని సమయమున నన్ను అపహరించిననాడే నీకు మృత్యువు ఆసన్నమయింది. ఓ రావణా! నీ గురించి నీ బల పరాక్రమముల గురించి నీవు గొప్పలు చెప్పుకున్నావు కదా! మరి రామలక్ష్మణులు ఉండగానే వారితో యుద్ధము చేసి ఓడించి నన్ను తీసుకు రావచ్చు కదా! మరి దొంగలాగా వచ్చి ఎందుకు అపహరించావు? రాముడికి భయపడే కదా!..." అని ఇంకా సీత ఏమో అనబోతూ ఉండగానే రావణుడు కళ్లు పెద్దవి చేసి సీత వంక చూచాడు.

"సీతా! ఇంక చాలు. ఆపు నీ వాచాలత్వము. అడవులలో తిరిగే రాముని భార్యవు నీవు కూడా నన్ను అంటావా. నీవు నన్ను భస్మం చేయడం కాదు. నేనే నిన్ను ఇక్కడే ఇప్పుడే సర్వనాశనం చేస్తాను. ఎవరు అడ్డం వస్తారో చూస్తాను." అని పరుషంగా పలికి సీతకు కావలిగా ఉన్న రాక్షస స్త్రీలను చూచి ఇలా అన్నాడు.

" ఓ ఏకాక్షీ! ఓ మేకకర్ణీ! ఓ గోకర్ణీ! ఓ హస్తికర్ణీ! ఓ లంబకర్ణీ! ఓఅకర్ణీ! ఓ గోపాదీ! ఓ హస్తిపాదీ! ఓ మేకపాదీ! ఓ అపాదీ!
ఓ దీర్ఘజిహ్వా! ఓ అనాసికా! ఓ సింహముఖీ! ఓ గోముఖీ! ఓ సూకరీముఖీ! మీరంతా నేను చెప్పేది శ్రద్ధగా వినండి. మీ శక్తి

యుక్తులు ఉపయోగించి ఈ సీతను నాకు వశురాలను చెయ్యండి. నయానా భయానా చెప్పి చూడండి. సామ,దాన,భేద, దండోపాయా లను ప్రయోగించండి. సీతను లొంగదీసుకోండి." అని ఆజ్ఞాపించాడు.

ఈ మాటలు విన్న ధాన్యమాలిని అనే రాక్షస వనిత రావణుని వద్దకు పోయి ఇలా అంది. " ఓ రాక్షస రాజా! మేము ఇంతమందిమి ఇక్కడ ఉండగా ఈ అనాకారి ఎందుకు నీకు. నాతోరా. నీకు స్వర్గసుఖాలు చూపిస్తాను. అయినా సుఖాలు అనుభవించడానికి కూడా బ్రహ్మరాత ఉండాలి. నీతో పాటు సురలోకభోగాలు అనుభవించే రాత ఈమె మొహాన బ్రహ్మరాయలేదు. నిన్ను కావాలని కోరుకొనే స్త్రీని నువ్వు కోరుకోవాలి గానీ, నిన్ను వద్దు అన్న స్త్రీ వెంట బడితే శ్రమ మాత్రమే మిగులుతుంది కానీ కోరిక తీరదు. కాబట్టి నిన్ను కావాలని కోరుకొనే స్త్రీలతోనే అమరసుఖాలు అనుభవించు." అని ఇంకా ఏదో చెప్పబోతూ ఉండగా, రావణుడు ఆమెను పట్టుకొని పక్కకునెట్టి, నవ్వుకుంటూ వెనక్కు తిరిగివెళ్లిపోయాడు. రావణుని వెంట వచ్చిన కన్యలుకూడా ఆయనను అనుసరించారు. అందరూ తమ తమ నివాసములకు వెళ్లిపోయారు.

సుందర కాండము ఇరువది రెండవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

ఇరువది మూడవ సర్గ.

రావణుడు వెళ్లిపోగానే రాక్షస స్త్రీలు సీత చుట్టు చేరారు. కొంత మంది ఆమెతో పరుషంగా మాట్లాడారు. "ఒసేయ్ సీతా! రావణుడు అంటే ఎవరనుకున్నావు. పులస్త్య వంశంలో పుట్టాడు. మహాత్ముడు. వరిష్ఠుడు. పదితలలు కలవాడు. అటువంటి రావణుడు కోరి వస్తే అతడికి భార్యకావడానికి ఎందుకు నిరాకరిస్తున్నావు." అంటూ సీత మీద విరుచుకుపడ్డారు.

అంతలో ఏకజట అనే రాక్షసస్త్రీ సీతతో ఇలా అంది. "ఓ సీతా! ప్రజాపతులు ఆరుగురు. వారు బ్రహ్మమానస పుత్రులు. వారిలో నాలుగవ వాడు పులస్త్య ప్రజాపతి. ఆ పులస్త్యుని మానస పుత్రుడు విశ్రవసుడు. ఈ విశ్రవసుని కుమారుడే రావణుడు. అటువంటి రావణుడు నిన్ను తన భార్యగా కోరుకుంటున్నాడు. ఇంకా ఎందుకు సందేహిస్తావు. నా మాట విను. రావణునికి భార్యగా ఉండు." అని పలికింది.

ఇంతలో హరిజట అనే రాక్షసి ముందుకు వచ్చి ఇలా అంది. "మా రావణుడు దేవేంద్రుని, సకల దేవతలను జయించాడు. అటువంటి రావణునికి భార్య కావడం మంచిది. నా మాట విను." అంది.

ఇంతలో మరొక రాక్షసి ప్రఘస అనేపేరు కలది సీతను ఇలా

భయపెట్టింది. "రావణుడు మహా బలవంతుడు, వీర్యవంతుడు, శూరుడు, యుద్ధములో రావణునికి సాటి ఎవరూ లేరు. అటువంటి పరాక్రమ వంతుడికి భార్య కావడం కన్నా అదృష్టం ఏముంటుంది? పైగా మండోదరి రావణునికి పట్ట మహిషి. ఆమెను కూడా కాదని రావణుడు నిన్ను కోరుకుంటున్నాడు. ఇంకా సందేహిస్తావెందుకు. రావణుని అంత:పురమునకు నీవే మహారాణివి. కాబట్టి ఒప్పుకో." అని పలికింది.

వికట అనే రాక్షసి సీతతో ఇలా అంది. "దేవ, దానవ, గంధర్వులను ఓడించిన రావణుడు నిన్ను వేడుకుంటున్నాడు. అట్టి మహాత్ముడు కోరి వచ్చి నిన్ను తన భార్యగా చేసుకుంటాను అంటే, కాదంటావెందుకే మూర్ఖురాలా! " అని పలికింది.

దుర్ముఖి అనే రాక్షస స్త్రీ ఇలా అంది. "ఏ రావణుని పేరు చెబితే సూర్యుడు తన తేజస్సును పరిమితం చేసుకుంటాడో, ఏ రావణునికి భయపడి వాయుదేవుడు మంద్రంగా వీస్తాడో, ఎవరి ఆజ్ఞలకు భయపడి అన్ని ఋతువులలోనూ పుష్పములు వర్షంగా కురుస్తాయో, ఏ రావణుడు కోరినప్పుడలా మేఘాలు వర్షాలు కురుస్తాయో, అట్టి రావణుడు నిన్ను కోరి వచ్చాడు. మారుమాటాడక ఒప్పుకో! ఒప్పుకోకపోతే ఏమవుతుందో తెలుసుగా! మేమందరమూ నిన్ను నంజుకొని తింటాము." అంది.

శ్రీమద్రామాయణము

సుందర కాండము ఇరువది మూడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము
ఇరువది నాలుగవ సర్గ.

ఆ ప్రకారంగా సీత చుట్టు ఉన్న రాక్షస స్త్రీలు సీతకు రావణుని వరించమని, నయానా భయానా నచ్చ చెప్పడానికి ప్రయత్నిస్తున్నారు. కాని సీతలో మాత్రం ఎలాంటి మార్పురాలేదు. అయినా వాళ్లు తమప్రయత్నాలు వదలడంలేదు.

"ఓ సీతా! నువ్వు ఎప్పుడూ రావణుని అంత:పురమును ఎప్పుడూ చూడలేదేమో! చాలా బాగుంటుంది. ఆ శయన మందిరములు, హంసతూలికా తల్పములు, మణిమాణిక్యములతో అలంకరింపబడిన దీపములు, ఇంకా ఎన్నో అలంకరణ వస్తువులు ఉన్నాయి. మరి అటువంటి భోగములు ఎందుకు వదులుకుంటావు? అవునులే రావణుడు రాక్షసుడు అని కదా నీ బాధ. నీవు మానవ కాంతవు. నీవు మరొక మానవుడికి మాత్రమే భార్యగా ఉండటానికి ఇష్టపడుతున్నావు. కానీ ఒక్కసారి రాక్షసుని సాంగత్యము పొందితే జన్మలో మరిచిపోవు. ఎందుకంటే నీ రాముడు అయోధ్యకు మాత్రమే రాజు. రావణుడు మూడులోకములకు రాజు. మరి ఎవరు ఎక్కువ చెప్పు. అందుకని రావణుని వరించి సుఖించు.

అయినా రాముడు కేవలం మానవుడు. రాజ్యము పోగొట్టుకొని అడవులు పట్టుకొని తిరుగుతున్నాడు. వాడితో నీవు ఏం సుఖాలు అనుభవించగలవు. రాముడితో చేరితే నీకు కష్టాలు తప్ప సుఖాలు ఉండవు. రావణుని వరిస్తే నీకు సుఖాలు తప్ప కష్టాలు అంటే ఏమిటో తెలియవు. కాబట్టి మామాటలు విని రావణుని వరించు." అని

సీతకు నచ్చచెప్పడానికి ప్రయత్నించారు ఆ రాక్షస స్త్రీలు. వారి మాటలన్నీ ఓపిగ్గా వింది సీత. కన్నీరు కార్చింది. చీర కొంగుతో కన్నీళ్లు ఒత్తుకుంటూ వారితో ఇలా అంది.

"మీరందరూ మీ ప్రభువును కీర్తిస్తూ నాతో అనకూడని మాటలు అంటున్నారు. అలా నాతో పరపురుషుడి గురించి మాట్లాడటం మీకు పాపము అనిపించడం లేదా! నేను మానవ కాంతను. రావణుడు రాక్షసుడు. ఎక్కడైనా మానవులు రాక్షసులను వరిస్తారా? మీరు నన్ను ఖండ ఖండములుగా ఖండించినా నేను ఒక రాక్షసుని వరించడానికి ఒప్పుకోను. నా రాముడికి రాజ్యము లేకపోవచ్చు. అడవులు పట్టి తిరుగుతుండవచ్చు. భార్యను పోగొట్టు కొని దీనుడి మాదిరి శోకిస్తూ ఉండవచ్చు అయినా రాముడే నా భర్త. నా దైవము. నా ప్రేమ, నా అనురాగము, నా భర్తకే గానీ వేరే వాళ్లకు కాదు. శచీదేవికి ఇంద్రుని మీద వలె, అరుంధతికి వసిష్ఠుని మీద వలె, రోహిణికి చంద్రుని మీద వలె, లోపాముద్రకు అగస్త్యుని మీద వలె, సుకన్యకు చ్యవనుని మీద వలె, సావిత్రికి సత్యవంతుని మీద వలె, శ్రీమతికి కపిలుని మీద వలె, మదయంతికి సౌదాసుని మీద వలె, కేశినికి సగరుని మీద వలె, దమయంతికి నలుని మీద వలె, నాకు రాముని మీద అమితమైన ప్రేమ, అనురాగము. నేను రాముని అనుసరిస్తాను కానీ పరపురుషుని కాదు. కాబట్టి మీ మాటలతో నన్ను ప్రలోభపెట్టడం మానండి." అని పలికింది సీత.

సీత మాటలు విన్న రాక్షస స్త్రీలకు కోపం మిన్నుముట్టింది. కోపంతో ఊగిపోయారు. రావణుడు రావడం, ఏదేదో మాట్లాడటం, సీత దానికి సమాధానం ఇవ్వడం, రాక్షసస్త్రీలు సీతను బెదిరించడం

సీత వారికి తగురీతిగా సమాధానం ఇవ్వడం అంతా చెట్టు పైన కూర్చున్న హనుమంతుడు చూస్తున్నాడు వింటున్నాడు. హనుమంతునికి ఆ రాక్షసులను పట్టుకొని ఒక్కొక్క రాక్షసిని ఉతుకుదామని అనిపించింది. కానీ ఆ సమయంలో తాను బయట పడటం మంచిది కాదనీ, రామ కార్యం చెడుతుందనీ ఆలోచించి, తన కోపాన్ని అణుచుకున్నాడు. ఆ రాక్షస స్త్రీల మాటలు ఓపిగ్గా వింటున్నాడు.

సీత మాటలు విన్న రాక్షస వనితలు కోపంతో ఊగిపోయారు. వీరంగం తొక్కారు. సీతను చంపుదామని నోళ్ళు పెద్దగా తెరిచి, నాలుకలు బయట పెట్టి సీత మీది మీదికి వచ్చారు. మరి కొందరు తమ ఆయుధములను చేత ధరించి "ఇంక ఈమె జీవించి ఉండటం వ్యర్థము. ఈమె రావణుని భార్యగా ఉండటం తగదు. కాబట్టి చంపండి. నరకండి" అని అరుస్తున్నారు. వాళ్ల మధ్య ఉండటం ఇష్టం లేక, సీత అక్కడి నుండి దూరంగా వెళ్లి నిలబడింది. ఆ రాక్షస వనితలు ఆమెను వదల లేదు. బిలబిల మంటూ వారంతా ఆమె దగ్గరకు పోయి ఆమె చుట్టు నిలబడ్డారు. పెద్దగా అరుస్తూ కేకలు పెడుతూ సీతను భయపెడుతున్నారు.

వాళ్లలో ఉన్న వినత అనే రాక్షసి సీతను చూచి ఇలా అంది. "చూడు సీతా! ఇప్పటిదాకా నీవు నీ రాముని మీద చూపిన ప్రేమ చాలు. ఇంక రాముని విడిచిపెట్టు. ఏదీ అతి చేయవద్దు. అతి అన్ని విధాలా అనర్థకము. సమయాన్ని బట్టి పోవాలి కానీ మూర్ఖపు పట్టుదల పనికిరాదు. మూర్ఖంగా ప్రవర్తించి కష్టములను కొనితెచ్చుకోకు. నువ్వు ఇప్పటి దాకా మనుష్య ధర్మముల గురించి చెప్పావు. నేను చెప్పేదికూడా

విను. ముల్లోకములలో ఉన్న రాక్షసులకందరికీ ప్రభువు రావణుడు. ఆయనే నీకు తగిన భర్త. రావణుడు అత్యంత పరాక్రమ వంతుడు, సుందరుడు. శూరుడు. దేవేంద్రునితో సమానుడు. త్యాగధనుడు. అందరికీ ఆనందం కలిగించేవాడు. కేవలం ఒక దీనుడైన మానవుని కోసరం త్రిలోకాధి పతి అయిన రావణుని తిరస్కరించకు. నేటి నుండి నువ్వు కూడా త్రిలోకములకు మహారాణివి అవుతావు. రావణుని వరించు. భోగాలు అనుభవించు. అంతే గానీ అడవుల పట్టి తిరిగే రాముని వలన ఏమి ప్రయోజనం ఉంది.

పైగా ఆ రాముడు ఉన్నాడో, చచ్చాడో తెలీదు. ఒకవేళ బతికి ఉన్నా అతని ఆయుర్దాయము తీరిపోయింది. రాముడు రావణుని చేతిలో చావడం తప్పదు. నేను ఎంతో మంచి దాన్ని కాబట్టి ఇంతదూరం చెబుతున్నాను. నా మాట వినకపోయావో, మేమందరం కలిసి నిన్ను చంపి, నీ మాంసమును పంచుకొని, నంజుకొని తింటాము." అని చెప్పింది వినత అనే రాక్షసి.

ఇంతలో మరొక రాక్షసి పిడికిలి బిగించి "ఓ సీతా! ఇప్పటి దాకా నువ్వు ఏమేమి మాట్లాడినా, నీ మీద జాలితో నిన్ను ఇంతసేపూ సహించాము. ఇంక మా ఓపిక నశించింది. మేము ఏమి చెప్పినా నీవు వినడం లేదు. ఇప్పుడు నువ్వు ఎక్కడున్నావో తెలుసా. భయంకర మైన సముద్రము మధ్యలో ఉన్న లంకలో ఉన్నావు. నిన్ను రక్షించడానికి నీ రాముడే కాదు కదా సాక్షాత్తు ఆ దేవేంద్రుడు కూడా రాలేడు. అనవసరంగా ఏడ్చి ఏడ్చి నిన్ను నువ్వు హింసించుకోకు. దు:ఖాన్ని విడిచి పెట్టి సుఖాల్ని అనుభవించు. సుఖసంతోషాలతో గడపవలసిన నీ వయసును దు:ఖభూయిష్టం చేసుకోకు. రావణుని వరించు. సుఖాలు

అనుభవించు. ఈ వయసు, ఈ యవ్వనము శాశ్వతం కావు. రోజురోజుకూ తరిగిపోతుంటాయి. ఈరోజు అనుభవించాల్సిన సుఖం రేపు రాదు. కాబట్టి రావణుని వరించి. అతనితో విహరించు. స్వర్గసుఖాలు అనుభవించు. నీ యవ్వనాన్ని సార్థకం చేసుకో.

ఓ సీతా! ముల్లోకములలోని రాక్షసులకు అధిపతి అయిన రావణుని వరిస్తే, రావణుని వద్ద ఉన్న ఏడువేల మంది సుందరీ మణులు నీకు దాసీలు అవుతారు. నీ వశంలో ఉంటారు. నామాట వినకపోతే ఇప్పుడే నీ గుండెలు చీల్చి నమిలి తింటాను." అని తీవ్రంగా పలికింది.

చండోదరి అనే రాక్షసి తన చేతిలో ఉన్న పెద్ద శూలమును తిప్పుతూ ఇలా అంది. "రావణుడు ఈ సీతను అపహరించి తీసుకొని వచ్చినపుడు నాకు ఒక ఆశ పుట్టింది. బాగాబలిసి అత్యంత సుందరంగా ఉన్న ఈమె గుండె కుడిభాగమును, ఎడమ భాగమును చీల్చి తినవలెననీ, ఈమె తలను పగులగొట్టి లోపల ఉన్న మెత్తటి మెదడును ఆరగించవలెననీ, ఈమె పేగులను జుర్రుకోవలెనని, ఈమె రక్తమును తాగవలెననీ, మహా కోరికగా ఉండింది. ఆ కోరిక ఇప్పుడు నెరవేరబోతూ ఉంది." అంది.

ప్రఘస అనే రాక్షసి వారందరినీ చూచి "అబ్బా ఇంకా ఏమిటీ మాటలు. అనవసరంగా మాటలతో కాలక్షేపం చేస్తున్నారు. ముందు దీని కంఠాన్ని పట్టుకొని నులమండి. క్షణంలో చస్తుంది. మనం పోయి రావణునితో "ప్రభూ! సీత మరణించినది" అని చెబుదాము. అప్పుడు రావణుడు "మీరంతా దానిని తినండి" అంటాడు.

అంతే మనం అంతా దీని మాంసంతో విందు చేసుకుందాము." అని పలికింది.

ఇంతలో అజాముఖి అనే రాక్షసి ఇలా అంది."అది సరే! ముందు దీనిని చంపి దీని మాంసమును మన కందరికీ సమానంగా ముక్కలు ముక్కలు గా పంచండి. ఒకరికి ఎక్కువా మరొకరికి తక్కువా రాకూడదు. అది నాకు ఇష్టం లేదు. వెంటనే మద్యము, మంచి మంచి లేహ్యములు తీసుకొని రండి. మనం అందరూ మద్యం తాగుతూ దీని మాంసమును నంచుకొని తింటాము." అంది.

శూర్పణఖ అనే మరో రాక్షసి ఇలాఅంది." మరి ఎందుకు ఆలస్యం. మంచి మద్యము తీసుకొని రండి. దీనిని ముక్కముక్కలుగా నరకండి. మద్యం తాగుతూ దీని మాంసమును కొరుక్కుంటూ, మన నికుంభిలాదేవికి ప్రీతిగా నృత్యం చేద్దాము." అని పలికింది. ఆ ప్రకారంగా అక్కడ ఉన్న రాక్షస స్త్రీలందరూ తలోక విధంగా సీతను భయపెడుతున్నారు. వారి మాటలు విన్న సీత భయంతో వణికిపోయింది..

శ్రీమద్రామాయణము

సుందర కాండము ఇరువది నాలుగవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

ఇరువది ఐదవ సర్గ.

అంత:పుర కాంతల మధ్య, మృదుమధుర వీణావాదలను వింటూ, ఆహ్లాదంగా గడపవలసిన సీతకు, ఈ ప్రకారంగా అతి వికారంగా, క్రూరంగా కనపడుతున్న రాక్షస స్త్రీల మధ్య వారి పరుషమైన మాటలను, బెదిరింపులను వింటూఉంటూ దు:ఖము ముంచు కొచ్చింది. శరీరం అంతా భయంతో కంపించిపోయింది. నోట మాట రావడం లేదు. అతి ప్రయత్నం మీద నోరుపెగల్చుకొని ఇలా అంది.

"చూడండీ. నేను మానవ కాంతను. నేను రాక్షసుని వరించడం కలలోని మాట. మీరు చంపి తిన్నా సరే నా నిశ్చయం ఇదే. ఇప్పటి దాకా రావణుడు భయపెట్టాడు. ఇప్పుడు మీరు భయపెడు తున్నారు. ఎవరెన్ని భయపెట్టినా నా నిశ్చయంమారదు. ఇంకమీ ఇష్టం." అని పలికింది. తోడేళ్ల మధ్య ఉన్న లేడి పిల్లలాముడుచుకొని కూర్చుంది సీత.

రాముని గురించి విలపించసాగింది. "హా రామా! హా లక్ష్మణా! ఎక్కడున్నారు మీరు. అయ్యో కౌసల్యాదేవీ! చూడండి నాకు ఎన్ని కష్టాలు వచ్చాయో! హా సుమిత్రా! మాతో పాటు మీ కుమారుడు లక్ష్మణుడు కూడా ఎన్నో కష్టాలు పడుతున్నాడు. నేను నా రామునికి దూరంగా ఉన్నాను. ఈ రాక్షస స్త్రీల మధ్య ఉన్నాను వీరి బెదిరింపులకు వణికిపోతున్నాను. ఇంక ఒక్క క్షణకాలము కూడా జీవించలేను. ఎవరైనా కానీ, మరణించాలని కోరుకున్నా కూడా, వారికి మరణం

ఆసన్నమయ్యే వరకూ జీవించి ఉండటం తప్పదు కదా. అందుకే జీవించి ఉన్నాను. నా రాముడు ఎన్నటికైనా రాకపోతాడా నన్ను ఈ కష్టముల నుండి రక్షించక పోతాడా అనే ఆశతో జీవించి ఉన్నాను. నేను ఏ జన్మలో తక్కువ పుణ్యం చేసుకున్నానో, ఈ జన్మలో నా భర్తకు దూరమై ఈ రాక్షసుల మధ్య బతుకుతున్నాను.

అటు నా భర్తకు దగ్గరవలేను. ఇటు ఈ రాక్షసులకు లొంగి పోయి వారు చెప్పినట్టు వినలేను. నడిసముద్రంలో నావలాగా కొట్టుకుంటున్నాను. అయినా జీవితాంతం భర్తతో కలిసి జీవించే సుఖం కూడా అందరికీ లభించదు. కేవలం కొంతమంది అదృష్టవంతులకే ఆ సుఖం దక్కుతుంది. అతి భయంకరమైన విషము తిన్న తరువాత జీవించడం ఎంత కష్టమో, నా రాముని విడిచి ఉండటం అంతే కష్టంగా ఉంది నాకు. పూర్వజన్మలో ఏం పాపం చేసానో ఈ జన్మలో నా భర్తకు దూరమై అష్టకష్టములు అనుభవిస్తున్నాను.

ఓ రామా! నిన్ను విడిచి నేను జీవించలేదు. నేను చచ్చిపోదామన్నా ఈ రాక్షసులు నన్ను చావనివ్వడం లేదు. ఏంచెయ్యాలి? ఇష్టం వచ్చినప్పుడు చావడానికి కూడా స్వేచ్ఛలేని ఈ మనుష్యజీవితము ఎంతో దుర్భరం కదా!" అని పలువిదములుగా విలపిస్తూ ఉంది సీత.

శ్రీమద్రామాయణము

సుందర కాండము ఇరువది ఐదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

ఇరువది ఆరవ సర్గ.

అతి చిన్నవయసులోనే ఇన్ని కష్టములను పడుతున్న సీత, కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ఉంది. నేల మీద పడి దొర్లుతూ ఏడుస్తూ ఉంది. “ ఓ రామా! నీవు ఇంటలేని సమయంలో ఈ రాక్షసుడు నన్ను ఎత్తుకొని వచ్చాడు. ఇప్పుడు ఈ రాక్షసులు నన్ను దారుణంగా భయపెడు తున్నారు. ఇన్ని బాధలు పడుతూ జీవించడం దుర్భరంగా ఉ ంది.

ఓ రామా! నీవే లేనపుడు నాకు ఈ ఆభరణములతోనూ, ప్రాణములతోనూ పని ఏముంది. ఇటువంటి కష్టములు మరొకరికి వచ్చి ఉంటే వారి హృదయము ఈ పాటికి బద్దలయి ఉండేది. కానీ నా హృదయము పాషాణము. ఇనుముతో చేయబడింది. అందుకనే ఆగిపో లేదు. ఇంకొ కొట్టుకుంటూ ఉంది. ధర్మశాస్త్రము ప్రకారము భర్త దగ్గర లేకుండా భార్య క్షణకాలం కూడా జీవించ కూడదు. కాని నేను నీవు దగ్గర లేకుండా ఇంతకాలము జీవించి ఉన్నాను. నేను ఎంతటి పాపాత్మురాలనో కదా! ఈ భరతఖండమునకు ప్రభువు అయిన నా రాముని విడిచి ఉన్న నాకు, ఈ భోగముల మీద కానీ, సుఖముల మీద కానీ, ఆఖరుకు ఈ జీవితము మీద కానీ ఆసక్తి లేదు. నేను ఇంక క్షణకాలం కూడా జీవించి ఉండలేను. వీళ్లు నా శరీరమును చీల్చినా సరే, తిన్నా సరే, నాకు సంబంధము లేదు. నేను ఈ శరీరాన్ని విడిచిపెట్టడానికి సిద్ధంగా ఉన్నాను.

ఇంక ఈ కష్టములను, దు:ఖమును భరించడం నా వల్లకాదు. ఆఖరుకు చావనైనా చస్తాను కానీ, ఆ రావణుని నా ఎడమకాలుతో కూడా తాకను. అయినా ఆ రావణుడు ఎంత మూర్ఖుడు. నువ్వు అంటే నాకు ఇష్టంలేదురా అంటే కూడా వినడు. నన్ను వరించమని నా వెంటపడుతున్నాడు. కనీసం తాను పుట్టిన కులము, వంశము గురించి కూడా ఆలోచించడం లేదు. నా కాళ్ల మీద పడుతున్నాడు.

ఓసీ రాక్షసులారా! మీరు నన్ను కొయ్యండి. నరకండి. అగ్నిలో పడెయ్యండి. మీ ఇష్టం వచ్చినట్టు భయపెట్టండి. నేను మాత్ర ము మీ రావణుని వంక కన్నెత్తికూడా చూడను. నా రాముని గురించి మీకు తెలియదు. అత్యంత పరాక్రమ వంతుడు. మంచి జాలి గుండె కలవాడు. కాని ఎందుకో నా మీద జాలి చూపడం లేదు. లేకపోతే ఈ పాటికి ఈ లంకకు వచ్చి రావణుని చంపి నన్ను తీసుకుపోవాలి కదా! ఎందుకంటే, జన స్థానములో 14,000 మందిరాక్షసులను ఒంటి చేత్తో చంపిన రామునికి అల్పుడైన ఈ రావణుడు ఒక లెక్కా! ఒక్క బాణంతో ఈ రావణుని నేలకూల్చ గలడు. మరి ఎందుకు రావడం లేదు. రామునికి నా మీద ప్రేమ తగ్గిందా అని అనుమానంగా ఉంది.

దండకారణ్యంలో విరాధుని చంపిన వీరుడు రాముడు నన్ను రక్షించడానికి ఎందుకు రాలేదు? ఈ లంక సముద్ర మధ్యలో ఉంది అని సందేహిస్తున్నాడా! రామబాణమునకు అడ్డేముంది? ఒక రాక్షసుడు మాయ చేత నన్ను అపహరించాడు అని రామునికి తెలుసు కదా! మరి రాముడు నన్ను రక్షించడానికి రాకపోవడానికి కారణం ఏమైఉంటుంది? అంటే రామునికి నేను ఇక్కడ లంకలో, రావణుని

చెరలో ఈ అశోక వనములో ఉన్నాను అని తెలిసి ఉండకపోవచ్చు. తెలిస్తే ఎందుకు రాడు! రావణుడు నన్ను ఇక్కడ దాచాడు అని ఏ మాత్రం తెలిసినా ఈ అవమానమును సహించి ఊరుకోడు. తప్పకుండా వస్తాడు. నన్ను విడిపిస్తాడు.

నన్ను రావణుడు అపహరించి తీసుకొని వస్తుంటే జటాయువు అనే పక్షిరాజు నన్ను రక్షించడానికి ప్రయత్నించి రావణుని చేతిలో మరణించాడు. ఆ పక్షిరాజు వృద్ధుడైనా తన వంతు ప్రయత్నం తాను చేసాడు. వృద్ధుడైన జటాయువు చేసినంత మాత్రం రాముడు చేయలేడా! నేను ఇక్కడ ఉన్నట్టు తెలిస్తే, రాముడు లంకకు వచ్చి రావణుని చంపడా! రాముడు తలుచుకుంటే, అసలు ఈ లోకంలో రాక్షసుడు అనే వాడు లేకుండా చేస్తాడు కదా! కానీ నా రాముడు ఎందుకు రావడం లేదో అర్థం కావడం లేదు. రాముడు తలచు కుంటే ఈ సముద్రమును ఇంకింపచేసి, లంకకు వచ్చి రావణుని చంపి, నన్ను తీసుకువెళ్లాలి కదా! మరి రాముడు ఎందుకు తలచు కోలేదు?

రాముడు వచ్చి ఈ లంకలో ఉన్న రాక్షసులందరినీ చంపితే, ఆ రాక్షసుల భార్యలు కూడా నా మాదిరి ఏడుస్తారేమో! అప్పుడు ప్రతి ఇంట్లో కూడా రాక్షస స్త్రీల ఏడుపులు వినిపిస్తాయేమో! రాముని కంట పడిన తరువాత ఈ రావణుడు క్షణకాలం కూడా జీవించి ఉండలేడు. కానీ రాముడు ఇక్కడకు రావాలి కదా! ఎప్పుడు వస్తాడో ఏమో! నా రాముడు రావాలే కానీ, ఈ లంక శ్మశానంగా మారడం ఎంతసేపు! లంక అంతా శవాలు కాలుతున్న పొగతో నిండి పోతుంది. లంక మీద శవాల కోసరం గద్దలు ఎగురుతుంటాయి.

ఓ రాక్షసులారా! ఈ లంక దానితో పాటు మీరందరూ సర్వనాశనం అయ్యేరోజు దగ్గరలోనే ఉంది. ఎందుకుంటే లంకలో అశు భ శకునములు చాలా కనపడుతున్నాయి. చాలా తొందరలోనే రావణుడు చావడం, ఈ లంక తన వైభవాన్ని కోల్పోవడం జరుగుతుంది. రావణుడు, రాక్షసులు అందరూ మరణిస్తే, లంకలో రాక్షస స్త్రీలు మాత్రం మిగులుతారు. లంకతో పాటు వారూ అనాధలు అవుతారు. ఇంటింటా రాక్షస స్త్రీల ఏడుపులను నేను త్వరలోనే వింటాను.

ఇదంతా జరగాలంటే నేను ఇక్కడ ఉన్నట్టు రామునికి తెలియాలి కదా! రామునికి నేను రావణుని అధీనములో ఉన్నట్టు ఎలా తెలుస్తుంది? రావణుడు నాకు పెట్టిన రెండు నెలల గడువు కూడా అయిపోవచ్చింది. అలాంటి గడువు మృత్యు దేవత ఆ రావణునికి ఎందుకు పెట్టలేదు. గడువు తీరిపోగానే మృత్యువు వాడినే కబళించవచ్చు కదా.

పచ్చి మాంసము తినే ఈ రాక్షసులకు ధర్మం అంటే ఏమిటో అధర్మం అంటే ఏమిటో అసలు తెలియదు. ఏది చెయ్యాలో ఏది చెయ్యకూడదో ఏమీ తెలియదు. తెలిస్తే కోరి కోరి ఇంతటి ఉపద్రవాన్ని కొనితెచ్చుకుంటారా! ఏం చేస్తాం. గడువు తీరి పోగానే ఆ రాక్షసుడు రావణుడు నన్ను తన ప్రాత:కాల భోజనం లోకి నంజుకుంటాడు. ఈ రెండు నెలల కాలంలో, ఎక్కడో ఉన్న రాముడు ఇక్కడకుక ఎలా వస్తాడు? నన్ను ఎలా రక్షిస్తాడు? ఇక్కడ నాకు ఇంత విషం ఇచ్చే దిక్కు కూడా లేదు. లేకపోతే హాయిగా విషం తాగి యమలోకం చేరుకొనే దాన్ని.

ఇంతకూ రాముడికి నేను ఇక్కడ ఉన్నట్టు తెలిసి ఉండదు. లేకపోతే నన్ను వెదకకుండా ఉంటాడా! అసలు రాముడు బతికి ఉన్నాడా లేక నా వియోగాన్ని భరించలేక ఈ లోకాన్ని విడిచిపెట్టాడా! ఈ లోకంలో ఉంటే నన్ను వెదుక్కుంటూ రాకుండా ఉంటాడా! ఈ లోకంలో రాముని చూచే అదృష్టానికి నేను నోచుకోలేదు కానీ స్వర్గంలో ఉన్న దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు రాముని దివ్యదర్శన భాగ్యమునకు నోచుకున్నారు.

కాదు. అలా ఎన్నటికీ జరగదు. నా ఊహ అబద్ధము. రాముడు ఎన్నటికీ నన్ను విడిచి స్వర్గానికి ఒంటరిగా వెళ్లడు. కాకపోతే రాముడు రాజర్షి కదా! అందుకని రామునికి నా అవసరము ఏముంటుంది. అందుకని నన్ను మర్చిపోయి ఉండవచ్చు. అందుకనే నా కోసరం రాలేదు. లోకంలో ప్రజలకు భార్య ఎదురుగా ఉన్నప్పుడే ప్రేమలు అనురాగాలు పొంగి పొర్లుతుంటాయి. భార్య కాస్త కనుమరుగు అయితే ఆ ప్రేమానురాగాలు ఆవిరి అయిపోతాయి లేక మరొకరి మీదకు మరలుతాయి.

కాని నా రాముడు అలాంటి వాడు కాడు. నా మీద ఉన్న ప్రేమను అంత సులభంగా మర్చిపోడు. నేను రాముడిని అనవసరంగా శంకిస్తున్నాను. రాముడికి దూరమై కృంగిపోతున్నాను. సద్గుణములు లేని వారే భర్తకు దూరం అవుతారు. అంటే నాలో సద్గుణములు లేవా! నా పుణ్యము క్షీణించి పోయిందా! నా సౌభాగ్యము అంతరించిందా! ఎందుకిలా జరుగుతూ ఉంది? దీనికంతటికీ కారణమేమి! ఎంత ఆలోచించినా ఏమీ అంతు చిక్కడం లేదు.

దీని కంతటికీ ఒకే పరిష్కారము. రాముడు లేకుండా నేను జీవించ ఉండటం వృధా. నాకు మరణమే శరణ్యము. రామలక్ష్మణులు అడవులలో ఆకులలములు తింటూ కృంగి కృశించి పోతుంటే, నేను జీవించి ఉండటం వలన లాభం ఏమిటి! లేదా! ఈ రావణుడు తన మనుషులతో రామలక్ష్మణులను చంపించాడేమో! అప్పుడు కూడా నేను బతికి ఉండటం వృధా! ఏది ఏమైనా నేను మరణించక తప్పదు.

ఎన్ని కష్టాలు వచ్చినా మాలాంటి మామూలు వారికే గానీ, జితేంద్రియులు, తపశ్శాలులు అయిన మహాత్ములకు కష్టములే ఉండవు కదా! వారికి ఇది కావాలి అనికానీ, ఇది వద్దు అని కానీ ఉండదు. వారు దేనికోసరమూ వెంపర్లాడరు. ఏది వచ్చినా వద్దనరు. వారికి సుఖము దు:ఖము సమానములు. వారు ధన్యజీవులు. వారందరికీ నా నమోవాకములు. నేను ప్రస్తుతము అదే స్థితికి చేరుకున్నాను. రాముడు లేని ఈ లోకంతోనూ, ఈ జీవితంతోనూ నాకు పనిలేదు. నేను ప్రాణత్యాగము చేస్తాను." అని ధృఢంగా నిశ్చయించుకుంది సీత.

శ్రీమద్రామాయణము

సుందర కాండము ఇరువది ఆరవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

ఇరువది ఏడవ సర్గ.

సీతకు ఎంత చెప్పినా లాభం లేదు అని అనుకొన్నారు ఆ రాక్షస స్త్రీలు. వారిలో కొంతమంది సీత గురించి, సీత మూర్ఖత్వాన్ని

గురించీ రావణునికి తెలియజెయ్యాలని వెళ్లారు. మిగిలిన రాక్షస వనితలు మరలా పరుష వాక్యములతో సీతను నిందించడం మొదలెట్టారు.

"సీతా! ఇంక నీకు ఏమి చెప్పీ ప్రయోజనము లేదు. నిన్ను తినడం తప్ప మారు మరోమార్గము లేదు." అని సీత మీద పడి చంపుదామని అనుకుంటూ ఉండగానే వారిలో ఒక వృద్ధరాక్షసి త్రిజట అనే పేరుకలది అప్పటి దాకా నిద్రపోతూ ఉంది. రాక్షస వనితల ఆర్భాటము చూచి నిద్రలేచింది. తన తోటి రాక్షస స్త్రీలను చూచి ఇలా అంది.

"ఏమిటే! ఏమి చేస్తున్నారు? మూర్ఖుల్లారా! మీరు ఎవరిని చంపి తింటున్నారో తెలుసా! దశరథుని కోడలిని. రాముని భార్యను. మీరు సీతను తినడం లేదు. మిమ్మల్ని మీరే చంపుకొని తింటున్నారు. అసలు సంగతి చెబుతాను వినండి. నేను ఇప్పటిదాకా నిద్రపోతున్నానా! ఆ నిద్రలో నాకు ఒళ్లు గగుర్పొడిచే ఒక కల వచ్చింది. అదీ ఈ తెల్లవారుజామున వచ్చింది. తెల్లవారుజామున వచ్చే కలలు నిజం అవుతాయంటారు కదా! ఆ కలలో రాక్షసులు అంతా నాశనమైనట్టు, రాముడు సీతను తీసుకువెల్లినట్టు కల వచ్చింది. తెలుసా!" అని కాసేపు ఆగింది.

ఆ మాటలకు ఆ రాక్షస వనితల శరీరంలో వణుకు పుట్టింది. "త్రిజటా! నిజంగానా! నీకు అలాంటి కల వచ్చిందా. అబ్బా వివరంగా చెప్పవే. ఇక్కడ మేము భయంతో వణికి చస్తున్నాము. తొందరగా చెప్పు." అని త్రిజటను తొందర చేసారు.

వారితో త్రిజట ఇలా చెప్పసాగింది. "సీత మొగుడు రాముడు, రాముని తమ్ముడు లక్ష్మణుడు తెల్లని వస్త్రములు ధరించి ఒక పల్లకీ ఎక్కి వస్తున్నారు. ఆ పల్లకీని వెయ్యి హంసలు మోసుకొని ఎగురుకుంటూ వస్తున్నాయి. మన సీత కూడా తెల్లని వస్త్రములు ధరించి దేదీప్యమానంగా వెలుగుతూ కనపడింది. రాముడు సీతను తన వెంట తీసుకొని వెళ్లాడు.

అంతలో నాకు నాలుగు దంతములు కలిగిన ఒక ఏనుగు కనపడింది. సీత, రాముడు, లక్ష్మణుడు ఆ ఏనుగు ఎక్కి వెళుతున్నారు. రాముడు, లక్ష్మణుడు తెల్లని వస్త్రములు ధరించి సీత దగ్గరకు రావడం నేను చూచాను. రాముడు ఎక్కిన ఏనుగు సీత ముందుకు వచ్చి ఒంగింది. సీతకు రాముడు చెయ్యి అందిచ్చాడు. రాముని చెయ్యి పట్టుకొని సీత ఆ ఏనుగు మీదికి ఎక్కింది. తరువాత ఏం జరిగిందో తెలుసా!" అని ఆగింది త్రిజట.

అప్పటికే భయంతో వణుకుతున్న రాక్షసులు "ఏం జరిగిందే!" అని అడిగారు.

"అప్పుడు ఏ ఏనుగు రాముని, సీతను ఎక్కించుకొని లంకమీద నిలబడింది. ఇంతలో ఆ దృశ్యం మారి పోయింది. తెల్లటి ఎనిమిది ఎద్దులు కట్టిన ఒక రథం కనిపించింది. అందులో రాముడు సీత కూర్చుని ఉన్నారు. అంతలో దృశ్యము మారి పోయింది. రాముడు, లక్ష్మణుడు, సీత కలిసి పుష్పక విమానము ఎక్కి ఉత్తర దిక్కుగా వెళ్లిపోయారు. నా స్వప్నంలో రాముడు సాక్షాత్తు విష్ణుమూర్తిలా ప్రకాశిస్తున్నాడు. ఇంక మన రావణుడు ఆ రాముని ఎలా జయిస్తాడు?

మీకు ఇంకో సంగతి తెలుసా! మన రావణుడు ఎర్రని వస్త్రములు ధరించి, ఎర్రని పూల మాలలు వేసుకొని, ఒంటి నిండా నూనె పూసుకొని, నూనె తాగుతూ, కిందపడి దొర్లుతూ ఉండటం నేను నా స్వప్నంలో చూచాను. అంతలోనే రావణుడు నున్నగా గుండు కొట్టించుకొని కనపడ్డాడు. అప్పుడు రావణుడు నల్లని వస్త్రములు ధరించి ఉన్నాడు. రావణుడు పుష్పక విమానం నుండి అమాంతం కింద పడ్డాడు. అప్పుడు ఒక ఆడది పుష్పకము నుండి కింద పడ్డ రావణుని నేలమీద ఈడ్చుకుంటూ వెళుతూ ఉంది." అని ఆగింది.

రాక్షస స్త్రీలు భయంతో వణికిపోతున్నారు. త్రిజట చెప్పింది నోళ్లు వెళ్లబెట్టి వింటున్నారు. మరలా త్రిజట చెప్పడం మొదలెట్టింది.

"ఇంతలో మరొక దృశ్యం. ఇందాక చెప్పానే, రావణుడు ఎర్రటి వస్త్రములు కట్టుకున్నాడని, అలాగే రావణుడు నూనె తాగుతూ గాడిదలు కట్టిన రథం ఎక్కి, రథం మీద పిచ్చివాడిలా నృత్యం చేస్తూ దక్షిణ దిక్కుగా పోతున్నాడు. పోతూ పోతూ జారి రథంనుండి తలకిందులుగా కిందపడ్డాడు. కింద పడ్డ రావణుడు పైకి లేచాడు. పిచ్చి పిచ్చి గా మాట్లాడుతున్నాడు. ఒంటిమీద బట్టలు చించుకున్నాడు. విప్పుకున్నాడు. దిగంబరంగా నృత్యం చేస్తున్నాడు. అక్కడే ఉన్న ఒక చెడువాసన వేస్తున్న బురద గుంటలో పడిపోయాడు. మునిగిపోయాడు. అంతే. మళ్లీ పైకి లేవలేదు.

అంతలోనే దృశ్యం మారింది. నల్లని వస్త్రములు కట్టుకున్న స్త్రీ ఒకత్తె రావణుని మెడకు ఉరి తాడు బిగించి లాగుకుంటూ దక్షిణ దిక్కుగా ఈడ్చుకుంటూ వెళ్లింది. మీకు తెలుసో లేదో! రావణుని

తమ్ముడు కుంభకర్ణుడు, రావణుని కుమారులు కూడా ఇలాగే నూనె తాగుతూ బురదగుంటలో పడిపోతున్నారు. వాళ్లను కూడా నేలమీద పడేసి ఈడ్చుకుంటూ వెళుతున్నారు. రావణుడు పందినీ, ఇంద్రజిత్తు మొసలిని, కుంభకర్ణుడు ఒంటెను, ఎక్కి దక్షిణ దిశగా వెళ్లడం నాకు కలలో కనపడింది.

కానీ విభీషణుడు మాత్రం తెల్లని వస్త్రములు ధరించి తెల్లని గొడుగు ధరించి నాలుగు దంతాలు కల ఏనుగు ఎక్కి ఆకాశంలో తిరుగుతున్నాడు.

వీళ్ల సంగతి ఇలా ఉంటే, రావణుని అనుచరులు అయిన రాక్షసులు కూడా నూనె తాగుతూ ఎర్రని వస్త్రములు కట్టుకొని మద్యము తాగుతూ పిచ్చిపిచ్చిగా ఆడుతున్నారు. ఇంక ఈ లంకా నగరం లోని ఇళ్లు, గోపురములు తోరణములు, అన్నీ కూలిపోయాయి. సముద్రము పొంగి లంకను మొత్తం ముంచేసింది. ” అని త్రిజట భయంకరంగా చెబుతుంటే రాక్షసస్త్రీలు వణికిపోతున్నారు.

ఇప్పటి దాకా రావణునికి ప్రియం చేకూర్చడానికి సీతను భయపెట్టారు కానీ, ఆ రావణునికే దిక్కులేకుండా లంక మొత్తం మునిగిపోతుంటే వాళ్లు బెంబెలు ఎత్తిపోయారు. ఇంకా త్రిజట ఏం చెబుతుందో అని భయపడి చస్తున్నారు. త్రిజట మరలా చెప్పడం మొదలెట్టింది.

“మీకు మరో సంగతి చెప్పడం మరిచిపోయాను. మన లంకలోకి ఒక కోతి వచ్చింది. ఆ కోతి రాముడు పంపగా వచ్చిందట. ఆ

కోతి లంకను మొత్తం తగలపెట్టింది. ఇదంతా నాకు కలలో కనపడింది. లంక అంతా తగలబడి పోతుంటే రాక్షస స్త్రీలు అందరూ నూనెలు తాగుతూ పిచ్చిపిచ్చిగా గంతులువేస్తున్నారు. కుంభకర్ణుడు మొదలగు రాక్షసులు అందరూ బురద గుంటలలో కూరుకుపోయారు. ఇదీ నాకు వచ్చిన కల.

దీనిని బట్టి చూస్తే రావణుడు చావడం ఖాయం. కాబట్టి మనమన్నా బతుకుదాము. సీతను వదిలి పెట్టి వెళ్లిపోండి. లేకపోతే తన భార్యను భయపెట్టిన మీ అందరినీ కూడా రాముడు చంపుతాడు. ఎందుకుంటే రాముడికి తన భార్య సీత అంటే ప్రాణం. సీతను ఎవరు ఏమన్నా రాముడు సహించడు. వాళ్లను చంపేదాకా వదలడు. మనకెందుకు చెప్పండి. సీతకు మంచిగా చెప్పిచూద్దాము. రావణుని మాటలు విని సీతను భయపెట్టి మన ప్రాణాల మీదికి తెచ్చుకోడం ఎందుకు. పైగా నాకు ఈ కల తెల్లవారుజామున వచ్చింది. తెల్లవారు జామున వచ్చిన కల జరుగుతుంది అంటారు.

ఇదంతా ఎందుకు చెప్పండి! సీత కోసరం రాముడు వస్తాడు. ఆమెను రావణుని వద్దనుండి తీసుకొని వెళతాడు. మధ్యలోమనం చస్తాము. ఇప్పటిదాకా సీతను భయపెట్టినా ఏమీ ప్రయోజనం లేదుకదా! అందుకని ఇంక సీతను భయపెట్టడం మానేద్దాము. మంచిమాటలు చెబుదాము. ప్రార్థిద్దాము. మనం సీతను మంచి చేసుకున్నాము అనుకో సీత రామునికి చెప్పి మనలను ఏమీ చెయ్యకుండా రక్షిస్తుంది. ఎందుకంటే నాకు వచ్చిన కలను బట్టి చూస్తే రాముడు రావడం రావణుడు చావడం తథ్యం అనిపిస్తూ ఉంది.

అటు చూడండి. సీతకు ఎడమ కన్ను ఎడమ భుజము అదురుతూ ఉంది. ఇవి శుభ సూచకములు. కాబట్టి రాముడు తొందరలోనే లంకకు వస్తాడు. సీతను చెర విడిపిస్తాడు." అని త్రిజట తనకు వచ్చిన స్వప్నమును గురించి రాక్షసస్త్రీలకు వివరించింది.

శ్రీమద్రామాయణము

సుందర కాండము ఇరువది ఏడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

ఇరువది ఎనిమిదవ సర్గ.

త్రిజటకు వచ్చిన స్వప్నము గురించి కానీ, దాని గురించి త్రిజట తోటి రాక్షస వనితలకు చెప్పడం కానీ సీతకు తెలియదు. రావణుడు వచ్చి తనను అన్న మాటలను తలచుకొని, తరువాత రాక్షస స్త్రీలు తనను చంపుతానని బెదిరిస్తూ మాట్లాడిన మాటలను తలచుకొని బాధపడుతూ ఉంది సీత.

"నేను ఎంత పాపం చేసానో గానీ, వీళ్ల చేత ఇన్ని మాటలు పడుతూకూడా నా ప్రాణములు నా శరీరమును వదలకుండా ఉన్నాయి. కాలము తీరనిది మరణము కూడా దగ్గరకు రాదు అన్న విషయం సత్యము అని తోస్తూ ఉంది. నేను సుఖాలకు నోచుకోలేదు. నా జీవితము అంతా దు:ఖ మయము. అయినా కూడా నా హృదయము పాషాణము కంటే గట్టిగా ఉంది. అందుకే జీవితాంతము కష్టములు వచ్చినా బద్దలు కాకుండా ఇంకా వజ్రసమానంగా ఉంది.

అసలు నా తప్పు ఏమీ లేకుండానే రావణుడు నన్ను చంపమని ఆజ్ఞాపించాడు. ఈ రావణుడు ఏమి చేసినా వీడిని మాత్రము నేను దగ్గరకు రానివ్వను. ఈ రెండు నెలల గడువులోపల రాముడు రాకుంటే ఈ రావణుడు నన్ను చంపుతాడు. రాముడు ఎప్పుడు వస్తాడో తెలియదు. నాకు ఎన్ని కష్టములు వచ్చి పడ్డాయి. రామా! లక్ష్మణా! తొందరగా రండి. నన్ను ఈ రాక్షసుని చెరనుండి నన్ను విడిపించండి.

ఆ రోజు కాలమే మృగరూపంలో వచ్చి నన్ను ప్రలోభ పెట్టింది. నేను రాముని ఆ మృగమును తెచ్చి ఇమ్మని అడిగాను. నా తెలివి తక్కువతనంతో లక్ష్మణుని కూడా దూరంగా పంపాను. అంతా కాలమహిమ. నా దురదృష్టము. రామలక్ష్మణులు తిరిగి వచ్చునప్పటికి నేను అపహరింపబడ్డాను. రామునికి, లక్ష్మణునికి నా గురించి ఎలా తెలుస్తుంది. నాగురించి తెలిసిన జటాయువు కూడా ఈ రాక్షసుని చేతిలో మరణించాడు. నేను చేసిన పూజలు, నోములు, వ్రతాలు, నా పాతివ్రత్యము, నేను అనుసరించిన ధర్మము అన్నీ వృధా అయి పోయాయి.

కనీసము నా భర్తను చేరుకోడానికి కూడా పనికిరాని ఈ పాతివ్రత్యము ఎందుకు? నిరర్థకము కదా! రామా! నీవు నీ తండ్రి ఆజ్ఞ మేరకు పదునాలుగేండ్ల గడువు ముగిసిన తరువాత అయోధ్యకు పోయి, పట్టాభిషిక్తుడివై, కోరిన స్త్రీలతో సుఖించు. నేను ఇక్కడే ఈ రాక్షసుని చేతిలో మరణిస్తాను. నాకు నీ మీద ఉన్న ప్రేమ, నీకొరకు ఆచరించిన పాతివ్రత్యము నా వినాశము కొరకే దాపురించాయి. నా అంత దురదృష్టవంతురాలు లోకంలో ఉండబోదు. ఏం చెయ్యను. చచ్చిపోదామన్నా ఇంత విషం ఇచ్చే వాళ్లు కూడా లేరు. ఈ రాక్షసుని

మందిరంలో విషానికి కూడా కరువే కదా!" అని పరి పరి విధముల విలపిస్తూ ఉంది సీత.

చావడానికి విషము కానీ, ఆయుధము కానీ లేకపోవడంతో, అందుబాటులో ఉన్న తన పొడుగాటి జడనే తాడుగా ఉపయోగించి, మెడకు ఉరివేసుకొని ప్రాణత్యాగము చేయడానికి ప్రయత్నించింది సీత. "నేను ఈ జడతో ఉరి పోసుకొని, చచ్చిపోయి, యమలోకాని వెళతాను" అని మనసులో అనుకొంది సీత.

చావడానికి నిశ్చయించుకున్న సీత లేచి నిలబడింది. ఆ చెట్టు కొమ్మ కింద నిలుచుంది. చావడానికి సిద్ధంగా ఉన్న సీతకు శుభశకునములు కనపడ్డాయి. అటువంటి శకునములు కనపడినపుడు సీతకు ఎన్నో శుభాలు జరిగాయి. అటువంటి శుభ శకునములు మరలా కనపడ్డాయి సీతకు.

శ్రీమద్రామాయణము

సుందర కాండము ఇరువది ఎనిమిదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

ఇరువది తొమ్మిదవ సర్గ.

చెట్టుకొమ్మకు తన పొడుగాటి జడతో ఉరి పోసుకొని చావాలను కున్న సీతకు ఎన్నో శుభశకునములుకనిపిపించాయి. సీతకు ఎడమ కన్ను అదిరింది. ఎడమ భుజము కూడా అదిరింది.

శరీరంలో ఎడమ భాగము అంతా అదురుతూ ఉంది. ఈ ప్రకారంగా శరీరంలో ఎడమ భాగంలో ఉన్న అవయవములు అదిరి నపుడు సీతకు ఎన్నో శుభాలు జరిగాయి. ఇప్పుడు తనకు ఎడమ భాగం అదరడంతో సీతకు తనకు శుభాలుజరగబోతున్నాయి అన్న భావనకలిగింది.

సీత మనసంతా ఆనందంతో నిండి పోయింది. సీత ముఖపద్మము దివ్యంగా ప్రకాశించింది. సీత ఆత్మహత్యా ప్రయత్నాన్ని తాత్కాలికంగా విరమించింది.

శ్రీమద్రామాయణము

సుందర కాండము ఇరువది తొమ్మిదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

ముప్పదవసర్గ.

శింశుపా వృక్షము మీద ఆకుల మాటున దాగి ఉన్న హనుమంతుడు చెట్టు కింద జరుగుతున్న విషయములను అన్నీ ఓపికగా చూస్తున్నాడు. సీత విలపించడం, రాక్షసస్త్రీలు సీతను భయపెట్టడం, సీత బయపడటం, త్రిజట తనకు వచ్చిన కల గురించి రాక్షసస్త్రీలకు చెప్పడం, సీత తన దుస్థితిని తలచుకొని దు:ఖించడం అన్నీ చూస్తున్నాడు వింటున్నాడు హనుమంతుడు.

సుందర కాండము

హనుమంతుని దృష్టి అంతా సీత మీదనే ఉంది. హనుమంతుడు తనలో తాను ఇలా ఆలోచిస్తున్నాడు. "నాలుగు దిక్కులకు వెళ్లిన వానరములకు పట్టని అదృష్టం తనకు పట్టింది. సీతను తాను చూడగలిగాడు. ఎవరికీ కనపడకుండా కూర్చుని అన్నివిషయములను ఆకళింపు చేసుకున్నాను. లంకను గురించి సంపూర్ణంగా తెలుసుకున్నాను. రావణుని గురించి అతని ప్రవర్తన గురించి బాగుగా అధ్యయనం చేసాను.

రాముని భార్య సీత ఎప్పుడెప్పుడు తన భర్త రాముని చూద్దామా అని ఆతురతగా ఉంది. ఆమె దు:ఖసముద్రంలో మునిగి ఉంది. ఇప్పుడు ఆమెను కలుసుకొని ఓదార్చడం తన తక్షణ కర్తవ్యం. సీతను చూస్తుంటే ఆమె ఇంతకు ముందు ఎన్నడూ ఇటువంటి కష్టములను అనుభవించినట్టులేదు. ఇప్పుడు ఆమెను కలిసి, ఆమెకు నాలుగు ఓదార్పు వచనములు చెప్పడం అత్యంత ఆవశ్యకము.

ఏదో సముద్రం దాటాను, లంకకు వచ్చాను, సీతను చూచాను అంటూ వెళ్లిపోతే నేను ఇక్కడకు వచ్చిన దానికి ఫలితం ఉండదు. నేను ఆమెకు కనపడకుండా వెళ్లిపోతే, నేను అటు వెళ్లగానే ఆమె దు:ఖము తట్టుకోలేక ఆత్మత్యాగము చేసుకుంటే, నేను పడ్డ శ్రమఅంతా వృధా అవుతుంది. అంతేకాకుండా, ఇప్పుడు నేను సీతను కలవకుండా రాముని వద్దకు వెళితే, "హనుమా! సీతను చూచావుకదా! సీత నాతో ఏమి చెప్పమని చెప్పింది" అని అడిగితే ఏమని సమాధానము చెప్పాలి. సీత నుండి నేను సందేశము తీసుకొని వెళ్లకపోతే రాముడికి కోపం వస్తుంది కదా!

ఇప్పుడు నేను సీతను కలవకుండా వెళ్లి, సుగ్రీవుని వానరసేనలతో తీసుకొని వచ్చి రావణునితో యుద్ధము చేసి, రావణుని సంహరించి సీత కోసం వెదికితే, అప్పటికే సీత ప్రాణత్యాగము చేసుకుని ఉంటే, ఈ ప్రయత్నములన్నీ వృధా అవుతాయి కదా! అందుకని తక్షణమే సీతను కలవడం అత్యావశ్యకము. సీతను కలిసి ఆమెను ఓదార్చాలి. రామునికి సీత గురించి చెప్పి రామునీ ఓదార్చాలి.

కానీ సీతను ఒంటరిగా ఎలా కలవాలి. ఈ రాక్షసస్త్రీలు ఆమెను చుట్టుముట్టి ఉన్నారు. వీళ్లు చూడ కుండా సీతను కలవడం ఎలాగ! ఇప్పుడు నేను ఈమెను కలవక పోతే ఈమె ప్రాణత్యాగము చేసుకుంటుంది. కాబట్టి ఈ రాక్షస స్త్రీలు ఏమరుపాటుగా ఉన్నప్పుడు సీతను కలవాలి. ఆమెను ఓదార్చాలి." అని అనుకున్నాడు

హనుమంతుడు. తనశరీరం వంక చూచుకున్నాడు. చాలా చిన్న శరీరంతో ఉన్నాడు. మరలా ఇలా ఆలోచిస్తున్నాడు. "తాను వానర రూపంలో ఉన్నా సంస్కృతములో మాట్లాడగలుగుతున్నాడు. కాని తాను సంస్కృతములో మాట్లాడితే తనను రాక్షసుడు అని సీత భ్రమించగలదు. పైగా తాను వానరుడు. తాను మానుష భాషలో మాట్లాడటం అసంభవం కదా! కాని తాను మానుష భాషలో మాట్లాడితే గానీ, సీతకు అర్థం కాదు. కాబట్టి సీతకు అర్థము అయ్యేభాషలో మాట్లాడి ఆమెను ఓదార్చాలి.

అంతవరకూ బాగానే ఉంది. కానీ సీత ముందుకు ఏ రూపంలో వెళ్లాలి. వానర రూపంలో వెళితే, అసలే రాక్షసుల వలన భయపడుతున్న సీత ఇంకా భయపడుతుంది. తనను

మాయారూపములు ధరించు రావణునిగా భయపడుతుంది. అరుస్తుంది. అప్పుడు ఈ రాక్షసులు లేస్తారు. వాళ్లంతా ఆయుధములు పట్టుకొని వస్తారు. నన్ను పట్టుకొని చంపడానికి ప్రయత్నం చేస్తారు. నేను వాళ్లకు దొరకకుండా పారిపోగలను. కానీ వారికి అనుమానం వస్తుంది. పోనీ నా భయంకరాకారముతో కనపడితే, ఈ రాక్షస స్త్రీలు పెద్దగా అరిచి గోల చేస్తారు. అప్పుడు రాక్షస సేనలు వస్తాయి. వారితో యుద్ధం చేయాల్సివస్తుంది. వాళ్లందరినీ చంపి నేను సముద్రము ఒడ్డుకు చేరుకోవడం అసంభవమవుతుంది. నేను తిరిగి కిష్కింధకు వెళ్లకపోతే, పడిన శ్రమ అంతా వృధా అవుతుంది.

అదీ కాకుండా, నేను సీతను కలుసుకోకముందే రాక్షసులు నన్ను పట్టుకుంటే, వచ్చిన పని నెరవేరదు. నా మీద కోపంతో వారు సీతను చంపినా చంపుతారు. అప్పుడు రామకార్యము మొత్తము చెడిపోతుంది." ఈ విధంగా అన్ని విషయములనూ కూలంకషంగా ఆలోచిస్తున్నాడు హనుమంతుడు.

"ఈ ప్రదేశము లంకకు ఒక మూలగా ఉంది. ఇక్కడ కట్టుదిట్టమైన కాపలా ఉంది. ఏ మాత్రం తప్పటడుగు వేసినా తాను చావడం ఖాయం. అప్పుడు మరొకడు వచ్చి రామ కార్యమును పూర్తిచేస్తాడు అని అనుకోడానికి వీలు లేదు. వానరులలో అంతసామర్థ్యము కలవారు లేరు. సీతతో మాట్లాడితే రాక్షసులు నన్ను పట్టుకుంటారు. సీతతో మాట్లాడకుండా వెళ్లిపోతే తనకు ఏ దిక్కూలేదని సీత ప్రాణాలు తీసుకుంటుంది. ఇప్పుడే జడతో ఉరి పోసుకోబోయింది. కాబట్టి ఈ కార్యమును నేర్పుతో చక్కదిద్దాలి.

నా వలన రామ కార్యము చెడింది అన్న అపవాదు నాకు రాకూడదు. ఏది చెయ్యాలో ఏది చెయ్యకూడదో నిర్ణయించుకున్న తరువాత కూడా, అవివేకుడైన దూత వలన కార్యము మొత్తము చెడిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి దూతకు తనకు అంతా తెలుసు అన్న అహం పనికిరాదు. అహంకారులు, దురభిమానులు అయిన దూతలవలన కార్యము సర్వనాశనము అవుతుంది. కాబట్టి బాగా ఆలోచించి ఒక నిర్ణయంతీసుకోవాలి. ఆ నిర్ణయం వలన కార్యం సానుకూలం కావాలి గానీ, చేసిందంతా చెడిపోకూడదు.

అందుకని, ఎవరూ చూడకుండా సీతను కలవాలి. తనను తాను తెలియ పరచుకోవాలి. సీత తనను చూచి భయపడకుండా చూచుకోవాలి. సీతకు తన మీద నమ్మకం కలిగించుకోవాలి. ఇవన్నీ నేర్పుగా సాధించాలి. ఇప్పుడు నేను ఈమెకు కనపడకుండా రాముని గురించి కీర్తిస్తే సీతకు నా మీద నమ్మకం కుదిరే అవకాశం ఉంది. పైగా సీత తనను చూచి భయపడదు. కాబట్టి రాముని గురించి కీర్తించడం ఒక్కటే ప్రస్తుత కర్తవ్యము." అని మనసులో నిశ్చయించు కున్నాడు హనుమంతుడు.

శ్రీమద్రామాయణము

సుందర కాండము ముప్పదియవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

ముప్పది ఒకటవ సర్గ.

ఆలోచించి ఆలోచించి హనుమంతుడు ఒక నిర్ణయానికి వచ్చాడు. చెట్లచాటున కూర్చుని సీతకు వినబడేటట్టుగా రామకథను గానం చెయ్యాలని అనుకున్నాడు. అదేవిధంగా హనుమంతుడు రామ కధను గానం చెయ్యసాగాడు.

"ఇక్ష్వాకు వంశంలో ఒక మహారాజు ఉండేవాడు. ఆయన పేరు దశరథుడు. ఆయన గొప్ప కీర్తి మంతుడు, ఐశ్వర్యవంతుడు. ధర్మాత్ముడు. బలంలో దేవేంద్రుని మించిన వాడు. దశరథుడు గొప్ప రాజర్షి. అహింసావ్రతమును, సత్యవాక్పరిపాలనను అవలంబించిన వాడు. దశరథుడు నాలుగుసముద్రముల మధ్య ఉన్న భూమిని పరిపాలించేవాడు.

ఆ దశరథుని పెద్ద కుమారుని పేరు రాముడు. రాముని ముఖం చంద్రుని వలె ప్రకాశిస్తూ ఉంటుంది. రాముడు మానవులలో ఉత్తముడు. గొప్ప ధనుర్ధారి. రాముడు ఎల్లప్పుడూ ధర్మమునే పాటించేవాడు. ఎల్లప్పుడూ సత్యమునే పలికెడి వాడు. అటువంటి రాముడు, తన తండ్రి ఆదేశము మేరకు అరణ్యవాసమునకు వెళ్లాడు. రాముని వెంట ఆయన భార్య సీత, తమ్ముడు లక్ష్మణుడు, కూడా అరణ్యవాసమునకు వెళ్లారు. పరాక్రమవంతుడైన రాముడు అడవిలో ఉండగా అనేకమంది రాక్షసులను చంపాడు.

రాముడు రాక్షసులను చంపాడు అన్న విషయం రావణునికి తెలిసింది. రాముని మీద ప్రతీకారము తీర్చుకోవాలి అనుకున్నాడు రావణుడు. రావణుడు ఒక మాయమృగమును పంపి, రాముని, లక్ష్మణుని దూరంగా పంపి, సీతను వంచనతో అపహరించాడు. రాముడు సీతను వెతుకుతూ అరణ్యములో తిరుగుతూ, వానర రాజు అయిన సుగ్రీవునితో స్నేహం చేసాడు. సుగ్రీవుని కోరిక మేరకు, రాముడు వాలిని చంపి, సుగ్రీవునికి రాజ్యం ఇప్పించాడు. సుగ్రీవుని ఆజ్ఞమేరకు వానరులు సీతను వెదకడానికి నలుమూలలకూ పంపబడ్డారు. ఆ వానరులలో నేనూ ఒకడిని. సంపాతి చెప్పిన మాటలను బట్టి సీత లంకలో ఉన్నదని తెలుసుకున్నాను. నూరు యోజనముల దూరము కల సముద్రమును దాటిలంకలో ప్రవేశించాను. రాముడు చెప్పిన గుర్తులుబట్టి ఇక్కడ ఈ అశోకవనములో, శింశుపా వృక్షము కింద ఉన్న ఉత్తమురాలు సీత అని గుర్తించాను." అని మౌనం వహించాడు హనుమంతుడు.

హనుమంతుడు పలికిన పలుకులు అన్నీ సీత ఆశ్చర్యంతో వినసాగింది. తల పైకి ఎత్తి చూచింది. శింశుపావృక్షము మీద కొమ్మల చాటున ఉన్న హనుమంతుని చూచింది. రామ కథను హనుమంతుని నోట విన్న సీత ఎంతో సంతోషించింది.

హనుమ మాటలు ఎవరన్నా విన్నారా అని అనుమానంతో అటు ఇటు చూచింది. మనసులో రాముని స్మరించుకుంది. తనకు విముక్తి లభించబోతున్నదని ఆనందించింది సీత.

మరలా తల పైకి ఎత్తి హనుమంతుని వంక చూచింది సీత.

శ్రీమద్రామాయణము

సుందర కాండము ముప్పది ఒకటవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

ముప్పది రెండవ సర్గ.

శింశుపా వృక్షము చెట్ల ఆకుల మాటున, ఆకు పచ్చని శరీర ఛాయతో, తెల్లని వస్త్రమును ధరించి, రామకథను గానం చేసిన హనుమంతుని చూచింది సీత. ఆలోచనలో పడింది. చూడబోతే కోతి. మహాభయంకరంగా ఉన్నాడు. ఆ కోతి ముఖం తేజస్సుతో వెలిగిపోతూ ఉంది. కానీ రామ కథను గానం చేసాడు. ఏమీ అర్థం కాలేదు సీతకు. ఆమెలో భయం ప్రవేశించింది. "రామా! రామా! ఏంటి నాకీ పరీక్ష. ఇతను ఎవరు? ఎందుకొచ్చాడు? నీ చరిత్ర ఎందుకు గానం చేసాడు. కొంపదీసి నేను కనగంటున్నానా! ఇదీ కలా! నిజమా!" అని మనసులోనే మధనపడసాగింది. మరలా తల పైకి ఎత్తి హనుమంతుని వంక చూచింది.

(ఒకసారి మాయ లేడి విషయంలో మోసపోయి అంతులేని కష్టాల్లో ఇరుక్కుంది. అందుకే ఎవర్ని నమ్మడం లేదు సీత.)

సీత తన గురించి ఏమి అనుకుంటూ ఉందో అని సీత వంక తదేకంగా చూస్తున్నాడు హనుమంతుడు. హనుమంతుని చూపులు చూచి సీతకు పైప్రాణాలు పైనే పోయాయి. కాసేపు స్పృహ

తప్పినట్టయింది. అంతలోనే తేరుకుంది. సీతకు హనుమంతుడు కనపడటం స్వప్నంలాగా అనిపించింది.

"వికృతమైన వానరము కలలో కనిపిస్తే మంచిది కాదంటారు. నా రామునికి, లక్ష్మణునికి, నా తండ్రి జనకునికి ఏమీ కాకూడదు. భగవంతుడు వారి నందరినీ క్షేమంగా చూడాలి." అని అనుకొంది. కాని అంతలోనే సీతకు మరో సందేహము వచ్చింది.

"స్వప్నములు నిద్రలో వస్తాయి కదా! నిత్యము కష్టాలు తలచుకుంటూ దు:ఖించే నాకు నిద్రే రానపుడు ఇంక కల రావడం ఏమిటి? కాబట్టి ఇది కలకాదు. నేను సదా రామ నామమును జపిస్తూ ఉంటడం వలన, నాకు ఎవరు ఏమి మాట్లాడినా రామ కధలాగానే వినిపిస్తూ ఉంది. ఇదంతా నా భ్రమ" అని అనుకొంది సీత.

అంతలోనే మరొకసందేహము. "ఇది భ్రమ అయితే మరి ఎదురుగా కనపడుతున్న ఆ వానరము సంగతేమిటి? మనసులో అనుకొన్నది, కలలో కనిపించింది, రూపం ధరించి ఎదురుగా కనపడుతుందా! నాకు ఈ వానరము కనపడుతూ ఉంది కదా! పైగా ఈ వానరుడు మానుష భాషలో స్పష్టంగా మాట్లాడుతున్నాడు. మరి దీన్ని ఏమనాలి? అతడు ఎవరైనా కానీ, అతడు చెప్పిన మాటలు సత్యం కావాలి. నాకు నా రామునకు శుభం జరగాలి." అని మనసులోనే బ్రహ్మదేవునికి, ఇంద్రునికి, సమస్త దేవతలకు నమస్కరించింది సీత.

శ్రీమద్రామాయణము

సుందర కాండము ముప్పది రెండవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందరకాండము

ముప్పది మూడవ సర్గ.

సీత పడుతున్న మనోవేదనను గమనించాడు హనుమంతుడు. ఇలా కాదనుకున్నాడు. చెట్టు దిగాడు. సీత ముందు నిలబడ్డాడు. రెండు చేతులు జోడించి తల మీద పెట్టుకొని వినయంగా నమస్కారం చేసాడు. సీతతో ఇలా అన్నాడు.

“అమ్మా! మీరు ఎవరు? మీ ముఖంలో లక్ష్మీకళ ఉట్టిపడుతూ ఉంది. కాని మాసిన చీర కట్టుకొని ఉన్నారు. ఈ చెట్టుకొమ్మను పట్టుకొని నిలబడి ఉన్నారు. మీరు ఎవరు? మీ రెండు కళ్లనుండి నిరంతరమూ నీళ్లు కారుతున్నాయి. ఎందుకు దు:ఖిస్తున్నారు. నీవు ఏ జాతికి చెందిన స్త్రీవి. దేవకాంతవా! రాక్షస కాంతవా! గంధర్వ కాంతవా! నాగదేవతవా! యక్షిణివా! లేక కిన్నెర కాంతవా! పోనీ రుద్రగణములు, మరుత్ గణములు, వసుగణములు, ఈ గణములకు చెందిన కాంతవా!

నీవు మానవ కాంతవు కావు. దేవతా స్త్రీవి అని అనిపిస్తూ ఉంది. స్వర్గం నుండి భూమికి దిగిన అప్సరసవా! వసిష్టుని భార్య అరుంధతివి కాదు కదా! నీ భర్త మీద కోపంతో ఆయనను వదిలి వచ్చి ఆయన కోసం దు:ఖిస్తున్నావా! లేక పోతే నీ వాళ్లు ఎవరన్నా చనిపోతే వారి కోసరం ఏడుస్తున్నావా! ఆ చనిపోయింది నీ కొడుకా, భర్తా, సోదరుడా లేక నీ తండ్రియా! ఎందుకోసం ఏడుస్తున్నావు?

నీవు ఏడవడం చూస్తుంటే నీవు దేవతా స్త్రీవి కాదని అనిపిస్తూ

ఉంది. ఎందుకంటే దేవతలకు ఏడుపురాదు కదా! మరి రాజలక్షణములు కలిగిన మానవ కాంతవా! నీ ముఖ కళవళికలు, నీ శరీర లక్షణాలను బట్టి నీవు క్షత్రియ కాంతవనీ, చక్రవర్తి భార్యవు అనీ నాకు అనిపిస్తూ ఉంది. అవునూ! నువ్వు జనస్థానము నుండి రావణుడు అపహరించి తీసుకొని వచ్చిన సీతవు కావు కదా! నీ ముఖంలో కనపడుతున్న దీనత్వము, శోకము, నీ శరీర సౌందర్యము, నీ పవిత్రత చూస్తుంటే నీవు రాముని భార్య సీత అని నాకు అనిపిస్తూ ఉంది. నీవు రాముని భార్య సీతవే కదా! " అని ఊరుకున్నాడు

హనుమంతుడు. సీతకు ఇంక తన గురించి తాను చెప్పుకోక తప్పలేదు. హనుమంతుని చూచి ఇలాఅంది.

"అవును. నువ్వు చెప్పింది నిజమే. నేను దశరథమహారాజు కోడలిని. విదేహ మహారాజు జనకుని కూతురిని. రాముని భార్యను సీతను. నా వివాహము అయిన తరువాత నేను అయోధ్యలో పన్నెండు సంవత్సరములు నా భర్తతో సకల రాజభోగములు అనుభవించాను. పదమూడవ సంవత్సరంలో దశరథ మహారాజు రామునికి పట్టాభిషేకము చేయ నిశ్చయించాడు.

రాముని పట్టాభిషేకానికి ఏర్పాట్లు జరుగుతుంటే, దశరథుని మూడవ భార్య కైక దశరథునితో "రామునికి పట్టాభిషేకము జరిగితే నేను ఆహారము నీరు ముట్టను. బలవంతంగా ప్రాణం తీసుకుంటాను. నీవు నాకు ఇచ్చిన మాట నిలబెట్టుకోదలచుకుంటే రాముని పదునాలుగేళ్లు అడవులకు పంపు. " అని శపథం చేసింది.

ఆమాటలు విన్న దశరథుడు మూర్ఛపోయాడు. మూర్ఛనుండి తేరుకొని, రామునికి వారసత్వంగా సంక్రమించిన రాజ్యాధికారమును తిరిగి తనకు ఇవ్వమని రాముని అడిగాడు దశరథుడు. రాజ్యపట్టాభిషేకము కంటే కూడా తండ్రి మాటకు విలువ ఇచ్చాడు రాముడు. ఒకరికి ఇవ్వడమే కానీ, ఎవ్వరినుండీ ఏదీ తీసుకోని రాముడు, తనకు సంక్రమించిన రాజ్యాధికారమును దశరథునికి ఇచ్చివేసాడు. రాజ్యాధికారమును త్యజించిన రాముడు నార చీరలు ధరించి అడవులకు బయలు దేరాడు. రాముడు లేనిదే నేను బతుకలేనని, నేను కూడా రాముని వెంట అడవులకు బయలుదేరాను. అన్నగారికి రక్షణగా రాముని తమ్ముడు లక్ష్మణుడు కూడా రాముని వెంటఅడవులకు వచ్చాడు.

ఆ ప్రకారంగా మేము ముగ్గురము అరణ్యవాసము చేస్తున్నాము. మేము ముగ్గురమూ దండకారణ్యములో ఉండగా, రావణుడు అనే రాక్షసుడు నన్ను అపహరించాడు. ఇప్పుడు రావణుడు నాకు రెండుమాసములు సమయము ఇచ్చాడు. రావణుడు ఇచ్చిన రెండుమాసములు గడువు తరువాత నేను ప్రాణత్యాగము చేస్తాను." అని తన గురించి క్లుప్తంగా చెప్పింది సీత.

శ్రీమద్రామాయణము
సుందర కాండము ముప్పది మూడవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

ముప్పది నాలుగవ సర్గ.

సీత పలికిన పలుకులు అన్నీ శ్రద్ధగా విన్నాడు హనుమంతుడు. సీతతో ఇలా అన్నాడు.

"ఓ వైదేహీ! నేను రాముడు పంపగా దూతగా నీ వద్దకు వచ్చాను. రాముడు క్షేమంగా ఉన్నాడు. నీ క్షేమ సమాచారములు తెలుసుకొని రమ్మని రాముడు నన్ను నీ వద్దకు పంపాడు. రాముని తమ్ముడు లక్ష్మణుడు కూడా ఆయన పక్కనే ఉన్నాడు. లక్ష్మణుడు కూడా నీకు తన అభివాదములు తెలుపమన్నాడు." అని అన్నాడు హనుమంతుడు.

రామలక్ష్మణుల క్షేమవార్తలు విన్న సీత ఆనందంతో పొంగి పోయింది. "మానవుడు బతికి ఉంటే నూరు సంవత్సరములకైనా క్షేమకరమైన వార్తలు వింటాడు అని లోకోక్తి. నేను ఇన్నిరోజుల నుండి రాముని క్షేమ వార్తల కోసరము ఎదురు చూస్తున్నాను. నీ వలన రామలక్ష్మణుల క్షేమము గురించి తెలుసుకున్నాను. నాకు చాలా సంతోషంగా ఉంది." అని పలికింది సీత.

హనుమంతుడు ఆమె దగ్గరగా వెళ్లాడు. హనుమంతుడు దగ్గర దగ్గరగా రావడం చూచి మరలా సీత మనసులో అనుమానం పొడసూపింది. వీడు మారువేషములో ఉన్న రావణుడు కాదు కదా! అని అనుమా నించింది.

"అయ్యో! నేనెంత మందమతిని. నా విషయాలన్నీ అనవసరంగా ఇతనికి చెప్పాను. ఇతడు మాయ వేషంలో వచ్చిన రావణుడు. సందేహం లేదు. లేకపోతే నా దగ్గరగా ఎందుకు వస్తాడు. నేను ఇతనికి దూరంగా ఉండాలి." అనీ సీత దూర దూరం గా జరిగి కూర్చుంది.

హనుమంతునికి ఏమీ తోచలేదు. సీతమ్మ తనను అనుమానిస్తూ ఉంది. ఆ అనుమానం తీర్చడం ఎలాగా అని ఆలోచిస్తున్నాడు. రెండు చేతులు ఎత్తి సీతమ్మకు నమస్కారం పెట్టాడు అంతకన్నా ఏమీ చెయ్యలేక. కాని సీత భయంతో వణికి పోతూ ఉంది. కాని తనకు నమస్కరించుచున్న హనుమను చూచి సీత భయం కొద్దిగా తగ్గింది. రావణుడు అయితే నమస్కరించడు కదా! అని అనుకొంది. అందుకని హనుమతో ఇలాఅంది.

"అయ్యా! నీవు ఎవరవో నాకు తెలియదు. నీవు కనుక మాయావేషంలో వచ్చిన రావణుడివే అయితే వెంటనే వెళ్లిపో. నా నిర్ణయం నీకు ముందే చెప్పాను. మరలా మరలా వచ్చి నాబాధను పెంచకు. నీకు మంచిది కాదు. నువ్వు ఎవ్వరవో నాకు బాగా తెలుసు. నేను ఆశ్రమంలో ఉండగా పవిత్రమైన సన్యాసి రూపంలో వచ్చావు. నన్ను అపహరించావు. ఇప్పుడు ఈ వానర రూపంలో వచ్చావు. నువ్వు ఆ రావణుడివే. సందేహము లేదు. ఇలా మాటి మాటికీ వచ్చి నన్ను ఎందుకు బాధ పెడతావు. నీ వంటి వాడికి ఒక స్త్రీ కోసరం ఇలా చెయ్యడం మంచిది కాదు. శోభనివ్వదు." అని దూరంగా జరిగింది. కాని అంతలోనే మరొక ఆలోచన సీతమ్మ మదిలో మెదిలింది. తనలో తాను అనుకుంటున్నట్టు బయటకు అనుకుంది.

"కాని, ఎందుకో, నా మనస్సులో, నువ్వు రావణుడివి కాదు అని అనిపిస్తూ ఉంది. ఎందుకంటే మొదట నిన్ను చూడగానే నా మనసులో అనుకోకుండా నాకు ఆనందం కలిగింది. రావణుని చూస్తే నాకు అసహ్యము తప్ప ఆనందం కలుగదు. నీవు చెప్పినట్టు నీవు రాముని దూతగా వచ్చినట్టయితే చాలా సంతోషము. నీవు గానం చేసిన రామ కథ నాకు చాలా ఇష్టము. ఎన్ని సార్లు విన్నా తనివి తీరదు.

ఓ బాల వానరమా! నాకు ఇంకా రాముని గురించి చెప్పవా! విని సంతోషిస్తాను. నాకు ఇదంతా ఒక స్వప్నము వలె తోస్తూ ఉంది. ఎంతో కాలము కింద రావణునిచేత అపహరింపబడిన నాకు దు:ఖభారంతో నిద్రపట్టడంలేదు. స్వప్నములు కూడా రావడంలేదు. కనీసం స్వప్నములో అయినా రాముడు నాకు కనపడితే ఆ ఆనందంతో నేను రాముని కొరకు ఎంత కాలము అయినా వేచి ఉంటాను. నాకు ఆ భాగ్యము లేదు. కానీ ఇప్పుడు రామదూతగా నువ్వు కనపడు తున్నావు. ఇది స్వప్నము అయినా నిజము అయినా నాకు సంతోషమే!" అని పలికింది.

అంతలో మరలా తనలోతాను ఇలా అనుకొంది. "నాకేమైనా పిచ్చి పట్టిందా! వీడితో ఇలా మాట్లాడుతున్నాను. లేక ఉన్మాదంతో ఇలా పలికానా! కాదు కాదు. నాకు ఏమీ కాలేదు. నేను బాగానే ఉన్నాను. నేను నేనే. నా ఎదుట ఈ వానరము నిలబడి ఉంది. నేను మంచి స్పృహలోనే ఉన్నాను. ఎలాంటి ఉన్మాదస్థితిలో లేను. నా ఎదుట ఉన్నది నిజంగా వానరమే." అని పరి పరి విధాలా ఆలోచించింది.

కానీ ఆమె మనసుకు ఎందుకో హనుమంతుని నమ్మ బుద్ధికావడంలేదు. “సందేహం లేదు. వీడు వానరరూపంలో వచ్చిన రావణుడే.” అని నిర్ధారించుకుంది సీత. వీడు రావణుడు అయినప్పుడు వీడితో మాట్లాడటం అనవసరము అని హనుమతో మాట్లాడకుండా ఊరుకొంది.

సూక్ష్మగ్రాహి అయిన హనుమంతుడు సీత మనసులో మెదిలే ఆలోచనలను పసిగట్టాడు. సీత తనను నమ్మడం లేదు అని నిర్ధారించు కున్నాడు. ఇప్పుడు రాముని గురించి చెప్పడం, రాముని స్తుతించడం తప్ప వేరు మార్గం లేదు అని అనుకొన్నాడు. సీత వినేట్టు ఇలా అంటున్నాడు.

“రాముడు ఎంత తేజోవంతుడు. ఆయన తేజస్సు సూర్యుని తేజస్సుతో సమానమైనది. అంతే కాదు రాముడు చంద్రుని వలె చల్లని వెన్నెల వంటి తన చూపులతో లోకాలకు ఆహ్లాదాన్ని కలిగిస్తాడు. రాముడు కుబేరుని వలె గొప్ప ఐశ్వర్యవంతుడు. విష్ణువు వలె గొప్ప కీర్తి కలవాడు. రాముడు ఎల్లప్పుడూ సత్యములే పలుకుతాడు. బృహస్పతి వలె బుద్ధిమంతుడు. మంచి రూపవంతుడు. మన్మధునికి రూపం వస్తే ఎలా ఉంటాడో అలా ఉంటాడు రాముడు. రామునికి సాధారణంగా కోపం రాదు. సంహరించవలసిన వారిని సంహరించవలసినపుడు, కోపం తెచ్చుకుంటాడు. ఆ కార్య అయిపోగానే మరలా కోపాన్ని విడిచిపెడతాడు. రాముడు గొప్ప ధనుర్ధారి. మహారథుడు.

ఓ సీతమ్మ తల్లీ! ఈ తుచ్ఛుడైన రావణుడు మాయా మృగమును ప్రయోగించి నీ రాముని దూరంగా పంపి, నిన్ను

అపహరించాడు కదా! ఈ రావణునికి ఎట్టి దుర్గతి పట్టబోతూ ఉందో కళ్లారా చూస్తావు. ఓ సీతమ్మ తల్లీ! ఏ రాముడైతే అతి త్వరలో లంకకు వచ్చి తన బాణములతో రావణుని చంపి నిన్ను రక్షిస్తాడో ఆ రాముడే నన్ను నీ వద్దకు పంపాడు. నన్ను నమ్ము. రాముడు నిన్ను తలచుకుంటూ నీ వియోగముతో చాలా బాధపడుతున్నాడు. నీ క్షేమము గురించి తెలుసుకొని రమ్మని నన్ను పంపాడు.

రాముడు వానరరాజు అయిన సుగ్రీవునితో స్నేహము చేసాడు. ఆ సుగ్రీవుడు కూడా నీ క్షేమము అడగమన్నాడు. మా అందరి అదృష్టము కొద్దీ నీవు రాక్షసుల చెరలో ఉన్ననూ జీవించి ఉన్నావు. రామ,లక్ష్మణ,సుగ్రీవులు అనుక్షణం నిన్ను తలచుకుంటూ నీ గురించి ఆందోళనపడుతున్నారు. నీకు ఈ చెర ఎంతో కాలము ఉండదు. కోట్లాది వానర వీరులతో రామలక్ష్మణులు, సుగ్రీవుడు లంకకు వచ్చి, రావణుని చంపగలరు.

నేను వానర రాజు సుగ్రీవుని మంత్రిని. నా పేరు హనుమంతుడు. ఇది నా నిజస్వరూపము కాదు. హ్రస్వ స్వరూపము. నేను నూరుయోజనముల దూరం ఉన్న సముద్రమును దాటి ఈ లంకలో ప్రవేశించాను. నిన్ను చూడటానికి ఇక్కడకు వచ్చాను. రావణుడు ఇక్కడకు రాక ముందు నుంచే ఈ చెట్టు మీద ఉన్నాను. రావణుడు పలికిన పలుకులు, ఈ రాక్షసస్త్రీల బెదిరింపులు అన్నీ విన్నాను.

ఓ సీతాదేవీ! ఇప్పటికైనా నన్ను నమ్ము. నేను రావణుడను కాను. వానరుడను. నీ సందేహమును విడిచి పెట్టు." అని పలికాడు హనుమంతుడు.

శ్రీమద్రామాయణము
సుందర కాండము ముప్పది నాలుగవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము
ముప్పది ఐదవ సర్గ.

హనుమంతుడు ఎన్ని చెప్పినా సీత మనసులో ఉన్న సందేహము తీరడం లేదు. ఏమో! మరలా తాను మోసపోతున్నానేమో! అని మనసులో మథనపడుతూ ఉంది సీత. అందుకని హనుమంతునితో ఇలా అంది.

"నీవు రాముని వద్దనుండి వచ్చాను అన్నావు కదా! నీవు రాముని ఎప్పుడు కలిసావు. నీకూ రామునికి సంబంధము ఎలా కలిగింది? నీకు లక్ష్మణుడు ఎలా తెలుసు? మీరు వానరులు. రామలక్ష్మణులు నరులు, వారికీ మీకూ స్నేహం ఎలా కుదిరింది? నువ్వు రాముని, లక్ష్మణుని, నిజంగా చూస్తే రాముడు ఎలా ఉంటాడు. లక్ష్మణుడు ఎలా ఉంటాడు. వివరించి చెప్పు. అప్పుడే నేను నిన్ను నమ్ముతాను." అని అడిగింది సీత.

సీతతో హనుమంతుడు ఇలా చెప్పసాగాడు. "నీకు రాముని గురించి బాగా తెలుసు కాబట్టి రాముని రూపు రేఖల గురించి అడుగుతున్నావు. నేనూ రాముని చూచాను కాబట్టి రాముని గురించి చెబుతాను విను.

రాముని కన్నులు కమలముల వలె ఉంటాయి. రాముడు మనోహరుడు. అందరి మనస్సులనూ తన మంచితనంతో హరించేవాడు. మంచి రూపవంతుడు. మంచి నేర్పుకలవాడు. ఇంకా రాముడు తేజస్సులో సూర్యునితోనూ, బుద్ధిలో బృహస్పతి తోనూ, ఓర్పులో భూదేవితోనూ, కీర్తిలో దేవేంద్రునితోనూ సమానుడు. రాముడు తన పరాక్రమంతో తన వారిని రక్షిస్తాడు. శత్రువులను సంహరిస్తాడు.

ఈ లోకంలో ఉన్న నాలుగు వర్ణముల వారిని సమానముగా రక్షిస్తాడు. అన్ని వర్ణముల వారికీ కట్టుబాట్లు ఏర్పరచి జనులందరూ ఆ కట్టుబాట్ల ప్రకారము నడుచుకొనేటట్లు చేస్తాడు. రాముడికి ఏపనికి ఏ ఫలితము వస్తుందో తెలుసు. అందుకని సత్కర్మలనే ఆచరిస్తాడు. రాముడు రాజనీతిజ్ఞుడు. బ్రాహ్మణులను గౌరవిస్తాడు. రాముడు సకల విద్యలు నేర్చినవాడు. మంచి వినయము కలవాడు. రాముడు యజుశ్శాఖాధ్యాయి. వేదములు చదివిన వారిచేత పూజింపబడేవాడు. వేద, వేదాంగములను చదివినవాడు. విశేషించి ధనుర్వేదమును చక్కగా అభ్యాసించాడు.

రాముడు ఆజానుబాహుడు. విశాలమైన భుజములు కలవాడు. రాముడు శ్యామవర్ణములో ఉంటాడు. రాముడు విశాలమైన

వక్షస్థలము కలవాడు. దీర్ఘబాహుడు. రామునికి అన్ని అవయవములు సమానంగా తీర్చిదిద్దినట్టు ఉంటాయి. రాముని పొట్టమీద మూడు రేఖలు ఉన్నాయి. సాముద్రికశాస్త్రములో చెప్పబడిన శుభలక్షణములు అన్నీ రాముని హస్తరేఖలలో పాద ముద్రలలో ఉన్నాయి. రాముడు నడుస్తుంటే సింహము, ఏనుగు, ఎద్దు నడిచినట్టు ఉంటుంది. రాముని శరీర అవయవములు అన్నీ గుండ్రంగా పద్మము ఆకారంలో ప్రకాశిస్తూ ఉంటాయి. రాముని తేజస్సు, కీర్తి, సంపద మూడులోకములలో ప్రసిద్ధిచెందాయి.

రాముని యొక్క మాతృవంశము పితృవంశము పునీతమైనవి. రాముడు పురుషార్థములైన ధర్మ, అర్థ, కామ, మోక్షములను చక్కగా పాటిస్తాడు. రాముడు సత్యము పలకడం లోనూ, ధర్మాచరణంలోనూ ఆసక్తి కలవాడు. రాముడు తన శరణు కోరిన వారిని అనుగ్రహిస్తాడు. రామునికి యుక్తాయుక్త జ్ఞానము ఎక్కువ. రాముడు అందరితోనూ చాలా ప్రియంగా మాట్లాడతాడు. ఇంక లక్ష్మణుడు పరాక్రమ వంతుడు. ఇప్పటి వరకూ ఎవరిచేతిలోనూ ఓడిపోలేదు.

రామలక్ష్మణులు నీ కోసం వెదుకుతూ మా దగ్గరకు వచ్చారు. నిన్ను చూడాలని ఆతురత పడుతున్నారు. నేను, మా రాజు సుగ్రీవుడు ఋష్యమూక పర్వతము మీద ఉంటాము. రాముడు, లక్ష్మణుడు నిన్ను వెతుక్కుంటూ ఋష్యమూక పర్వతము వద్దకు వచ్చారు. మేము వారిని చూచాము. మా మహారాజు సుగ్రీవుడు తన అన్న వాలితో రాజ్యము నుండి తరిమివేయబడ్డాడు. రాజ్యభ్రష్టుడైన సుగ్రీవుని మేము సేవిస్తున్నాము.

ఆసమయంలో నారచీరలు కట్టుకొని ధనుస్సు, బాణములు చేతులలో ధరించి వస్తున్న రామలక్ష్మణులను నేను సుగ్రీవుడు చూచాము. సుగ్రీవుడు వారిని చూచి భయపడి కొండశిఖరము ఎక్కికూర్చున్నాడు. నన్ను రామలక్ష్మణుల వద్దకు పంపాడు. నేను రామలక్ష్మణుల వద్దకు వెళ్లి నమస్కరించాను. సుగ్రీవుని గురించి జరిగింది జరిగినట్టు చెప్పాను. నేను వారిని నా వీపు మీద ఎక్కించుకొని సుగ్రీవుని వద్దకు తీసుకొని వెళ్లాను.

రాముడు సుగ్రీవుడు ఒకరితో ఒకరు మాట్లాడుకొని ఒకరి కష్టసుఖములు మరొకరితో పంచుకున్నారు. ఇద్దరికీ మైత్రి కుదిరింది. ఇద్దరూ ఒకే విధమైన దు:ఖములో ఉన్నారు. రాముని భార్య సీతను రావణుడు అపహరించాడు. సుగ్రీవుని భార్య రుమను అతని అన్న వాలి లాక్కున్నాడు. రామునికి రాజ్యము పోయింది. సుగ్రీవుడు కూడా రాజ్యభ్రష్టుడు అయ్యాడు. ఒకరికి ఒకరు సాయం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.

ఓ సీతమ్మ తల్లీ! నిన్ను రావణుడు అపహరించి తీసుకొని పోవునపుడు నీవు నీ ఉత్తరీయమును చించి నీ ఆభరణములను మూటకట్టి కింద జారవిడిచావు. ఆ మూట అదృష్టవశాత్తు మా దగ్గర పడింది. మేము ఆ మూటను రామునికి చూపించాము. ఆ ఆభరణములను చూచి రాముడు మూర్ఛపోయాడు. నిన్ను తలచుకుంటూ పరిపరివిధముల శోకించాడు. ఆ ఆభరణములు అప్పటిదాకా అణచుకొన్న రాముని శోకాగ్నిని మరలా ప్రజ్వరిల్లజేసాయి.

సుందర కాండము

మేము రాముని మా శాయశక్తులా ఓదార్చాము. అప్పటినుండి రాముడు నిన్ను తలచుకుంటూ, నీ ఆభరణములను చూస్తూ ఏడుస్తున్నాడు. రాముడు నిద్ర ఆహారములను విడిచి పెట్టి నిన్నే తలచుకుంటున్నాడు. ఓ సీతమ్మ తల్లీ! రాముడు వెంటనే వచ్చి రావణుని సంహరించి నిన్ను చేరుకుంటాడు.

-- రాముడు, సుగ్రీవుడు ఒకరికి ఒకరు సాయం చేసుకోవాలని ఒప్పందం చేసుకున్నారు. ఆ ఒప్పందం ప్రకారము రాముడు వాలిని చంపి, సుగ్రీవునికి రాజ్యమును, అతని భార్యను ఇప్పించాలి. దానికి బదులుగా సుగ్రీవుడు నీ కోసం వానరులను పంపి వెతికించి, నీ జాడ తెలుసుకోవాలి. తరువాత రావణుని ఓడించి నిన్ను పొందడంలో రామునికి సాయపడాలి.

ఆ ఒప్పందము ప్రకారము రాముడు వాలిని చంపి, సుగ్రీవుని కిష్కింధకు రాజును చేసాడు. అతని భార్య రుమను అతనికి అప్పగించాడు. సుగ్రీవుడు తన ఒప్పందము ప్రకారము నిన్ను వెదకడానికి వానర వీరులను నాలుగు దిక్కులకు పంపాడు. నన్ను ఇంకా కొంతమంది వానరులను నిన్ను వెదకడానికి దక్షిణ దిశగా పంపాడు. వాలి కుమారుడు అంగదుడు మాకు నాయకుడు.

సుగ్రీవుడు మాకు మాసము రోజులు గడువు ఇచ్చాడు. నిన్ను వెదుకుతూ మేము వింధ్యపర్వత ప్రాంతములో ఒక బిలములో దారి తప్పాము. అక్కడే చాలారోజులు గడిచిపోయాయి. నీ జాడ తెలియలేదు. మాకు సుగ్రీవుడు ఇచ్చిన గడువు దాటిపోయింది. ఒట్టి చేతులతో వెళితే సుగ్రీవుడు మాకు మరణదండన విధిస్తాడు. అందుకని మేము

ప్రాయోపవేశము చేయాలని నిర్ణయించుకున్నాము.

ఆ సమయంలో మా దగ్గరకు ఒక పక్షిరాజు వచ్చాడు. ఆయన పేరు సంపాతి. ఆయన జటాయువుకు సోదరుడు. రామలక్ష్మణుల నుండి మేము, నిన్ను రావణుడు అపహరించడం, జటాయువును రావణుడు చంపడం గురించి విని ఉన్నాము. ఆ విషయం మేము సంపాతికి చెప్పాము. సంపాతికి తన సోదరుని చంపిన రావణుని మీద కోపం వచ్చింది. నీవు రావణుని ఆలయము నందు ఉన్నట్టు సంపాతి మాకు చెప్పాడు.

ఆ మాటలు విన్న మేము, అంగదుడు అక్కడి నుండి బయలేదేరాము. సముద్ర తీరము చేరుకున్నాము. కాని విశాలమైన సముద్రమును చూడగానే దానిని ఎలా దాటాలి అని అందరం చింతిస్తున్నాము. నేను మాత్రము నా శక్తి యుక్తులు ఉపయోగించి, నూరుయోజనముల దూరం ఉన్న సముద్రమును లంఘించాను. రాత్రి లంకలో ప్రవేశించాను. లంక అంతా గాలించాను. రావణుని అంత:పురము అంతా వెతికాను. నీవు కనపడలేదు. ఈ అశోక వనమును వెతుకుతుంటే నీవుకనిపించావు. ఇదీ జరిగింది.

నేను వాయుదేవుని కుమారుడను. రాముని దూతను. సుగ్రీవుడు పంపగా ఇక్కడకు వచ్చాను. కానీ మాయావి రావణుని కాను. నన్ను నమ్ము. నీ భర్త రాముడు, రాముని తమ్ముడు లక్ష్మణుడు క్షేమంగా ఉన్నారు. నేను కూడా కామ రూపుడను. నా ఇష్టం వచ్చిన రూపం ధరించగలవాడను. ఇప్పుడు ఈ చిన్ని వానరరూపంలో

ఉన్నాను. నేను వెంటనే వెళ్లి సముద్రము ఆవల ఒడ్డున ఉన్న వానరులకు నీ గురించి చెప్పి వారి దు:ఖమును తొలగించాలి.

నీకోసం లంక అంతా గాలించి నీవు కనపడకపోతే నేను కూడా ప్రాయోపవేశము చేద్దామని నిర్ణయించుకున్నాను. కానీ నేను సముద్రమును లంఘించి లంకకు చేరుకోడానికి పడ్డ శ్రమ వృథా కాలేదు. నిన్ను చూడగలిగాను. నేను చాలా అదృష్టవంతుడను. నాకు చాలా సంతోషంగా ఉంది.

నా తండ్రి పేరు కేసరి. నా తండ్రి దేవతలు, ఋషుల కోరిక మేరకు శంబసాదనుడు అనే రాక్షసుని చంపాడు. నేను నా తండ్రి భార్య అయిన అంజనా దేవికి, వాయుదేవుని వలన జన్మించాను. ఇంద్రుని వజ్రాయుధ దెబ్బకు నా దవడ విరిగిపోవడంతో నాకు హనుమంతుడు అనే పేరువచ్చింది. ఓ సీతాదేవీ! నీకు నమ్మకం కలిగించడానికి నీకు ఇదంతా చెప్పాను. తరువాత నీ ఇష్టము." అని చెప్పి ఊరుకున్నాడు హనుమంతుడు.

హనుమంతుడు చెప్పిన విషయములను సావధానంగా విన్న సీతకు హనుమంతుని మీద నమ్మకం కుదిరింది. చాలారోజులకు సీత కంటి వెంట ఆనందభాష్పములు రాలాయి. సీత ముఖము ఆనందంతో వెలిగిపోయింది. హనుమంతుడు నిజంగా వానరుడేననీ, మాయారూపంలో ఉన్న రాక్షసుడు కాదనీ నమ్మింది.

సీత ముఖకళవళికలు చూచిన హనుమంతుడు సీత తనను నమ్మినట్టు ధృవపరచుకొన్నాడు. అప్పుడు సీతతో ఇలా అన్నాడు.

"సీతాదేవీ! జరిగినది అంతా నీకు చెప్పాను కదా! నేను నీకు ఇంకా ఏమి చెయ్యాలో చెప్పు. ఇంక నేను రాముని వద్దకు వెళ్లాలి. నీ గురించి రామునికి తెలియజెయ్యాలి." అని అన్నాడు హనుమంతుడు.

శ్రీమద్రామాయణము

సుందరకాండము ముప్పది ఐదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

ముప్పది ఆరవ సర్గ.

అంతా చెప్పి సీత వంక చూచాడు హనుమంతుడు. సీతకు ఇంకా తన మీద నమ్మకం కలిగినట్టులేదు అని అర్థం అయింది హనుమంతునికి. అప్పుడు హటాత్తుగా రాముడు తనకు ఆనవాలుగా ఇచ్చిన ఉంగరము గుర్తుకు వచ్చింది. వెంటనే తాను భద్రపరచిన రాముని ఉంగరమును బయటకు తీసాడు. సీతతో ఇలా అన్నాడు.

"అమ్మా! సీతా! నేను రాముని వద్ద నుండి వచ్చాను, రాముని దూతను అని నిరూపించుకోడానికి నాకు రాముడు ఇచ్చిన ఉంగరమును చూడు. దీనిని నీకు ఆనవాలుగా చూపించమని నాకు రాముడు ఇచ్చాడు." అంటూ హనుమంతుడు రాముడు తనకు ఇచ్చిన ముద్రికను సీతమ్మకు ఇచ్చాడు.

సీత సంభ్రమంతో ఈ ముద్రికను తీసుకొంది. అది రామునిదే. సందేహము లేదు. సీత ఆ ముద్రికను కళ్లకు అద్దుకొంది.

తాను రాముని చేరినట్టు రాముని చెంత ఉన్నట్టు ఆనందపడింది. సీతమ్మ మొహంలో ఆనందం చూచి హనుమంతుడు ఎంతో ఆనందించాడు. సీత మొహంలో నునుసిగ్గులు ఆవరించాయి. హనుమంతుని వంక ప్రశంసా పూర్వకంగా చూచింది.

"ఓ వానరోత్తమా! సందేహము లేదు. నీవు రాముని వద్ద నుండి వచ్చావు. నీవు మహా పరాక్రమ వంతుడివి. లేకపోతే నూరుయోజనముల సముద్రము దాటి ఈ రాక్షస రాజ్యంలోకి ప్రవేశించలేవు. నీకు రావణుని వలన అసలు భయం ఉన్నట్టు లేదు. నీ మొహంలో ధైర్యం ఆత్మవిశ్వాసం కనపడుతున్నాయి. నీవు సామాన్య వానరుడవు కావు. రాముడు నిన్ను నా వద్దకు పంపాడు అంటేనే నీ పరాక్రమము ఏపాటిదో అర్థంఅవుతూఉంది.

నిన్నూ, నీ శక్తిని, నీ పరాక్రమమును, నీ బుద్ధికుశలతను పరీక్షించకుండా రాముడు నిన్ను పంపిఉండడు. నేనెంతో అదృష్ట వంతురాలిని. రాముని యొక్క, లక్ష్మణుని యొక్క క్షేమమును తెలుసుకున్నాను. వారు క్షేమముగా ఉన్నారని తెలిసి నా మనసు కుదుటపడింది. రాముడు క్షేమంగా ఉంటే, అతని కోపము ప్రళయాగ్నిరూపంలో ప్రజ్వరిల్లి ఇంకా ఈ లంకను ఎందుకు దహించలేదు? అని అనుమానపడ్డాను. కాని అది సరి కాదు. వారు పరాక్రమం వంతులు కాక కాదు. నా కష్టములు తీరు కాలము సమీపించలేదు. అందుకని వారు నన్ను విడిపించుటకు ఇంకా రాలేదు.

9హనుమా! రాముడు నా గురించి దు:ఖిస్తున్నాడా! రావణుని మీద దండెత్తడానికి సకల సన్నాహాలు చేసుకుంటున్నాడా! లేక నా మీద దిగులుతో ఏమీ చెయ్యడం లేదా! రాముడు తాను నిర్వర్తించవలసిన కార్యములను ఏ మాత్రమూ దీనత్వమూ భ్రాంతి లేకుండా చేస్తున్నాడా! రాముడు సామ,దాన,బేధ,దండోపాయములను సమర్ధవంతంగా ఉపయోగిస్తున్నాడు. శత్రువులను జయించడానికి మిత్రులతో స్నేహంగా ఉంటున్నాడా! రాముడు మిత్రులందరూ మంచి వారే కదా! వారు రామునికి సాయం చేయువారే కదా! రాముని మిత్రులు రాముని గౌరవ భావంతో చూస్తున్నారు కదా!

రాముడు నిత్యమూ దేవతలను ఆరాధిస్తున్నాడు కదా! పురుష ప్రయత్నానికి దైవయత్నం తోడు చేసుకొని ప్రవర్తిస్తున్నాడా! హనుమా! రాముడు నా గురించి తలచుకుంటున్నాడా. నేను దగ్గరలేను కదా అని నన్ను మరిచిపోయాడా! రాముడు ఇక్కడకు వచ్చి నన్ను ఈ రాక్షసుని చెరనుండి విడిపించే ప్రయత్నం ఏమన్నా చేస్తున్నాడా! లేదా! ఓహనుమా! రాముడు చిన్నప్పటి నుండి రాజ భోగములకు అలవాటు పడ్డాడు. ఇటువంటి కష్టములు ఉంటాయని కూడా ఆయనకు తెలియదు. అయినా నేను పక్కన ఉన్నాను కాబట్టి ధైర్యంగా ఉన్నాడు. ఇప్పుడు నేను కూడా పక్కన లేను కదా! మరి రాముడు దు:ఖభారంతో కృంగి పోతున్నాడా! రాముడు నా గురించి శోకిస్తున్నాడా లేక నన్ను ఈ శోకసముద్రము నుండి గట్టెక్కించే ప్రయత్నం ఏమన్నా చేస్తున్నాడా!

హనుమా! రాముడు కిష్కింధలో ఉన్నప్పుడు అయోధ్యనుండి సుమిత్ర గురించి కానీ కౌసల్యగురించి గానీ వార్తలు ఏమన్నా

వస్తున్నాయా! నన్ను రావణుడు అపహరించిన వార్త భరతునికి చేరినదా! నన్ను రావణుని చెరనుండి విడిపించడానికి భరతుడు తన అశేషసైన్యమును పంపుతున్నాడా! సుగ్రీవుడు తన వానర సైన్యముతో లంకమీదికి దండెత్తుతాడు కదా! నన్ను విడిపిస్తాడు కదా! లక్ష్మణుడు తన వాడి అయిన బాణములతో రావణుని, అతని సైన్యమును హతమారుస్తాడు కదా! రావణుడు రణరంగంలో కూలిపోయినపుడు వాడి శరీరమును ఎప్పుడు చూస్తానో కదా!

హనుమా! ఎప్పుడూ పద్మము వలె వికసించి ఉన్న రాముని ముఖం ఇప్పుడు వాడిపోయిందా! హనుమా! రాముడు తన తండ్రి మాట ప్రకారము నన్ను అడవికి తీసుకొని పోయి అడవులలో రాళ్లమీద, ముళ్లమీద నడిపించినప్పుడు కూడా నేను బాధ పడలేదు. అటువంటి రాముడు ఇప్పుడు నాగురించి బాధపడుతున్నాడా! లేక ధైర్యంగా ఉన్నాడా! రాముడు తన జీవితంలో నన్నే అధికంగా ప్రేమించాడు. నా ప్రేమముందు తన తల్లి కౌసల్య మీద ఉన్న ప్రేమగానీ, తండ్రి దశరథుని మీద ఉన్న ప్రేమగానీ సాటి రాదు. ఆ కారణం వలననే నేను రాముని కొరకు ప్రాణములు అరచేతిలో పెట్టుకొని ఈ రాక్షసుని చెరలో జీవించుచున్నాను." అని పలికి రాముని తలచుకుంటూ ఉంది సీత.

సీత మాటలు విన్న హనుమంతుడు సీతకు నమస్కరించి ఇలా అన్నాడు. "ఓ సీతా దేవీ! నీవు ఇక్కడ ఉన్నట్టు, నీవు ఇన్ని కష్టములు పడుతున్నట్టు రామునికి తెలియదు. అందుకనే రాముడు ఇక్కడకు రాలేదు. నేను పోయి రామునికి నీ గురించి చెప్పగానే రాముడు వెంటనే వానరసైన్యముతో ఇక్కడకు వస్తాడు. నిన్ను ఈ రాక్షసుని చెరనుండి విడిపిస్తాడు. రాముడు తన బాణములతో సముద్రమును

ఎండించి, సముద్రమును దాటి లంకకు రాగలడు. ఆ సమయంలో ఎవరు అడ్డు వచ్చినా ఆఖరుకు మృత్యువు కానీ, దేవతలు కానీ, అసురులు కానీ, అడ్డు వచ్చినా సరే రాముడు లెక్కచెయ్యడు.

ఓ సీతాదేవీ! నీవు కనపడలేదని రాముడు ఇంతకాలము నిన్ను రోజూ తలచుకుంటూ దు:ఖముతో కుమిలిపోతున్నాడు. ఓ సీతాదేవీ! నేను ఈ పర్వతముల మీద, సముద్రము మీదా, చెట్లమీద ఒట్టు పెట్టుకొని చెబుతున్నాను. నేను వెళ్లి నీగురించి చెప్పి రాముని తీసుకొని వస్తాను. నా మాట నమ్ము. నీవు రాముడిని తొందరలోనే చూస్తావు. రాముడు నీ మీద ఉన్న ప్రేమతో నువ్వు దగ్గర లేవని మద్యమాంసములు ముట్టడం లేదు. కేవలము ఫలములు ఆరగించి కడుపునింపుకుంటున్నాడు.

రాముడు ఎల్లప్పుడూ నీ గురించి ఆలోచిస్తూ పరధ్యానంగా ఉంటున్నాడు. నిన్ను తప్ప వేరే ఎవరిగురించీ ఆలోచించడం లేదు. రాముడు చాలావరకూ నిద్రలేని రాత్రులు గడుపుతున్నాడు. ఎప్పుడైనా నిద్రపడితే సీతా సీతా అని కలవరిస్తుంటాడు. రామునికి ఏదైనా అందమైన వస్తువు కనపడి నప్పుడు నువ్వు దగ్గరలేవని బాధపడు తుంటాడు. రాముడు నిన్ను మరువలేదు. సతతమూ నిన్నే స్మరిస్తున్నాడు." అని రాముడు పడుతున్న వేదన గురించి సీతకు తెలియజేసాడు హనుమంతుడు. హనుమంతుడు చెప్పిన మాటలు విని సీత కొంత ఊరట చెందింది.

శ్రీమద్రామాయణము

సుందర కాండము ముప్పది ఆరవ సర్గము సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందరకాండము

మప్పది ఏడవ సర్గ.

హనుమంతుడు చెప్పిన మాటలు విన్న సీత హనుమతో ఇలా అంది. “హనుమా! రాముడు జీవించి ఉన్నాడు అని చెప్పావు. కానీ రాముడు నా గురించి శోకిస్తున్నాడు అని చెప్పావు. రాముడు జీవించి ఉన్నందుకు సంతోషించాలో, నాగురించి శోకిస్తున్నందుకు దు:ఖించాలో అర్థం కావడం లేదు. మనిషికి ఎక్కువ సుఖము వచ్చినా ఎక్కువ దు:ఖము వచ్చినా తట్టుకోలేడు. అదే దైవ లీల. ఆ దైవ లీలను దాటడం ఎవరికీ శక్యముకాదు.

మా ప్రమేయం లేకుండానే నేను, రాముడు, లక్ష్మణుడు ఎటువంటి కష్టములు పడుతున్నామో చూడు! అక్కడ రాముని శోకము ఇక్కడ నా శోకము ఎప్పుడు అంతం అవుతుందో కదా! రాముడు లంకకు వచ్చి రావణుని చంపి నా కష్టములను ఎప్పుడు తీరుస్తాడో కదా! రావణుడు నాకు ఒక సంవత్సరము గడువు ఇచ్చాడు. అందులో పది మాసములు గడిచిపోయినవి, ఇంక రెండు మాసములు మాత్రమే మిగిలి ఉన్నవి. ఈ రెండు మాసములలో రాముడు వచ్చి నన్ను రక్షించడం సాధ్యమా!

హనుమా! నీవు వెళ్లి రామునితో చెప్పు. నీ సీత కేవలము ఇంక రెండు మాసములు మాత్రమే ప్రాణములతో ఉంటుంది అని చెప్పు. రావణుని తమ్ముడు విభీషణుడు అను వాడు “సీతను రామునికి ఇచ్చివేయి” అని ఎంత చెప్పినా రావణుడు వినడం లేదు. నన్ను రామునికి అప్పగించుటకు రావణుడు ఎంత మాత్రమూ

అంగీకరించడం లేదు. రావణునికి మృత్యువు ఆసన్నమయింది. అందుకే ఈ ప్రకారము ప్రవర్తిస్తున్నాడు. ఓ హనుమా! రావణుని తమ్ముడైన విభీషణుని కుమార్తె నల అనే పేరు కలది, స్వయంగా నా వద్దకు వచ్చి ఈ విషయం చెప్పింది.

హనుమంతుడా! నా ఈ ఆందోళన అర్థ రహితంగా తోస్తూ ఉంది. రాముడు తప్పకుండా వచ్చి నన్ను రక్షిస్తాడు అని నా అంతరాత్మ ఘోషిస్తూ ఉంది. నేను ఇక్కడ ఉన్నాను అని తెలిసిన తరువాత రాముడు క్షణకాలము ఊరుకోడు. రామునిలో ఉత్సాహము, పరాక్రమము, పురుషప్రయత్నము, బలము అన్నీ ఉన్నాయి. రాముడు తప్పకుండా వస్తాడు నన్ను రక్షిస్తాడు.

ఏ రాముడు అయితే జనస్థానములో 14,000 మంది రాక్షసులను ఒంటి చేత్తో చంపాడో ఆ రాముడికి ఏ రాక్షసుడు భయపడడు? రాముడు ఎన్ని కష్టములు వచ్చినా ఓర్పుతో సహిస్తాడు. రాముడు ఎవరికీ దేనికీ భయపడడు. రాముడి పరాక్రమము గురించీ, మనోధైర్యము గురించీ నాకు బాగాతెలుసు." అని ఉ ద్వేగంతో పలికింది సీత.

ఆ మాటలు విన్న హనుమంతుడు సీతతో ఇలా అన్నాడు. "అమ్మా సీతా దేవీ! దీనికి ఇంత ఆలోచించాలా! రా అమ్మా! నా వీపు మీద కూర్చో. నిన్ను క్షణాలలో సముద్రము దాటించి రాముని వద్దకు చేరుస్తాను. నన్ను నమ్ము. అమ్మా సీతా! నిన్నే కాదు. ఈ లంకను రావణునితో సహా పెకలించి తీసుకొని పోగలను. నాకు అంత శక్తి ఉంది. ముందు నిన్ను రాముని వద్దకు చేరుస్తాను. తరువాత రాముడు

వచ్చి రావణుని సంహరిస్తాడు. రాముడు నిన్ను ఎప్పుడు చూస్తానా అని తహతహలాడుతున్నాడు. అందుకని నిన్ను ఇప్పుడే రాముని వద్దకు చేరుస్తాను.

రా అమ్మా! వచ్చి నా వీపు మీద కూర్చో. మనము రాముని వద్దకు వెళుదాము. ఆకాశమార్గములో ప్రయాణమే చేసి సముద్రమును దాటుదాము. ఈ లంకలో ఉన్న రాక్షసులు ఎవ్వరూ మనలను అనుసరించలేరు ఆ భయం నీకు వద్దు. ఓ సీతా దేవీ! నిన్ను రావణుడు ఏ ప్రకారంగా ఆకాశమార్గంలో ఇక్కడకు తీసుకొని వచ్చాడో, అదే ప్రకారంగా నేను నిన్ను ఆకాశమార్గంలో కిష్కింధకు తీసుకొని వెళుతాను." అని అన్నాడు హనుమంతుడు.

హనుమ మాటలు విని సీతకు ఆశ్చర్యము, సంతోషము, సందేహము, ఒక్కసారిగా కలిగాయి. అంత దు:ఖంలో కూడా సీతకు నవ్వు వచ్చింది. హనుమంతునితో ఇలా అంది.

"ఓ వానరుడా! నీవు నన్ను మోసుకొని సముద్రము దాటుతావా! నూరుయోజనముల దూరము నన్ను ఎలా మోసుకొని పోగలవు అని అనుకుంటున్నావు. దీనిని బట్టి నీవు నిజంగా వానరుడవు అని నిరూపణ అయింది." అంటూ సీత చిన్న పిల్లి అంత ఆకారంలో ఉన్న హనుమంతుని తేరిపారచూచి "ఇంత చిన్ని శరీరం గల నీవు నన్ను నూరుయోజనములు మోసుకొని పోయి సముద్రము దాటించగలవా! నన్ను రాముని వద్దకు తీసుకొని పోగలవా! అలా అని నీవు ఎలా అనుకుంటున్నావు? ఇది నీకు సాధ్యమా కాదా అని కూడా నీకు తెలియదా!" అని పక్కున నవ్వింది సీత.

హనుమంతుడు దానిని తీరని అవమానంగా భావించాడు. "ఈమెకు నా బలము శక్తి, నా మాయారూపము తెలియవు. ఇప్పుడు నేను నా శక్తి ఏమిటో చూపించి ఈమెను నమ్మిస్తాను." అని మనసులో అనుకున్నాడు హనుమంతుడు. వెంటనే లేచి నిలబడ్డాడు. తన నిజస్వరూపమును సీతకు చూపించాడు. నేల మీద నిలబడి అలా అలా ఆకాశంలోకి పెరిగిపోతున్నాడు హనుమంతుడు. సీత ఆశ్చర్యంగా చూస్తూ ఉంది.

నేల మీద కాళ్లు ఆకాశంలో తల మేరు పర్వతము మాదిరి ప్రకాశిస్తున్నాడు హనుమంతుడు. తల పైకి ఎత్తి చూస్తున్న సీతతో ఇలా అన్నాడు హనుమంతుడు. "అమ్మా! సీతా! ఇప్పుడు తెలిసిందా! నాకు ఈ లంకనే పెకలించుకొని పోగల శక్తి ఉందని. కాబట్టి నీ మనసులో ఉన్న సందేహమును వదిలి పెట్టి వచ్చి నా వీపు మీద కూర్చో. నేను క్షణంలో రాముని చెంతకు చేరుస్తాను." అని అన్నాడు హనుమంతుడు.

భూమ్యాకాశాలు ఒకటిగా వెలుగొందుతున్న వాయుపుత్రుడు హనుమంతుని చూచి సీత ఇలా అంది. "ఓ వాయుపుత్రా! హనుమా! నీ బలము, పరాక్రమము, నీ శక్తి, నీ గమనవేగము అన్నీ నాకు పూర్తిగా తెలిసాయి. నీ వంటి వాడికి కాక మరొకడికి ఈ సముద్రమును దాటడం సాధ్యమా! ఏదో స్త్రీచాపల్యము వలన అలా అన్నానే కానీ, నీవు నన్ను నీ వీపుమీద మోసుకొని పోయి రాముని వద్దకు చేరుస్తావు అని నాకు తెలుసు.

కాని, ఇప్పుడు మనము రామ కార్యము ఎలా నిర్వర్తించాలా అని ఆలోచించాలి. నేను నీతో రావడం అంత మంచి పని కాదు. నీవు

వాయు వేగముతో పోగలవు కానీ, నీ వేగమును తట్టుకొని నీ వీపు మీద కూర్చొనే శక్తి నాకు లేదు కదా! నీవు వాయు వేగంతో పోతుంటే నీ వీపు మీద ఉన్న నేను ఆ వేగమునకు తట్టుకోలేక కళ్లు తిరిగి సముద్రములో పడిపోతానేమో అని భయంగా ఉంది. అలా పడిపోయినపుడు నేను సముద్రములో ఉన్న జలచరములకు ఆహారము అవుతాను కదా!

అదీ కాకుండా, నువ్వు నన్ను తీసుకొని పోతుంటే రాక్షసులు నిన్ను వెంబడిస్తారు కదా! రాక్షసులు నిన్ను నన్ను ఆయుధములతో చుట్టుముట్టినపుడు, నిన్ను నీవు రక్షించుకోవడమే కాకుండా నీవు నన్ను కూడా రక్షించవలసి ఉంటుంది. నువ్వు ఆకాశంలె క్రూరులైన రాక్షసులతో యుద్ధం చేయవలసి ఉంటుంది. అప్పడు నిన్ను నువ్వు రక్షించుకుంటావా? నీ వీపుమీద ఉన్న నన్నుకూడా రక్షిస్తావా? నిన్ను నువ్వు రక్షించుకుంటూ, నన్ను కూడా రక్షిస్తూ సముద్రము మీద ఎలా ప్రయాణము చేస్తావు? కష్టం కదా!

అంతే కాదు! నువ్వు రాక్షసులతో యుద్ధం చేస్తుంటే, నేను నీ వీపు మీది నుండి కింద పడిపోయే అవకాశము ఉంది కదా! ఆ సమయంలో రాక్షసులు తిరిగి నన్ను పట్టుకొని రావణుని వద్దకు చేరుస్తారు. లేదా కసి కొద్దీ దారిలోనే నన్ను చంపేస్తారు. లేదా నన్ను తీసుకొని పోయి మీకు ఎవ్వరికీ తెలియని ప్రదేశములో దాచిపెడతారు. అప్పడు నేను ఎక్కడున్నదీ మీకు తెలియడం చాలా కష్టం కదా! అదీకాకుండా, నువ్వు రాక్షసులతో యుద్ధం చేస్తున్నప్పడు నువ్వే జయించవచ్చు లేక రాక్షసులు జయించ వచ్చు. యుద్ధములో జయాపజయాలు దైవాధీనాలు కదా! అట్టి పరిస్థితులలో నన్ను రాముని

వద్దకు చేర్చడం అన్న నీ ప్రయత్నం సఫలం కాదు.

నువ్వు లంకలో ఉన్న రాక్షసులను అందరినీ సంహరిస్తావని నాకు తెలుసు. నువ్వే అందరు రాక్షసులను చంపేస్తే, రాముని పరాక్రమమునకు, కీర్తికి ముప్పు వాటిల్లుతుంది కదా! ఇవన్నీ ఆలోచిస్తే, నేను నీతో రావడం అంత మంచి పని కాదు. కాబట్టి రాముడు వచ్చి రావణునితో యుద్ధం చేసి, రావణుని సంహరించి నన్ను తీసుకొని పోవడమే మంచి పద్ధతి. రాముడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు, వానరులు వీరి జీవితాలు నా మీదనే ఆధారపడి ఉన్నాయి. నేను కనుక దారి మధ్యలో సముద్రములో పడి చనిపోతే, లేక మరలా రాక్షసుల చేతిలో పడితే, వీరందరూ ప్రాణత్యాగము చేసే అవకాశం ఉంది కదా!

అదీ కాకుండా నేను మొదటి నుండీ పతివ్రతా ధర్మమును అనుసరిస్తున్నాను. అందుకని నేను పరపురుషుని శరీరమును తాకను. నన్ను తీసుకొని వచ్చునపుడు రావణుని శరీర స్పర్శ నాకు తగిలింది కదా అని నీకు సందేహము రావచ్చు. రావణుడు నన్ను బలాత్కారంగా తీసుకొని వస్తున్నప్పుడు నేను అశక్తురాలిని, నిస్సహాయురాలిని. నన్ను నేను రక్షించుకొనే పరిస్థితిలో లేను. నా ప్రమేయం లేకుండా జరిగిన దానికి నేను బాధ్యురాలిని కాను కదా!

కాబట్టి రాముడు సైన్య సమేతంగా వచ్చి నన్ను తీసుకొని వెళ్లడమే యుక్తము అని నా అభిప్రాయము. రాముడు తప్పకుండా రావణునితో యుద్ధము చేసి గెలుస్తాడు. రాముని బలపరాక్రమములు నాకు తెలుసు. దేవ, దానవ, గంధర్వ,నాగ,రాక్షసులు ఎవరూ రాముని

ఎదిరించి నిలువలేరు. రామలక్ష్మణులు ధనుస్సులు ధరించి యుద్ధరంగంలో నిలబడితే, వారిని ఎదిరించడం సాక్షాత్తు ఆ దేవేంద్రునికే సాధ్యము కాదు. కాబట్టి నీవు పోయి, రామునితో నా ఉనికిని గురించి చెప్పి, వారిని ఇక్కడకు తీసుకొని రా! రాముని మనస్సుకు నా మనస్సుకు సంతోషమును కలిగించు." అని సీత హనుమంతునికి నచ్చచెప్పింది.

శ్రీమద్రామాయణము

సుందర కాండము ముప్పది ఏడవసర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

ముప్పది ఎనిమిదవ సర్గ.

హనుమంతునికి సీత పలికిన మాటలలో పొరపాటు ఏమీ లేదు అనిపించింది. "సీతా దేవీ! నీవు పతివ్రతలకు అనుకూలమైన మాటలే చెప్పావు. నాకు చాలా సంతోషంగా ఉంది. స్త్రీవైన నీకు నా వీపు మీద కూర్చుని నా వేగమునకు తట్టుకుంటూ నూరుయోజనముల దూరమును దాటడం చాటా కష్టమైన విషయం. రాముని తప్ప పరపురుషుని తాకను అన్న నీ మాటలు రాముని భార్యవు అయిన నీకే తగును. ఇటువంటి కష్టములలో ఉన్న ఏ స్త్రీ కూడా ఇక్కడి నుండి ఎలా బయటకు బయట పడాలా అని ఆలోచిస్తుంది కానీ నీ వలె మాట్లాడదు. అందుకే నీ మాటలు నాకు బాగా నచ్చాయి.

సీతా దేవీ! నీవు ఇప్పుడు నాతో పలికిన పలుకులు అన్నీ నేను రామునికి యథాతథంగా తెలుపుతాను. అమ్మా! నీకూ, రామునికి మేలు చేయవలెననే తలంపుతో నేను అలా చెప్పానే కానీ వేరు కాదు. నాకు నిన్ను నా వీపు మీద మోసుకొని పోవడానికి తగిన సామర్థ్యం ఉంది అనే నమ్మకంతో చెప్పాను కానీ, ఈ మహాసముద్రమును దాటడం కష్టము అని నాకు తెలుసు. నీవు నాతోపాటు రాముని వద్దకు రావడానికి ఇష్టపడటం లేదు. అందుకని నేను నిన్ను కలుసుకొని మాట్లాడినట్టుగా నాకు ఆనవాలుగా ఏదైనా ఇస్తే నేను దానిని రామునికి ఇస్తాను. అప్పుడే నేను నిన్ను చూచాను, కలుసుకున్నాను, నీతో మాట్లాడాను అని రాముడు నమ్ముతాడు." అని అన్నాడు హనుమంతుడు.

అప్పుడు సీతా దేవి హనుమంతునితో ఇలా అంది. "ఓ హనుమా! నేను నీకు ఒక విషయం చెబుతాను. అది నాకూ రామునికి మాత్రమే తెలిసిన విషయము. నీవు ఈ విషయమును రామునికి చెబితే రాముడు నమ్ముతాడు. మేము గంగానదీ తీరంలో ఉన్న చిత్రకూట పర్వతము వద్ద ఉంటూ ఉండగా ఒక సంఘటన జరిగింది. ఆ సంఘటనను నేను రామునికి చెప్పినట్టు చెప్తు.

"ఓ రామా! మనము చిత్రకూట పర్వతము వద్ద పర్ణశాలలో ఉంటున్నప్పుడు, మనము జలములలో జలక్రీడలాడి అలసిపోయి, తడిసిపోయి కూర్చుని ఉన్నాము. అప్పుడు ఒక కాకి వచ్చి నన్ను తన ముక్కుతో పొడవడం మొదలుపెట్టింది. నేను దానిని చిన్న చిన్న మట్టిపెళ్లలు విసిరి తోలసాగాను. కాని అది నన్ను వదలలేదు. నా దగ్గరకు వచ్చి నన్ను పొడవడం, మరలా పారిపోయి దాక్కోవడం చేస్తూ

ఉంది. నాకు ఆ కాకి మీద చాలా కోపము వచ్చింది. ఆ కాకిని తోలడంలో నాకు పై వస్త్రము జారిపోతే నేను దానిని సర్దుకుంటున్నాను. అప్పుడు నువ్వు నన్ను చూచావు. కాకికి భయపడ్డ నన్ను చూచి నీవు ఎగతాళి చేయగా నేను సిగ్గుపడ్డాను. అప్పుడు నాకు నీమీద కోపం కూడా వచ్చింది. నీవు నన్ను దగ్గరకు తీసుకొని ఓదార్చావు. నాకు కళ్లనిండా నీళ్లు తిరిగాయి. నిద్ర వచ్చింది. నేను నీ ఒడిలో పడుకొని చాలాసేపు నిద్రపోయాను. తరువాత నువ్వు కూడా నా మీద పడుకొని నిద్రపోయావు.

మనము నిద్రపోతూ ఉండగా ఆ కాకి మరలా వచ్చింది. నాశరీరం అంతా తన ముక్కుతో చీరుతూ ఉంది. నా శరీరం నుండి రక్తం వచ్చింది. నా శరీరము నుండి వచ్చిన రక్తపు చుక్కలు నీ మీద పడ్డాయి. అప్పుడు నేను నిన్ను నిద్రలేపాను. నా ఒంటి నుండి రక్తం కారడం చూచి నీకు కోపం వచ్చింది. “ఓ సీతా! నిన్ను ఈ ప్రకారంగా గాయపరచిన వాడు ఎవరు?” అని కోపంగా అడిగావు. నేను దూరంగా ఉన్న కాకిని చూపించాను. కాలి గోళ్లనుండి రక్తం కారుతున్న కాకిని చూచావు నువ్వు.

ఇంతకూ అసలు విషయం ఏమిటంటే ఆ కాకి దేవేంద్రుని కుమారుడు. వాయువుతో సమానమైన వేగము కలవాడు. అది తెలుసుకొని నువ్వు పక్కనే ఉన్న ఒక దర్భను తీసుకున్నావు. ఆ దర్భ ద్వారా బ్రహ్మ అస్త్రమును సంధించావు. దర్భను మంత్రించి కాకి మీదికి విసిరావు. ఆ దర్భ కాకిని తరుముకుంటూ వెళ్లింది. ఆ కాకికి దిక్కుతోచక రక్షణ కొరకు ముల్లోకములు తిరిగింది. కడకు ఆ కాకికి తండ్రి అయిన దేవేంద్రుడు కూడా తాను అశక్తుడను అని అన్నాడట.

అప్పుడు ఆ కాకి తిరిగి తిరిగి నీ వద్దకు వచ్చి శరణు వేడింది.

మొదట్లో ఆ కాకిని చంపాలి అనుకున్న నువ్వు, ఆ కాకి వచ్చి నిన్ను శరణు కోరగానే జాలి తలచి దానికి శరణాగతి ప్రసాదించావు. “ఓ కాకమా! నీమీద నేను బ్రహ్మాస్త్రమును ప్రయోగించాను. అది వృధా కారాదు. దానిని ఎవరి మీద ప్రయోగించాలో నీవే నిర్ణయించు” అని అన్నావు. అప్పుడు ఆ కాకి ఇలా అంది. “నీవు సంధించిన బ్రహ్మాస్త్రమును నా కుడికంటి మీదికి మళ్లించు.” అని అంది. నీవు వదిలిన బ్రహ్మాస్త్రము శక్తికి, ఆ కాకి కుడి కన్ను పోయింది. ఆ కాకి నీకు నమస్కరించి ఎగిరిపోయింది.

ఓ రామా! కేవలము ఒక కాకి నన్ను హింసించి నందుకు బ్రహ్మాస్త్రమును ప్రయోగించావు కదా! ఇప్పుడు ఒక రాక్షసుడు నన్ను చెరబట్టాడు. ఇప్పుడు ఎందుకు ఊరుకుంటున్నావు. ఈ రాక్షసుని కూడా క్షమించావా! వీడి మీద బ్రహ్మాస్త్రము ఎందుకు ప్రయోగించవు. ఓ రామా! నీవు వెంటనే వచ్చి శత్రువులనుసంహరించి, నన్ను ఈ రాక్షసుని చెరనుండి విడిపించు. ఓ రామా! నీవు నాకు నాధుడవు. కాని నేను అనాధగా బతుకుతున్నాను.

ఓరామా! అన్ని ధర్మములలో కెల్లా ఇతరుల మీద దయచూపడం ఉత్తమ ధర్మము అని నాకు తెలుసు. ఈ రాక్షసుల మీద కూడా, దయచూపకూడని వారి మీద కూడా, నీ దయా గుణమును ప్రసరింపచేస్తున్నావా!

రామా! నీవు పరాక్రమ వంతుడవు. నీకు తెలియని

అస్త్రములు, శస్త్రములు లేవు. నీవు దేవేంద్రునితో సమానుడవు. నీ శక్తితో పరాక్రమంతో సముద్రములను కూడా ఎండింపచేయగల వాడివి. ఈ రాక్షసుని పట్ల ఎందుకు ఉదాసీనంగా ఉంటున్నావు. ఈ రాక్షసుల మీద ఎందుకు నీ అస్త్రశస్త్రములను ప్రయోగించడం లేదు. యుద్ధమే సంభవిస్తే ఈ రాక్షసులే కాదు, దేవతలు, దానవులు, గంధర్వులు కూడా నీ ఎదుట నిలువలేరు కదా! అట్టి నీవు నన్ను రక్షించడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నావు? పోనీ నీ తమ్ముడు లక్ష్మణునికి అనుజ్ఞ ఇచ్చినా, లక్ష్మణుడు వచ్చి తన పరాక్ర మంతో ఈ రాక్షసుని సంహరించి నన్ను ఈ చెర నుండి విడిపిస్తాడు కదా! మీరు ఇద్దరూ నన్ను ఈ రాక్షసుని చెరనుండి విడిపించడానికి సమర్థులై ఉ ండి కూడా ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. నన్ను కాపాడటంలో మీరు ఇంత నిర్లక్ష్యంగా ఉన్నారు అంటే అది మీ తప్పు కాదు. నేనే పూర్వజన్మలో ఏదో పాపం చేసి ఉంటాను. ఆ పాపఫలము అనుభవించే వరకూ నాకు ఈ చెర నుండి విముక్తి లేదు. ఆ కారణం చేతనే మీరు సమర్థులై ఉండి కూడా నన్ను ఈ రావణుని బారి నుండి రక్షించడం లేదు. ఇది నిక్కువము." అని నామాటలుగా రామునికి చెప్పు" అని కన్నీళ్లు కారుస్తూ చెప్పింది సీత.

సీత మాటలు విన్నహనుమంతునికి కూడా దు:ఖము పెల్లుబికింది.

"అమ్మా! సీతమ్మ, తల్లీ! నీవు పొరపడుతున్నావు. నీవు ఇక్కడ ఉన్నట్టు రామునికి తెలియదు. నీ వియోగంతో రాముడు ఎంత బాధపడుతున్నాడో నీకు తెలియదు. అన్నగారి దు:ఖమును చూచి, రామునితో పాటు లక్ష్మణుడు కూడా ఎంతగానో శోకిస్తున్నాడు. మన

అందరి అదృష్టము కొద్దీ నీవు నాకు కనపడ్డావు. ఇంక నీ కష్టములు అన్నీ గట్టెక్కినట్టే అనుకో! నీ దు:ఖము అంతం అయ్యేరోజు ఎంతో దూరం లేదు. రాముడు, లక్ష్మణుడు నీ గురించి తెలుసుకోవాలని, నిన్ను చూడాలని ఎంతో ఆతురతగా ఉన్నారు. అతి త్వరలోనే రాముడు లంకకు వచ్చి రావణుని సంహరించి నిన్ను అయోధ్యకు తీసుకొని వెళ్లగలడు. అమ్మా! నీవు ఊరట చెందు. రామునికి, లక్ష్మణునికి, సుగ్రీవునికి నేను చెప్పవలసిన సందేశమును వినిపించు." అని సీతను ప్రార్థించాడు హనుమంతుడు.

ఆ మాటలు విన్న సీత తన దు:ఖమును ఉపశమింప జేసుకొని హనుమంతునితో ఇలాఅంది.

"హనుమా! కౌసల్యాతనయుడైనరామునికి నేను శిరస్సువంచి నమస్కరించి, ఆయన క్షేమమును అడిగినానని చెప్పు. సుమిత్రా తనయుడైన లక్ష్మణుని కూడా క్షేమమును అడిగానని చెప్పు. లక్ష్మణుడు సామాన్యుడు కాడు. తాను అనుభవించతగిన రాజభోగములు అన్నీ విడిచి అన్నతో కూడా అరణ్యమునకు వచ్చిన త్యాగ మూర్తి. లక్ష్మణుడు రాముని తన తండ్రిగానూ, నన్ను తన తల్లి వలె చూచుకొనే వాడు. ఎల్లప్పుడూ పెద్దలను గౌరవించేవాడు. ఏ కార్యము అప్పగించినా సమర్థవంతంగా పూర్తిచేసేవాడు. మా మామగారు దశరథునకు చాలా ఇష్టమైన వాడు.

లక్ష్మణునికి నన్ను ఈ దుర్మార్గుడు రావణుడు అపహరిస్తాడు అన్న విషయం తెలియదు. తెలిస్తే రావణుని ఆరోజే అంతమొందించే వాడు. అటువంటి లక్ష్మణుని క్షేమమును అడిగినట్టు చెప్పు. హనుమా!

నా గురించి, నేను ఈ రాక్షసుని చేతిలో పడుతున్న కష్టముల గురించి రామునికి, లక్ష్మణునికి వివరంగా చెప్పు. వారిని సత్వరమే ఇక్కడకు వచ్చేట్టు చెయ్యి. ఆలస్యం చేయవద్దని చెప్పు. రామునికి నేను చెప్పినట్టుగా ఈ విధంగా చెప్పు.

"నాథా! నేను ఇంక జీవించేది ఒక్క మాసము మాత్రమే! మాసము దాటి ఒక్కరోజుకూడా నా శరీరములో ప్రాణములు ఉండవు. ఇది సత్యము. కాబట్టి, నన్ను అవమానించిన రావణుని సంహరించి, నన్ను రక్షించు." అని రామునికి నా మాటగా చెప్పు." అని పలికింది సీత.

అప్పుడు హనుమంతుడు సీతతో ఇలా అన్నాడు. "అమ్మా! సీతా! ఒక్కమాట. నేను నీవద్దకు వచ్చినట్టు గుర్తుగా నీ వద్ద ఉన్న ఆభరణమును ఏదైనా ఇస్తే దానిని రామునికి ఇస్తాను. అప్పుడు నేను నిన్ను చూచినట్టు, కలుసుకున్నట్టు రాముడు నమ్ముతాడు."అని పలికాడు హనుమంతుడు.

వెంటనే సీత తన కొంగున ముడివేసి దాచిన చూడామణిని తీసి హనుమకు ఇచ్చింది. "హనుమా! నీవు నన్ను కలిసినట్టు గుర్తుగా రామునికి ఈ చూడామణిని ఇమ్ము." అని సీత చూడామణిని (శిరస్సున ధరించే ఆభరణము) హనుమంతునికి ఇచ్చింది. హనుమంతుడు దానిని భద్రంగా దాచుకున్నాడు. హనుమంతుడు సీతకు ప్రదక్షిణపూర్వకంగా నమస్కారము చేసి ఒక పక్కగా ఒదిగి నిలబడ్డాడు. అప్పుడు హనుమంతుని మనస్సులో రాముడు మెదిలాడు. తాను అప్పుడే రాముని వద్దకు పోయినట్టు, సీతమ్మ ఇచ్చిన

చూడామణిని రామునికి ఇచ్చినట్టు, రాముడు ఆ చూడమణిని చూచి ఆనందంతో పొంగిపోయినట్టు మనస్సులో ఊహించుకుంటున్నాడు హనుమంతుడు. హనుమంతుని శరీరం మాత్రం అశోకవనములో ఉంది. మనస్సు మాత్రము రాముని చెంత ఉంది.

శ్రీమద్రామాయణము
సుందర కాండము ముప్పది ఎనిమిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము
ముప్పది తొమ్మిదవ సర్గ.

సీత తన కొంగున ముడివేసి దాచిపెట్టిన చూడామణిని తీసి హనుమంతునికి ఇచ్చి ఇలా పలికింది.

"హనుమా! ఈ చూడామణిని గురించి రామునికి బాగా తెలుసు.ఈ చూడామణిని చూస్తే రామునికి నా తల్లి, తన తండ్రి దశరథుడు, నేనూ గుర్తుకు వస్తాము. కాబట్టి ఈ చూడామణిని రామునికి ఇవ్వు. తరువాత జరగ వలసిన కార్యమును గూర్చి ఆలోచించి ఏది సమంజసమో అది చెయ్యి. కాని నా దు:ఖము మాత్రము త్వరగా పోగొట్టే మార్గము చూడు." అని పలికింది సీత.

హనుమంతుడు తల వంచి సీతకు నమస్కరించి "నీవు చెప్పినట్టే చేస్తాను." అని అన్నాడు. తరువాత అక్కడి నుండి వెళ్లడానికి

సిద్ధం అయ్యాడు. హనుమ వెళుతుంటే తన ఆప్తుడు తనను విడిచి వెళుతున్నట్టు బాధపడింది సీత.

"ఓ హనుమా! వానరవీరా! రాముని, లక్ష్మణుని, సుగ్రీవుని అడిగినట్టు చెప్పు. రామునితో నన్ను ఈ దు:ఖసాగరమునుండి ఉద్ధరించమని చెప్పు. నా శరీరములో ప్రాణాలు ఉండగానే వచ్చి రక్షించమని రామునితో చెప్పు. కాస్త ఈ మాట సాయం చేసి పుణ్యం కట్టుకో. హనుమా! నీవు నేను చెప్పిన మాటలు పదే పదే రామునికి చెప్పడం వల్ల రామునికి నన్ను సత్వరమే రక్షించవలెనని కోరిక కలుగుతుంది. రాముడు నా సందేశమును నీ ద్వారా విని, తన పరాక్రమమును ప్రదర్శింపగలడు." అని తన అభ్యర్ధనను మాటి మాటికీ హనుమకు తెలియజేసింది సీత.

సీత మాటలు విన్న హనుమ ఆమెతో ఇలా అన్నాడు. "అమ్మా! నా మాట నమ్ము. రాముడు వానర సేన, భల్లూకసేనలతో వచ్చి, రావణుని సంహరించి నిన్ను రక్షిస్తాడు. రాముని బాణములకు ఎదురు నిలువ గలవాడు ఈ రాక్షసులలో ఎవడూ లేడు. రాముడు యుద్ధరంగములో సాక్షాత్తు సూర్యుని, ఇంద్రుని, యముడిని ఓడించగల సమర్ధుడు. రాముడు నీ కొరకు ఈ భూమి యావత్తు జయించగల సమర్ధుడు." అని సీతకు ధైర్యవచనాలు పలికాడు హనుమంతుడు.

హనుమంతుని మాటలతో ఊరట చెందింది సీత. హనుమంతుడు వెళుతుంటే తన ఆప్తులు వెళుతున్నట్టు బాధపడించి. అప్పుడు సీతకు ఒక ఆలోచన వచ్చింది.

"పాపము ఈ వానరుడు నూరుయోజనముల దూరము గల సముద్రమును దాటి లంకకు వచ్చి, తన కోసం వెతికి వెతికి అలసిపోయాడు." అని అనుకొంది. అందుకని హనుమంతో ఇలా అంది. "హనుమా! నీకు మంచిది అని అనుకుంటే ఈ రాత్రికి ఇక్కడే ఉండి విశ్రాంతి తీసుకొని, రేపు ఉదయమే వెళ్లవచ్చు కదా! ఇక్కడ ఇన్నాళ్లు ఒంటరిగా ఈ రాక్షసుల మధ్య బాధలు పడుతున్న నాకు, నీవు ఇక్కడే ఉన్నావనే భావన నా మనసుకు కాస్త ఊరట కలిగిస్తుంది. మరలా నీవు లంకకు ఎప్పుడు వస్తావో! అప్పటికి నేను బతికి ఉంటానో లేదో!

హనుమా! ఇప్పటి దాకా నాకు ఎవ్వరూ లేరు అనే దు:ఖంతో బాధపడుతున్నాను. ఇప్పుడు నువ్వు వెళ్లిపోతున్నావనే బాధ నా మనసును కలిచివేస్తూ ఉంది. ఇలా బాధలు మీద బాధలు నన్ను వెంటాడుతున్నాయి. ఏంచెయ్యను? హనుమా! నువ్వు ఇన్ని చెప్పినా నాకు ఒక సందేహము పట్టి పీడిస్తూ ఉంది. మీ సైన్యము అంతా వానరములు భల్లూకములు కదా! వారు ఈ మహాసముద్రమును ఎలాదాటగలరు? ఇక్కడకు ఎలా రాగలరు? వాళ్లు సరే. రామలక్ష్మణులకు కూడా ఈ మహా సముద్రమును దాటడం శక్యమా!

నాకు తెలిసినంతవరకూ నువ్వు, గరుడుడు, వాయుదేవుడు మాత్రమే ఈ నూరుయోజనముల దూరము కల సముద్రమును దాటగల సమర్థులు. మీరు ఈ కార్యము సాధించడం కష్టమనే అనిపిస్తూ ఉంది నాకు. నీకు ఏమైనా ఉపాయం తట్టిందా! నీకు తెలివి తేటలు ఎక్కువ కదా! ఏమి ఆలోచించావు? ఈ కార్యమును నీవు ఒంటరిగరానే సాధించగలవు అని నాకు తెలుసు.

కాని రామలక్ష్మణుల సంగతేమిటి? వారు ఎలా ఇక్కడకు రాగలరు? రామలక్ష్మణులు సముద్రమును దాటి లంకకు వచ్చి రావణుని సంహరించి నన్ను అయోధ్యకు తీసుకొని వెళ్లగలరు అనే నమ్మకంతోనే ఉన్నాను. కాబట్టి రామునికి నీవే తగిన ఉపాయము చెప్పి ఇక్కడకు తీసుకొని రావాలి." అని చెప్పింది సీత.

"అమ్మా! సీతమ్మ తల్లీ! వానర సేన భల్లూక సేన అపారము. వారు ఇక్కడకు రావలెనని ధృఢంగా విశ్వసించి ఉన్నారు. వారికి ఏదీ అసాధ్యము కాదు. వానరులు ఎక్కడికి అయినా వెళ్లగల సమర్థులు. వానరులు ఆకాశంలోగానీ, నేల మీద గానీ నీటిలో గానీ ప్రయాణం చేయగల సమర్థులు. వారి తేజస్సు అటువంటిది. వారు ఏ పనిచేయడానికైనా వెనుకాడరు. ఈ వానరులలో ఆకాశంలో ఎగురుతూ భూప్రదక్షిణము చేసిన వారు ఎంతోమంది ఉన్నారు.

వానర సేనలో నా కన్నా మేధావులు. పరాక్రమవంతులు ఎంతో మంది ఉన్నారు. నా కన్నా తక్కువవాడు వానర సేనలో ఎవడూ లేడు. నేనే ఎగురుకుంటూ సముద్రమును దాటి వచ్చానంటే ఇంక మిగిలిన వానరుల మాట చెప్పాలా! అమ్మా! నీకు ఒక విషయం తెలుసా! ఇలా వెతకడంలాంటి చిన్న చిన్న పనులకు నా లాంటి చిన్న చిన్న వాళ్లను పంపుతారు కానీ, శ్రేష్టమైన వారిని పంపరు కదా! కాబట్టి నీవు విచారించకు. నీ శోకమును వదిలిపెట్టు. వానర నాయకులు అందరూ ఒకే ఒక్క గంతులో సముద్రమును దాటి లంకలో బిలా బిలా ప్రవేశిస్తారు. రామలక్షణులను నా బుజాల మీద ఎక్కించుకొని లంకకు తీసుకొని వస్తాను. రామలక్ష్మణులు వానరసేనసాయంతో లంకను నాశనం చేసి నిన్ను రక్షిస్తారు. అయోధ్యకు తీసుకొని వెళ్తాడు. కాబట్టి

నీవు ఏ మాత్రమూ సందేహపడవద్దు. రామలక్ష్మణుల రాకకై వేచి ఉండు. అతి కొద్ది కాలములోనే రాముని చూడగలవు. రావణుని చావు చూడగలవు." అని ధైర్యవచనములు పలికాడు హనుమంతుడు.

ఇంక వెళ్లడానికి ఉద్యుక్తుడయ్యాడు. ఆఖరి మాటలుగా సీతతో ఇలా అన్నాడు. "అమ్మా! నీవు అధైర్యపడకు. రామలక్ష్మణులను లంకా నగరంలో త్వరలోనే చూస్తావు. ఈ లంకానగరమంతా వానరసేనలతో నిండిపోవడం నీవు త్వరలో చూస్తావు. ఈ లంకలో ఎక్కడ చూచినా, ఏ పర్వతము మీద చూచినా గుంపులు గుంపులుగా వానరసేనలు సంచరించడం త్వరలోనే చూడగలవు.

ఓ సీతా దేవీ! నీవు రాముని కొరకు ఇక్కడ ఎలా శోకిస్తున్నావో అక్కడ రాముడు కూడా నీ కోసం ఇంతకంటే అధికంగా శోకిస్తున్నాడు. కాబట్టి ఊరడిల్లు. అగ్ని, వాయువు తో సమానులైన రామలక్ష్మణులు నీకు అండగా ఉండగా నీకేం భయం. ప్రశాంతంగా ఉండు. లంకకు రాక్షసులకు ఋణం తీరిపోయింది. రాక్షసరాజ్యం అంతరించే కాలము ఆసన్నమయింది. నీవు ఇక్కడ ఎంతో కాలము ఉండవు. నేను వెళ్లి నీ గురించి రామునికి చెప్పడమే ఆలస్యం. రాముడు ఇక్కడకు వస్తాడు. నిన్ను చెర విడిపిస్తాడు. అంతవరకూ ఓపిక పట్టు " అని అనేకవిధములుగా సీతకు ధైర్యం చెప్పాడు హనుమంతుడు.

శ్రీమద్రామాయణము

సుందర కాండము ముప్పది తొమ్మిదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

నలుబదవ సర్గ.

హనుమంతుడు పలికిన ధైర్యవచనములకు ఎంతో సంతోషించింది సీత. “హనుమా! ఇక్కడ ఈ లంకలో, ఈ రాక్షసుల చెరలో, నా చెవికి మంచి మాటలు వినడమే కరువు అయింది. ఇన్నాళ్లకు నీ నోటి నుండి నాలుగు మంచి మాటలు వింటుంటే ఇంకా ఇంకా వినాలని ఉంది. నువ్వు వెళ్లిపోతున్నావు అంటే దిగులుగా ఉంది. నాలో ఉన్న ఉద్వేగముతో మరలా మరలా చెబుతున్నాను. నా గురించి రామునికి చెప్పి రాముని ఇక్కడకు తీసుకొని రా! నేను చెప్పిన కాకి కథను రామునికి నా ఆనవాలుగా చెప్పు.

అంతే కాకుండా ఒక సారి నా నుదుటనున్న తిలకము చెరిగి పోతే రాముడు ఒక శిలను తీసుకొని దానిని అరగదీసి, ఆ గంధమును నా నుదుటికి బదులు గండస్థలము మీద తిలకముగా దిద్దాడు. ఈ విషయం కూడా రామునికి చెప్పు. ఇంకా రామునితో నా మాటగా ఇలా చెప్పు.

“నేను ఇక్కడ ఈ రాక్షసుల మధ్య నానాబాధలు పడుతుంటే, దేవేంద్రునితో సమానమయిన పరాక్రమము కలిగి ఉండీ నా వద్దకు రావడానికి ఎందుకు ఉపేక్షిస్తున్నావు. ఓ రామా! నేను ఇంతకాలమూ ఈ చూడామణిని చూస్తూ నువ్వు నా దగ్గర ఉన్నట్టే అనుకుంటున్నాను. ఇప్పుడు ఈ చూడామణిని నా ఆనవాలుగా నీకు పంపుతున్నాను. ఓ రామా! నీవు ఏ నాటికైనా రాకపోతావా! ఈ రాక్షసుల చెరనుండి నన్ను విడిపించకపోతావా! అని ఎదురు

చూస్తున్నాను. నేను ఇంక ఒక్క మాసము కాలము మాత్రమే నీ కొరకు ఎదురుచూస్తాను. అటుపైన నీవు నన్ను చూడలేవు. ఈ మాసము లోపల నీవు రాకపోతే నేను జీవించ ఉండను. ఈ రావణుడు చాలా క్రూరుడు. గడువు దాటిన తరువాత నన్ను బతుకనీయడు. తరువాత నీ ఇష్టం." అని నా మాటగా రామునికి చెప్పు." అని పలికింది సీత.

సీత దీనంగా మాటి మాటికీ పలుకుతున్న దీనాలాపములు విన్న హనుమకు కూడా దు:ఖము ఆగలేదు. సీతను ఆ దు:ఖము నుండి మళ్లించడానికి ఇలా అన్నాడు.

"అమ్మా! నేను తప్పకుండా రామునికి నీ గురించి చెబుతాను. కానీ, నీ వద్ద ఇంకా ఏమైనా రామునికి గుర్తుగా ఇవ్వదగిన వస్తువు ఉంటే అది ఇవ్వవా! " అని అడిగాడు హనుమంతుడు. సీత తన వద్ద ఇంకా ఏమైనా వస్తువు ఉందా అని వెతికింది. "హనుమా! నా వద్ద ఉన్న చూడామణిని ఇదివరకే ఇచ్చాను కదా. ఇంకా నా వద్ద నేను శిరోభూషణంగా ధరించే ఒక మణి ఉంది. దీనిని కూడా రామునికి చూపించు. దీనిని కూడా రాముడు బాగా గుర్తుపట్టగలడు. నీవు చెప్పిన మాటలనునమ్ముతాడు." అని తాను శిరస్సున ధరించిన మణిని తీసి ఇచ్చింది. హనుమంతుడు ఆ మణిని తీసుకొని భద్రపరచుకున్నాడు.

తరువాత అక్కడి నుండి వెళ్లడానికి సిద్ధము అయ్యాడు. పైకి ఎగరడానికి అనువుగా తన దేహాన్ని పెంచడం మొదలెట్టాడు. అప్పుడు సీత హనుమతో ఇలా అంది. "హనుమా! రాముని, లక్ష్మణుని, సుగ్రీవుని క్షేమము అడిగానని చెప్పు. నన్ను ఈ రాక్షస స్త్రీలు

భయపెడుతున్నారని రామునికి స్వయంగా చెప్పు. నీవు సుఖంగా వెళ్లిరా." అని సాదరంగా వీడ్కోలు పలికింది సీత. హనుమంతుడు సీత వద్దనుండి ఉత్తర దిక్కుగా బయలుదేరాడు.

శ్రీమద్రామాయణము

సుందర కాండము నలుబదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

నలుబది ఒకటవ సర్గ.

హనుమంతుడు సీత వద్దనుండి బయలు దేరి కొంత దూరము వెళ్లాడు. అక్కడ నిలబడి ఆలోచించాడు. "లంకకు వచ్చాను, సీతను చూచాను. వచ్చిన పని అయిపోయింది. ఇంకా ఏదో మిగిలిపోయింది అని అనుమానంగా ఉంది. ఊరికే పోవడం ఏం బాగుంటుంది. నా పరాక్రమం కూడా కొంచెం ప్రదర్శిస్తే బాగుంటుంది కదా! ఈ రాక్షసుల విషయంలో సామ,దాన,భేదో పాయములు పనికిరావు. దండోపాయమే యుక్తము. కాబట్టి ప్రస్తుతము నా పరాక్రమమును వీళ్లకు రుచి చూపించడమే మంచిది.

ఒక పని చెయ్యాలంటే ఒకే ఉపాయము పనికిరాదు. అనేక ఉపాయములను ఆలోచించాలి. తొందరలో రాక్షసులతో యుద్ధము జరుగబోతోంది. అలాంటప్పుడు, రాక్షసుల బలం ఎంతో, వీరిలో వీరులు ఎవరెవరుఉన్నారో, వీళ్లలో రావణునికి అండగా నిలిచేవాళ్లు ఎవరో, రావణునితె విభేధించే వాళ్లు ఎవరో తెలుసుకొని సుగ్రీవునికి చెప్పడం

మంచిది. అప్పుడే నేను లంకకు వచ్చిన పని పూర్తి అవుతుంది. కాబట్టి ఇప్పుడు రాక్షసులతో అనవసర కలహం పెట్టుకోవాలి! రావణుని, అతని మంత్రులను, సేనాధిపతులను సైనికులను నాతో యుద్ధానికి వచ్చేట్టు చెయ్యాలి! రాక్షసుల యుద్ధరీతులు ఎలా ఉంటాయో గమనించాలి. ఇదంతా మంచిదే! కానీ, వీరితో కలహం ఎలా పెట్టుకోవాలి? ఏం చేస్తే రాక్షసులకు కోపం వస్తుంది?" అని ఆలోచించి చుట్టూ చూచాడు.

ఎదురుగా రావణుడు తన రాణులతో విహరించే అందమైన ఉద్యానవనము కనపడింది. "అమ్మయ్య. దొరికింది. ఈ ఉద్యానవనమును నాశనం చేస్తే రావణునికి కోపం వస్తుంది. అప్పుడు రావణుడు తన సైన్యములను పిలిపించి నాతో యుద్ధం చెయ్యమంటాడు. అప్పుడు పెద్దయుద్ధం జరుగుతుంది. నేను కూడా రాక్షసులతో యుద్ధము చేసి, వారిని చంపి, కిష్కింధకు తిరిగి వెళతాను." అని నిశ్చయించుకున్నాడు హనుమంతుడు.

పక్షుల కిలా కిలారావములతో, అందమైన పూల చెట్లతో మనోహరంగా ఉన్న ఉద్యానవనములోకి ప్రవేశించాడు హనుమంతుడు. అడ్డం వచ్చిన చెట్లను పెకలించాడు. అందమైన సరోవరముల గట్టు తెగగొట్టి నీటిని విడిచిపెట్టాడు. ఉద్యానవనమంతా జలమయముఅయింది. చిన్న చిన్న కొండలను, గుట్టలను పడగొట్టాడు. ఉద్యానవనమును చిందరవందర చేసాడు.ఈ భీభత్సానికి ప్రశాంతంగా చెట్ల కొమ్మల మీద ఉన్న పక్షులు భయం భయంగా అరుస్తూ ఎగిరిపోయాయి.

హనుమంతుడు పొదరిళ్లను, లతలను నాశనం చేసాడు. అక్కడ ఉన్న పెంపుడుజంతువులను తరిమేసాడు. అక్కడక్కడ ఉన్న విశ్రాంతి భవనములను కూలగొట్టాడు. ఆ ఉద్యానవనము తన పూర్వశోభను కోల్పోయి శ్మశానము మాదిరి అయింది. చెయ్యాల్సింది అంతా చేసి, తన కోసరం ఎవరన్నా వస్తారా అని ఎదురు చూస్తూ ఆ ఉద్యానవనము ముఖద్వారము వద్ద ఉన్న తోరణ స్తంభము మీద ఎక్కి కూర్చుని నలుదిక్కులను చూస్తున్నాడు హనుమంతుడు.

శ్రీమద్రామాయణము

సుందర కాండము నలుబది ఒకటవ సర్గ సంపూర్ణము.

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందరకాండము

నలుబది రెండవ సర్గ.

పక్షులు, జంతువులు భయంతో అరిచే అరుపులు,చెట్లు పెళ పెళా విరిగిన శబ్దాలు, వినిన రాక్షసులు భయంతో వణికిపోయారు. పైగా రాక్షసులకు దుశ్శకునములు విపరీతంగా కనపడసాగాయి. వారంత నలుదిక్కులకు పోయి చూచారు. విరిగిన చెట్లు, పాడైపోయిన వనము, గట్లు తెగిన సరోవరములు, స్తంభము మీద కూర్చున్న హనుమంతుని చూచారు. వారిని చూచిన హనుమంతుడు తన ఆకారమును పెంచి వారిని భయపెట్టాడు. వెంటనే ఆ రాక్షస స్త్రీలు సీత వద్దకు వెళ్లారు.

“వాడు ఎవరు? ఎవరి కోసం వచ్చాడు? నీ కోసం వచ్చాడా? వాడు నీకు తెలుసా? వాడు నీతో ఏమి మాట్లాడాడు? అసలు వాడు ఇక్కడు ఎందుకు వచ్చాడు? వాడికి నీకు ఏమి సంబంధం? చెప్పు.” అని గద్దించి అడిగారు. మరి కొంత మంది రాక్షసస్త్రీలు సీతను చూచి “సీతా! నువ్వు ఏమీ భయపడవద్దు. వాడు ఎవరో మాకు చెప్పు? వాడు నీతో ఏమేమి మాట్లాడాడు. చెప్పు.” అనునయంగా అడిగారు.

అప్పుడు సీత వారితో ఇలా అంది. “ఆ వానరాన్ని చూడండి ఎంత భయంకరంగా ఉందో. అది మాయా రూపము ధరించిన రాక్షసుడు కాబోలు. అటువంటి రాక్షసుల గురించి తెలుసుకొనే పరిజ్ఞానం నాకు ఎక్కడుంది. వాడిని చూస్తేనే భయంగా ఉంది. అయినా అటువంటి రాక్షసుల గురించి మీకే తెలియాలి. నాకు ఎలా తెలుస్తుంది.” అని భయం నటించింది సీత.

సీత మాటలు విన్న రాక్షస స్త్రీలు ఆ వానరము మనలను కూడా చంపుతుందేమో అని భయంతో నలుదిక్కులకూ పారిపోయారు. మరి కొందరు ఈ విషయం రావణునికి చెప్పుటకు రావణుని మందిరానికి వెళ్లారు. మరి కొందరు మొండి వాళ్లు, చస్తే చస్తామని అక్కడే సీతకు కాపలాగా ఉన్నారు.

రావణుని దగ్గరకు వెళ్లిన రాక్షస స్త్రీలు, హనుమంతుని గురించి అతని భయంకరాకారము గురించి చిలవలు పలవలుగా కల్పించి చెప్పారు. “ఓ మహారాజా! ఒక భయంకరమైన వానరము అశోకవనములో ప్రవేశించింది. వనమంతా నాశనం చేసింది. సీతతో ఏమేమో మాట్లాడింది. మేము ఎంత అడిగినా సీత ఆ వానరము

గురించి చెప్పడం లేదు. ఆ వానరము దేవేంద్రుని వద్ద నుండి కానీ, మీ సోదరుడు కుబేరుని వద్ద నుండి కానీ, లేక రాముని వద్ద నుండి కానీ వచ్చిన దూత కావచ్చును. ఆ వానరుని రూపము అత్యంత ఆశ్చర్యకరంగా ఉంది. ఇప్పుడు ఇంత ఉంటాడు. మరుక్షణం ఆకాశమంత ఉంటాడు. ఇప్పుడు ఇక్కడ ఉంటాడు. క్షణంలో అక్కడ ఉంటాడు. అశోక వనంలో వాడు విరవని చెట్టు లేదు. నాశనం చెయ్యని ప్రదేశము లేదు.

ప్రభూ! ఆశ్చర్యము ఏమంటే, ఆ వానరము సీత ఉన్న ప్రదేశము తప్ప మిగిలిన వనము అంతా ధ్వంసము చేసింది. కేవలము సీతను రక్షించడానికే అలా చేసాడా లేక వనం అంతా నాశనం చేసి అలసి పోయి సీత ఉన్న ప్రదేశమును మాత్రము నాశనము చేయలేదా! అనే విషయం తెలియడం లేదు ప్రభూ!...అదేంకాదు లెండి. కోతికి అలసట ఏముంది. సీతను రక్షించడానికే వాడు ఈ పని చేసాడు. ప్రభూ! ప్రత్యేకంగా సీత కూర్చున్న శింశుపా వృక్షమును మాత్రము ఆ వానరము తాకనైనా తాకలేదు.

ప్రభూ! మీరంటే ఏ మాత్రం భయం లేకుండా, అశోక వనంలో ప్రవేశించి, సీతతో మాట్లాడి, అశోకవనమును ధ్వంసము చేసిన ఆ వానరమును పట్టి కఠినంగా శిక్షించండి. వాడు చావడానికి సిద్ధపడినట్టున్నాడు లేకపోతే తమరి అధీనంలో ఉన్న సీతతో మరొకడు వచ్చి మాట్లాడటం సంభవమా!" అని తలొక విధంగా చెప్పారు రాక్షస స్త్రీలు.

వారి మాటలు విన్న రావణునికి కోపం తలకెక్కింది. అగ్ని వలె మండి పడ్డాడు. వెంటనే ఎనభై వేలమంది రాక్షస సైనికులను

పిలిచాడు. హనుమంతుని పట్టుకొని చంపమని ఆదేశించాడు. వెంటనే ఆ సైనికులు రకరకాలైన ఆయుధములను పట్టుకొని హనుమంతుని వెతుక్కుంటూ వెళ్లారు. అశోక వనద్వారము వద్ద నిలబడి ఉన్న హనుమంతుని చూచారు.

ఆ రాక్షసులు తమ తమ ఆయుధములను ఝుళిపిస్తూ హనుమంతుని మీదికి ఉరికారు. హనుమంతుని తమ తమ ఆయుధములతో చుట్టుముట్టారు. వారిని చూడగానే హనుమంతుడు తన శరీరమును పెంచాడు. తోకను నేలకేసి బాదాడు. పెద్దగా అరిచాడు. "ఒరేయ్! నేను వాయు పుత్రుడను. నా పేరు హనుమంతుడు. నేను రాముడు పంపగా, సుగ్రీవుడు పంపగా రామదూతగా వచ్చాను. మీరు ఎంత మంది వచ్చినా నేను చంపేస్తాను. వెయ్యిమంది రావణులు కూడా నా ఎదుట నిలువలేరు. నేను సీత కోసరం వచ్చాను. సీతను చూచాను. లంకను నాశనం చేసి, సీతకు నమస్కరించి వెళతాను." అని పెద్దగా అరిచి చెప్పాడు.

హనుమంతుని అరుపులు విని చాలా మంది రాక్షసులకు పై ప్రాణాలు పైనే పోయాయి. రావణుని ఆజ్ఞ తప్పదని, వారందరూ హనుమంతుని మీదికి తమ తమ ఆయుధములతో దూకారు. అప్పుడు హనుమంతుడు అశోకవనమునకు అమర్చిన పెద్ద ద్వారము వద్దకు వచ్చాడు. దానికి అమర్చిన పెద్ద గడియను ఊడపీకాడు. దానిని పట్టుకొని ఆ రాక్షసులను ఒక్కొక్కడిని చావగొట్టాడు. కొద్ది నిమిషములతో రావణుడు పంపిన రాక్షసులు అందరూ పీనుగులయ్యారు. ఇంకా ఎవరైనా వస్తారా అని చూస్తూ మరలా ఆ తోరణ స్తంభము వద్ద నిలబడ్డాడు హనుమంతుడు.

చచ్చిన వాళ్లు చావగా, హనుమంతుని బారి నుండి తప్పించుకొన్న కొంతమంది రాక్షసులు పరుగు పరుగున పోయి రావణునికి జరిగిందంతా చెప్పారు. తాను పంపిన రాక్షస సేన సమస్తం హనుమంతుని దెబ్బకు ఆహుతి అయ్యారు అన్న వార్త విన్న రావణుడు కోపంతో ఊగిపోయాడు. అదే రావణునికి తగిలిన మొదటి ఎదురు దెబ్బ. వెంటనే తన సేనానాయకుడు ప్రహస్తుని పిలిపించాడు. అశేష సేనలతో ప్రహస్తుని హనుమంతుని మీదికి పంపాడు.

శ్రీమద్రామాయణము

సుందర కాండము నలుబది రెండవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

నలుబది మూడవ సర్గ.

రాక్షస సైనికులను చంపిన తరువాత ఇంకా ఎవరు వస్తారా అని తోరణస్తంభము మీద ఎక్కి కూర్చుని ఎదురు చూస్తున్నాడు హనుమంతుడు. ఎదురుగుండా అశోక వనములో ఉన్న చైత్యప్రాసాదము కనపడింది. అప్పుడు హనుమంతునికి ఒక ఆలోచన వచ్చింది. "అశోకవనము అంతా ధ్వంసము చేసాను. ఈ చైత్యప్రాసాదమును మాత్రము ఎందుకు వదిలిపెట్టాలి. . దీనిని కూడా ధ్వంసం చేస్తే ఓ పనైపోతుంది" అనుకున్నాడు.

అనుకున్నదే తడవుగా పైకి లేచాడు. చైత్యప్రాసాదము మీదికి లంఘించాడు. ఆ చైత్యప్రాసాదము మీద ఎక్కి కూర్చున్నాడు. తరువాత

తన శరీరమును పెంచాడు. లంకా పట్టణం అంతా అదిరిపోయేట్టు తన జబ్బలు చరుచుకున్నాడు. సింహనాదం చేసాడు. ఆ శబ్దానికి తట్టుకోలేక చైత్యప్రాసాదమును రక్షించుచున్న రక్షకభటులు మూర్ఛపోయారు. మరి కొంత మంది సైనికులు వివిధములైన ఆయుధములను పట్టుకొని అక్కడకు వచ్చారు. చైత్యప్రాసాదము మీద ఉన్న హనుమంతుని చూచారు.

హనుమంతుడు కిందికి దుమికాడు. వెంటనే ఆ సైనికులు హనుమంతుని చుట్టుముట్టారు. హనుమంతుడు ఆ చైత్యప్రాసాదము స్తంభమును ఒకదానిని పెకలించి, గిరా గిరా తిప్పి ఆ సైనికుల మీదికి విసిరాడు. హనుమంతుడు ఆ స్తంభమును గిరా గిరా తిప్పుతుంటే అగ్ని ప్రజ్వరిల్లింది. ఆ అగ్ని చైత్యప్రాసాదము మొత్తం పాకింది. చైత్యప్రాసాదము అగ్నికి ఆహుతి అయిపోయింది. స్తంభము తమ మీద పడ్డ సైనికులు అక్కడికక్కడే మృతి చెందారు.

వారిని చూచి ఇలా అన్నాడు హనుమంతుడు. "నా దెబ్బకే ఇంతమంది చచ్చారు. ఇంకా నా లాంటి వాళ్లు సుగ్రీవుని సేనలో లక్షలు కోట్లు ఉన్నారు. వాళ్లను ఎలా తట్టుకుంటారు మీరు. ఒక్కొక్కరు వెయ్యి ఏనుగుల బలం ఉన్న వానరులు ఉన్నారు. కోట్లకొద్దీ వానర సైన్యముతో, రాముడు సుగ్రీవుడు లంకమీదికి దండెత్తి వస్తున్నారు. మీరందరూ చావడం, మీ లంక నాశనం కావడం తథ్యం.

ఒరేయ్! మీ రావణుడు రామునితో అనవసరంగా పెట్టుకున్నాడు. దాని ఫలితంగా మీ రావణుడు, మీరు, మీ లంకానగరం, సర్వనాశనం

అవుతుంది. ఒక్కడు కూడా మిగలడు." అని బిగ్గరగా అరిచి చెప్పాడు హనుమంతుడు.

శ్రీమద్రామాయణము
సుందరకాండము నలుబది మూడవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము
నలుబది నాలుగవ సర్గ.

ప్రహస్తుని కుమారుని పేరు జంబుమాలి. మహా పరాక్రమ వంతుడు. రావణుడు జంబు మాలిని సైన్యసమేతంగా, హనుమంతుని వధించి రమ్మని, పంపించాడు. జంబుమాలి పెద్ద శరీరంతో అతి వికృతంగా క్రూరంగా ఉంటాడు. అప్పటిదాకా జంబుమాలి అపజయము అనే మాట ఎరుగడు. జంబుమాలి ధనుస్సు, బాణములు ధరించి వచ్చాడు. జంబుమాలి చేసే ధనుష్టంకారానికి దిక్కులు మార్మోగు తున్నాయి. గాడిదలు కట్టిన రథం మీద జంబుమాలి అశోకవనము దగ్గర ఉన్న చైత్యప్రాసాదము వద్దకు వచ్చాడు.

జంబు మాలిని చూచి హనుమంతుడు సంతోషంతో కిచా కిచా నవ్వాడు. జంబుమాలి ముఖద్వారము పైన కూర్చుని ఉన్న హనుమంతుని మీద వాడి అయిన బాణములను ప్రయోగించాడు. అర్ధచంద్రబాణముతో హనుమంతుని ముఖము మీద, కర్ణిబాణముతో హనుమంతుని శిరస్సును, పది నారాచబాణములతో హనుమంతుని బాహువుల మీద కొట్టాడు.

హనుమంతుని నుదుటి మీద బాణం తగిలి రక్తం బయటకు చిమ్మింది. హనుమంతుడికి కోపం వచ్చింది. పక్కకు చూచాడు. పక్కన ఒక పెద్ద రాతి బండ కనపడింది. హనుమంతుడు కిందికి దుమికి ఆ రాతి బండను ఎత్తి జంబుమాలి మీదికి విసిరాడు. జంబుమాలి పది బాణములతో ఆ రాతి బండను ముక్కలు చేసాడు. ఇంక లాభం లేదు అనుకొని అశోకవనంలో ఉన్న పెద్ద మద్దిచెట్టును కూకటి వేళ్లతో సహా పెకలించాడు. దానిని రెండు చేతులతో గిరా గిరా తిప్పాడు. హనుమంతుడు మద్దిచెట్టును అలా గిరా గిరా తిప్పుతున్నప్పుడు జంబుమాలి హనుమంతుని మీద బాణప్రయోగం చేసాడు. జంబుమాలి ప్రయోగించిన బాణముల ధాటికి ఆ మద్దివృక్షము తునా తునకలు అయింది.

తరువాత జంబుమాలి హనుమంతుని భుజమును ఐదు బాణములతోనూ, వక్షస్థలమును ఒక బాణంతోనూ కొట్టాడు. ఒక పరిఘను హనుమంతుని మీదికి విసిరాడు. జంబుమాలి ప్రయోగించిన బాణములు తన శరీరం అంతా గుచ్చుకోడంతో హనుమంతుడు కోపంతో ఊగిపోయాడు. జంబుమాలి ప్రయోగించిన పరిఘను పట్టుకొని దానిని తిరిగి వేగంగా జంబుమాలి వక్షస్థమునకు తగిలేట్టు విసిరాడు. జంబు మాలి ఈ పరిణామాన్ని ఊహించలేదు. ఆ పరిఘను వారించడానికి ప్రయత్నించలేదు. అంతే. ఆ పరిఘ జంబుమాలిని బలంగా తాకింది. ఆ పరిఘ దెబ్బకు జంబు మాలి అతను ఎక్కిన రథము, దానికి కట్టబడిన గాడిదలు, తోలుతున్న సారథి అందరూ ముద్దగా అయిపోయారు. జంబుమాలి ఆకారం కూడా కనపడలేదు.

జంబు మాలి మరణించగానే, చావగా మిగిలిన రాక్షస సైనికులు పారిపోయారు. రావణునితో జంబుమాలి మరణ వార్తను చెప్పారు. ప్రహస్తుని కుమారుడు, మహా బలశాలి అయిన జంబుమాలి మరణ వార్త విని రావణుడు కోపంతో ఊగిపోయాడు. తన వద్ద ఉన్న ఏడుగురు మంత్రుల కుమారులను పిలిపించాడు. వారిని అపార సైన్యంతో హనుమంతుని మీదికి యుద్ధానికి పంపాడు.

శ్రీమద్రామాయణము

సుందర కాండము నలుబది నాలుగవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

నలుబది ఐదవ సర్గ.

రావణుని చేత ఆజ్ఞాపింపబడిన ఏడుగురు మంత్రుల కుమారులు అశ్వములు కట్టిన రథములను ఎక్కి హనుమంతుని మీదికి యుద్ధానికి బయలుదేరారు. వారు కూడా సామాన్యులు కారు. మహాబలశాలురు. వారంతా ధనుర్బాణములను ధరించి ఉన్నారు. వారి వెంట పెద్ద సైన్యము బయలుదేరింది. ఏడుగురు మంత్రుల కుమారులు ఉత్సాహంతో హనుమంతుని మీదికి యుద్ధానికి బయలు దేరారు. వారి తల్లి తండ్రులు, బంధువులు మాత్రము “జంబుమాలి వంటి మహావీరుడే హనుమంతుని ధాటికి తట్టుకోలేక మరణించాడు. వీళ్లగతి ఏమవుతుందో”అని ఆందోళన చెందారు. కాని ఆ మంత్రి పుత్రులు మాత్రము హనుమంతుని నేను చంపుతాను అంటే నేను చంపుతాను అంటూ ఉరకలు వేస్తూ దూసుకు వెళుతున్నారు.

ఏడుగురు మంత్రుల కుమారులు తమ తమ బాణపరంపరలతో హనుమంతుని కప్పివేసారు. ఆ బాణవర్షంలో తడిసిపోయాడు హనుమంతుడు. కాని ఒక్కబాణము కూడా తనకు తగల కుండా వేగంగా గిరా గిరా తిరుగుతూ తప్పించుకుంటున్నాడు హనుమంతుడు. మంత్రి కుమారులు ప్రయోగించిన బాణములు అన్నీ వృథా అయ్యాయి. హనుమంతుడు అర్భకులైన మంత్రికుమారులతో ఆడుకుంటున్నాడా అన్నట్టు ఉంది.

తరువాత గట్టిగా అరిచాడు హనుమంతుడు. ఆ అరుపుకు రాక్షససేన కకావికలైంది. హనుమంతుడు ఒక్కొక్క మంత్రి కుమారుని పట్టుకొని తలమీద, వీపు మీద చేత్తో చేతులతో బలంగా చరుస్తున్నాడు. కాళ్లతో తొక్కాడు. అక్కడా ఇక్కడా అనకుండా ఒళ్లంతా పిడిగుద్దులు గుద్దాడు. ఆ దెబ్బలకు తట్టకోలేక మంత్రి కుమారులు అందరూ పరలోకం చేరుకున్నారు. వారు చావగానే హనుమంతుడుమిగిలిన సైనికులను గోళ్లతో రక్కాడు. చీల్చాడు. పెద్దగా అరుస్తూ భయపెట్టాడు. హనుమంతుని చేతిలో చావగా మిగిలిన సైనికులు పారిపోయారు. సైనికులు చేస్తున్న ఆర్తనాదాలతో, ఏనుగుల ఘీంకారాలతో, అశ్వముల సకిలింపులతో లంకానగరము మార్మోగిపోయింది. రాక్షసుల రక్తం కాలువలు కట్టి ప్రవహించింది. ఇప్పటికి వీళ్లు అయ్యారు. ఇంకా ఎవరు వస్తారో అని హనుమంతుడు తోరణ స్తంభము ఎక్కి ఎదురుచూస్తున్నాడు.

శ్రీమద్రామాయణము

సుందర కాండము నలుబది ఐదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

నలుబది ఆరవ సర్గ.

తను పంపిన ఏడుగురు మంత్రి కుమారులు సైన్యంతో సహా హనుమంతుని చేతిలో మరణించారు అన్న వార్త విన్న రావణాసురునిలో మొట్ట మొదటి సారిగా భయం ప్రవేశించింది. “తాను ఓడిపోతున్నాడా! తాను ఓడిపోవడం మొదలయిందా! ఒక్క వానరాన్ని చంపడానికి ఇంతమంది బలికావాలా! ఏమిటీ విపరీత పరిణామం!” అని మనసులోనే మధనపడసాగాడు. కాని తన భయాన్ని బయటకు కనిపించకుండా నిబ్బరంగా ఉన్నాడు.

ఈ సారి ఐదుగురు సేనానాయకులను పిలిపించాడు. వారు విరూపాక్షుడు, యూపాక్షుడు, దుర్ధరుడు, ప్రఘనుడు, భాసకర్ణుడు. వారిని పిలిపించాడు రావణుడు.

“ఓ సేనానాయకులారా! మీరందరూ మీకు కావలసిన సైన్యమును తీసుకొని వెళ్లండి. ఆ వానరాన్ని చంపండి. కాని మీరు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. ఇప్పటిదాకా జరిగిన పరిణామాలు, చంపబడిన సైనికులు, వీరులను బట్టి చూస్తే అది సామాన్యమైన వానరము కాదు. ఏదో మహత్తర శక్తి కల భూతము అనిపిస్తూ ఉంది. మనకు బద్ధశత్రువు అయిన ఇంద్రుడు మనలను తుదముట్టించడానికి తన మహత్తర శక్తితో ఆ భూతాన్ని సృష్టించాడా అని అనుమానంగా ఉంది. ఎందుకంటే ఇంతకు ముందు మనం అందరం దేవతలను, నాగులను, గంధర్వులను, యక్షులను ఓడించాము. వారిలో ఎవరో ఒకరు మనమీద పగబట్టి ఈ రూపంలో వచ్చి ఉండవచ్చు. కాబట్టి

మీరు అది సామాన్య వానరమే కదా అని తేలిగ్గా తీసుకోకండి. నిర్దాక్షిణ్యంగా సంహరించండి.

అంతే కాదు, ఇది నిజమైన వానరమే అనుకుంటే అది కూడా సంభవమే అనిపిస్తూ ఉంది. ఎందుకంటే, నేను ఇంతకు పూర్వము వాలి, సుగ్రీవుడు, జాంబవంతుడు, నీలుడు, ద్వివిదుడు మొదలైన వానరములను చూచి ఉన్నాను. వారు లోకోత్తరమైన శక్తి కలవారు. కాని వారికి ఇంత బుద్ధి, చాకచక్యము లేవు. ఈ వానరము వారి కంటే బుద్ధి, బలము, శౌర్యము, శక్తి కల వానరము అనిపిస్తూ ఉంది. కాబట్టి మీరు ఇది వానర రూపంలో ఉన్న ఒక మహాభూతము అని అనుకొని దానితో యుద్ధం చేయండి.

ఇంతకు ముందు మనము చేసిన యుద్ధములలో ఇంద్రుడు కానీ, అసురులు కానీ, గంధర్వులు కానీ, యక్షులు కానీ మనముందు నిలువ లేదు. అని చెప్పి గర్వించకండి. యుద్ధములో జయాపజయములు చంచలంగా ఉంటాయి. ఎల్లప్పుడే మనమే జయిస్తాము అనుకోవడం పొరపాటు. కాబట్టి జాగరూకతతో వ్యవహరించండి. వానరమే కదా అని నిర్లక్ష్యం చేయకండి.” అని ఆజ్ఞాపించాడు.

రావణుని మాటలు విన్న ఆ సైన్యాధ్యక్షులు రెట్టించిన ఉత్సాహంతో హనుమంతుని మీదికి యుద్ధానికి బయలుదేరారు. వారి వెంట రథికులు, ఆశ్వికులు, గజారోహకులు, వివిధ అస్త్రశస్త్రములను ధరించిన వారు, బలంతులు అయిన సైనికులు బయలుదేరారు.

అశోకవనము ముఖద్వారము వద్ద నిలబడి ఉన్న హనుమంతుడు వీరిని చూచాడు. మరోఐదుగురు చావడానికి వస్తున్నారు అని మనసులో అనుకున్నాడు. రాక్షసులు హనుమంతుని చుట్టుముట్టారు. వివిధ రకములైన ఆయుధములను హనుమంతుని మీద ప్రయోగించారు.

దుర్ధరుడు ఐదు ఇనప ములికలు కలిగిన బాణములను హనుమంతుని తలకు తగిలేట్టు కొట్టాడు. ఆ అయిదు బాణములు తన తలకు తగలగానే హనుమంతుడు సింహనాదము చేస్తూ ఆకాశంలోకి ఎగిరాడు. దుర్ధరుడు కూడా తన రథముతో సహా ఆకాశంలోకి ఎగిరాడు. హనుమంతుని మీద రకరకాలైన బాణములను ప్రయోగించాడు. హనుమంతుడు చిత్రవిచిత్రముగా తిరుగుతూ ఆ బాణముల నుండి తప్పించుకుంటున్నాడు. ఇలా కాదని హనుమంతుడు తన శరీరమును విపరీతంగా పెంచాడు. దుర్ధరుని రథము మీదికి ఎగిరాడు. అక్కడినుండి మహావేగముతో దుర్ధరుని రథము మీద అడ్డంగా పడ్డాడు. మహాకాయంతో హనుమంతుడు దుర్ధరుని రథం మీద పడగానే, రథం విరిగిపోయింది. దానికి కట్టిన గుర్రాలు మరణించాయి. దుర్ధరుడు కూడా ఆ రథము మీది నుండి వేగంగా కిందపడి మరణించాడు.

దుర్ధరుని మరణం కళ్లారా చూచిన విరూపాక్షుడు, యూపాక్షుడు కోపంతో ఊగిపోయారు. వారిద్దరూ ఆకాశంలోకి ఎగిరారు. ఇద్దరూ ముద్గరలతో హనుమ వక్షస్థలము మీద కొట్టారు. హనుమంతుడు వారి నుండి తప్పించుకొని వేగంగా నేలమీదికి దిగాడు. వారు కూడా కిందికి దిగేలోపు హనుమంతుడు ఒక

సాలవృక్షమును పెకలించి సిద్ధంగా ఉన్నాడు. విరూపాక్ష, యూపాక్షులు కిందికి దిగగానే ఆ వృక్షముతో వారిని బలంగా మోదాడు. ఆ దెబ్బలకు తాళలేక ఆ ఇరువురు రాక్షసులు మరణించారు.

వచ్చిన ఐదుగురిలో ముగ్గురు మరణించారు. ఇంక ఇద్దరు మిగిలారు. వారు ప్రఘనుడు, భాసకర్ణుడు. ఇద్దరూ శూలములను తీసుకొని హనుమంతుని మీదికి వెళ్లారు. వారిద్దరూ హనుమంతునికి చెరి ఒక పక్క నిలిచి యుద్ధం చేస్తున్నారు. ఆ ఇరువురు కొట్టిన దెబ్బలకు హనుమంతుని శరీరం అంతా రక్తసిక్తము అయింది. ఇంక లాభం లేదని, హనుమంతుడు ఒక పెద్ద కొండ శిఖరమును పెకలించి వారి మీదికి విసిరాడు. ఆ కొండ శిఖరము కిందపడి ప్రఘనుడు, భాసకర్ణుడు మరణించారు.

ఐదుగురు సేనాపతులు మరణించగానే వారి సేనలు చెల్లాచెదరు అయ్యారు. హనుమంతుడు వారిని తరిమి తరిమి చంపాడు. ఒక ఏనుగును పట్టు కొని మరొక ఏనుగు మీదికి విసిరాడు. రెండు ఏనుగులు చచ్చాయి. అలాగే గుర్రముల మీదికి గుర్రములను, రధముల మీదికి రథములను, రాక్షసుల మీదికి రాక్షసులను విసురుతూ అందరినీ సంహరించాడు హనుమంతుడు.

చచ్చిపడి ఉన్న సైనికులతోనూ, రథములతోనూ అశ్వములతోనూ ఏనుగులతోనూ ఆ ప్రదేశము అంతా నడవడానికి వీలులేకుండా ఉంది. పీనుగుల పెంట అయింది.

హనుమంతుడు తిరిగి తోరణ స్తంభము ఎక్కి కూర్చున్నాడు. ఈ సారి ఎంతమంది వస్తారా అని ఎదురుచూస్తున్నాడు.

శ్రీమద్రామాయణము
సుందర కాండము నలుబది ఆరవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము
నలుబది ఏడవ సర్గ.

పట్టుదల, కోపము, అహంకారమూ మనసులో ప్రజ్వరిల్లితే మనిషి కానీ, రాక్షసుడు కానీ యుక్తాయుక్త వివేచన కోల్పోతాడు. రావణుని పరిస్థితి అలాగే ఉంది. వచ్చిన వానరుడు ఒక్కడు. చచ్చిన వాళ్లు వేలకు వేలు. కారణం ఏమిటి? ఆలోచించలేదు. జంబుమాలి చచ్చాడు. ఏడుగురు మంత్రి కుమారులు వధింపబడ్డారు. ఐదుగురు సేనాపతులు పరలోక గతులయ్యారు. కానీ రావణునికి బుద్ధిరాలేదు. అసలు విషయం కనుక్కోవాలనే ఆలోచన రాలేదు.

ఐదుగురు సేనాపతులు మరణించారు అన్న వార్త విని తన ఎదురుగా కూర్చుని ఉన్న తన కుమారుడు అక్షయ కుమారుని వంక చూచాడు రావణుడు. తండ్రి అభిప్రాయాన్ని అర్థం చేసుకున్నాడు అక్ష కుమారుడు. పైకి లేచాడు. అపార సేనావాహినితో హనుమంతుని మీదికి యుద్ధానికి బయలుదేరాడు. అక్షకుమారుడు ఎక్కిన రథము అతడు ఎంతో తపస్సు చేసి సంపాదించినది. దానికి ఎనిమిది గుర్రములు కట్టి ఉన్నాయి. అది మనస్సు కంటే వేగంగా ప్రయాణం

చేస్తుంది. ఆ రథాన్ని దేవతలు, అసురులు, గంధర్వులు కూడా ఆప శక్యం కాదు. ఆరథము భూమి మీద ఆకాశంలోనూ నిరాఘాటంగా ప్రయాణం చేస్తుంది. అటువంటి రథాన్ని ఎక్కాడు అక్షకుమారుడు. ధనుర్బాణములు ధరించాడు. ఖడ్గములు, తోమరములు, శక్తి అస్త్రములు తన రథంలో పెట్టించాడు. అక్షకుమారుడు హనుమంతుని మీదికి యుద్ధానికి బయలుదేరాడు. అక్షకుమారుని వెంట అశేష సేనావాహిని బయలుదేరింది.

అక్షకుమారుడు అశోక వనము ముఖద్వారమును సమీపించాడు. హనుమంతుని వంక చూచాడు. అక్షకుమారునికి ఆశ్చర్యము గౌరవము ఒకేసారి కలిగాయి. అక్షకుమారుడు తన బలమును, హనుమంతుని బలమును అంచనా వేసుకున్నాడు. హనుమంతునితో ఎలా యుద్ధం చెయ్యాలో మనసులో నిర్ణయించుకున్నాడు. ముందుగా అక్షకుమారుడు మూడు బాణములను హనుమంతుని మీద ప్రయోగించి హనుమంతుని యుద్ధానికి ఆహ్వానించాడు.

అక్షకుమారుని ఆర్భాటం అంతా తోరణ స్తంభం మీది నుండి ఆసక్తితో చూస్తున్నాడు హనుమంతుడు. అక్షకుమారుడు వాడి అయిన మూడు బాణములతో హనుమంతుని తలమీద కొట్టాడు. ఆ బాణములు హనుమంతుని శిరస్సును గాయపరిచాయి. వెంటనే అక్షకుమారునితో యుద్ధానికి తలపడ్డాడు. తన శరీరమును పెంచాడు. అది చూచిన అక్షకుమారుడు హనుమంతుని మీద బాణములను వర్షం మాదిరి కురిపించాడు. అది చూచి హనుమంతుడు పెద్దగా అరిచాడు. బుజాలు చరచుకున్నాడు.

హనుమంతుడు కాళ్లు చేతులు భయంకరంగా ఆడిస్తూ ఆకాశంలోకి ఎగిరాడు. ఆకాశంలోకి ఎగురుతున్న హనుమంతుని చూచి అక్షకుమారుడు హనుమంతుని మీద బాణములు వేస్తూ తాను కూడా ఆకాశంలోకి ఎగిరాడు.

హనుమంతుడు ఆకాశంలో గిరా గిరా తిరుగుతూ అక్షకుమారుడు తన మీద ప్రయోగిస్తున్న బాణములను తప్పుకుంటున్నాడు. అలా ఆకాశంలో గిరా గిరా తిరుగుతూనే అక్షకుమారుని పరాక్రమాన్ని చూచి ఆలోచనలో పడ్డాడు హనుమంతుడు. ఇంతలో అక్షకుమారుడు తన వాడి అయిన బాణములతో హనుమంతుని వక్షస్థలము మీద కొట్టాడు. అక్షకుమారుని యుద్ధనైపుణ్యము చూచి హనుమంతునికి ముచ్చటేసింది. బాలుడు, అపార యుద్ధనైపుణ్యము చూపుతున్న అక్షకుమారుని చంపడానికి హనుమకు మనసొప్పలేదు. అక్షకుమారుని బాణముల ధాటిని తప్పుకుంటూనే హనుమంతుడు అక్షకుమారుని గురించి ఆలోచిస్తున్నాడు.

"ఈ కుమారుడు మహాపరాక్రమవంతుడు, బుద్ధిమంతుడు. మంచి యుద్ధనైపుణ్యము కలవాడు. ఇతని యుద్ధతంత్రములను దేవతలు, యక్షులు, గంధర్వులు కూడా మెచ్చుకుంటారు. ఇతడిని చంపడానికి మనసురావడం లేదు. కానీ ఇతని పరాక్రమము క్షణక్షణానికీ పెరిగిపోతూ ఉంది. ఇంక లాభం లేదు. ఇతనిని ఉపేక్షిస్తే నన్ను సంహరిస్తాడు. కాబట్టి ఇతని మీద జాలి చూపడం మంచిది కాదు. ఇతనిని చంపక తప్పదు." అని మనసులో నిశ్చయించుకున్నాడు హనుమంతుడు. ఎలా చంపాలా అని పథకం వేసుకున్నాడు.

హనుమంతుడు ఒక్కసారిగా గాలిలోకి ఎగిరాడు. మహావేగంతో కిందికి దిగుతూ అక్షకుమారుని రథమునకు కట్టిన గుర్రములను అరిచేతితో బలంగా చరిచాడు. ఆ దెబ్బలకు తట్టుకోలేక ఆ గుర్రములు కిందపడి మరణించాయి. తరువాత హనుమంతుడు అక్షకుమారుని దివ్య రథమును ఒక్కవేటుతో విరగ్గొట్టాడు. అక్షకుమారుడు రథము నుండి జారి కింద పడ్డాడు. రథము ఆకాశములో ఉన్నందున, అక్షకుమారుడు ఆకాశంలో నుండి గిరా గిరా తిరుగుతూ కిందకు జారుతున్నాడు. అంతలోనే అక్షకుమారుడు ఒక చేత్తో ఖడ్గము ధరించి పైకి ఎగిరాడు. కానీ, హనుమంతుడు అక్షకుమారుని కాళ్లు పట్టుకొని కిందికి బలంగా లాగాడు. హనుమంతుడు అక్షకుమారుని రెండు కాళ్లు పట్టుకొని గిరా గిరా తిప్పి నేలకేసి మోదాడు. ఆ దెబ్బకు అక్షకుమారుని చేతులు, కాళ్లు, నడుము విరిగిపోయాయి. అక్షకుమారుడు నెత్తురు కక్కుకొని మరణించాడు.

అక్షకుమారుడు మరణించడం చూచిన అతని సేనలు ఇంక హనుమంతునితో యుద్ధ చేయకుండా పలాయనం చిత్తగించాయి. యుద్ధం చేయడానికి ఎవరూ లేకపోవడంతో, హనుమంతుడు తిరిగి తోరణ స్తంభము ఎక్కి ఇంకా ఎవరన్నా వస్తారా అని ఎదురుచూస్తున్నాడు.

శ్రీమద్రామాయణము
సుందర కాండము నలుబది ఏడవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

నలుబది ఎనిమిదవ సర్గ.

తన కుమారుడు కూడా హనుమంతుని చేతిలో హతమైనాడు అన్న వార్త విన్న రావణునికి దిక్కుతోచలేదు. దు:ఖాన్ని తట్టుకోలేకపోయాడు. అయినా గుండె నిబ్బరం చేసుకున్నాడు. తన కుమారుడు ఇంద్రజిత్తును హనుమంతుని మీదికి యుద్ధానికి వెళ్లమని ఆదేశించాడు.

ఇంద్రుని జయించిన వాడు ఇంద్రజిత్తు. మహా బలవంతుడు. పరాక్రమవంతుడు. వీర్యవంతుడు. ధైర్యవంతుడు. అప్పటి దాకా ఓటమి ఎరుగని వాడు. అటువంటి ఇంద్రజిత్తును హనుమంతుని మీదికి యుద్ధానికి పంపుతూ ఇంద్రజిత్తుతో ఇలా అన్నాడు రావణుడు.

"కుమారా! నీవు సకల అస్త్ర, శస్త్ర కోవిదుడవు. నీకు తెలియని అస్త్రము లేదు. నీవు దేవతలను, అసురులను జయించిన వాడవు. నీవు బ్రహ్మదేవుని ఆరాధించి బ్రహ్మవలన బ్రహ్మాస్త్రమును పొందిన వాడవు. దేవేంద్రుడు, దేవతలు, మరుత్తులు, ఎవరు కూడా యుద్ధములో నీ ముందు నిలువలేరు. ముల్లోకములలో నిన్ను ఎదిరించి గెలిచిన వాడు లేడు. నీకు దేశ, కాల మాన పరిస్థితులను బట్టి యుద్ధము చేయడం తెలుసు. వీర్యములో కానీ, పరాక్రమములో కానీ, బుద్ధిలోకానీ, బలములోకానీ, అస్త్ర,శస్త్రనైపుణ్యములో కానీ నీకు సాటిరాగల వాడు ముల్లోకములలో లేడు. నీకు తప్పక విజయము లభిస్తుంది.

నీకు తెలిసే ఉంటుంది. ఆ వింత వానరము చేతిలో జంబుమాలి, మంత్రుల పుత్రులు ఏడుగురు, ఐదుగురు సైన్యాధ్యక్షులు మరణించారు. మన అక్షకుమారుడు కూడా మృతి చెందాడు. ప్రస్తుతము నాతో సమానమైన వాడివి నీవు మిగిలి ఉన్నావు. నీవు తొందర పడకుండా ఆ వానరుని బలమును, పరాక్రమమును తెలుసుకొని, నీ బలాన్ని శక్తిని ఉపయోగించి అతనితో యుద్ధము చెయ్యి. నా ఆశలన్నీ నీ మీదనే పెట్టుకొని ఉన్నాను. ఆ వానరుని చంపి విజయుడవై తిరిగిరా!

మరొక్క మాట. ఎంత మంది సైనికులు ఉన్నను ఆ వానరుని ముందు నిలువలేకపోతున్నారు. కాబట్టి ఎంతమంది సైనికులు ఉన్నారు అన్నది ముఖ్యంకాదు. బుద్ధిబలంతో, పరాక్రమంతో, నీ వద్ద ఉన్న అస్త్రములను, శస్త్రములను సమయానుకూలంగా ప్రయోగించి ఆ వానరుని జయించు. నేను నిన్ను నా కుమారునిగా పంపడం లేదు. యుద్ధయు చేయడం రాజధర్మము. ఆ రాజధర్మము నిర్వర్తించడానికి నిన్ను పంపుతున్నాను. నీ ధర్మాన్ని నువ్వు నిర్వర్తించు." అని పలికాడు రావణుడు.

తండ్రి మాటలను శ్రద్ధగా విన్నాడు ఇంద్రజిత్తు. తండ్రికి ప్రదక్షిణాపూర్వకంగా నమస్కరించాడు. సమరోత్సాహంతో తన రథాన్ని ఎక్కి యుద్ధభూమికి వెళ్లాడు ఇంద్రజిత్తు. హనుమంతుడు ఇంద్రజిత్తు రాకను దూరంనుండే చూచాడు. ఇంద్రజిత్తు చేయుచున్న ధనుష్టంకారమును విన్నాడు. హనుమంతుడు ఇంద్రజిత్తును చూచి తన శరీరమును పెంచాడు. పెద్దగా హుంకారము చేసాడు. ఇంద్రజిత్తు ధనుష్టంకారము చేస్తుంటే హనుమంతుడు పెద్దగా అరుస్తున్నాడు.

హనుమంతుడు, ఇంద్రజిత్తు రణరంగంలోకి దిగాడు.

ఇంద్రజిత్తు హనుమంతుని మీద రకరకాలైన శరములను ప్రయోగించాడు. ఆ శరాఘాతములను తప్పించుకోడానికి హనుమంతుడు ఆకాశంలోకి ఎగిరాడు. హనుమంతుడు ఎక్కడ ఉంటే అక్కడ బాణములను ప్రయోగిస్తున్నాడు ఇంద్రజిత్తు. హనుమంతుడు చిత్రవిచిత్ర రీతులలో ఎగురుతూ ఆ బాణముల బారి నుండి తప్పించుకుంటున్నాడు. ఇంద్రజిత్తు అటు కొడితే ఇటు, ఇటు కొడితే అటు ఎగురుతున్నాడు. ఇంద్రజిత్తు ప్రయోగించిన అస్త్రములు, శస్త్రములు అన్నీ వృధా అవుతున్నాయి.

ఒక్కోసారి హనుమంతుడు ఇంద్రజిత్తు ఎదురుగా నిలబడుతున్నాడు. చిక్కాడు కదా అని హనుమంతుని మీద బాణములు వేస్తే అంతలోనే రెండు చేతులు పైకెత్తి ఆకాశంలోకి ఎగురుతున్నాడు. ఇంద్రజిత్తు వేసిన బాణములు గురితప్పుతున్నాయి. హనుమంతుతని ఎలా జయించాలా అని ఇంద్రజిత్తు నానా రకాలుగా ఆలోచిస్తున్నాడు. హనుమంతుని లోని బలహీనత అంతుచిక్కడం లేదు ఇంద్రజిత్తుకు. అలాగే ఇంద్రజిత్తును ఎలా ఓడించాలా అని హనుమంతుడు శతవిధాలా ప్రయత్నం చేస్తున్నాడు. కాని అతని వల్ల కావడం లేదు.

ఇద్దరూ సమఉజ్జీల మాదిరి యుద్ధం చేస్తున్నారు. గురితప్పదు అనుకున్న బాణం కూడా వ్యర్థం కావడం చూచి ఇంద్రజిత్తు ఆలోచనలో పడ్డాడు. హనుమంతుని ఎలా కొట్టాలా అని ఆలోచిస్తున్నాడు. హనుమంతుని చంపడం తన వల్లకాదు అని

అనుకున్నాడు ఇంద్రజిత్తు. కనీసము హనుమంతుని పట్టుకొని బంధించడానికి ప్రయత్నం చెయ్యాలి అని నిశ్చయించుకున్నాడు. బ్రహ్మాస్త్రమును మనసులో స్మరించాడు. విల్లు ఎక్కుపెట్టి అస్త్రమును సంధించాడు. బ్రహ్మాస్త్రమును ప్రయోగించాడు. ఆ బ్రహ్మఅస్త్రము ధాటికి హనుమంతుని శక్తి తగ్గిపోయింది. తాను బంధింపబడుతున్నాను అని తెలుసుకున్నాడు హనుమంతుడు. తనకు ఇంతకు ముందు బ్రహ్మ ఇచ్చిన వరమును స్మరించుకున్నాడు. హనుమంతునికి తాను బ్రహ్మాస్త్రము చేత బంధింపబడుతున్నాను అని తెలిసింది.

"నేను బ్రహ్మాస్త్రమును గౌరవించాలి. బ్రహ్మాస్త్రము బారి నుండి తప్పించుకొనే శక్తి నాకు లేదు. నేను దీనికి కట్టుబడాలి. తప్పదు. అయినా నన్ను బ్రహ్మ దేవుడు, నా తండ్రి వాయుదేవుడు నిరంతరమూ రక్షిస్తూ ఉండగా నాకు భయం ఎందుకు. ఈ బ్రహ్మాస్త్రము నన్ను ఏమీ చేయలేదు. ఇలా కట్టుబడి ఉండటం వలన నాకు మరొక లాభం కూడా ఉంది. నేను రాక్షస రాజు రావణుని చూడవచ్చును. అతనితో మాట్లాడవచ్చును. రాముని సందేశము వినిపించవచ్చును. రావణుని మనోభావములు తెలుసుకొనవచ్చును." అని మనసులో అనుకున్నాడు హనుమంతుడు. అందుకని కదలక మెదలక ఊరుకున్నాడు.

రాక్షస సైన్యము హనుమంతుని చుట్టుముట్టింది. హనుమంతుని తాళ్లతో బంధించింది. తనను రాక్షసులు బంధిస్తుంటే తనకు ఇష్టం లేనట్టు నటిస్తూ పెద్దగా అరుస్తున్నాడు హనుమంతుడు. అప్పుడు రాక్షసులు హనుమంతుని పెద్ద పెద్ద తాళ్లతోనూ, నారలతో చేసిన వస్త్రములతోనూ గట్టిగా కట్టారు. హనుమంతుడు తాళ్లతో

చక్కగా కట్టించుకున్నాడు.

రాక్షసులు ఎప్పుడైతే హనుమంతుని తాళ్లతో కట్టారో, బ్రహ్మాస్త్రము ప్రభావము అంతరించింది. బ్రహ్మాస్త్రము హనుమంతుని తన బంధనముల నుండి విడిచిపెట్టింది. ఎందుకంటే మరొక బంధనముతో బంధిస్తే అస్త్రబంధము విడిపోతుంది. ఈవిషయం ఇంద్రజిత్తుకు తెలుసు. "ఇప్పుడు ఈ వానరము బ్రహ్మాస్త్రబంధనములో లేడు. ఈ తాళ్లు ఈ వానరమును ఏమీ చేయలేవు. ఈ బుద్ధిలేని రాక్షసులు ఈ పనిచేసారు. నేను చేసిన శ్రమ అంతా వృధా అయింది. ఈ విషయం హనుమంతునికి తెలిస్తే క్షణంలో తప్పించుకుంటాడు. ఏం చెయ్యడం" అని ఆలోచనలోపడ్డాడు ఇంద్రజిత్తు. కాని ఈ విషయం హనుమంతునికి తెలియదు అన్న విషయం గ్రహించి కాస్త ఊరట చెందాడు.

ఇదేమీ తెలియని రాక్షసులు హనుమంతుని ఈడ్చుకొనుచూ, గుద్దుతూ, కర్రలతో, కాళ్లతో, చేతులతో తన్నుతూ రావణుని వద్దకు తీసుకొని వెళ్లారు. రావణుని ముందు నిలబెట్టారు. "మహారాజా! ఇప్పటిదాకా లంకలో అల్లకల్లోలము సృష్టించిన వానరము ఇదే" అని చెప్పారు.

ఆ సభలో ఉన్న వారికి అందరికీ ఆశ్చర్యము కలిగింది. ఈ చిన్న వానరము ఇంత పని చేసిందా? ఇంతకూ ఈ వానరము ఎవ్వరు? ఎక్కడి నుండి వచ్చింది? ఎవరు పంపారు? ఎందుకు పంపారు? లంకలో ఈ వానరమునకు ఏమి పని? ఈ వానరమునకు లంకలో ఆశ్రయము ఇచ్చినవారు ఎవరు?" అని వాళ్లలో వాళ్లు

గుసగుసలాడుకుంటున్నారు. మరి కొంత మంది పెద్దగా “వీడిని కొట్టండి. చంపండి. తినెయ్యండి. కాల్చెయ్యండి.” అని పెద్దగా అరుస్తున్నారు. ఆ రాక్షసులు హనుమంతుని రావణుని ముందు నిలబెట్టారు.

రావణుడు వృద్ధులైన మంత్రుల మధ్య కూర్చుని ఉన్నాడు. రావణుడు హనుమంతుని వంక చూచాడు. హనుమంతుడు కూడా మహాతేజముతో వెలిగిపోతున్న రావణుని చూచాడు. రావణుడు తన మంత్రులను చూచి విచారణ మొదలు పెట్టమన్నాడు. అప్పుడు మంత్రులు హనుమంతుని చూచి “నీవు ఎవరు? ఇక్కడకు ఎందుకు వచ్చావు? నిన్ను ఎవరు పంపారు?” అని అడిగారు.

“ నేను సుగ్రీవుడు పంపగా వచ్చాను” అని హనుమంతుడు బదులు చెప్పాడు.

శ్రీమద్రామాయణము
సుందర కాండము నలుబది ఎనిమిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము
నలుబది తొమ్మిదవ సర్గ.

తీవిగా సింహాసనము మీద కూర్చుని ఉన్న రావణుని చూచి హనుమంతుడు మనసులో “ఇతడేనా రావణుడు. నన్ను కట్టి తన

వద్దకు రప్పించుకున్న వాడు." అని అనుకొన్నాడు. హనుమంతుడు రావణుని నిశితంగా పరిశీలిస్తున్నాడు.

రావణుడు ఆ సమయంలో మెరిసిపోతున్న బంగారు కిరీటమును ధరించాడు. వజ్రములు, మణులు పొదిగిన బంగారు ఆభరణములను ధరించాడు. ఎర్రని పట్టు బట్టలు కట్టుకొని ఉన్నాడు. ఒళ్లంతా ఎర్రని మైపూతలు పూసుకొని ఉన్నాడు. ఆ రావణునికి భయంకరమైన పదితలలు ఉన్నాయి. ఆ రావణుడు ఉన్నతమైన ఆసనము మీద కూర్చుని ఉన్నాడు. అతని ఇరు పక్కల స్త్రీలు వింజామరలు వీస్తున్నారు. రావణుని దగ్గర దుర్ధరుడు, ప్రహస్తుడు, మహాపార్శ్వుడు, నికుంభుడు అనే మంత్రులు ఇరుపక్కల కూర్చుని ఉన్నారు. వీరు కాకుండా ఇంకా కొంత మంది మంత్రులు రావణుని కొలువు కూటములో ఉన్నారు. మంత్రులతో కూడి ఉన్న రావణుని చూచి హనుమంతుడు తన మనసులో ఇలా అనుకున్నాడు.

"ఆహా! ఏమి వీడి తేజస్సు. ఏమి రూపము? ఏమి ధైర్యము. ఏమి పరాక్రమము? వీడే కనుక అధర్మ ప్రవర్తన వీడి ధర్మమును అవలంబించిన ఎడల, వీడు సాక్షాత్తు ఇంద్రుని తో సమానముగా దేవలోకమును ఏలదగిన వాడు. కాని ఇతడు తన బలముతో దేవతలను, దిక్పాలకులను తన సేవకులుగా చేసుకున్నాడు. ఇతడి క్రూరకర్మలే ఇతనిని నాశనం చేస్తున్నాయి." అని మనసులో అనుకున్నాడు హనుమంతుడు.

శ్రీమద్రామాయణము

సుందర కాండము నలుబది తొమ్మిదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

ఏబదియవ సర్గ.

రావణుడు కూడా హనుమంతుని చూచి తన మనసులో ఇలా అనుకున్నాడు. "వీడా! ఈ వానరమా తనను ఇంతకాలమూ ముప్పు తిప్పలు పెట్టింది. ఇంత మంది రాక్షస వీరులను చంపింది ఈ వానరమా! పూర్వము నేను కైలాస పర్వతమును ఎత్తినపుడు నన్ను శపించిన నందీశ్వరుడు ఈ రూపంలో రాలేదు కదా! లేక వీడు వానర రూపంలో ఉన్న బాణాసురుడు కాదు కదా! లేక పోతే వీడికి ఇంత బలము పరాక్రమము ఎలా వచ్చాయి." అని మనసులో అనుకున్నాడు.

ప్రహస్తుని చూచి ఇలా అన్నాడు. " ప్రహస్తా! వీడు ఎవరు? ఎక్కడినుండి వచ్చాడు? ఇక్కడకు ఎందుకు వచ్చాడు? ఎవరు పంపితే వచ్చాడు? అశోక వనమును ఎందుకు పాడు చేసాడు? రాక్షసులను ఎందుకు చంపాడు? లంకానగరానికి ఎందుకు వచ్చాడు? రాక్షసులతో ఎందుకు యుద్ధం చేసాడు? వివరంగా అడగండి." అని ఆదేశించాడు.

అప్పుడు ప్రహస్తుడు హనుమంతునితో ఇలా అన్నాడు. "ఓ వానరుడా! నీవు భయపడవద్దు. నీకు ఏమీ అపకారము చెయ్యము. నిన్ను ఇక్కడకు ఎవరు పంపారు? ఇంద్రుడు పంపించాడా? నిజం చెప్పు. నిన్ను ఏమీ చెయ్యము. విడచి పెడతాము. ఇంద్రుడు కాకపోతే వరుణుడు పంపించాడా? నువ్వు ఎవరి గూఢచారివి? నిగూఢంగా ఎందుకు లంకలో ప్రవేశించావు? పోనీ కుబేరుడు పంపాడా?

యముడు పంపాడా? ఎవరు పంపారు? నిజం చెప్పు. లేకపోతే విష్ణువు నిన్ను తన దూతగా పంపాడా!

నీ రూపము వానర రూపము. కానీ నీ ముఖంలో వింతఅయిన తేజస్సు కనబడుతూ ఉంది. నీవు సామాన్య వానరము కావు. అందుకని ఉన్నది ఉన్నట్టు నిజం చెప్పు. వెంటనే నిన్ను విడిచి పెడతాము. అలా కాకుండా అసత్యము పలికావో నీవు జీవించడం కష్టము. అది సరే! పోనీ నిన్ను ఎవరూ పంపలేదు అనుకుందాము. నీ అంతట నీవే వచ్చావా? ఎందుకు వచ్చావు? నీకు లంకలో ఏమి పని? రావణుని గృహంలోకి ఎందుకు ప్రవేశించావు? " అని అడిగాడు ప్రహస్తుడు.

అప్పుడు హనుమంతుడు ప్రహస్తునితో ఇలా అన్నాడు. "మీరు చెప్పినట్టు నేను ఇంద్రునికి కానీ, యమునికి కానీ, వరుణునికి కానీ, విష్ణువుకు కానీ లేక కుబేరునికి కానీ దూతను కాను. నన్ను వారు ఎవరూ పంపలేదు. వారికీ నాకూ ఎలాంటి సంబంధము లేదు. పైగా మీరు అన్నట్టు నేను ఏ మారు రూపములో రాలేదు. నేను వానరుడను. నాది వానరజాతి. నేను వానర రూపంలోనే వచ్చాను. నా అంతట నేను వచ్చాను. రావణుని చూడాలని అనుకున్నాను. రావణుని దర్శనము అంత సులభంగా లభించదు కదా! అందుకని అశోకవనమును నాశనం చేసాను. రాక్షసులు నాతో యుద్ధం చేసారు. నన్ను నేను రక్షించుకోడానికి నేనూ వారితో యుద్ధం చేసాను. వాళ్లు చచ్చారు. నన్ను ఎవరూ ఏ అస్త్రముతో బంధించలేరు. ఇది నాకు బ్రహ్మ ఇచ్చిన వరము. కాని బ్రహ్మాస్త్రమును గౌరవించి పట్టుబడ్డాను. అందువలన నన్ను పట్టుకోగలిగారు. రావణుని వద్దకు తీసుకొని వచ్చారు.

నేను ఒక రాచకార్యము మీద రావణుని వద్దకు వచ్చాను. ఓ రావణా! నేను రాముని దూతను. నీకు నాలుగు మంచి మాటలు చెబుదామని వచ్చాను.” అని అన్నాడు హనుమంతుడు.

శ్రీమద్రామాయణము
సుందర కాండము ఏబదియవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము
ఏబది ఒకటవ సర్గ.

హనుమంతుడు రావణుని ఎదురుగా నిలబడి, రావణుని చూచి ఏ మాత్రమూ భయపడకుండా ఈ విధంగా పలికాడు. “ఓ రాక్షసేంద్రా! నేను కిష్కింధను పాలించే సుగ్రీవుని వద్దనుండి వచ్చాను. నేను ఆయన మంత్రిని. నా పేరు హనుమంతుడు. సుగ్రీవుడు నీ క్షేమములు కనుక్కోమన్నాడు. సుగ్రీవుడు నీకు ఒక సందేశము పంపాడు. దానిని సావధానంగా విను.

ఇక్ష్వాకు వంశంలో దశరథుడు అనే మహారాజు ఉన్నాడు. అతని పెద్ద కుమారుడు రాముడు. రాముడు తన తండ్రి దశరథుని ఆదేశము మేరకు తన భార్య సీతతోనూ, తమ్ముడు లక్ష్మణుని తోనూ దండకారణ్యమునకు వచ్చి వనవాసము చేస్తున్నాడు. రాముని భార్య సీత, విదేహ రాజపుత్రి. భర్తను అనుసరించి వనవాసమునకు వచ్చింది.

సుందర కాండము

కాని ఒక రోజు సీత అరణ్యములో కనపడకుండా పోయింది. తన భార్య సీతను వెదుక్కుంటూ రాముడు, రాముని తమ్ముడు లక్ష్మణుడు ఋష్యమూక పర్వతము వద్దకు వచ్చారు. వారు సుగ్రీవునితో మైత్రి చేసుకున్నారు. సీతను వెదకడానికి సాయం చేస్తానని సుగ్రీవుడు, సుగ్రీవుడు కోల్పోయిన రాజ్యము తిరిగి అతనికి ఇప్పిస్తానని రాముడు ప్రతిజ్ఞలు చేసుకున్నారు. తదుపరి రాముడు వాలిని చంపి, సుగ్రీవుని కిష్కింధకు రాజ్యాభిషిక్తుని చేసాడు. వాలి గురించి నీకు నేను వేరుగా చెప్ప పని లేదు. అటువంటి వాలిని ఒకే ఒక్క బాణంతో రాముడు చంపాడు.

సుగ్రీవుడు కూడా తాను చేసిన ప్రతిజ్ఞలో భాగంగా సీతను వెదకడానికి వానరులను నలుదిక్కులకూ పంపాడు. దక్షిణ దిశగా పంపిన వారిలో నేను ఒకడిని. నా పేరు హనుమంతుడు. నేను వాయుదేవుని కుమారుడను. నేను సీత కోసరము నూరు యోజనముల సముద్రమును దాటిలంకకు వచ్చాను. సీత లంకలో ఉన్నదని కనుక్కున్నాను. నీవే సీతను అపహరించావు అని తెలిసింది.

ఓ లంకేశ్వరా! నీవు ధర్మాధర్మములను తెలిసినవాడవు. గొప్ప తపస్సంపన్నుడవు. ఇతరుల భార్యలను నీ ఇంటిలో ఉంచుకోవడం ధర్మం కాదు. నీ వంటి ధర్మాత్ములు, బుద్ధిమంతులు ఇటువంటి అధర్మమైన పనులుచేస్తారా! తన భార్యను తీసుకు వెళితే రామునికి కోపం రాదా! రాముని, అతని తమ్ముడు లక్ష్మణుని బాణములను ఎదుర్కొనడం ఇతరులకు సాధ్యమా! రామునికి కీడు చేసి ఈ ముల్లోకములలో ఎవడూ బతకలేడు! అందుకని నా మాట విను. సీతను రాముని వద్దకు పంపు. నీవు సుఖంగా ఉండు. నేను అశోకవనములో ఉన్న సీతను

చూచాను. సీతమ్మ దర్శనం నాకు లభించింది. నేను వెళ్లి సీత లంకలో ఉన్న అశోకవనములో ఉన్నదని రామునికి చెబుతాను. తరువాత కథ రాముడే చూచుకుంటాడు.

ఓ రావణా! సీత మీద చెయ్యివేసి చాలా పొరపాటు చేసావు. రాబోయే ప్రమాదాన్ని గుర్తించలేకపోతున్నావు. దానికి ఫలితం అనుభవిస్తావు. సీతను నీ వద్ద ఉంచుకోవడం విషము కలిపిన అన్నము తినడం లాంటిది. తిని బతకడం కష్టం కదా! నీవు ఎంతో తపస్సు చేసి, అనంత ఐశ్వర్యాన్ని, దీర్ఘమైన ఆయుస్సు పొంది ఉన్నావు. దానిని నీ అధర్మ ప్రవర్తనతో నాశనం చేసుకోకు! నీవు తపస్సు చేసి దేవతల చేత, అసురుల చేతిలో మరణం లేకుండా వరం పొందాను అని అనుకుంటు న్నావు. అది సరి కాదు. సుగ్రీవుడు దేవత కానీ, అసురుడు కానీ, గంధర్వుడు కానీ, యక్షుడు కానీ కాదు. కేవలం వానరుడు. నీవు నరుల చేతిలో కానీ, వానరుల చేతిలో చావు లేదని వరం కోరలేదు. మరి సుగ్రీవుని నుండి నీ ప్రాణాలు ఎలా రక్షించుకుంటావో ఆలోచించు!

ఓ లంకేశ్వరా! నీవు ఆర్జించిన పుణ్యఫలము అనుభవించడం పూర్తి అయింది. ఇంక నీ పాపఫలము అనుభవంలోకి రానుంది. దానిని అనుభవించక తప్పదు. ఓ రావణా! నీవు చేసిన పుణ్యం కొంచెమే. పాపం ఎక్కువ. నీ పుణ్యఫలానుభం పూర్తి అయింది. ఇంక నీ పాపాల ఫలితాలను అనుభవించడానికి సిద్ధంగా ఉండు. మరొక్కమాట! జనస్థానములో 14,000 మంది రాక్షసులను ఒంటి చేత్తో రాముడు చంపడం గుర్తుకు తెచ్చుకో. మహా బలశాలి అయిన వాలిని రాముడు ఒకేఒక బాణంతో చంపడం మరిచిపోకు!

సుగ్రీవుడు, రాముడు ఒకరికొకరు సాయం చేసుకోడానికి ప్రతిజ్ఞలు చేసుకున్నారు అని గుర్తుపెట్టుకో! తరువాత నీకు ఏది మంచిదో అది చెయ్యి.

ఇంక నా సంగతి. నేను లంకలో ఏమేమి చేసానో నీకు తెలుసు. జంబుమాలి, ఐదుగురు సేనాపతులు, ఏడుగురు మంత్రి పుత్రులు నాచేతిలో మరణించారు. ఇంక సైన్యం సంగతి చెప్పనక్కరలేదు. నేను తలచుకుంటే ఈ క్షణమే లంకను నాశనం చెయ్యగలను. కానీ, రాముడు నాకు ఆ పని అప్పగించలేదు. కాబట్టి చెయ్యను. ఎందుకంటే రాముడు అందరి ముందరా శత్రువులను నాశనం చేసి, సీతను తీసుకొని వస్తాను అని ప్రతిజ్ఞచేసాడు. రాముని ప్రతిజ్ఞను భంగం చేయడం నాకు ఇష్టం లేదు.

రామునితో విరోధము పెట్టుకొని సాక్షాత్తు దేవేంద్రుడు కూడా సుఖంగా ఉండలేడు. ఇంక నీ సంగతి చెప్పాల్సిన పనిలేదు. నీవు సీతను సామాన్య స్త్రీ అనుకుంటున్నావు. కాలసర్పమును తెచ్చి లంకలో పెట్టుకున్నావు అని మర్చిపోతున్నావు. సీత రూపంలో ఉన్న కాలపాశమును నీ మెడలో తగిలించుకోకు. నీ మంత్రులతో ఆలోచించి ఏది మంచిదో అది చెయ్యి. నీవు నీ మొండి పట్టు వదలక పోతే భగభగమండే మంటలలో భస్మం అయ్యే లంకను చూస్తావు. నీ స్నేహితులు, మంత్రులు, నీ భార్యలు, అంతఃపుర స్త్రీలు, బంధువులు, నీ కుమారులు, సోదరులు అందరూ నాశనం కావడం కళ్లారా చూస్తావు.

ఓ రాక్షసరాజా! నేను రాముని దూతను. కేవలం దూతను. నాకు ఎవరి మీదా కోపము ద్వేషమూ లేవు. నీకు నాలుగు మంచి

మాటలు చెబుతున్నాను. ఆలకించు.

నేను సత్యమే చెబుతున్నాను. రాముడు సృష్టిస్థితి లయ కారకుడు. ఈ సృష్టిని అంతా నాశనం చేసి మరలా సృష్టించగల సమర్థుడు. పరాక్రమములో రాముడు విష్ణువుతో సమానుడు. అటువంటి రాముని ఎదుట నిలిచి యుద్ధం చేసి గెలవగల సమర్థుడు దేవతలలో కానీ, అసురులలోగానీ, గంధర్వులలోగానీ, విద్యాధరులలో గానీ, యక్షులలోగానీ, నాగులలో కానీ లేరు.

రాముని భార్యను అపహరించి తెచ్చి నీ ఇంట ఉంచుకున్న నీవు బతకడం చాలా కష్టం. రాముడు ఎవరినైనా చంపదలచుకుంటే వానిని బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కానీ, ఇంద్రుడు కానీ, ఎవరూ రక్షించలేరు. తరువాత నీ ఇష్టం." అని పలికాడు హనుమంతుడు.

శ్రీమద్రామాయణము
సుందర కాండము ఏబది ఒకటవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము
ఏబది రెండవ సర్గ.

ముల్లోకములలో తనకు ఎదురు లేదు అన్న అహంకారం రావణునికి నరనరాల్లో పాకిపోయింది. అందుకని హనుమంతుడు చెప్పిన మాటలు రుచించలేదు. కనీసం వాటి గురించి ఆలోచించడానికి కూడా అతని మనసు ఒప్పుకోలేదు. పైగా రావణుని

కోపం హద్దులు దాటింది. రావణుని నోటి నుండి ఒకే మాట వెలువడింది. “ఈ వానరాన్ని చంపండి.” అని ఆదేశించాడు.

రావణుని తమ్ముడు విభీషణుడు. ధర్మం తెలిసిన వాడు. రావణునికి కోపం వచ్చిందని, ఆ కోపంలో ఏమి చేస్తున్నాడో తెలియడం లేదని అనుకున్నాడు. దూతను చంపడం ధర్మవిరుద్ధమని రావణునికి ఎలా నచ్చచెప్పాలా అని ఆలోచించాడు. రావణునితో ఇలా అన్నాడు.

“ఓరాక్షసరాజా! నన్ను క్షమించు. నీ కోపము, రోషము విడిచిపెట్టు. నేను చెప్పే మాట విను. ఇతడు సుగ్రీవుడు పంపగా వచ్చిన దూత. దూతగా తన కర్తవ్యమును నిర్వర్తించాడు. ధర్మం తెలిసిన రాజులు దూతను చంపరు. అది ధర్మవిరుద్ధము. ఓ రాజా! నీకు తెలియని ధర్మము లేదు. నీకు సకల ధర్మములు తెలియును. ధర్మము తెలిసిన నీవు ఈ పని చేయకూడదు.

ఓరాజా! నీవు శాస్త్రములు చదువుకున్నావు. అందులో విషయములను ఆకళింపు చేసుకున్నావు. అన్నీ తెలిసిన నీవే కోపంలో ఇలా చేస్తే, ఇంక శాస్త్రములు చదివిన దానికి ఫలితం ఏముంటుంది, కేవలం శ్రమ తప్ప. నీవు శత్రువులను చంప వచ్చు. కానీ ఇతను నీకు శత్రువుకాడు. కేవలం దూత. ఇతను ఏమైనా తప్పుచేసి ఉంటే తగిన దండన విధించు. అంతేకాని చంపడం ఉచితం కాదు.” అని అనునయంగా చెప్పాడు విభీషణుడు.

కానీ రావణుని కోపం చల్లారలేదు. కోపంతో ఇలా అన్నాడు. “విభీషణా! వీడు పాపం చేసాడు. పాపాత్ములకు సరైన శిక్ష మరణ

దండన. వీడిని చంపినందువల్ల పాపం రాదు. అధర్మం అంతకంటే కాదు. కాబట్టి వీడిని వధిస్తాను." అని తన నిశ్చయాన్ని ప్రకటించాడు.

అప్పుడు విభీషణుడు రావణునితో ఇలా అన్నాడు. "ఓ రాజా! మరలా చెబుతున్నాను. సావధానంగా విను. ఏ కాలంలో కూడా, ఏరాజ్యంలో కూడా, సత్పురుషులు అయిన రాజులు తమ వద్దకు వచ్చిన దూతలను వధించరు. ఈ వానరుడు దూతగా వచ్చాడు. కానీ కొంచెం మితిమీరి ప్రవర్తించాడు. దానికి సరి అయిన దండన విధించు.

తప్పుచేసిన దూతలకు విధించవలసిన దండనలు చాలా ఉన్నాయి. వికలాంగుడిగా చెయ్యడం, కొరడాలతో కొట్టించడం, తల గొరిగించడం, చేసిన తప్పుకు గుర్తుగా ఒంటి మీద వాతలు పెట్టడం, ఇటువంటి దండనలు విధించవచ్చును. కానీ దూతలను చంపడం మనం ఎక్కడా వినలేదు.

నీవు రాక్షస రాజువు. ధర్మము బాగా తెలిసిన వాడవు. కానీ కోపానికి వశుడైనావు. ఆ కోపంలో అధర్మానికి పాల్పడుతున్నావు. నీవంటి బుద్ధి మంతులు తమ కోపాన్ని అదుపులో పెట్టుకోవాలి కదా! ధర్మాధర్మ విచక్షణలో కానీ, లోకాచారములను పాటించడంలో కానీ, శాస్త్రవిషయములను చర్చించడంలో కానీ, ఇతరుల మనోవృత్తులను అర్థంచేసుకోడంలో కానీ, నిన్ను మించిన వాడు దేవతలలో గానీ, అసురులలో గానీ లేడు.

ఓ రాజా! నీవు అజేయుడవు. దేవతలను అసురులను ఎన్నోమార్లు జయించావు. అటువంటి వాడికి ఈ వానరము ఒక లెక్కా!

అసలు ఈ వానరమును కాదు చంపవలసినది. ఈ వానరమును నీ వద్దకు పంపిన వారిని చంపాలి. వాళ్లు చేసిన తప్పుకు వాళ్లు పంపగా వచ్చిన దూతను చంపడం ధర్మవిరుద్ధము కదా!

ఓ రాజా! దూత మంచి వాడే కావచ్చు, చెడ్డ వాడే కావచ్చు. కాని అతడు ఇతరులు పంపగా వచ్చినవాడే కానీ, తనకు తానుగా నీవద్దకు రాలేదు కదా! దూతలకు తాము అనుకున్న విధంగా చెప్పడానికి స్వతంత్రము లేదు కదా! కేవలము తనను పంపిన వారు చెప్పమన్న మాటలు చెప్పిన ఈ దూతను చంపడం ధర్మం కాదు కదా! ఈ దూత నీ ప్రతాపమును చవిచూడ తగిన వాడు కాదు. నీ ప్రతాపము ఇంద్రుని మీద, దేవతల మీద, ఈ దూతను పంపిన వారి మీద చూపించు. వీడిని తగిన విధంగా దండించి వదిలిపెట్టు.

మరొక మాట! ఇప్పుడు నీవు వీడిని చంపితే, వీడు ఏమయ్యాడో అని వీడిని పంపిన వారికి తెలియదు. అప్పుడు వాళ్లు ఇక్కడకు వచ్చే అవకాశము లేదు. నీవు వాళ్లను చంపే అవకాశము లేదు. అందుకని వీడిని వదిలిపెడితే వీడు పోయి, వీడిని ఎవరైతే నీ వద్దకు పంపారో, వాళ్లను తీసుకొని వస్తాడు. అప్పుడు నీవు వారినందరినీ చంపవచ్చు.

ఓ రాక్షసరాజా! నీవు అజేయుడవు. నిన్ను యుద్ధంలో ఓడించగల వాడు ముల్లోకములలో లేడు. అటువంటప్పుడు, వీడిని చంపడం కన్నా, వీడిని పంపిన వాళ్లతో యుద్ధం చేసి ఓడించి చంపడం వీరత్వము కదా! అదే నీ వంటి వీరుడు చేయదగిన పని. కాబట్టి వీడిని వదిలిపెట్టి, వీడిని పంపిన వారు ఇక్కడకు రావడానికి

మార్గము సుగమం చెయ్యి. నీ దగ్గర ఎంతో మంది రాక్షస వీరులు ఉన్నారు. వారిలో కొంత మందిని యుద్ధానికి పంపి ఆ రాజకుమారులను సంహరించు. వీడిని వదిలిపెట్టు." అని రావణునికి ప్రియం చేకూర్చేట్టు పలికాడు విభీషణుడు. విభీషణుని మాటలు రావణునికి నచ్చాయి.

శ్రీమద్రామాయణము
సుందర కాండము ఏబది రెండవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము
ఏబది మూడవ సర్గ.

రావణుడు తనలో చెలరేగుతున్న కోపం,రోషం,కసిని కొంచెం తగ్గించుకున్నాడు. విభీషణుని మాటలు సావధానంగా విన్నాడు. కోపంలో తాను ఎంత అధర్మంగా ప్రవర్తిస్తున్నాడో అర్థం చేసుకున్నాడు.

"విభీషణా! నీవు చెప్పినది ధర్మయుక్తంగా సమంజసంగా ఉంది. దూతగా వచ్చిన వాడిని చంపడం పాపము. కానీ వీడిని వదల కూడదు. తీవ్రంగా దండించాలి. ఇతను చేసిన అపరాధములకు తగిన దండన విధించాలి. ఇతను వానరుడు. వానరులకు తోక అలంకారము. ఆ తోకను కత్తిరిస్తే వికలాంగుడు అవుతాడు. ఇతని తోకకు నిప్పు అంటించి కాల్చండి. కాలి పోయిన తోకతో ఇతనిని తరిమెయ్యండి. లంకకు వచ్చి తోక పోగొట్టుకున్న ఇతనిని ఇతని బంధువులు, మిత్రులు అవహేళన చేస్తారు. ఆ దండన చాలు. లంకలో ఉన్న వారందరికీ తెలిసే

లాగ మీరు ఈ వానరం తోకకు నిప్పు అంటించి, వీధులలో ఊరేగించండి. లంక వాసులు అందరూ ఇతనిని చూచి నవ్వుకోవాలి." అని అన్నాడు రావణుడు.

వెంటనే రాక్షసులు పాత వస్త్రములు తీసుకొని వచ్చారు. హనుమంతుని తోకకు చుట్టారు. హనుమంతుడు వాళ్లవంక అదోరకంగా చూస్తున్నాడు. హనుమంతుని తోకకు పూర్తిగా వస్త్రములు చుట్టిన తరువాత, నూనె పోసారు. హనుమంతుని తోక పూర్తిగా నూనెతోతడిసి పోయింది. రాక్షసులు హనుమంతుని తోకకు నిప్పంటించారు. హనుమంతుని తోక మొత్తం నిప్పంటుకుంది. దేదీప్యమానంగా వెలుగుతూ ఉంది. రాక్షసులు హనుమంతుని వీధుల వెంట తిప్పుతున్నారు.

తోకకు నిప్పంటుకున్న హనుమంతుని చూడడానికి లంకలో ఉన్న బాలురు, వృద్ధులు, స్త్రీలు బారులు తీర్చి మార్గమునకు ఇరువైపులా నిలబడ్డారు. హనుమంతునికి పట్టరాని కోపం వచ్చింది. తన చుట్టు ఉన్న రాక్షసుల నందరినీ కింద పడేసాడు. రాక్షసులు ఊరుకోలేదు. మరలా హనుమంతుని మీద పడి బంధించారు. హనుమంతుడు ఇలా ఆలోచించాడు.

"వీరి నందరినీ చంపడం పెద్ద సమస్య కాదు. వీరుకట్టిన కట్లు నన్ను ఆపలేవు. నేను ఈ కట్లు తెంచుకొని, ఆకాశంలోకి ఒక్కసారిగా ఎగిరి వీళ్ల మీదికి దూకి చంపగలను. నేను ఎలాగైతే రాముని ఆజ్ఞమేరకు ప్రవర్తిస్తున్నానో, వీళ్లు కూడా రావణుని ఆజ్ఞమేరకు ఇదంతా చేస్తున్నారు. వీళ్లదేం తప్పులేదు. వీళ్లు చేస్తున్న దానికి నేను

చింతించవలసిన పని లేదు. వీళ్లు నన్ను లంక అంతా తిప్పేట్టు ఉన్నారు. మొన్న రాత్రిపూట లంక అంతా తిరిగాను. లంకలో ఉన్న భవనముల సౌందర్యమును సరిగా చూడలేదు. ఈ వంకతోనైనా మరలా ఒకసారి లంక అంతా ఒకసారి చూస్తాను. తరువాత నేను చేసేది ఏదో నేను చేస్తాను. ఈ కాసేపు ఈ బంధనాలను, ఈ అగ్నిని సహించాలి తప్పదు." అని అనుకున్నాడు హనుమంతుడు. కాని తన మనసులో భావాలను బయటకు తెలియనీయకుండా వారిని కోపంతో చూస్తున్నాడు.

వారు కూడా హనుమంతుడు తమకు పట్టుబడ్డాడు అని సంతోషిస్తూ, మరలా హనుమంతుని తోకకు గుడ్డలు చుట్టి నిప్పు అంటించారు. ముందు భేరీలు, శంఖములు మోగించుకుంటూ హనుమంతుని లంక అంతా ఊరేగిస్తున్నారు. లంకలో ఉన్నవారు హనుమంతుని వింతగా చూస్తున్నారు, అశోక వనము నాశనం చేసిన వాడికి తగిన శాస్తి జరిగిందని ఆనందిస్తున్నారు. హనుమంతుడు కూడా బుద్ధిమంతుడి మాదిరి వాళ్ల వెంట లంక అంతా తిరుగు తున్నాడు. హనుమంతుడు లంక అంతా తిరుగుతూ, గొప్ప గొప్ప భవనములను, భూగృహములను, ఎత్తైన విమానములను, విశాలమైన వీధులను, ఇరుకుగా ఉన్న సందులను, గొందులను, పెద్దపెద్ద రాజమార్గములను, చిన్న చిన్న మార్గములను, చిన్న చిన్న ఇళ్లను పెద్ద పెద్ద భవంతులను ఆసక్తిగా చూచాడు.

రాక్షసులు నాలుగు మార్గముల కూడలిలో హనుమంతుని నిలబెట్టి "ఇతను ఒక శత్రుగూఢచారి. రావణుడు ఇతనికి దండన విధించాడు. ఇతని తోకకు గుడ్డటు చుట్టి, నూనె పోసి నిప్పంటించ బడింది. ఇతని తోక ఎలా కాలుతూ ఉందో చూడండి" అని పెద్దగా

అరుస్తూ తెలియజేస్తున్నారు.

రాక్షసులు అరుస్తున్న అరుపులు సీత చెవిని కూడా పడ్డాయి. సీత మనస్సు క్షోభించింది. తన వలన హనుమంతునికి ఇన్ని కష్టాలు వచ్చాయి కదా అని ఆమె మనసు ఆందోళన చెందింది. తాను ఉపాశించే అగ్నిని మనసులోనే ఆవాహన చేసుకుంది. చిన్న చిన్న పుల్లలను సేకరించి అగ్నిని వేల్చింది. దాని చుట్టూ ప్రదక్షిణ చేస్తూ హనుమంతుని క్షేమం కోరుతూ సీత నిర్మలమైన మనస్సుతో అగ్నిని ప్రార్థించింది.

"ఓ అగ్నిదేవా! నీకు నమస్కారము. నేను త్రికరణ శుద్ధిగా నా పతికి అనునిత్యమూ సేవచేసినదానను అయితే, నేను పతివ్రతను అయితే, నేను ఏమైనా తపస్సుచేసి ఉంటే, వాటి మహిమ వలన హనుమంతునికి నీ వేడి సోకనీయకు. హనుమంతుని చల్లగా కరుణించు. త్రిలోక పూజ్యుడు దయామయుడు అయిన రామునకు నా మీద కరుణ దయ ఉంటే, హనుమంతుని తోకకు అంటించిన అగ్ని చల్లగా తగులుతుంది. నేను సత్త్వవర్తనతో నా రాముని చూడడానికి కలవడానికి ఉత్సాహపడుతున్నాను అని రాముడు విశ్వసిస్తే, హనుమంతుని దేహమునకు సోకిన అగ్ని అతనిని కాల్చకుండుగాక! ఓ అగ్నీ! నీవు హనుమంతునికి ఏ హానీ చెయ్యకు. " అని మనస్ఫూర్తిగా వేడుకుంది.

అగ్నిదేవుడు సీత చేసిన ప్రార్థనను మన్నించాడు అన్న విషయం తెలుపడానికే అన్నట్టు సీత వేల్చిన అగ్ని జ్వాలలు సీతతో పాటు ఆమెను తాకుతున్నట్టు ప్రదక్షిన పూర్వకంగా తిరిగాయి. హనుమంతుని

తండ్రి వాయుదేవుడు కూడా, తన కుమారునికి ఏ హానీ జరగకుండా అగ్నికి తోడైనాడు. చల్లగా వీస్తున్నాడు. అక్కడ హనుమంతునికి తోక భగభగ మండుతున్నా చీమ కుట్టినట్టు కూడా లేదు.

"ఏమిటి ఇది! నా తోక ఇలా కాలుతున్నా నాకు అగ్ని సెగ కూడా తగలడం లేదు! ఇది ఏమి విచిత్రము. అగ్ని జ్వాలలుమాత్రము భయంకరంగా ప్రజ్వరిల్లుతున్నాయి. కాని నా తోక మీద మంచు ముద్దలుపెట్టినట్టు చల్లగా ఉంది. నేను సముద్రమును దాటు తున్నప్పుడు రాముని మీద ఉన్న గౌరవం వలన సముద్రుడు, మైనాకుడు నాకు సాయం చేయడానికి ముందుకు వచ్చారు కదా! ఇప్పుడు అగ్ని కూడా రాముని మీద ఉన్న గౌరవంతో నాకు సాయం చేస్తున్నాడేమో! అందుకే నాకు అగ్ని వలన పుట్టే వేడి సోకడం లేదు. అంతే కాదు, సీతాదేవి పాతివ్రత్య మహిమ వలననూ, రాముని తేజస్సుచేతనూ, నా తండ్రి వాయుదేవునితో అగ్నికి ఉన్న స్నేహము చేతనూ, అగ్ని నన్ను చల్లగా చూస్తున్నాడు. కాబట్టి నేను నా ఇష్టం వచ్చినట్టు చెయ్యవచ్చు." అని మనసులో అనుకున్నాడు.

అప్పటికి హనుమంతుని ఊరేగింపు నగర ద్వారము వద్దకు చేరుకుంది. అనుకున్నదే తడవుగా హనుమంతుడు ఆ రాక్షసుల మధ్యలో నుండి పైకి ఎగిరాడు. పెద్దగా అరిచాడు. నగర ద్వారము ఎక్కి కూర్చున్నాడు. ఒక్కసారిగా చిన్నవాడుగా మారాడు. అప్పుడు హనుమంతునికి కట్లు అన్నీ వదులు అయ్యాయి. వాటిని విదిల్చుకున్నాడు. మరలా తన శరీరమును పెంచాడు. నగర ద్వారమునకు అమర్చిన పరిఘను ఊడపీకాడు. దానిని చేతిలో పట్టుకొని రాక్షసుల మధ్యకు దూకాడు. ఆ పరిఘతో వాళ్లను

చితకబాదాడు. మండుతున్న తోకతో హనుమంతుడు మరలా లంక వైపుకు వెళ్లాడు.

శ్రీమద్రామాయణము

సుందర కాండము ఏబది మూడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

ఏబది నాలుగవ సర్గ.

తన తోకకు నిప్పంటించి లంకా పట్టణము అంతా ఊరేగించి సంతోషించారు రాక్షసులు. మరి తను ఏమి చేస్తే వారు దు:ఖిస్తారోఅని ఆలోచిస్తున్నాడు హనుమంతుడు. ఇప్పటి దాకా అశోక వనమును నాశనం చేసాడు. రాక్షసులను చంపాడు. చాలా భాగం రావణ సైన్యాన్ని నాశనం చేసాడు. సైన్యాధిపతులను, మంత్రి కుమారులను చంపాడు. దానికి ప్రతీకారంగా రాక్షసులు తన తోకకు నిప్పంటించారు కాబట్టి తాను కూడా లంకకు నిప్పంటిస్తే దెబ్బకు దెబ్బ సరిపోతుంది కదా అని అనుకున్నాడు. అదీ కాకుండా తాను ఇప్పుడు లంకను నాశనం చేస్తే తరువాత రాముని పని సులభం అవుతుంది కదా అని ఆలోచించాడు హనుమంతుడు. అగ్ని దేవునికి నా తోకను కాల్చడంతో తృప్తి చెందినట్టు లేదు. ఈ లంకా నగరమును దహించి అగ్నిదేవునికి సంతర్పణ చేస్తే అగ్ని దేవుడు తృప్తి పడతాడు అని అనుకున్నాడు హనుమంతుడు.

అనుకోవడమే ఆలస్యం హనుమంతుడు లంకా నగరంలో ఉన్న పెద్ద పెద్ద భవనాల మీదికి ఉరికాడు. ఒక్కొక్క భవనానికి నిప్పు అంటించడం మొదలెట్టాడు. ఒక భవనం మీది నుండి మరొక భవనం మీదికి దూకుతూ అన్ని భవనములకు నిప్పంటిస్తున్నాడు. హనుమంతుడు దేనినీ వదిలిపెట్టలేదు. చిన్న, పెద్ద భవనములను అన్నిటినీ తగులబెట్టాడు. ఉద్యానవనములను అందులో భవనములను కూడా కాల్చాడు. దారిలో రావణుని మంత్రి ప్రహస్తుని గృహము కనపడింది. పనిలో పనిగా దానికి కూడా నిప్పు అంటించాడు. ఆ గృహము మీది నుండి మహాపార్శ్వుడి గృహము మీదికి దుమికాడు. దానికి కూడా నిప్పుపెట్టాడు. పక్కపక్కనేఉన్న వజ్రదంష్ట్రుడు, శుకుడు, సారణుడు మొదలగు వారి గృహములకుకూడా నిప్పంటించాడు. తరువాత హనుమంతుడు ఇంద్రజిత్తు, జంబుమాలి, సుమాలి గృహములను కూడా దహించాడు.

హనుమంతుడు ఒక్క విభీషణుని గృహమును మాత్రము వదిలిపెట్టాడు. మిగిలిన గృహములను అన్నిటినీ పరశురామ ప్రీతి చేసాడు. ఒకదాని నుండి మరొక దానికి అగ్ని పాకిపోతూ ఉంది. లంకానగరము అంతా తగలబడి పోతూ ఉంది. అందులో రశ్మికేతువు, సూర్యశత్రువు, హ్రస్వకర్ణుడు, దంష్ట్రుడు, రోమశుడు, యుద్ధోన్మత్తుడు, మత్తుడు, ధ్వజగ్రీవుడు, విద్యుజ్జిహ్వుడు, హస్తిముఖుడు,కరాళుడు, పిశాచుడు, శోణితాక్షుడు, కుంభకర్ణుడు, మకరాక్షుడు, యజ్ఞశత్రువు, బ్రహ్మశత్రువు, నరాంతకుడు, కుంభుడు, నికుంభుడు, మొదలగు రాక్షసుల భవనములు అన్నిటినీ ఒక్కటీ వదలకుండా కాల్చాడు హనుమంతుడు. పొరపాటున ఏ ఒక్క భవనమునకు నిప్పు అంటుకోకున్నా, పనికట్టుకొని పోయి ఆ భవనమును కూడా కాల్చి

వచ్చాడు హనుమంతుడు.

ఒక్క రాక్షస ప్రముఖుల గృహములే కాదు, లంకలో ఉన్న పురప్రముఖుల ఇండ్లు కూడా తగలబెట్టాడు హనుమంతుడు. లంకలో ఉన్న సంపన్నులగృహములలో ఉన్న సకల సంపదలు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఆఖరున హనుమంతుడు రావణుని గృహము చేరుకున్నాడు. అది ఒక్కటే మిగిలి ఉంది. హనుమంతుడు రత్నశోభితమైన రావణుని గృహమునకు కూడా నిప్పంటించాడు. అగ్నికి వాయువు కూడా తోడవడం వల్ల రావణుని గృహమును దహించు అగ్నికీలలు నలుదిక్కులకు తీవ్రంగా, అతి వేగంగా వ్యాపించాయి. రావణుని గృహముతో సహా లంక అంతా తగులబడి పోతూ ఉంది. హనుమంతుడు కొన్ని గృహములకు నిప్పంటిస్తే, గాలి బలంగా వీచడం వల్ల ఆ అగ్ని మిగిలిన గృహములకు కూడా వ్యాపించింది. ఛటఛటధ్వనులతో ఆ గృహములు కాలిపోతున్నాయి. ఎత్తైన భవనములు నిలువునా కూలిపోతున్నాయి. ఆ భవనముల నుండి వ్యాపించిన మంటలలో ఎగురుతున్న ద్వారములు, కిటికీలు దూరంగా పడుతున్నాయి. అవి పడ్డచోట కూడా మంటలు వ్యాపిస్తున్నాయి.

లంకానగర వాసులు తమ తమ విలువైన వస్తువులు కాపాడుకోడంలో సతమతమవుతున్నారు. అటుఇటు పరుగెడుతున్నారు. “ఈ వానరము ఎక్కడనుండో వచ్చి అగ్నిదేవుడి రూపంలో మన లంకను తగులబెట్టింది కదా! ” అని వాపోతున్నారు. బిగ్గరగా ఏడుస్తున్నారు. తలలు బాదుకుంటున్నారు. కొందరుస్త్రీలు చంటి బిడ్డలను కాపాడుకుంటూ అటు ఇటు పరుగులెడుతున్నారు. కొందరు మేడల మీదినుండి కిందికి దుముకుతున్నారు. కాలి పోయిన

భవనముల నుండి ఆ భవనములకు పొదిగిన మణులు, బంగారము, కరిగి కారిపోతూ ఉంది. అలా లంకానగరమును దహిస్తూ హనుమంతుడు అపర రుద్రుని వలె ప్రకాశించాడు.

హనుమంతుడు అంటించిన అగ్ని పెద్ద పెట్టున లంకను దహిస్తూ, ఆ అగ్ని జ్వాలలు పైపైకి ఎగిసిపడుతూ ఉన్నాయి. ఆ అగ్ని జ్వాలలో పడి కాలిపోతున్న రాక్షసుల దేహముల నుండి స్రవించు ద్రవములు ఆజ్యము మాదిరి మంటలను ప్రజ్వరిల్లజేస్తున్నాయి. భవనములు కాలిపోతున్నప్పుడు వెలువడుతున్న ఛటఛటధ్వనులు పిడుగులు పడ్డట్టు ధ్వనిస్తున్నాయి. "వీడు సామాన్యవానరుడు కాడు. రావణుని మీద పగ తీర్చుకోడానికి వచ్చిన కుబేరుడో,యముడో, దేవేంద్రుడో, రుద్రుడో, సూర్యుడో, లేక సాక్షాత్తు కాలపురుషుడో అయి ఉంటాడు. లేకపోతే ఇంత విధ్వంసము ఎందుకు సృష్టిస్తాడు" అని పరి పరి విధములుగా అనుకుంటున్నారు లంకలో ఉన్న రాక్షసులు. మరి కొందరైతే "రావణునికి వరములు ఇచ్చిన బ్రహ్మదేవుడే రాక్షస సంహారమునకు ఈ వానర రూపంలో వచ్చాడా!" అని అనుకొన్నారు. "కాదు కాదు. ఇది విష్ణు తేజము. వానర రూపంలో వచ్చి లంకను నాశనం చేసింది. రాక్షసుల మీద పగ తీర్చుకొంది." అని మరికొందరు అభిప్రాయపడ్డారు.

లంకానగరము అంతా దైన్యముతో శోకిస్తూ ఉంది. భయంతో వణికిపోతూ ఉంది. కొంత మంది తమ కుమారులను, కుమార్తెలను వెదుక్కుంటూ ఏడుస్తుంటే మరి కొందరు తమ తమ సోదరులను, బంధువులను, తల్లి తండ్రులను, మిత్రులను వెతుక్కుంటూ వారు కనపడకపోతే గుండెలు పగిలేట్టు ఏడుస్తున్నారు.

అగ్నికి ఆహుతి అయిన లంకా నగరము ఎవరో ఒక మహాపురుషుని శాపము తగిలి నాశనం అయినట్టు కనపడుతూ ఉంది. హనుమంతుడు త్రికూట పర్వతము మీద నిలబడి తాను చేసిన నిర్వాహకమును పరిశీలిస్తున్నాడు. హనుమంతుని తోక ఇంకా మంటలు విరజిమ్ముతూనే ఉంది. హనుమంతునిచే దహింపబడిన లంకానగరమును చూచి దేవతలు, అసురులు, గంధర్వులు సంతోషించారు. తమ శత్రువుకు తగిన శాస్తి జరిగిందని సంబరపడ్డారు.

శ్రీమద్రామాయణము
సుందర కాండము ఏబది నాల్గవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము
ఏబది ఐదవ సర్గ.

తన కళ్లముందు సమూలంగా దహించుకు పోతున్న లంకానగరాన్ని చూచాడు హనుమంతుడు. హనుమంతునికి మనసులో ఒక ఆలోచన దానితో పాటు భయం మెదిలాయి.

“ తనకు జరిగిన అవమానానికి లంకను, లంకలోని ప్రజలను నాశనం చెయ్యడం అవసరమా! రామ కార్యంలో అది భాగం కాదే!   మరి తను ఎందుకు లంకను కాల్చినట్టు? తనలో పుట్టిన కోపానికి ఇంత సుందరమైన లంకానగరము బూడిద కుప్ప అయిపోవాలా!

కోపాన్ని అణచుకున్న వాడే బుద్ధికలవాడు. ధన్యుడు. కోపంలో మనిషి ఎంతటి పాపకార్యమైనా చేస్తాడు. ఆఖరుకు పెద్దలను కూడా ఆ కోపంలో చంపడానికి వెనుకాడడు. కోపావేశంలో నరులు ఎంతటి గొప్పవారినైనా పరుషమైన మాటలతో దూషిస్తారు. కోపం ఎక్కువ అయితే నోటికి ఏం మాట వస్తుందో తెలియదు. ఏ మాట మాట్లాడాలో ఏ మాట మాట్లాడకూడదో తెలియదు. ఇష్టం వచ్చినట్టు వాగుతారు. కోపంలో ఉన్న వాడికి చేయకూడని పని, అనకూడని మాట, అంటూ లేదు. అన్ని పనులు తగుదునమ్మాఅని చేసేస్తాడు.

సర్పము తన కుబుసమును విడిచిపెట్టినట్టు, మంచి వారు తమ కోపమును వెంటనే వదిలేస్తారు. ఎదుటి వారు ఏమన్నా ఓర్పుతో సహిస్తారు. ఆ ఓర్పు నాకు లేకుండా పోయింది. రాక్షసులు నా తోకకు నిప్పంటించినంత మాత్రాన నేను లంకను మొత్తం తగులబెట్టాలా! నా వంటి సిగ్గులేని వాడు, దుర్బుద్ధి మరొకడు ఉండడు. నేను నా ప్రభువు రామునికి ద్రోహం చేసాను.   ఈ లంకలోనే సీత ఉన్నది అన్న విషయం మరిచి లంకను మొత్తం తగులబెట్టాను. లంక మొత్తం తగులబడి పోయిన తరువాత సీత మాత్రం బతికి ఉంటుందా! ఈ ఒక్క పనితో రామ కార్యము మొత్తం చెడిపోయింది. నా శ్రమ అంతా సర్వనాశనం అయింది. ఎవరి కోసరం నేను నూరు యోజనముల దూరం ఎగిరి వచ్చి నానా కష్టాలు పడి, తుదకు సీతను చూచానో, ఆ సీత నా కోపాగ్నికి ఆహుతి అయిపోయింది. . నేను పడ్డ కష్టం అంతా బూడిదలో పోసిన పన్నీరు అయింది. లంక తగులబడే టప్పుడు సీతను రక్షించాలి అన్న బుద్ధికూడా నాకు లేదు. నేను ఎంత మందమతిని.

సుందర కాండము

సీతను చూడ్డంతోనూ, సీత నుంచి చూడామణిని తీసుకోడంతోనూ నేను వచ్చిన కార్యము పూర్తి అయింది. బుద్ధిగా కిష్కింధకు తిరిగి వెళ్లకుండా, అశోకవనమును నాశనం చెయ్యడం ఎందుకు చేసినట్టు? రాక్షసులను చంపడం ఎందుకు? లంకను తగలబెట్టడం ఎందుకు? లంక అంతా పూర్తిగా కాలిపోయింది. ఇందరు మరణించినపుడు సీత మాత్రం ఎందుకు బతికిఉంటుంది. లంకలో సీత లేనపుడు నేను పోయి సీతను చూచాను అని రాముడికి చెప్పడం ఎందుకు? నేను కూడా ఇక్కడే ప్రాణాలు విడుస్తాను. నాకు ఇదే తగిన శిక్ష.

చావాలంటే ఏం చెయ్యాలి? లంకానగరాన్ని దహిస్తున్న మంటలలో దూకాలా? లేక సముద్రంలో దూకాలా? మొత్తం రామ కార్యమును నాశనం చేసిన తరువాత రామునికి సుగ్రీవునికి నా మొహం ఎలా చూపించాలి? ఏమని చెప్పాలి? నేను రామ కార్యము మీద వచ్చాను అన్న విషయం మరిచి వానరులకు సహజమైన చాపల్యంతో ప్రవర్తించాను. ఎప్పుడూ సత్త్వగుణంతో ఉండే నేను ఇలా రాజస గుణంతో ఎందుకు ప్రవర్తించాను. రాజసము మనసును అదుపులో ఉండనీయదు. చపలత్వమును కలుగజేస్తుంది. ఈ రాజస ప్రవృత్తి వల్లనే లంకను తగులపెట్టాను. కనీసం లంక తగల బటేటప్పుడన్నా సీతను రక్షించాలి అన్న ఆలోచన నాకు రాలేదు. ఇదంతా ఈ రాజస ప్రవృత్తి ప్రభావం కదా!

సీత ఈ లోకంలో లేది అని తెలిస్తే రాముడు మరణిస్తాడు. రాముడు లేనిదే లక్ష్మణుడు ప్రాణాలతో ఉండడు. వీరి మరణం చూచి సుగ్రీవుడుకూడా ప్రాణత్యాగము చేస్తాడు. ఈ వార్త విన్న భరత

శత్రుఘ్నులు కూడా ఆ బాధను తట్టుకోలేక చనిపోతారు. రాజులేని అయోధ్య కిష్కింధ అనాధలవుతాయి. ఇంత వినాశనమునకు నేను కారణము. కేవలం నా లో ఉన్న కోపము, రోషము నా చేత ఇంతపని చేయించింది.” అని శోకిస్తున్నాడు హనుమంతుడు.

ఇంతలో హనుమంతుని మనస్సులో ఒక ఊహ మెదిలింది. “ నా పిచ్చి గానీ, సీత అయోనిజ. ఆమె అగ్ని స్వరూపము. అగ్నిని అగ్ని కాల్చగలదా? రాముని భార్య, మహా పతివ్రత అయిన సీతను కాల్చే ధైర్యము అగ్నికి ఉంటుందా! నా తోకకు అంటుకున్న అగ్ని నన్నే కాల్చలేదంటే అది అంతా రాముని ప్రభావము, సీత పాతివ్రత్య మహాత్మ్యము. నన్ను కాదు కదా, కనీసం నా తోకనే కాల్చలేని అగ్ని సీతను కాలుస్తుందా. మహాతపస్వి, సత్యవ్రతమును, పాతివ్రత్యమును పాటించు సీతను అగ్ని కాల్చలేదు. ఇది సత్యం.”అని తనలో తాను ఊరట చెందుతున్నాడు హనుమంతుడు.

ఇంతలో ఈ లంకా దహనము కార్యక్రమమును పైనుండి చూస్తున్న చారణులు ఈ విధంగా అనుకోవడం హనుమంతుని చెవిని పడింది. “హనుమంతుని చేత దహింపబడిన లంక సర్వనాశనము అయింది కానీ సీత మాత్రం క్షేమంగా ఉంది. ఇది చాలా ఆశ్చర్యంగా ఉంది కదూ!” అని తమలో తాము అనుకుంటున్నారు. ఆ మాటలు విన్న హనుమంతుని మనస్సు ఊరట చెందింది. వెంటనే సీతను చూడ టానికి అశోకవనమునకు వెళ్లాడు హనుమంతుడు.

శ్రీమద్రామాయణము

సుందర కాండము ఏబది ఐదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

ఏబది ఆరవ సర్గ.

అశోకవనములో శింశుపా వృక్షము కింద క్షేమంగా కూర్చుని ఉన్న సీతను చూచాడు హనుమంతుడు. సీతకు నమస్కరించి “అమ్మా! దైవవశాత్తు నీవు క్షేమంగా ఉన్నావు. నిన్ను ఏ అపాయమూ లేకుండా చూడగలిగాను. నాకు చాలా సంతోషంగా ఉంది. తమరు అనుజ్ఞ ఇస్తే ఇంక నేను కిష్కింధకు వెళతాను.” అని పలికాడు హనుమంతుడు.

సీత మరలా తాను హనుమంతుని చూడగలిగాను అన్న సంతోషంతో ఇలా పలికింది. “రామ కార్యమును సాధించడానికి నీవు ఒక్కడివే సమర్థుడివి అన్న విషయం ఋజువు అయింది. నీ బలపరాక్రమములు మిక్కిలి ప్రశంసనీయములు. రాముడు ఇక్కడకు వచ్చి నన్ను తీసుకొని వెళితేనే బాగుంటుంది. రాముడు ఆ కార్యము నెరవేర్చుటకు నీవు తగినట్టు సాయము చేయుము.” అని పలికింది సీత.

“అమ్మా! సీతాదేవీ! రాముడు వానర సేనలతో వచ్చి, రావణుని వధించి నిన్ను అయోధ్యకు తీసుకొని వెళ్లేరోజు త్వరలోనే రానుంది. నీ శోకము తీరే సమయము ఆసన్నమయింది. ఇంక నేను వెళ్లి వస్తాను.” అని సీతకు నమస్కరించాడు.

అక్కడి నుండి బయలు దేరి హనుమంతుడు ఒక పెద్ద పర్వతశిఖరమును ఎక్కాడు. తన దేహమును విపరీతంగా పెంచాడు. ఎదురుగా అలలతో పోటెత్తిన సముద్రాన్ని చూచాడు. ఉత్తర దిక్కుగా తిరిగి ఒక్కసారిగా తన శరీరాన్ని గాలిలోకి లేపాడు. రెండు చేతులు ముందుకు చాచి పైకి ఎగిరాడు. హనుమంతుడు తన పాదాలను ఆ పర్వతశిఖరము మీద తన్ని పెట్టి పైకి ఎగిరాడు.

హనుమంతుని పాదఘట్టనలకు పర్వతశిఖరము మీద ఉన్న పెద్ద పెద్ద రాళ్లు నుగ్గు నుగ్గు అయ్యాయి. వృక్షములు అటు ఇటూ ఊగుతూ కూకటి వేళ్లతో సహా పెకలింపబడ్డాయి. ఆ పర్వతము మీద ఉన్న జంతువులు కకావికలై పరుగులెత్తాయి. ఆ పర్వతము మీద నివసించుచున్న పెద్ద పెద్ద సర్పములు హనుమంతుని పాదఘట్టనలకు జారిన, దొర్లిన రాళ్లు, బండలకింద పడి నలిగిపోయాయి. అంతకన్నా పెద్ద విచిత్రము ఏమంటే హనుమంతుడు ఎక్కిన పర్వతము హనుమంతుని పాదాల తాకిడికి తట్టుకోలేక భూమిలోకి కుంగి పోయింది. నేలమట్టము అయింది. అంతకు ముందు అక్కడ ఒక పెద్ద పర్వతము ఉన్నదా అనే సందేహము కలిగింది. ఆ ప్రకారంగా హనుమంతుడు సముద్రమును లంఘించడానికి పైకి ఎగిరాడు.

శ్రీమద్రామాయణము
సుందర కాండము ఏబది ఆరవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

సుందర కాండము

ఏబది ఏడవ సర్గ.

వాయుదేవుని పుత్రుడు అయిన హనుమంతుడు ఆ మహా సముద్రమును అవలీలగా దాటాడు. హనుమంతుడు ఆకాశంలో సముద్రము మీద ఎగురుతుంటే చూచేవాళ్లకు అతడు ఆకాశమును మింగుతున్నాడా అన్న అనుభూతి కలిగింది. ఆ ప్రకారంగా హనుమంతుడు మేఘముల పంక్తులను దాటుకుంటూ వెళుతున్నాడు. హనుమంతుడు కాసేపు మేఘాల చాటుకు వెళుతూ మరలా బయటకు వస్తూ వాయువేగంతో మేఘాల గుండా ప్రయాణం చేస్తున్నాడు. ఆ ప్రకారంగా ఎగురుతున్న హనుమంతుడు మేఘాల మధ్య దోబూచులాడే చంద్రుడి మాదిరి ప్రకాశిస్తున్నాడు. హనుమంతుడు మేఘాలను చీల్చుకుంటూ, పెద్దగా అరుస్తూ వెళు తుంటే, ఉరుముతున్న ఆకాశంలో గరుడుడు ఎగురుతూ వెళుతున్నాడా అన్నట్టు ఉంది.

హనుమంతుడు దారిలో తన కోసరము ఎదురుచూస్తున్న మైనాక పర్వత శిఖరమును తన చేతితో స్నేహపూర్వకముగా తాకి, మరలా విల్లు నుండి వెలువడిన బాణము వలే మహా వేగముతో తన ప్రయాణమును కొనసాగించాడు. అలా ఎగురుతూ హనుమంతుడు సముద్రమునకు ఆవల ఒడ్డున ఉన్న మహేంద్రగిరిని సమీపించాడు. తన వాళ్ల దగ్గరకు వచ్చాను అన్న సంతోషంతో హనుమంతుడు సింహనాదము చేసాడు. తన మిత్రులను చూడబోతున్నాను అన్న సంతోషంతో తన తోకను చిత్రవిచిత్రంగా తిప్పుతూ పెద్ద పెద్దగా అరుస్తున్నాడు.

హనుమంతుని అరుపులకు ఆకాశము బద్దలయిందా అన్నట్టుంది. హనుమంతుని రాకకోసరం అంగదుడు, జాంబవంతుడు మొదలగు వానరములు, భల్లూకములు ఎదురుచూస్తున్నాయి. వారికి ఒక్కసారిగా ఆకాశము బద్దలయిందా అన్నంత ధ్వని, గాలి వేగమునకు ఊగుతున్న చెట్లు హనుమంతుడు ఎగురుతుంటే వచ్చే భయంకర శబ్దము వినపడ్డాయి. తర్వాత హనుమంతుడు పెద్దగా అరుస్తున్న అరుపులు వినబడ్డాయి. అప్పటి దాకా వారికి హనుమంతుని గూర్చి వార్త ఏమీ తెలియలేదు. హనుమంతుడు లంకకు చేరాడా, సీతను చూచాడా అని వారిలో వారు తర్కించుకుంటున్నారు.

ఇంతలో హనుమంతుని రాకకు గుర్తుగా గాలి వేగము, ఒత్తిడి, హనుమంతుని అరుపులు వినపడ్డాయి. అప్పుడు జాంబవంతుడు మిగిలిన వానరములను చూచి మిక్కిలి సంతోషముతో ఇలా అన్నాడు. "ఓ వానర శ్రేష్టులారా! హనుమంతుడు రామ కార్యము సఫలము చేసుకొని వస్తున్నాడు. హనుమంతుడు సీతను చూడనిచో ఇంత ఆనందంగా కేరింతలుకొట్టడు." అని అన్నాడు.

ఆ మాటలు విన్న వానరులు ఆనందంతో కేరింతలు కొట్టారు. గంతులు వేసారు. హనుమంతుని చూడవలెనని కోరికతో కొంత మంది ఎత్తైన చెట్లనుఎక్కారు. మరి కొంత మంది కొండలను గుట్టలను ఎక్కారు. చెట్లమీద ఎక్కినవారు, ఆ సంతోషంలో చెట్లకొమ్మలను పట్టుకొని గబా గబా ఊపుతున్నారు. అప్పుడు ఆకాశంలో గంభీరమైన ధ్వని వినపడింది. నల్లని మేఘము కదిలి వస్తున్న చప్పుడు అయింది. హనుమంతుడు ఆకాశము నుండి కిందికి దిగి మహేంద్ర

పర్వతము శిఖరము మీద దిగాడు. హనుమంతుని చూచి వానరులందరూ దోసిలి పట్టుకొని నిలబడ్డారు. హనుమంతుడు సీతను చూచిన సంతోషముతో ఆనందంతో పొంగిపోతున్నాడు.

హనుమంతుని కొరకు వేచి ఉన్న వానరులు గబా గబా హనుమంతుని చుట్టు చేరారు. హనుమంతుని చూచి వారందరూ ఆనందంతో గంతులు వేసారు. కొంత మంది ఫలములను, కంద మూలములను హనుమంతునికి ఇచ్చారు. హనుమంతుడు తన కన్నా పెద్ద వారైన జాంబవంతుడు మొదలగు వానరులకు, యువరాజు అంగదునకు నమస్కరించాడు.

అప్పుడు హనుమంతుడు వారితో ఒకే మాట అన్నాడు. "సీతచూడబడినది" ("దృష్టాసీతేతి".) ఆ మాట విన్న వానరులు ఆనందోత్సాహాలతో ఓలలాడారు. హనుమంతుడు అంగదుని చేయి పట్టుకొని ఒక రాతి మీద కూర్చున్నాడు. మిగిలిన వానరులు వాళ్ల చుట్టు నిలబడ్డారు. అప్పుడు హనుమంతుడు వారితో ఇలా అన్నాడు.

"అశోక వనములో ఉన్న జనకుని కూతురు అయిన సీతను నేను చూచాను. ఆమె కేశ సంస్కారము లేకుండా దీనంగా ఉంది. ఉపవాసములతో ఆమె శరీరం చిక్కిపోయింది. ఆమె మలినమైన వస్త్రములు ధరించి ఉంది. ఆమె చుట్టు రాక్షస స్త్రీలు కూర్చుని ఆమెకు కాపలాగా ఉన్నారు. సీత ఎప్పుడూ రాముని గురించి ఆలోచిస్తూ రాముని చూడవలెనని ఆతురతగా ఉంది." అని పలికాడు హనుమంతుడు.

వానరులందరికీ "సీతను చూచాను" అన్న మాటలు కర్ణపేయంగా వినిపించాయి. కొందరు సింహనాదం చేసారు. మరి కొంత మంది గర్జించారు. మరి కొంత మంది కిచ కిచ మంటూ అరుస్తున్నారు. మరి కొందరు తమ తమ తోకలను పైకెత్తి ఆడిస్తున్నారు. మరి కొంత మంది అక్కడ ఉన్న కొండలను గుట్టలను ఎక్కి కిందికి దుముకుతున్నారు. వారి ఆనందాన్ని ఆ వానరులు రకరకాలుగా వ్యక్తపరుస్తున్నారు. సీతను చూచిన హనుమంతుని వారు అలా అలా తాకి ఆనందిస్తున్నారు. అప్పుడు అంగదుడు హనుమంతునితో ఇలా అన్నాడు.

"ఓ హనుమా! నీ వంటి బలవంతుడు, ధైర్యవంతుడు, పరాక్రమవంతుడు ముల్లోకములలో లేడు. నీవు కాబట్టి నూరు యోజనముల దూరముకల సముద్రమును దాటి లంకకు వెళ్లగలిగావు. నీ ప్రభుభక్తి ప్రశంసనీయము. నీ శక్తి అమోఘము. మా అందరి అదృష్టము కొద్దీ నీవు రాముని భార్య సీతను చూచావు. మా అందరి ప్రాణములను రక్షించావు. రాముని శోకమును పోగొట్టావు. " అని అన్నాడు.

ఆ మాటలకు మిగిలిన వానరులు అందరూ వారి ఇద్దరి చుట్టుచేరి వారిని శ్లాఘించారు. వారందరూ హనుమంతుడు, అంగదుడు, జాంబవంతుని చుట్టు కూర్చుని, హనుమంతుడు సముద్రమును ఎలా దాటాడు, లంకను ఎలా చేరాడు, లంకలో ఏమేమి చేసాడు అనే విషయములను వినడానికి చాలా కుతూహలంగా ఉన్నారు. వానరులందరూచుట్టు కూర్చుని ఉండగా

అంగదుడు దేవతలు మధ్యఉన్న ఇంద్రుని వలె ప్రకాశించాడు. హనుమంతుడు కూర్చుని ఉన్న ప్రదేశము కూడా అతని కీర్తితో ప్రకాశించింది.

శ్రీమద్రామాయణము
సుందర కాండము ఏబది ఏడవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము
ఏబది ఎనిమిదవ సర్గ.

వారందరిలోకీ పెద్దవాడు అయిన జాంబవంతుడు లేచి హనుమతో ఇలా అన్నాడు. "హనుమా! నీవు సీతను వెదుకుతూ బయలు దేరావు కదా! అప్పటి నుండి ఇప్పటి దాకా ఏమేమి జరిగిందో విపులంగా చెప్పు. నీవు సీతాదేవిని ఎలా చూచావు? సీత లంకలో ఎపక్కడ ఉంది? ఎలా ఉంది? రావణుడు ఆమె పట్ల ఎలా ప్రవర్తిస్తున్నాడు? ఈ విషయములు అన్నీ ఉన్నది ఉన్నట్టు చెప్పు. తరువాత మనము ఏమి చెయ్యాలో నిర్ణయించుకుందాము. మనము కిష్కింధకు వెళ్లిన తరువాత సుగ్రీవునికి ఏయే విషయాలుచెప్పాలి. ఏయే విషయాలు దాచి పెట్టాలి అన్న విషయం కూడా బుద్ధిమంతుడివి అయిన నీవు మాకు తెలియజేయాలి. " అని అన్నాడు జాంబవంతుడు.

ఆ మాటలు విన్న హనుమంతుడి ఒళ్లు పులకరించింది. తన మనసులోనే రామునికి సీతకు నమస్కరించాడు. వారందరితో

ఇలా అన్నాడు.

"నేను మహేంద్రపర్వతము మీది నుండి మీ అందరి ఎదుటనే ఆకాశంలోకి ఎగిరాను కదా! నాకు దారిలో ఒక ఆటంకము ఏర్పడింది. సముద్రము లోనుండి ఒక పర్వత శిఖరము పైకి లేచింది. నాకు అడ్డుగా వచ్చిన ఆ పర్వత శిఖరమును నేను బద్దలు కొట్టాలి అని అనుకున్నాను. నేను నా తోకతో ఆ పర్వత శిఖరమును కొట్టాను. ఆ పర్వత శిఖరము ముక్కలైపోయింది. ఆ పర్వతము మానవ వాక్కులతో ఇలా అంది.

"పుత్రా! నా పేరు మైనాకుడు. నేను నీ తండ్రి వాయుదేవునికి స్నేహితుడను. నేను నీ తండ్రికి సోదరుడి వంటి వాడిని. నేను సముద్రగర్భంలో ఉంటాను. ఇంతకు ముందు భూమి మీద ఉన్న పర్వతములకు రెక్కలు ఉండేవి. ఆ పర్వతములు ఆకాశంలో ఎగురుతూ ఉంటే, అవి ఎక్కడ తమ మీద పడతాయో అని ప్రజలు తల్లడిల్లిపోయేవారు. అందుకని ఇంద్రుడు తన వజ్రాయుధములో పర్వతముల రెక్కలను ఖండించాడు. ఆ సమయంలో ఆకాశంలో తిరుగుతున్న నన్ను నీ తండ్రి వాయుదేవుడు ఎగురగొట్టి ఈ సముద్ర గర్భంలో పడేశాడు. అందుకని ఇంద్రుడు నా రెక్కలు ఖండించలేక పోయాడు. అలా నేను రక్షింపబడ్డాను. నీవు రామ కార్యము మీద వెళు తున్నావు. నేను కూడా రామునికి సాయం చెయ్యాలని అనుకుంటున్నాను. రామ కార్యము మీద వెళ్లే నీవు నా శిఖరము మీద కాసేపు విశ్రాంతి తీసుకొని నా ఆతిథ్యము స్వీకరించి వెళ్లు." అని పలికాడు.

సుందర కాండము

నేను మైనాకునితో రామకార్యము గురించి తెలిపి అతనిని ఒప్పించి, మైనాకుని అనుమతి తీసుకొని అక్కడ నిలువ కుండా లంకకు వెళ్లాను. తరువాత మైనాకుడు సముద్రములో మునిగి పోయాడు.

నేను అలా ఎగురుతూ వెళుతుంటే, దారి మధ్యలో దేవతలు పంపిన సురస అనే దేవతాస్త్రీని చూచాను. “ఓ వానరుడా! దేవతలు నిన్ను నాకు ఆహారంగా చూపించారు. నేను నిన్ను భక్షిస్తాను.” అని నామీదికి రాబోయింది సురస. నాకు భయం వేసింది. నేను ఆమెకు నమస్కరించి ఇలా అన్నాడు. “సురసాదేవీ! నేను రామ కార్యము మీద వెళుతున్నాను. దశరథుని కుమారుడు రాముడు తన భార్య సీతతో సహా దండకారణ్యంలో ఉంటూ ఉండగా, రావణుడు అనే రాక్షసుడు రాముని భార్య సీతను అపహరించాడు. రాముని ఆదేశము మేరకు నేను రావణుని వద్దకు దూతగా వెళుతున్నాను. నా మార్గమునకు అడ్డురాకు. నీవు కూడా రాముని పాలనలో ఉన్న ప్రదేశములో నివసిస్తున్నావు కదా! అందుకని నీవు కూడా రామునికి సాయం చెయ్యాలి. అది నీ బాధ్యత. నేను లంకకు పోయి సీతను చూచి, ఆ విషయమును రామునికి చెప్పి తరువాత నీకు ఆహారంగా నీ నోట్లో ప్రవేశిస్తాను. ఇది నిజము.” అని అన్నాను.

నా మాటలు సురస వినలేదు. “నన్ను దాటి ఎవరూ పోకూడదు అని నాకు వరము ఉంది. అందుకని నీవు నన్ను దాటి పోలేవు.” అని పలికింది సురస. నేను పదియోజనముల పొడవుఉన్న నా శరీరాన్ని అందులో సగం అనగా పదిహేను యోజనముల పొడవు పెంచాను. అది చూచి సురస తన నోటిని నా పొడుగు సరిపోయేట్లు

తెరిచింది. నేను వెంటనే నా దేహమును కుచింప జేసి బొటనవేలి ప్రమాణంఅయ్యాను. సురస నాకోసం వెదుకుతూ ఉంది. నేను వెంటనే సురస నోట్లోకి దూరాను. వెంటనే బయటకు వచ్చాను. అప్పుడు సురస నాతో ఇలా అంది. "ఓ వానరోత్తమా! నీ తెలివికి సంతోషించాను. రామ కార్యము నెరవేర్చుటకు నీవు వెళ్లు. సీతను రామునితో కలుపు. నీకు శుభం కలుగు గాక" అని దీవించింది సురస.

నేను మరలా ఆకాశంలోకి ఎగిరాను. నేను సముద్రం మీద ఆకాశంలో ఎగురుతుంటే నా నీడ సముద్రము నీటి మీద తేలుతూ ఉంది. ఎవరో నా నీడను పట్టుకున్నారు. ఆకాశంలో ఉన్న నేను కదలలేక పోయాను. నేను చుట్టు చూచాను. ఎవరూ కనపడలేదు. నా వేగానికి అంతరాయము కలిగించిన వాళ్లు ఎవరా అని సముద్రము నీటి వంక చూచాను. సముద్రము నీళ్లలో దాగి ఉన్న ఒక భయంకర రాక్షసిని చూచాను. ఆ రాక్షసి భయంకరంగా అరుస్తూ నాతో ఇలా అంది. " ఓ వానరుడా!ఇంత పెద్ద శరీరంతో ఎక్కడకు వెళుతున్నావు. నాకు చాలా ఆకలిగా ఉంది. నిన్ను ఆహారంగా తింటాను. నీవు నాకు ఇష్టమైనా ఆహారము." అని నన్ను తినబోయింది. నేను ఆమె మాటలకు తల ఊపి "అలాగే నన్ను తినెయ్యి" అని అన్నాను. నేను నా శరీరాన్ని ఆమె ముఖం కన్నా రెట్టింపు పరిమాణానికి పెంచాను. నన్ను తినడానికి వీలుగా ఆ రాక్షసి కూడా తన నోటి పరిమాణాన్ని పెంచింది. మరుక్షణంలో నేను నా రూపాన్ని చిన్నదిగా చేసి దాని నోటిగుండా శరీరంలోకి ప్రవేశించాను. దాని గుండెను చీల్చాను. మరలా ఆకాశంలోకి ఎగిరాను. నేను దాని గుండెలు చీల్చడంతో ఆ రాక్షసి సముద్రంలో పడిపోయింది. ఆకాశంలో ఉన్న సిద్ధులు, చారణులు అందరూ "ఆహా! హనుమంతుడు సింహికను చంపేసాడు" అని

అనుకోవడం నేను విన్నాను.

తరువాత నేను ఎగురుతూ వెళ్లి లంకానగరము దక్షిణ తీరాన్ని చేరుకున్నాను. సూర్యుడు అస్తమించేవరకూ బయటనే ఉండి చీకటి పడగానే లంకానగరంలోకి ప్రవేశించాను. నేను నగరంలోకి ప్రవేశిస్తూ ఉండగానే భయంకరాకారం కల స్త్రీ ఒకత్తి నా ఎదురుగా నిలిచింది. ఆమె నన్ను చంపడానికి ప్రయత్నించింది. కానీ నేను ఆమెను ఎడమ చేతితో ఒక గుద్దుగుద్దాను. అప్పుడు ఆ రాక్షసి నాతో ఇలా అంది. “ఓ వానరుడా! నేను లంక దేవతను. ఈ లంకను రక్షిస్తుంటాను. ఇన్నాళ్లకు నువ్వు నన్ను జయించావు. ఇంక నీకు లంకలో ఎదురు లేదు. రాక్షసులందరినీ జయిస్తావు.” అని పలికి నాకు దోవ ఇచ్చింది.

నేను ఆ రాత్రి లంకా నగరము అంతా వెతికాను. రావణుని అంత:పురము ప్రవేశించాను. అంత:పురము అంతా వెతికాను. ఎంత వెతికినా నాకు సీత కనపడలేదు. నేను నిరాశ చెందాను. నూరు యోజనముల సముద్రము లంఘించిన నేను శోకసముద్రములో మునిగిపోయాను. అప్పుడు నాకు రావణుని భవనమునకు ఎదురుగా ఉన్న ఒక వనము కనపడింది. దాని పేరు అశోక వనము. నేను అశోకవనములోకి ప్రవేశించాను. ఆ వనములో వెతుకుతుంటే ఒక శింశుపా వృక్షము కనపడింది. నేను ఆ శింశుపా వృక్షము ఎక్కాను. చుట్టూ చూచాను. ఆ శింశుపా వృక్షము దగ్గరలోనే నేను మాసిన వస్త్రములు కట్టుకొని నిరంతర ఉపవాసములతో చిక్కి ఉన్న ఒక ఉత్తమురాలైన స్త్రీని చూచాను. ఆమె చుట్టు వికృతాకారులైన రాక్షస స్త్రీలు కూర్చుని ఉన్నారు.

ఆమెను సీతగా పోల్చుకున్నాను. ఆమె నిరంతరమూ తన భర్త రాముని తలచుకుంటూ ఉంది. ఆ రాక్షస స్త్రీలు ఆమెను భయపెడుతున్నారు. ఆ బాధలు తట్టుకోలేక ఆమె మరణించడానికి ఉద్యుక్తురాలయింది. ఆ పరిస్థితులలో ఉన్న సీతను నేను చూచాను. నేను నా రూపమును చిన్నదిగా చేసుకొని ఆ శింశుపావృక్షము మీదనే ఆమెకు కనపడకుండా ఉండిపోయాను. ఇంతలో నాకు కోలాహలము వినపడింది. రావణుడు తన భార్యలతో పరివారముతో సీత వద్దకు వచ్చాడు. రావణుని చూచిన సీత భయంతో వణికిపోతూ తన అవయవములను దగ్గరగా చేర్చుకొని కూర్చుంది. రావణుడు ఆమెను "నన్ను వరించు. నన్ను భర్తగా స్వీకరించు. నీకు ఇంక రెండు మాసముల గడువుమిగిలి ఉంది. ఆ లోపల నన్ను భర్తగా అంగీకరించకపోతే నిన్ను చంపి నీ రక్తము తాగుతాను" అని బెదిరించాడు.

రావణుని మాటలకు సీత కోపించింది. ఆ కోపంలో ఇలా పలికింది. "ఓ రాక్షసుడా! నేను ఇక్ష్వాకు వంశములో పుట్టిన దశరథుని కోడలిని. రాముని భార్యను. నా గురించి ఇంత ఘోరంగా మాట్లాడు తున్న నీ నాలుక ఇంకా ఎందుకు తెగి పడలేదు? నా భర్త ఇంట లేని సమయమున నన్ను అపహరించి తెచ్చావు? నీది కూడా ఒక పరాక్రమమా! నీవు ఒక వీరుడవా! నీకూ రామునికి సామ్యమే లేదు. రాముడు రారాజు. నీవు రామునికి దాసునిగా కూడా పనికిరావు. రాముని కీర్తి ముల్లోకములు ప్రకాశిస్తూ ఉంది." అని పలికింది.

ఆ మాటలకు రావణుడు కోపంతో మండి పడ్డాడు. తన కళ్లు ఇంతింత చేసుకొని చూచాడు. తన పిడికిలి బిగించి సీతను

చంపడానికి తన చెయ్యి పైకి ఎత్తాడు. రావణుని కోపావేశము చూచి అక్కడ ఉన్న రాక్షస స్త్రీలు హాహాకారాలు చేసారు. అప్పుడు రావణుని భార్య అయిన మండోదరి వచ్చి రావణుని చెయ్యిపట్టుకొని వారించింది. "నాథా! నీ పరాక్రమము ముల్లోకములలో కూడా ప్రశంసనీయము. అటువంటి నీకు ఈ మాసిన వస్త్రములతో అంద వికారముగా ఉన్న స్త్రీతో ఏమి పని. నీవు దేవకన్యలతోనూ, గంధర్వ కన్యలతోనూ యక్షకన్యలతోనూ క్రీడించడానికి తగినవాడవు కానీ ఈ మామూలు మానవ స్త్రీతో కాదు. " అని బతిమాలి రావణుని భార్యలందరూ, అతనిని తమ గృహమునకు తీసుకొని వెళ్లారు.

రావణుడు వెళ్లిపోయిన తరువాత సీత చుట్టు ఉన్న రాక్షస స్త్రీలు సీతను నానా రకాలుగా భయపెట్టారు. కాని సీత వారి మాటలను లెక్కచెయ్యలేదు. తాము ఎంత బతిమాలినా, భయపెట్టినా సీత లొంగలేదని, ఈ విషయం రావణునికి తెలియచెయ్యడానికి కొంతమంది రాక్షస స్త్రీలు రావణుని వద్దకు వెళ్లారు. మిగిలిన స్త్రీలు సీతను ఇంక భయపెట్టి లాభం లేదని, ఆమె చుట్టు పడుకొని నిద్రించారు. రాక్షస స్త్రీలు నిద్రించిన తరతువాత, సీత రాముని తలచుకొని తన దుస్థితికి ఏడుస్తూ ఉంది.

పడుకొని ఉన్న రాక్షస స్త్రీలలో త్రిజట అనే వృద్ధరాక్షసి కూడా ఉంది. ఆమె నిద్ర నుండి లేచి పక్కన ఉన్న రాక్షస స్త్రీలతో ఇలా అంది. "ఈమె సామాన్యురాలు కాదు. జనకుని కూతురు, దశరథుని కోడలు. రాముని భార్య. ఈమెను మీరు చంపలేరు. మీరందరూ చచ్చినా, ఈమె మాత్రము బతికే ఉంటుంది. ఎందుకంటే ఇప్పుడే నాకు ఒక కల వచ్చింది. ఆ కలలో లంకలో ఉన్న రాక్షసులు అందరూ నాశనం

అయినట్లు రాముడు విజయోత్సాహంతో ఉన్నట్లు నాకు కనపడింది. అంతే కాకుండా ఎవరైనా స్త్రీ ఆపదలో ఉంటే, అదే స్త్రీ సుఖంగా ఉన్నట్లు మనకు కలలో కనబడితే, ఆమె దు:ఖములు అన్నీ పోయి సుఖిస్తుంది అని పెద్దలు చెబుతారు. కాబట్టి మనలను అందరినీ కాపాడమని సీతను ప్రార్థిద్దాము అంతకన్నా మనకు వేరు మార్గము లేదు. మనము సీతకు నమస్కారం చేస్తే చాలు ఈమె చాలా సంతోషిస్తుంది." అని త్రిజట ఆ రాక్షస స్త్రీలకు చెప్పింది.

నేను శింశుపా వృక్షము మీద కూర్చుని ఇదంతా చూస్తూ ఉన్నాను. సీత దు:ఖిస్తూ ఉంటే చూస్తూనే ఉన్నాను కానీ ఏమీ చెయ్యలేకపోయాను. సీతతో ఎలా మాట్లాడాలా అని ఆలోచించి, తుదకు నేను ఆకుల మాటున కూర్చుని సీతకు కనపడకుండా రామ చరితమును వర్ణించాను. నేను చెబుతున్న రాముని చరితమును విని సీతకు ఆశ్చర్యము కలిగింది. తన పైకి ఎత్తి చూచింది. నేను ఆమెకు నమస్కరించాను. ఆమె నన్ను చూచి "నువ్వు ఎవరు? ఎక్కడి నుండి వచ్చావు? ఇక్కడికి ఎందుకు వచ్చావు?ఇక్కడికి ఎలా వచ్చావు?" అని ఆతురతగా అడిగింది.

అప్పుడు నేను సీతతో ఇలా అన్నాను. "ఓసీతాదేవీ! నీ భర్త రామునికి మా వానర రాజు సుగ్రీవునికీ మైత్రి కుదిరింది. నేను ఆ సుగ్రీవుని మంత్రిని. నా పేరు హనుమంతుడు. నీవు ఎక్కడ ఉన్నావో వెదకడానికి రాముడు, సుగ్రీవుడు నన్ను పంపారు. నీవు కనపడితే నీకు ఆనవాలుగా చూపమని రాముడు ఈ ఉంగరమును నాకు ఇచ్చాడు. వారి ఆదేశాను సారము నేను లంకకు వచ్చాను. నిన్ను చూచాను.

నువ్వు నాతో వస్తాను అంటే నేను నిన్ను రామలక్ష్మణుల వద్దకు తీసుకొని వెళతాను. మీ ఆజ్ఞకొరకు వేచి ఉన్నాను.” అని పలికి రాముడు ఇచ్చిన ఉంగరమును సీతకు ఇచ్చాను. అప్పుడు సీత నాతో ఇలా పలికింది. “రాముడు లంకకు వచ్చి రావణుని ఓడించి నన్ను తీసుకొని వెళ్లాలి. అంతే కానీ నేను నీతో రాను” అన్నది సీత. ఆమె మాటలకు సంతోషించిన నేను రామునికి చూపుటకు ఆనవాలుగా ఏదైనా గుర్తు ఇమ్మని అడిగాను. సీత తన చూడామణిని తీసి నాకు ఇచ్చింది. దీనిని రామునికి చూపిస్తే రాముడు నమ్ముతాడు అని చెప్పింది. ఆమె రామునితో చెప్పమని నాకు తన సందేశమును కూడా వినిపించింది. తరువాత నేను సీతకు ప్రదక్షిణము చేసి నమస్కరించాను. నేను వెళ్లబోతుంటే సీత నాతో ఇలా అంది.

“ఓ హనుమా! నా రామునికి ఇక్కడ ఉన్న పరిస్థితులను అన్నీ వివరించు. నేను పడుతున్న కష్టములు అన్నీ చెప్పు. నీవు పోయి రాముని, లక్ష్మణుని, నీ రాజు సుగ్రీవుని ఇక్కడకు వచ్చేట్టు చెయ్యి. నేను ఇంక రెండు మాసములు మాత్రమే జీవిస్తాను. రెండు మాసముల తరువాత రాముడు ఇక్కడకు వచ్చినా నన్ను చూడలేడు. ఎందుకంటే అప్పటికి నేను ఒక అనాథ వలె మరణిస్తాను.” అని దీనంగా పలికింది సీత. ఆమె మాటలు విని నాకు రావణుని మీద కోపం వచ్చింది. నా శరీరమును విపరీతంగా పెంచాను. ఆ అశోకవనమును సర్వనాశనం చేసాను.

నిద్రపోతున్న రాక్షస స్త్రీలందరూ లేచారు. విరిగిన లతలు, కూలిన చెట్లు, ధ్వంసము చేయబడ్డ సరోవరములు చూచారు. వనమును నాశనం చేస్తున్న నన్ను చూచారు. వెంటనే పోయి

రావణునికి నా గురించి చెప్పారు. "ఓ రాక్షసరాజా! అశోక వనమును ఒక కోతి నాశనం చేస్తూ ఉంది. దానిని చంపడానికి అనుజ్ఞ ఇవ్వండి." అని ప్రార్థించారు. వెంటనే రావణుడు కింకరులు అనే పేరుగల రాక్షస మూకను పంపాడు. వాళ్లను చూచి నేను ఒక పరిఘను తీసుకున్నాను. ఎనభయి వేలమంది కింకరులు అనే రాక్షసులను ఆ పరిఘతో సంహరించాను. చావగా మిగిలిన రాక్షసులు పరుగు పరుగున పోయి రావణునితో కింకరులు అందరూ మరణించారు అన్న వార్త చెప్పారు. తరువాత నేను అశోక వనములో ఉన్న చైత్య ప్రాసాదము అనే పెద్ద భవనమును సమూలంగా కూల్చివేసాను. రావణుడు ప్రహస్తుని కుమారుడు అయిన జంబుమాలిని కొంత సైన్యముతో నా మీదికి పంపాడు. నేను జంబుమాలిని, అతని సైన్యమును నా చేతిలో ఉన్న పరిఘతో కొట్టి చంపాను. జంబుమాలి మరణించాడు అన్న వార్త విన్న రావణుడు మంత్రికుమారులను నా మీదికి పంపాడు. నేను ఆ మంత్రి కుమారులను కూడా పరిఘతో కొట్టి చంపాను. తరువాత రావణుడు ఐదుగురు సేనానాయకులను సైన్యంతోసహా నా మీదికి పంపాడు. నేను ఆ ఐదుగురు సేనానాయకులను కూడా సంహరించాను. తరువాత రావణుడు తన కుమారుడు అయిన అక్షకుమారుని నా మీదికి యుద్ధానికి పంపాడు. అక్షకుమారుడు నన్ను చంపడానికి ఆకాశంలోకి ఎగిరాడు. అప్పుడు నేను అతని పాదములు పట్టుకొని గిరా గిరా తిప్పి నేలకేసి మోది చంపాను. అక్షకుమారుడు మరణించాడు అన్న వార్త విన్న రావణుడు క్రుద్ధుడై తన కుమారుడు ఇంద్రజిత్తును నా మీదికి పంపాడు. నేను ఇంద్ర జిత్తు వెంట వచ్చిన సైన్యమును పూర్తిగా చంపాను.

సుందర కాండము

అప్పుడు ఇంద్రజిత్తు నా మీద బ్రహ్మాస్త్రమును ప్రయోగించాడు. నేను బ్రహ్మాస్త్రమును గౌరవించి బంధింపబడ్డాను. తరువాత రాక్షసులు నన్ను తాళ్లతో కట్టి రావణుని ముందు నిలబెట్టారు. రావణుడు నన్ను చూచి "నీవు ఎవరు? లంకకు ఎందుకు వచ్చావు? రాక్షసులను ఎందుకు చంపావు?" అని అడిగాడు. అప్పుడు నేను రావణునితో ఇలా అన్నాను. "నేను సీతను చూడటానికి లంకకు వచ్చాను. సీతను చూచాను. నేను వాయుదేవుని ఔరస పుత్రుడను. నా పేరు హనుమంతుడు. నేను వానరుడను. నేను వానర రాజు వాలి సోదరుడు అయిన సుగ్రీవుని మంత్రిని. రాముని దూతగా లంకకు వచ్చాను. సుగ్రీవుడు నిన్ను క్షేమము అడగమని చెప్పాడు. నీకు కొన్ని హితవచనములు తన మాటలుగా నీకు చెప్పమని చెప్పాడు.

" ఓ రావణా! నేను ఋష్యమూక పర్వతము మీద ఉన్నప్పుడు రాముడు నాకు మిత్రుడు అయ్యాడు. తన భార్యను ఒక రాక్షసుడు అపహరించాడనీ, తన భార్యను వెదకడంలో తనకు సాయం చెయ్యమనీ రాముడు నన్ను అడిగాడు. నేను కూడా వాలి నా రాజ్యమును, నా భార్యను నా నుంచి బలవంతంగా లాక్కున్నాడు అని చెప్పి నాకు సాయం చెయ్యమని రాముని కోరాను. నేను రాముడు అగ్నిసాక్షిగా స్నేహితులము అయ్యాము. ఒకరికి ఒకరం సాయం చేసుకోవాలని ప్రతిజ్ఞలు చేసుకున్నాము. రాముడు నాకు ఇచ్చిన మాట ప్రకారము వాలిని వధించి నన్ను కిష్కింధకు రాజును చేసాడు. నా భార్యను తిరిగి నావద్దకు వచ్చేట్టు చేసాడు. దానికి ప్రతిఫలంగా నేను సీతను వెదకడానికి రామునికి సాయం చేయాలని నిశ్చయించుకున్నాను. అందుకని నా మంత్రి హనుమంతుని నీ వద్దకు పంపుతున్నాను. నేను వానరసైన్యముతో లంకకు వచ్చి నిన్ను చంపక

ముందే నీవు సీతను తీసుకొని వచ్చి రామునికి అప్పగించు. నీకు వానరముల శక్తి సామర్థ్యములు పరాక్రమము తెలియనిది కాదు. ” అని సుగ్రీవుడు నీతో చెప్పమన్నాడు. తరువాత నీ ఇష్టం.” అని ఊరుకున్నాను.

నా మాటలు విన్న రావణుని కళ్లు ఎర్రబడ్డాయి. కోపంతో ఊగిపోయాడు. వెంటనే నన్ను చంపమని ఆదేశాలు ఇచ్చాడు. ఇంతలో రావణుని సోదరుడు అయిన విభీషణుడు నా గురించి రావణుని ప్రార్థించాడు. “ఓ రాక్షస రాజా! దూతను చంపడం రాజ ధర్మమునకు విరుద్ధము. దూత ఎంత తప్పుచేసినా అవయవములు ఛేదించడం మంచిది కానీ చంపడం శాస్త్ర విరుద్ధము.” అని రావణునికి హితము చెప్పాడు. విభీషణుని మాటలు విన్నాడు రావణుడు. నా తోకకు నిప్పు అంటించి కాల్చమని ఆజ్ఞ ఇచ్చాడు.

వెంటనే రాక్షసులు నా తోకకు పాత వస్త్రములు చుట్టి, నూనె పోసి నిప్పంటించారు. తరువాత రాక్షసులు నన్ను చేతులతోనూ కాళ్లతోనూ కర్రలతోనూ పిడికిళ్లతోనూ కొట్టడం, మోదడం చేసారు. నన్ను నగర వీధులలో తిప్పారు. నా గురించి పెద్దగా అరిచి అందరికీ చెప్పారు. నాకు కోపం వచ్చింది. నేను ఆ కట్లను విడిపించుకున్నాను. ఒక పరిఘను తీసుకొని ఆ రాక్షసులను అందరినీ చంపాను. తరువాత నేను మండుతున్న తోకలో నగర ద్వారము మీదికి ఎక్కాను. ఒక గృహము మీది నుండి మరొక గృహము మీదికి దుముకుతూ అన్ని గృహములకు, భవనములకు, ప్రాసాదములకు నిప్పుపెట్టాను. లంక అంతా కాల్చాను.

అప్పుడు నాకు ఒక సందేహము వచ్చింది. లంక అంతా కాల్చాను కదా అందులో సీత కూడా కాలి పోయి ఉంటుంది కదా అని విచారించాను. రామకార్యమును నాశనం చేసాను కదా అని శోకించాను. ఇంతలో ఆకాశంలో వెళుతున్న చారణుల మాటలు నాకు వినబడ్డాయి. "హనుమంతుడు లంకాదహనం చేసాడు. కానీ మహాసాధ్వి సీత మరణించలేదు" అని వారు మాట్లాడుకోవడం నేను విన్నాను. అప్పుడు నాకు అనిపించింది. "నా తోకకు నిప్పంటించినపుడే అగ్ని నా తోకను కాల్చలేదు. ఇంక రాముని భార్య సీతను అగ్ని ఎలా దహిస్తాడు." అని అనుకున్నాను. అదీ కాకుండా సీతకు శుభశకునములు కనపడినప్పుడు సీతకు కీడు ఎలా కలుగుతుంది అని కూడా అనుకున్నాను.

నేను వెంటనే శింశుపా వృక్షము కింద ఉన్న సీత వద్దకు వెళ్లాను ఆమె క్షేమంగా ఉందని తెలుసుకున్నాను. ఆమె అనుజ్ఞను పొంది తిరిగి సముద్రమును లంఘించి మీ వద్దకు వచ్చి వాలాను. రాముని ప్రభావంతో, మీ అందరి ఆశీస్సులతో, సుగ్రీవుడు ఆజ్ఞాపించిన కార్యమును నిర్విఘ్నముగా నెరవేర్చాను. ఇంక మీరు ఎలా చెబితే అలా చేస్తాను." అని వినయంగా జరిగింది జరిగినట్టు చెప్పాడు హనుమంతుడు.(హనుమంతుడు చెప్పడంలో కొన్ని విషయాలు, కొన్ని పేర్లు అటు ఇటు అవడం మీరు గమనించేఉంటారు. ఒక విషయాన్ని తిరిగి చెబుతున్నప్పుడు కొంత వైవిధ్యం కనపడటం మానవ సహజం. ఇంక వానరుల సంగతి చెప్పేదేముంది.)

శ్రీమద్రామాయణము

సుందర కాండము ఏబది ఎనిమిదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

ఏబది తొమ్మిదవ సర్గ.

హనుమంతుడు లంకలో తాను చేసిన పనులు జరిగిన విషయములు అన్నీ జాంబవంతునికి, అంగదునకు మిగిలిన వానరశ్రేష్టులకు చెప్పి, ఇంకా ఇలా చెప్పసాగాడు.

“సీతా దేవి మహా పతివ్రత. ఆమె పాతివ్రత్య మహత్తు చేత రాముని ప్రయత్నము సఫలం అవుతుంది అని నా నమ్మకము. కాని రాక్షస రాజు రావణుడు సామాన్యుడు కాడు. మహా బలవంతుడు. అతడికి కోపం వస్తే ఎవరినీ లెక్కచెయ్యడు. తన తపోబలంతో ముల్లోకములను నాశనం చెయ్యగల సమర్థుడు. రావణుడు సీతను తీసుకొని వెళ్లేటప్పుడు ఆమె శరీరాన్ని తాకాడు. కానీ రావణుడు భస్మం కాకపోవడానికి కారణం అతడు చేసిన తపస్సు ఫలితమే. మరొకడు అయితే సీత పాతివ్రత్య మహిమకు భస్మంకాక తప్పదు. సీతకు కోపం వస్తే తన పాతివ్రత్య మహిమతో ఏమైనా చెయ్యగలదు.

ఇదీ పరిస్థితి. మనము ఇప్పుడు ఏం చెయ్యాలి. మనం అందరం లంకకు పోయి సీతను తీసుకొని వచ్చి రామునికి అప్పగించడమా! ఎందుకంటే రావణుని ససైన్యముగా నాశనం చెయ్యడానికి నేను ఒక్కడినే చాలు. నాకు రావణుని సైన్యము యొక్క ఆనుపానులు బాగా తెలుసు. నాకు తోడు మీరందరూ ఉన్నారు. మీరందరూ బలవంతులు, అస్త్రములను శస్త్రములను ప్రయోగించడంలో నిపుణులు. మీరందరూ నా తో ఉంటే ఇంక

చెప్పేదేముంది. క్షణాల్లో రావణుని, రావణుని సోదరులను, రావణుని పుత్రులను, అతని సమస్త సైన్యమును సంహరించవచ్చును. ఇంద్రజిత్తు చే ప్రయోగింపబడే బ్రహ్మాస్త్రము, ఇంద్రాస్త్రము, రౌద్రాస్త్రము, వాయవ్యాస్త్రము, వారుణాస్త్రము ఇంకా రకరకాల అస్త్రములను నేను దూది పింజల మాదిరి ఎగురగొట్టగలను. రాక్షసులందరినీ చంపగలను. నా పరాక్రమంతో రావణుని బంధించగలను. నేను కురిపించే రాళ్ల వర్షానికి దేవతలే భయపడతారు. ఇంక ఈ రాక్షసులు ఒక లెక్కా!

నా దాకా ఎందుకు ఈ జాంబవంతుడు చాలు. రాక్షసులనందరినీ తుదముట్టించడానికి. అంతదాకా ఎందుకు మన యువరాజు అంగదుడు చాలు. సకల రాక్షస నాయకులను సంహరించడానికి. మన పనసుడు, నీలుడు తలచుకుంటే మంధరపర్వతమును కూడా బద్దలు కొట్టగలరు. ఇంక ఆ రాక్షసులు వారి ముందు ఎంత! దేవాసురులు కానీ, గంధర్వులు, యక్షులు గానీ, పన్నగులు కానీ మన మైందునకు ద్వివిదునకు ఎదురు నిలిచి పోరాడగలరా! వారే పోరాడలేనపుడు ఈ రాక్షసాధములు ఎంత? ఎందుకంటే ఈ మైందుడు ద్వివిదుడు బ్రహ్మదేవుడు వరము చేత అమృతమును సేవించారు. వీరికి ఎక్కడా అపజయము అనే మాట లేదు. పైగా వీరికి ఎవరి చేతిలోనూ చావు రాదని బ్రహ్మదేవుడు వరం కూడా ఇచ్చాడు. బ్రహ్మదేవుడు ఇచ్చిన వరంతో గర్వించి, వీరు దేవతలను జయించి, వారి వద్ద ఉన్న అమృతమును తాగారు. అందువలన వీరు అజేయులు. కాబట్టి ఈ మైందుడు ద్వివిదుడు కోపిస్తే లంకానగరము సర్వము నాశనమైపోతుంది.

ఇప్పటికే నేను లంకానగరమును అగ్నికి ఆహుతి చేసి మన వానరుల పరాక్రమమును లంకావాసులకు తెలియజేసాను. అంతే కాదు. నేను లంకలో రామలక్ష్మణులయొక్క, మన రాజు సుగ్రీవుని యొక్క బల పరాక్రమముల గురించి రావణునికి తెలియజేసాను. అశోక వనములో ఉన్న సీత సదా రామనామస్మరణ చేస్తూ ఉందే కానీ, రావణుని పేరు ఒక్కసారి కూడా తలవడం లేదు.

మన రాముని భార్య సీత లంకలో బంధింపబడి ఉంది. ఆమె ఎప్పుడూ రాముని మనసులో స్మరిస్తూ ఉంది. సీత నిరంతరమూ శోకిస్తూ ఉంది. అటువంటి సీతను రాక్షస స్త్రీలు నిరంతరమూ భయపెడుతున్నారు. చంపుతామని బెదిరిస్తున్నారు. రావణుడు ఆమెకు రెండునెలల గడువు ఇచ్చాడు. వారి బాధలకు తట్టుకోలేక సీత ప్రాణత్యాగమునకు సిద్ధం అయింది. అది నేను కళ్లారా చూచాను. ఆమెకు నేను కిష్కింధలో జరిగిన విషయములు అన్నీ విపులంగా చెప్పాను. మేమందరమూ కూడా ఆమె కోసరం నిరంతరమూ బాధపడుతున్నాము అని తెలియజేసాను. నామాటలతో ఆమెకు ఊరట కలుగచేసాను.

అసలు మనమంతా ఎందుకు. సీతకు కోపం వస్తే రావణుని ఈ పాటికి భస్మం చేసి ఉండేది. కానీ అలా చేయలేదు. కారణం ఆమెకు రాముని మీద అచంచల భక్తి, విశ్వాసము. సీతను అపహరించగానే రావణుడు సగం చచ్చాడు. ఇప్పుడు రాముడు రావణుని చంపడం కేవలం నిమిత్తమాత్రమే.

కాబట్టి మనం అంతా కలిసి సీతను రావణుని చెరనుండి విడిపించుటకు తగిన ప్రయత్నములు చేయాలి." అని హనుమంతుడు తన సుదీర్ఘమైన ప్రసంగమును ముగించాడు.

శ్రీమద్రామాయణము
సుందర కాండము ఏబది తొమ్మిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము
అరువదవ సర్గ.

హనుమంతుని మాటలను సావధానంగా విన్న అంగదుడు ఇలా అన్నాడు. "హనుమంతుడు నూరుయోజనముల సముద్రమును దాటి లంకను చేరి సీతను చూచాడు. సీతను చూచి కూడా మనము సీతను మనతో తీసుకొని వెళ్లకుండా వట్టి చేతులతో పోవడం మంచిది కాదు. మనమంతా రాముని వద్దకు పోయి "రామా! మేము సీతను చూచాము కానీ ఆమెను అక్కడే వదిలి వచ్చాము" అని చెప్పడం శోభస్కరము కాదని నా అభిప్రాయము. ముల్లోకములలో ఎక్కడి కైనా మనము ఎగిరిపోగల శక్తి మనకు ఉంది. ఇప్పటికే హనుమంతుడు చాలా మంది రాక్షస వీరులను సంహరించాడు. ఇంక మనము లంకకు వెళ్లి సీతను రావడమే మిగిలి ఉంది." అని పలికాడు అంగదుడు.

ఆ మాటలు విన్న జాంబవంతుడు వారితో ఇలా అన్నాడు.

" అంగదా! నీవు చెప్పిన మాటలు బాగుగా ఉన్నాయి. సీతను లంక నుండి తీసుకురావడం మన శక్తికి మించిన పనేం కాదు. కానీ ఇది రామ కార్యము. రాముడు మనలను కేవలం సీతను వెదకడానికి సీత జాడ తెలుసుకోడానికి పంపించాడు. మనం అంతవరకే చెయ్యాలి. ముందు మనం రాముని వద్దకు పోయి, సీత గురించి రామునికి వివరంగా చెబుదాము. రాముడు ఏమి చెబితే అలా చేద్దాము. రాముని ఆలోచన ఎలా ఉందో అలా చేద్దాము. అంతే కానీ మనం స్వతంత్రించి ఏమీ చేయవద్దు." అని అన్నాడు జాంబవంతుడు.

శ్రీమద్రామాయణము
సుందర కాండము అరువదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము
అరువది ఒకటవ సర్గ.

పెద్దవాడు అయిన జాంబ వంతుని మాటలు అంగదునికి మిగిలిన వానరులకు బాగా నచ్చాయి. అందరూ జాంబవంతుడు ఎలా చెబితే అలా చేద్దాము అని అన్నారు. అందరూ కిష్కింధకు తిరిగి వెళ్లిపోదాము అని అనుకున్నారు. అందరూ హనుమంతుని ముందుంచుకొని మహేంద్ర పర్వతమును వదిలి పెట్టి ఆకాశంలో ఎగిరిపోయారు. అందరిలోనూ ఒకటే నిశ్చయము. రాముడికి సీత గురించి చెప్పడం. రావణుని చంపడం. సీతను తీసుకురావడం. ఎంత తొందరగా రాముడికి సీత గురించి చెబుదామా అని ఆతురతగా ఉన్నారు.

వారందరూ ఒక ఉద్యానవనమును చేరారు. దానిని సుగ్రీవుని మేనమామ మహా పరాక్రమ వంతుడు అయిన దధిముఖుడు అనే వానరుడు రక్షిస్తూ ఉంటాడు. ఆ వనము అంటే సుగ్రీవునికి ఎంతో ఇష్టం. అటువంటి వనములో మధువు బాగా దొరుకుతుంది. ఆ మధువును తాగాలని వానరులు అందరూ నిశ్చయించుకున్నారు. అందరూ ఆ మధువనములోకి ప్రవేశించారు.

అసలే వానరులు. అందులోనూ సీతను చూచిన ఆనందంలో ఉన్నారు. వారి సంతోషానికి పట్టపగ్గాలు లేవు. వానరులు అందరూ ఆ మధువనములోని మధువును తాగడానికి అంగదుని అనుమతి కోరారు. అంగదుడు పెద్దవాడైన జాంబవతుని అనుమతి కోరాడు. వానరుల ఉత్సాహమును చూచి జాంబవంతుడు మధువనములో మధువును తాగడానికి వారికి అనుమతి ఇచ్చాడు. అంగదుడు వానరులకు మధువును తాగడానికి అనుమతి ఇచ్చాడు.

వానరుల సంతోషానికి అంతు లేదు. వానరులు నృత్యం చేసారు. గంతులు వేసారు. ఆడారు. పాడారు. కొందరు నవ్వుతున్నారు. కింద పడుతున్నారు. గెంతుతున్నారు. చెట్లు ఎక్కుతున్నారు. దూకుతున్నారు. ఇష్టం వచ్చినట్టు వాగుతున్నారు. ఒకరి మీద ఒకరు ఎక్కుతున్నారు. కొట్టుకుంటున్నారు. ఆడుకుంటున్నారు. ఒక చెట్టు మీది నుండి మరొక చెట్టు మీదికి దూకుతున్నారు. ఉరుకుతున్నారు. నేల మీది నుండి మహావృక్షముల మీదికి దూకుతున్నారు. ఒకడు పాడుతుంటే మరొకడు వాడిని చూచి నవ్వుతున్నాడు. ఒకడు నవ్వుతుంటే మరొకడు వాడిని ఏడిపిస్తున్నాడు. వారందరూ అక్కడ ఉన్న మధువును పీకల దాకా తాగారు. వారికి మత్తుబాగా తలకెక్కింది.

వారికి ఏమి చేసినా తృప్తి కలగడం లేదు.

ఆ వనమునకు కాపలాగా ఉన్న దధిముఖుడు వానరములు వనము అంతా పాడుచేయడం చూచి వారిని అడ్డుకున్నాడు. వారి మీద కోపించాడు. వారిని భయపెట్టాడు. మత్తులో ఉన్న ఆ వానరులు ఊరుకోలేదు. ఇంకారెచ్చిపోయారు. వనం అంతా ధ్వంసం చేస్తున్నారు. ఆ దధిముఖుడు కొంత మందిని తిట్టాడు. మరి కొంత మందిని అదిలించాడు. ఇంకొంతమందిని కొట్టాడు. కొంత మందిని అలా చెయ్యవద్దని బతిమాలాడు.

ఎవరూ అతని మాట వినలేదు. వారి ఇష్టం వచ్చినట్టు చేస్తున్నారు. ఆ దధిముఖుని పట్టుకొని లాగుతున్నారు. కొడుతున్నారు. గోళ్లతో రక్కుతున్నారు. కాళ్లతోనూ చేతులతోనూ తంతున్నారు. మధువనములో ఉన్న పదార్థములనన్నిటినీ వానరులు చిందరవందర చేసారు.

శ్రీమద్రామాయణము

సుందర కాండము అరువది ఒకటవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందరకాండము

అరువది రెండవ సర్గ.

దదిముఖుడు వానరములను అడ్డుకోవడం చూచి అందరూ హనుమంతుని వద్దకు వెళ్లారు. "హనుమా! మేము ఈ వనములో మధువును సేవించడానికి ప్రయత్నిస్తుంటే ఈ దధిముఖుడు అడ్డుకుంటున్నాడు." అని అన్నారు.

హనుమంతుడు వానరములను చూచి ఇలా అన్నాడు. "మీరు ఎవరికీ భయపడకండి. మీ ఇష్టం వచ్చినట్టు ఈ మధు వనములో మధువు సేవించండి. మీకు ఎవరైనా అడ్డుచెబితే నేను వాళ్లను అదుపు చేస్తాను." అని అన్నాడు.

ఆ మాటలు విన్న అంగదుడు చాలా సంతోషించాడు. "మీరందరూ ఈ మధువనములో పేకరింపబడిన మధువును తనివితీరా తాగండి. మన హనుమంతుడు మనము చేయలేని కార్యమును సాధించుకొని వచ్చాడు. ఈ సంతోష సమయంలో మీరు ఏమి చేసినా ఏమీ అనను. ఇక్కడ మధువును తాగడం మనము చేయకూడని పని అయినా, హనుమంతుడు చెప్పాడు కాబట్టి మనం చేద్దాము." అని అనుజ్ఞ ఇచ్చాడు.

ఆ మాటలు విన్న వానరములు అంగదుని అభినందించారు. అందరూ మధువనములో ఉన్న మధువును తాగడానికి ఉద్యమించారు యధేచ్ఛగా మధువును సేవించారు. ఫలములను తిన్నారు. అడ్డం వచ్చిన వనపాలకులను చావ చితకా

కొట్టారు. కుండలతో మధువును సేవించారు. అందరూ మత్తులో తూలుతున్నారు. అసలే వానరులు. పైగా మధువు సేవించారు. తాగినంత తాగి మిగిలింది పారబోస్తున్నారు.

కొందరు పాన పాత్రలను చేత బట్టుకొని తాగుతూ మధువును ఒకరి మీద ఒకరు పోసుకుంటున్నారు. అందరికీ మత్తు బాగా తలకెక్కింది. మత్తులో తూలుతున్నారు. కొందరు చెట్ల కింద పడుకున్నారు. మరికొందరు చెట్ల మొదళ్లలో కూర్చుని మత్తులో జోగుతున్నారు. కొంత మంది ఒకరిని ఒకరు తోసుకుంటూ నడుస్తున్నారు. కొందరు పెద్దగా అరుస్తున్నారు. కొంతమంది ఈలలు వేస్తున్నారు. మరి కొంతమంది అలాగే ఎక్కడ అంటే అక్కడ నేల మీద పడిపోయి జోగుతున్నారు. మరి కొందరు తాము వనపాలకులను ఎలా కొట్టిందీ ఒకరితో ఒకరుచెప్పుకుంటూ ఆనందిస్తున్నారు. కొంత మంది మత్తులో ఏమి చేస్తున్నారో తెలియ కుండా వికృతమైన పనులు చేస్తున్నారు.

వానరులు ఇలా మధువనమును ధ్వంసము చేస్తుంటే వానరముల ఆగడాలు భరించలేక వన పాలకులు తలొక దిక్కు పారిపోయారు. ఈ వానరులు వాళ్లను తరిమి పట్టుకొని కొట్టి, ఈడ్చి మూల మూలలకు తోసేసారు. ఆ వనపాలకులు అందరూ దధిముఖుని వద్దకు పోయి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వానరముల ఆగడములు అన్నీ వివరంగా చెప్పారు. “హనుమంతుని అనుమతితో వానరములు మధువనమును పాడుచేసారు. అడ్డం వెళ్లిన మా అందరినీ తన్నారు. కొట్టారు. నేల మీద పడేసి ఈడ్చారు.” దధిముఖునితో మొరపెట్టుకున్నారు.

అప్పటికే వానరులతో తన్నులు తిన్న దధిముఖుడు వారిని ఓదార్చాడు. ఈ సారి అందరూ మూకుమ్మడిగా పోయి వానరములను అడ్డుకుందాము అని అనుకున్నారు. అందరూ మరలా మధు వనమునకు వెళ్లారు. వారందరూ చేతికి అందిన తాటిచెట్లను, మద్దిచెట్లను, వాటి కొమ్మలను, రాళ్లను పట్టుకొని హనుమంతుడు మొదలగు వానరుల దగ్గరకు వెళ్లారు. (దధిముఖుడు, అతని వనపాలకులు కూడా వానరులే).

దధిముఖుడు, వనపాలకులు అందరూ హనుమంతుడు మొదలగు వానరములను చుట్టుముట్టారు. హనుమంతుడు మొదలగు వానరములు దధిముఖుడు మొదలగు వనపాలకులను ఎదిరించడానికి సిద్ధం అయ్యారు. ఆ దధిముఖుడు సుగ్రీవునికి మేనమామ. అయినా లెక్కచెయ్యకుండా అంగదుడు దధిముఖుని తన అరిచేత్తో కొట్టాడు. బాగా మధువు తాగి మత్తులో ఉన్న అంగదుడు దధిముఖుని నేల మీద పడేసి ఈడ్చాడు. అంగదుడు కొట్టిన దెబ్బలకు దధిముఖునికి ఎముకలు అన్నీ విరిగిపోయాయి. శరీరం అంతా రక్తంతో తడసిపోయింది. దధిముఖుడు మూర్ఛపోయాడు. కాని వెంటనే తేరుకున్నాడు.

ఇప్పటి దాకా అంగదుడు యువరాజు అని ఉపేక్షించాడు దధిముఖుడు. ఇంక తప్పలేదు. అక్కడి నుండి తప్పించుకొని ఒక రహస్య ప్రదేశమునకు తన వన పాలకులతో వెళ్లాడు. వారితో ఇలా అన్నాడు. “ఈ వానరులను మనము ఏమీ చేయలేము. వీరిని ఇలాగే ఉండనీ. మనము అందరూ సుగ్రీవుని వద్దకు పోదాము. అంగదుని నాయకత్వములో ఈ వానరములు చేసిన ఆగడములు అన్నీ

సుగ్రీవునికి చెపుదాము. అప్పుడు సుగ్రీవుడు కోపించి అందరికీ మరణ దండన విధిస్తాడు. ఎందుకంటే సుగ్రీవునకు ఈ మధువనము అంటే ఎంతో ఇష్టము. ఈ మధువనము సుగ్రీవునికి తన తాత తండ్రుల నుండి సంక్రమించినది. దీనిని ఎవరు పాడు చేసినా సహించలేడు. ఈ మధువనమును పాడు చేస్తున్న వానరులకు ఆయువు మూడింది. సుగ్రీవుని చేతిలో వీరందరికీ మరణ దండన తప్పదు. అప్పుడు మన కోపము చల్లారుతుంది.” అని పలికాడు దధిముఖుడు.

తరువాత దదిముఖుడు ఆకాశంలో ఎగురుతూ సుగ్రీవుడు ఉండే చోటికి వెళ్లాడు. అక్కడ రాముడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు కూర్చుని ఉన్నారు. దధిముఖుడు వారి ముందు వాలాడు. వారికి నమస్కారము చేసాడు. సుగ్రీవుని పాదాలపై పడ్డాడు. సాష్టాంగ నమస్కారము చేసాడు.

శ్రీమద్రామాయణము

సుందర కాండము అరువది రెండవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాబడము

అరువది మూడవ సర్గ.

సుగ్రీవుడు దధిముఖుని బుజాలు పట్టుకొని లేవ నెత్తాడు. “ఏమయింది దధిముఖా! నీకు నీ వారికి క్షేమమే కదా! ఎందుకు అలా దిగాలుగా ఉన్నావు. ఏం జరిగింది. వివరంగా చెప్పు” అని అడిగాడు సుగ్రీవుడు.

"ఓ మహారాజా! మధువనము నీకు చెందినది. నీ తండ్రి గానీ, నీవు గానీ, నీ అన్న వాలి గానీ, ఆ మధువనమును ఎవరికీ అనుభవించమని ఇవ్వలేదు. ఆ మధువనమునకు మమ్ములను రక్షకులుగా నియమించావు. కాని ఈ రోజు కొంత మంది వానరులు వచ్చి ఆ మధువనమును ఆక్రమించుకొ.ని, మధువును తాగి. నానా అల్లరీ చేసారు. మా అందరినీ కొట్టారు. వన రక్షకులు అడ్డుకోగా వారిని కూడా లెక్క చేయలేదు. అందరినీ కొట్టారు. వారు మధువును తాగుతూ మిగిలింది పారబోస్తూ అదేమని అడిగితే కళ్లెర్ర చేస్తున్నారు. మేము మరలా మరలా వారిని అలా చేయవద్దు అని వారింపగా మా అందరినీ అక్కడి నుండి తరిమివేసారు. మా అందరినీ కొట్టి, తన్ని ఈడ్చి, మారు మూల ప్రదేశాలకు తరిమేసారు. మీరు మాకు రాజుగా ఉండి కూడా, ఆ వానరులు ఇంతటి దురాగతానికి పాలుబడ్డారు. మధువనమును పూర్తిగా నాశనం చేస్తున్నారు. మీరు వారిని కఠినంగా శిక్షించాలి." అని విన్నవించుకున్నాడు దధిముఖుడు.

ఈ మాటలు అన్నీ విన్న లక్ష్మణుడు సుగ్రీవునితో ఇలా అన్నాడు. "సుగ్రీవా! అతను దేని గురించి ఎవరి గురించి చెబుతున్నాడు?" అని అడిగాడు.

"లక్ష్మణా! ఈ దధిముఖుడు మధువనమునకు రక్షకుడు. కొందరు వానరులు మధువనమును పాడుచేసారు అని అంటున్నాడు. మనము దక్షిణ దిక్కుకు పంపిన వానరులు తిరిగి వచ్చి, దారిలో ఉన్న ఆ మధువనమును పాడుచేస్తున్నారేమో అని అనుమానంగా ఉంది. ఇక్కడ ఉన్న వానరులకు అంత ధైర్యము లేదు. వారు నిశ్చయంగా అంగదుడు, హనుమంతుడు అయి ఉంటారు. వారు వెళ్లిన కార్యము

సిద్ధించనిచో వారు అలా ప్రవర్తించరు. కాబట్టి అంగదుడు, హనుమంతుడు, జాంబవంతుడు ఈ కార్యము సాధించి ఉంటారని అనుకుంటున్నాను. హనుమంతుడు సీతా దేవిని చూచి ఉంటాడు. ఆ ఆనందములో వారంతా ఇలా విచ్చలవిడిగా మధువును తాగుతూ ఉండి ఉంటారు. హనుమంతుడు మంచి జ్ఞాని, బుద్ధిమంతుడు. వివేచనా పరుడు. అతనే సీతను చూచి ఉంటాడు. హనుమంతుడు, జాంబవంతుడు నాయకత్వం వహించే వానరులకు విజయం తప్పదు. ఈ దధిముఖుడు ఆ విషయం చెప్పడానికే ఇక్కడకు వచ్చాడు.

ఓ లక్ష్మణా! రామ కార్యము సఫలమైనది. సీత జాడ తెలిసింది. అందుకే మనము పంపిన వానరులు అంత ఆనందంగా కేరింతలు కొడుతున్నారు. మధువు తాగుతున్నారు. ఎందుకంటే, హనుమంతుడు సీతను చూడకపోయి ఉంటే, ఆ వానరులు ఇంత సాహసం చెయ్యరు. నాకు చెందిన మధువనములోకి ప్రవేశిస్తే మరణదండన తప్పదని అందరికీ తెలుసు." అని అన్నాడు సుగ్రీవుడు.

ఆ మాటలు విన్న రాముడు, లక్ష్మణుడు ఎంతో సంతోషించారు. అప్పుడు సుగ్రీవుడు దధిముఖునితో ఇలా అన్నాడు. "ఓ దధిముఖా! వారు ఎవరో కాదు. సీతను వెదకడానికి దక్షిణదిక్కుగా వెళ్లిన వానర వీరులు. వారు తమ పని పూర్తి చేసుకొని ఉల్లాసంగా ఉన్నారు. వారిని నేను క్షమించాను. అంత మహత్కార్యమును చేసుకొని వచ్చిన వారికి ఆ మాత్రం మధువు గ్రోలే అధికారం ఉంది. అది క్షమించరాని తప్పుకాదు కదా! నీవు పోయి వారందరినీ వెంటనే ఇక్కడకు తీసుకొని రా! నేను, రామలక్ష్మణులు వారి కోసరము వేచి ఉన్నాము అని వారికి తెలియజెయ్యి." అని అన్నాడు సుగ్రీవుడు.

సుందర కాండము

రామలక్ష్మణులు హనుమంతుని రాక కోసరం, అతడు సీత గురించి చెప్పబోయే విషయాల కోసరం ఆతురతగా ఎదురుచూస్తున్నారు.

శ్రీమద్రామాయణము

సుందర కాండము అరువది మూడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

సుందర కాండము

అరువది నాలుగవ సర్గ.

సుగ్రీవుని మాటలను సావధానంగా విన్నాడు దధిముఖుడు. అసలు విషయం అర్థం అయింది. రామలక్ష్మణులకు, సుగ్రీవునకు నమస్కరించాడు. తనతో వచ్చి వనపాలకులతో కలిసి వెంటనే మధువనమునకు ఎగిరిపోయాడు. అప్పటికే బాగా మధువును సేవించిన వానరులు మత్తులో తూలుతున్నారు. దధిముఖుడు చేతులు జోడించి నమస్కరిస్తూ యువరాజైన అంగదుని వద్దకు వెళ్లాడు.

"యువరాజా! తమరు ఎవరో తెలియక మా వనరక్షకులు మీకు ఆటంకము కలిగించారు. మమ్ములను క్షమించండి. నీవు కిష్కింధకు యువరాజువు. నీకు ఈ మధువనము మీద సర్వాధికారములు కలవు. మా మూర్ఖత్వముచేత మీ గురించి తెలియక అపరాధము చేసినాము. మమ్ములను క్షమించండి. మీరు ఇక్కడకు వచ్చినట్టు నేను మీ పినతండ్రి సుగ్రీవుల వారికి

తెలియజేసాను. మీ రాకను గురించి విని సుగ్రీవుడు ఎంతో సంతోషించాడు. ఈ మధువనము ధ్వంసము అయిన దాని గురించి ఆయన విచారించలేదు. మీ అందరినీ తొందరగా రమ్మని చెప్పారు. మీ రాక కోసం రామలక్ష్మణులు, సుగ్రీవుడు ఆతురతగా ఎదురు చూస్తున్నారు. కాబట్టి మీరందరూ వెంటనే సుగ్రీవుని వద్దకు పోవుట యుక్తము." అని దధిముఖుడు అంగదునితో చెప్పాడు.

దధిముఖుని మాటలు విన్న అంగదుడు హనుమంతుడు మొదలగు వానరులను చూచి ఇలా అన్నాడు. "మన గురించి, మన రాక గురించి రామునికి, సుగ్రీవునికి తెలిసిపోయింది. ఇంకా మనము ఇక్కడ ఉండడం మంచిది కాదు. ఇప్పటికే మన వాళ్లందరూ మధువు తృప్తిగా తాగి విశ్రాంతి తీసుకున్నారు. ఆడారు. పాడారు. ఇంక చాలు. ఇంక ఇక్కడ మనం చేసే పని ఏమీ లేదు. కాబట్టి మనం అందరం సుగ్రీవుని వద్దకు పోదాము. నేను యువరాజును, మీకు నాయకుడను అయినా మీరంతా నా కన్నా పెద్దవారు. అందుకని మిమ్ములను ఆజ్ఞాపించలేను. మీరంతా ఆలోచించి ఏది యుక్తము అని తోస్తే అది చేద్దాము." అని అన్నాడు అంగదుడు.

అంగదుని మాటలు విన్న వానరులు చాలా సంతోషించారు. "యువరాజా! నీ మంచి మనస్సుకు మేము ఎంతో సంతోషించాము. రాజు అయిన వాడు, తనకున్న ఐశ్వర్యముతో మదించి, 'నేను' 'నేను' అంటూ 'మీరంతా నా మాట వినాలి' అంటూ గర్వంగా పలుకుతుంటాడు. ఎదుటి వారు చెప్పిన మంచి మాటలు కూడా పట్టించుకోడు. కాని నువ్వు యువరాజువైనా పెద్దలను గౌరవిస్తున్నావు. ఇది నీకే చెల్లింది. మరొక యువరాజు ఇలా మాట్లాడడు. నీలో ఉన్న

వినయము పెద్దల ఎడల విధేయత నిన్ను భావి మహారాజుగా తీర్చిదిద్దుతాయి. నీ మాట ప్రకారము మేము అందరమూ మన మహారాజు సుగ్రీవుల వారి యొద్దకు పోవుటకు వేచి ఉన్నాము. నీ ఆజ్ఞలేకుండా మేమందరమూ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేము. ఇది నిజము.” అని ఆ వానరులందరూ ముక్తకంఠంతో పలికారు.

వారి మాటలకు సంతోషించాడు అంగదుడు. సుగ్రీవుని వద్దకు పోవుటకు ముందు తాను గాలిలోకి ఎగిరాడు. అంగదుని అనుసరించి మిగిలిన వానరములు అన్నీ గాలిలోకి ఎగిరాయి. అంగదుడు సుగ్రీవుని వద్దకు బయలుదేరిన సమయమున సుగ్రీవుడు రామునితో ఇలా అన్నాడు. “ఓ రామా! ఇంక నీ శోకమును విడిచిపెట్టు. నీ భార్య సీత జాడతెలిసినది కదా! నేను వారికి ఇచ్చిన సమయము దాటి పోయినది. సీత జాడ తెలుసుకోకుండా వారు నా దగ్గరకు రాలేరు. వారందరూ మధువనములో మధువును సేవించి సంతోషముతో నా దగ్గరకు వస్తున్నారు అంటే వారు రామ కార్యమును సఫలముచేసుకొని వస్తున్నారు అని అనుకోవచ్చు. అంగదుడు మొదలగు వానరులు తమ అప్పగించిన కార్యము సఫలము కానిచో మధువనములో అడుగు కూడా పెట్టేవారు కాదు. కాబట్టి వారందరూ సీతను చూచి ఆమె క్షేమములు తెలుసుకొని వస్తున్నారు. సంతోషకరమైన వార్త తీసుకొని వస్తున్నారు.

రామా! నీవు ఇంక ఊరడిల్లు. నేను దక్షిణదిక్కుకు పంపిన హనుమంతుడు కార్యదీక్ష, పట్టుదల కలవాడు. ఆతడు సూర్యుని తేజముతో సమానమైన తేజస్సుకలవాడు. అతడు నీ కార్యము

సఫలముచేసుకొని వస్తున్నాడు." అని రామునితో అంటూ ఉండగానే ఆకాశంలో వానరులు వస్తున్నట్టు వారు అరుస్తున్న అరుపులు, కేరింతలు వినబడ్డాయి. సుగ్రీవుడు తల ఎత్తి ఆకాశం వంక చూచాడు. ముందు అంగదుడు, తరువాత హనుమంతుడు, తరువాత జాంబవంతుడు, తరువాత మిగిలిన వానరములు వరుసగా వచ్చాయి. అందరూ రాముడు సుగ్రీవుడి ఎదుట నిలబడ్డారు.

హనుమంతుడు రామునికి శిరస్సు వంచి ప్రణామం చేసి "సీతా దేవి క్షేమంగా ఉంది" అని తెలిపాడు.

హనుమంతుని నోటి వెంట సీత క్షేమంగా ఉంది అన్న వార్త విన్న రాముని సంతోషానికి అంతులేకుండా పోయింది. ఆమాట విని లక్ష్మణుడు కూడా ఎంతో సంతోషించాడు. "సీతను చూచాను" అన్న హనుమంతుని వంక రాముడు ఆదరంతోనూ వాత్సల్యంతోనూ చూచాడు.

శ్రీమద్రామాయణము
సుందరకాండము అరువది నాల్గవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము
అరువది ఐదవ సర్గ.

అంగదుడు మొదలగు వానరులు రామునితో, తాము సీతను చూచామనీ, సీత లంకలో క్షేమంగా ఉందనీ, ఆమె రావణుని

అంత:పురములో బందీగా ఉందనీ, రాక్షస స్త్రీలు ఆమెను భయపెడుతున్నారనీ, సీత ఎల్లప్పుడూ రాముని తలచుకుంటూ ఉందనీ, రావణుడు ఆమెకు రెండు మాసముల గడువు ఇచ్చాడనీ, గబాగబా, గాభరాగా, కలగా పులగంగా చెప్పసాగారు. రాముడు వారిని ఆపి, వారితో ఇలా అన్నాడు.

"ఓ వానరులారా! సీత ఎక్కడ ఉంది? నా గురించి ఏమని అనుకుంటూ ఉంది? సీతను ఎవరు చూచారు. ఆ విషయములు అన్నీ నాకు వివరంగా చెప్పండి." అని అడిగాడు.

అప్పుడు ఆ వానరులు అందరూ సీతను చూచిన హనుమంతుని ముందుకు తోసారు. అప్పుడు హనుమంతుడు తన ఎదురుగా ఉన్న రామునికి, లంక వైపు తిరిగి లంకలో ఉన్న సీతకు నమస్కరించి, సీతను తను ఎలా చూచింది, సీత లంకలో ఎలా ఉ న్నదీ, రాముని గురించి ఏమనుకుంటూ ఉన్నదీ చెప్పనారంభించాడు.

"ఓ రామా! నేను నూరు యోజనముల దూరము ఉన్న సముద్రమును దాటి లంకకుచేరుకున్నాను. లంకలో సీత కోసరం అన్ని చోట్లా వెదికాను. రావణుని అంత:పురములో నేను సీతను చూచాను. సీత తన ప్రాణములు అన్నీ నీ మీదనే పెట్టుకొని జీవిస్తూ ఉంది. ఆమెకు కాపలాగా వికృతాకారులైన రాక్షస స్త్రీలు ఆమె చుట్టు ఉన్నారు. రావణుని వరించమని సీతను భయపెడుతున్నారు. రాక్షస స్త్రీల మధ్య ఉన్న సీతను నేను చూచాను. నీ భార్య సీత, నీతో ఉన్నప్పుడు సకల భోగములు అనుభవించిన సీత, ఇప్పుడు కష్టములు అనుభవిస్తూ ఉంది. ఆమె దీనంగా ఉంది. ఎల్లప్పుడూ నీ గురించే ఆలోచిస్తూ ఉంది.

నువ్వు ఎప్పుడు వచ్చి తనను ఆ రాక్షసుని చెరనుండి విడిపిస్తావా అని ఎదురు చూస్తూ ఉంది. ఆమె మరణించడానికి సిద్ధంగా ఉంది. అటువంటి సీతను నేను చూచాను.

సీతతో ఎలా మాట్లాడో తెలియక, ఇక్ష్వాకు వంశమును, మీ చరిత్రను ఆమె వినేటట్టు వర్ణించాను. అప్పుడు సీత నన్ను చూచింది. నేను నా గురించి మీ గురించి తెలిపాను. నీకు సుగ్రీవునికీ స్నేహము కుదిరినది అనీ, సుగ్రీవుడు పంపగా నేను వచ్చాను అని చెప్పాను. నా మాటలు విని సంతోషించిన సీతను నేను చూచాను. ఆమె నాతో చాలా విషయాలు మాట్లాడింది. నీవు, సీత చిత్రకూట పర్వతము మీద ఉండగా జరిగిన కాకి వృత్తాంతము నాకు ఆనవాలుగా చెప్పింది.

ఆమెనాతో ఇలా అంది. "ఓ హనుమా! నీవు ఇక్కడ చూచిన విషయాలు చూచినట్టు రామునితో, సుగ్రీవునితో చెప్పు. నన్ను చూచి నట్టు ఆనవాలుగా ఈ చూడామణిని రామునికి ఇవ్వు. రామునితో ఇంకా నామాటగా ఇలా చెప్పు. "ఓ రామా! నేను ఇంక ఒక్క మాసము మాత్రమే జీవిస్తాను. ఆ తరువాత నేను జీవించుట దుర్లభము." అని సీత నీతో చెప్పమని నాతో చెప్పింది " అని హనుమంతుడు రామునితో సీత గురించి చెప్పాడు. సీత తనకు ఆనవాలుగా ఇచ్చిన చూడామణిని రామునికి ఇచ్చాడు.

శ్రీమద్రామాయణము

సుందర కాండము అరువది ఐదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

సుందర కాండము

అరువది ఆరవ సర్గ

హనుమంతుడు ఇచ్చిన చూడామణిని చూడగానే రామునికి సీతను చూచినట్టు అనిపించింది. రామునికి దు:ఖము పొర్లుకొచ్చింది. మాటి మాటికీ చూడామణిని చూస్తూ రాముడు ఏడుస్తున్నాడు. రాముడు తన మిత్రుడు సుగ్రీవుని చూచి ఇలా అన్నాడు.

" సుగ్రీవా! ఈ చూడామణి మా వివాహ సమయములో నా మామ గారు అయిన జనక మహారాజు సీత శిరస్సున ధరించడానికి ఆమెకు ఇచ్చారు. ఈ మణి జలములో నుండి పుట్టింది. ఈ మణి తొలుత దేవేంద్రుని వద్ద ఉండేది. జనక మహారాజు ఒక యజ్ఞము చేసినప్పుడు, దేవేంద్రుడు సంతోషించి ఈ మణిని జనకమహారాజుకు ఇచ్చాడు. జనకుడు ఈ మణిని తన కుమార్తె సీతకు ఇచ్చాడు. ఈ మణిని చూస్తుంటే నాకు నా తండ్రి దశరథుడు, నా మామగారు జనక మహారాజు గుర్తుకువస్తున్నారు. సీత ఎల్లప్పుడూ ఈ మణిని తన శిరస్సున ధరించేది. ఈ మణిని చూస్తుంటే నాకు సీతను చూస్తున్నట్టు ఉంది.

లక్ష్మణా! చూచావా! సీత నా దగ్గర లేదు. కానీ సీత ధరించిన మణి నా దగ్గర ఉంది. లక్ష్మణా! సీత ఇంక ఒక మాసము రోజులు మాత్రమే జీవించి ఉండునట! సీత లేనిదే నాకు జీవితము లేదు. నన్ను వెంటనే సీత ఎక్కడ ఉందో అక్కడకు తీసుకొని వెళ్లండి. సీతను చూడకుండా నేను క్షణకాలం కూడా ఉండలేను. సీత ఎక్కడ

ఉన్నదో తెలిసి కూడా నేను ఇక్కడ ఉండలేను. ఆ రాక్షసులు నా సీతను ఎన్నిబాధలు పెడుతున్నారో ఏమో! ఎల్లప్పుడు చంద్ర బింబము మాదిరి ప్రకాశించే నాసీత ముఖం ఆ రాక్షసులు అనే మబ్బులతో కప్పబడి ఉంది. ఓ హనుమంతుడా! ఇంకా నా సీత ఏమేమి చెప్పింది. వివరంగా చెప్పు. సీత మాటలు వింటూ నేను ఊరటపొందుతాను." అని అడిగాడు రాముడు.

శ్రీమద్రామాయణము

సుందర కాండము అరువది ఆరవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము

ఆరువది ఏడవ సర్గ.

రాముని మాటలు విన్న హనుమంతుడు, రామునితో సీత గురించి ఇలా చెప్పసాగాడు. "ఓ రామా! చిత్రకూట పర్వతము మీద మీరూ, సీతాదేవి ఏకాంతముగా ఉన్న సమయంలో జరిగిన కాకి విషయం ఆనవాలుగా చెప్పమని నాతో చెప్పింది. ఎందుకంటే ఆ విషయము మీకు, సీతాదేవికి తప్ప మూడో వానికి తెలియదట.

మీరు, సీతా దేవి చిత్ర కూడ పర్వతము మీద ఉన్నప్పుడు, మీరు ఇద్దరూ నిద్రపోతున్నారట. సీతాదేవి ముందే మేలుకొన్నదట. మీరు ఇంకా నిద్రపోతున్నారట. అప్పుడు ఒక కాకి వచ్చి సీతాదేవి స్తనముల మధ్య తన ముక్కుతో చీరినదట. అలా మాటి మాటికీ ఆ కాకి చీరుతూ ఉంటే సీతా దేవి శరీరమునుండి రక్తము వచ్చినదట. ఆ రక్తము నీ

శరీరమును తడుపగా నీవు మేల్కొన్నావట. నిద్రలోనుండి మేల్కొన్న నీవు, గాయపడిన సీతను, చూచి కోపంతో ఊగిపోయావట. "సీతా! నిన్ను ఎవరు గాయపరిచారు. చెప్పు" అని అడిగావట. అప్పుడు సీత ఆ కాకిని చూపినదట. నీవు రక్తముతో తడిసిన గోళ్లతో ఉన్న కాకిని చూచావట. నీవు ఒక దర్భను తీసుకొని మంత్రించి ఆ కాకి మీదికి విసిరావట. అప్పుడు ఆ దర్భ మండుతూ, ఆ కాకిని దహించడానికి ఆ కాకిని తరుముతూ వెళ్లిందట. ఆ కాకి తన తండ్రి అయిన దేవేంద్రుని వద్దకు వెళ్లినదట. దేవేంద్రుడు తన నిస్సహాయతను వ్యక్తం చేయడంతో, ఆ కాకి ముల్లోకములు తిరిగి తిరిగి ఆఖరుకు నీ వద్దకు వచ్చి శరణు వేడినదట. నీవు ఆ కాకిని దయతో రక్షించావట. నీవు ప్రయోగించిన అస్త్రము వృధా కారాదని, ఆ మండుతున్న దర్భతో ఆ కాకి కుడి కన్నును పొడిచావట. బతుకుజీవుడా అంటూ ఆ కాకి నీకు, సీతకు నమస్కరించి వెళ్లిపోయినదట.

రామా! ఇంకా సీత నాతో ఇలా చెప్పింది. "కాకి మీదనే బ్రహ్మాస్త్రము ప్రయోగించిన నా రాముడు ఈ రాక్షసులను ఎందుకు ఉపేక్షిస్తున్నాడు. దేవ,దానవ,గంధర్వ,యక్షులు యుద్ధములో నా రాముని ముందు నిలువలేరు అని నాకు తెలుసు. ఇంక ఈ రావణుడు, ఈ రాక్షసులు ఎంత? కాని ఎందుకో రామలక్ష్మణులు నన్ను రక్షించడానికి రావడం లేదు?" అని సీతాదేవి దీనంగా పలికింది.

ఆ మాటలు విన్న నేను సీతాదేవితో ఇలా అన్నాను. "అమ్మా సీతా దేవీ! రాముడు అతి త్వరలో వానర సైన్యముతో లంకకు వచ్చి రావణుని చంపి నిన్ను రక్షిస్తాడు. అయోధ్యకు తీసుకొని వెళతాడు." అని ఆమెను ఊరడించాను. తమరికి ఆనవాలుగా చూపించడానికి ఏదైనా

ఆనవాలు ఇమ్మని అడిగాను. అప్పుడు సీతా దేవి తాను ధరించిన వస్త్రములో మూట కట్టబడి ఉన్న ఈ చూడామణిని తీసి నాకు ఇచ్చింది. నేను ఆ మణిని భక్తితో స్వీకరించి, వెనక్కు వస్తూ ఉండగా సీతాదేవి నాతో ఇలా అంది. "ఓ హనుమా! రాముని లక్ష్మణుని, నీ రాజు సుగ్రీవుని కుశలము అడిగానని చెప్పు." అని చెప్పింది.

ఓ రామా! నేను సీతను చూచాను. సీత చెప్పమన్న మాటలు నీతో చెప్పాను. నన్నునమ్మండి." అని పలికాడు హనుమంతుడు.

శ్రీమద్రామాయణము
సుందర కాండము అరువది ఏడవసర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

సుందర కాండము
అరువది ఎనిమిదవ సర్గ.

"ఓ రామా! నేను బయలు దేరి వస్తుంటే సీతమ్మ నాతో ఇంకా ఈ విధంగా పలికింది.

"హనుమా! ఇక్కడ జరుగుతున్న విషయములు యధాతథముగా రామునికి చెప్పి రాముని ఇక్కడకు తీసుకొని వచ్చి, రావణ సంహారము చేసి, నన్ను రక్షించునట్టు చెయ్యి. ఓ హనుమా! నీవు ఇక్కడ ఉన్నంత సేపూ నేను ఎంతో ధైర్యంగా ఉన్నాను. ఇప్పుడు నీవు వెళిపోతున్నావు, మరలా నా కష్టాలు మొదలవుతాయి. రాముడు

తన సమగ్రసైన్యముతో వచ్చి, రావణుని జయించి నన్ను తీసుకొని వెళ్లడం రామునికి యశస్సు కలిగిస్తుంది. అంతేకానీ, రావణుడు నన్ను దొంగతనంగా తీసుకొని వచ్చినట్టు నీవు కూడా నన్ను దొంగతనంగా తీసుకొని వెళ్లడం మంచిది కాదు.” అని పలికింది సీత.

ఆ మాటలకు నేను సీతాదేవితో ఇలా అన్నాను. “అమ్మా! సుగ్రీవుని వద్ద ఉన్న వానరులు సామాన్యులు కారు. ఆకాశంలో ఎగురుతూ భూమిని చుట్టిరాగల సమర్థులు. ఆ వానరసేన లంక మీద ఎగరడం, లంకను చుట్టుముట్టడం నీవు తొందరలోనే చూస్తావు. వారితో పాటు వచ్చిన రాముడు, శత్రు సంహారము చేసి, నిన్ను తీసుకొని అయోధ్యానగరము చేరి, అయోధ్యము పట్టాభిషిక్తుడవడం నీవు తొందరలోనే చూడగలవు.ష” అని నేను సీతాదేవికి ధైర్యము చెప్పాను. సీతాదేవి నా మాటలతో మనస్సులో శాంతిని పొందింది.” అని హనుమంతుడు రామునితో చెప్పాడు.

శ్రీమద్రామాయణము
సుందర కాండము అరవైఎనిమిదవ సర్గ సంపూర్ణము.
సుందర కాండము సర్వం సంపూర్ణం.
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

దీనితో సుందర కాండముపారాయణపూర్తి అయింది. సుందర కాండము పారాయణ పూర్తి అయిన తరువాత చదువుకోవలసిన శ్లోకములు కింద ఇస్తున్నాను. చదువుకోండి.

శ్రీమద్రామాయణము

స్వస్తి ప్రజాభ్య: పరిపాలయంతాం న్యాయ్యేన మార్గేణ మహీం మహీశా:।
గోబ్రాహ్మణేభ్య: శుభమస్తు నిత్యం లోకా: సమస్తా సుఖినో భవంతు॥

కాలే వర్షతు పర్జన్య: పృథివీ సస్యశాలినీ
దేశోయం క్షోభరహితో బ్రాహ్మణా: సంతు నిర్భయా:॥

రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే
రఘునాధాయ నాధాయ సీతాయా: పతయే నమ:॥

మంగళం కోసలేంద్రాయ మహనీయగుణాబ్ధయే
చక్రవర్తితనూజాయ సార్వభౌమాయ మంగళమ్॥

కాయేన వాచా మనసేంద్రియైర్వా బుధ్యాత్మనా వా ప్రకృతే: స్వభావాత్।
కరోమి యద్యత్ సకలం పరస్మై శ్రీమన్నారాణాయేతి సమర్పయామి.

యదక్షరపదభ్రష్టం మాత్రాహీనం చ యద్భవేత్
తత్సర్వం క్షమ్యతాం దేవ శ్రీ నారాయణ నమోస్తుతే॥

అనేన శ్రీమద్రామాయణ సుందరకాండ పారాయణేన
భగవాన్ సర్వదేవతాత్మక: సీతాలక్ష్మణభరతశత్రుఘ్నహనుమత్సమేత
శ్రీరామచంద్ర: సుప్రీత: సుప్రసన్నో వరదో భవతు.

శుభం.

సుందర కాండము